# 2018 Q2 ఏప్రిల్ - జూన్ ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక


ఒక బోర్డు, ఒక హత్య, వెరశి రెండు పార్టీల తగాదా
అన్నదాత వెర్సస్ గోమాత
మరాఠా సేవా సంఘ్‌లో చీలిక
పాపాలభైరవుని లోపాల స్క్రిప్టు
పచ్చ మీడియా కచ్చ కడితే..? - పవన్ స్వానుభవం
బయోపిక్ భయాలు
కర్ణాటక తెలుగు ఓటర్లు హోదా విషయంలో స్పందిస్తారా?
మెమరీ నెమరేస్తే.... శీర్షికకై బార్‌ట్లేకు ఎస్వీయార్ అంటే అంత గౌరవం ఎందుకు?
“మహానటి”కి నేపథ్యం
సావిత్రి ఆత్మాభిమానం
కమల్‌నాథ్ ఎందుకు?
కర్ణాటక ఎన్నికలు
హైదరాబాద్ కర్ణాటక దృశ్యం
బొంబాయి - కర్ణాటక దృశ్యం
మధ్య కర్ణాటక దృశ్యం
కోస్తా కర్ణాటక దృశ్యం
దక్షిణ కర్ణాటక దృశ్యం
బెంగుళూరు దృశ్యం
పండితులు సినిమాలకు నప్పరా?
ఎవరూ సిగ్గు పడరా?
దాచబోయినా ప్రమాదమే...
కాపీ కొట్టి నిరపరాధి అంటే ఎలా..?
పోస్టర్ డిజైనర్‌గా బిల్ గోల్డ్ ప్రతిభ
వెలుగు చూపవా, వెంకటేశ్వరా!
కర్ణాటక ఫలితాల విశ్లేషణ- 1/2
కర్ణాటక ఫలితాల విశ్లేషణ- 2/2
ఉప-ఫలితాలు ప్రమాద ఘంటికలా?
త్రిపుర నాయకత్వంలో మనస్పర్థలు
జెమినీ గణేశన్ కెరియర్
ఛత్తీస్‌గఢ్‌లో మరో కుమారస్వామి?
నల్లవారి పట్ల వివక్షతపై వినూత్న నిరసన
వోహ్‌ను వదిలించుకోవడం ఎలా?
రత్నగిరి ప్రాజెక్టుకు బిజెపి ఎస్, శివసేన నో
డ్రగ్ వ్యాపారి విచారణలోనూ యిబ్బందే
జయలలిత ఎంపిక తప్పింది
టీచర్లకు డ్రెస్‌కోడ్ ఉందా?
సర్వే ఎందుకు చేసినట్లు?
సోదరుడు’ శివాజీ గణేశన్‌కు సావిత్రి కానుక
దిలీప్-రాజ్ స్పర్థ; వైజయంతిమాల వ్యథ
పూరీ గుడి తాళంచెవి మిస్టరీ
గోవాలో పడకేసిన పాలన లేస్తుందా?

బిహార్‌లోని దర్భంగా జిల్లాలో భద్వా గ్రామంలో కమలేశ్ యాదవ్ అనే బిజెపి కార్యకర్త ఉన్నాడు. మోదీపై భక్తితో తన యింటి ప్రాంగణంలో 'మోదీ చౌక్' అనే బోర్డు రాయించి పెట్టేసుకున్నాడు. ఇది 2016లో జరిగింది. అప్పణ్నుంచి ఆ సెంటర్‌ను మోదీ చౌక్ అని బిజెపి వాళ్లు పిలవసాగారు కానీ మొన్నటిదాకా బిజెపికి వ్యతిరేకంగానే ఉన్న నీతీశ్ కుమార్ ప్రభుత్వం ఆ సెంటరుకు ఆ పేరు ఆమోదించలేదు. సొంత యింట్లోనే పెట్టుకున్న బోర్డు కాబట్టి ఎవరూ పీకి పారేయలేదు. ఇదీ నేపథ్యం.

మార్చి 15 రాత్రి ఓ పాతిక మంది కత్తులు, హాకీ కర్రలతో కమలేశ్ యాదవ్ యింటిపై పడ్డారు. కమలేశ్‌ను తీవ్రంగా కొట్టారు. అతని 61 ఏళ్ల తండ్రి రామచంద్ర యాదవ్ పీకను కత్తితో తెగనరికారు. పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. కమలేశ్‌ను దర్భంగా మెడికల్ కాలేజీ హాస్పటల్‌లో చేర్చడంతో ప్రాణప్రమాదం తప్పింది. అతను పోలీసులతో, 'నేను ఆ సెంటరుకు మోదీ చౌక్ అని పేరు పెట్టడం తక్కిన పార్టీల వాళ్లకు రుచించలేదు. అందుకే నాపై దాడి జరిగింది. మా నాన్నను చంపారు.' అని స్టేటుమెంటు యిచ్చాడు. ఇక రాష్ట్రవ్యాప్తంగా బిజెపి నాయకులు నిరసనలు తెలుపుతూ ఆందోళనలు చేయసాగారు – 'ఓ చౌక్‌కు మోదీ పేరు పెట్టినంత మాత్రాన ప్రాణాలు తీసేస్తారా?' అంటూ. వెంటనే నీతీశ్ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా ఉన్న సుశీల్ మోదీ 'అబ్బే, అది మోదీ చౌక్ పేరు గురించి జరిగిన గొడవ కాదు. వ్యక్తిగత కక్షలతో జరిగిన దాడి.' అని స్పష్టీకరించాడు.

కానీ బిహార్‌కు చెందిన కొందరు బిజెపి నాయకులు దీనికి ఆ కలరింగే యివ్వదలచుకున్నారు. సుశీల్ స్టేటుమెంటు యిచ్చిన మర్నాడే రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు నిత్యానంద రాయ్ 'మోదీ చౌక్ పేరు గురించి జరిగినదే యీ దాడి' అని ఉద్ఘాటించాడు. బిహారుకు చెందిన కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ అది మోదీ చౌక్ గురించిన గొడవే అని పునరుద్ఘాటించడంతో బాటు మరింత ముందుకు వెళ్లి దానికి కులం రంగు కూడా పులమబోయాడు. 'ఒక కులం వారు, వారికి సంబంధించిన పార్టీ వారు విషం చిమ్ముతున్నారని నాకు తెలుసు' అన్నాడు. బిహారులో యాదవులు లాలూ యాదవ్‌కు ఓటేస్తూంటారు. ఈ కేసులో కమలేశ్ యాదవుడే అయినా బిజెపి పక్షపాతి కావడాన్ని తోటి యాదవులు సహించలేక అతనిపై దాడి చేశారని స్ఫురించేట్లా మాట్లాడాడు. ఇలా మాట్లాడాన్ని నీతీశ్ ఖండించాడు. బిజెపి పేరు ఎత్తకపోయినా సమాజాన్ని కులాలపరంగా విడగొట్టే ధోరణిని సహించనని హెచ్చరించాడు. ఈ లోగా జిల్లా డిఎస్పీ (డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్) 'ఇది ఏడాదిగా నలుగుతున్న భూమి తగాదాకు సంబంధించిన హత్య. ఆ బోర్డు రెండేళ్లగా అక్కడున్నా జరగని గొడవ యిప్పుడే ఎందుకు జరుగుతుంది?' అని వివరణ యిచ్చాడు. ఇలా స్టేటుమెంటు యిచ్చిన డిఎస్పీకి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతూ కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ యిచ్చిన ఉపన్యాసాల వీడియోలు వైరల్ కావడంతో నీతీశ్‌కు ఏం చేయాలో పాలుపోవటం లేదు.

కులాల ఘర్షణలకు పేరు బడిన భాగల్పూరులో యీ విషయంపై బిజెపి నాయకులు అల్లర్లు చేయడంతో 21 మందిపై నాన్‌బెయిలబుల్ వారంటు జారీ అయింది. ఆ 21 మందిలో కేంద్ర మంత్రి అశ్విని చౌబే కుమారుడు అర్జిత్ శాశ్వత్ ఒకడు. అతను భాగల్పూరు అసెంబ్లీ నియోజకవర్గంలో బిజెపి టిక్కెట్టుపై పోటీ చేసి ఓడిపోయాడు. అతనిపై వారంటు ఉన్నా పోలీసులు అరెస్టు చేసినట్లు లేదు. ఎందుకంటే మార్చి 25న పట్నాలో జరిగిన రామనవమి ఉత్సవాల్లో అతను పాల్గొన్న వీడియోలు బయటకు వచ్చాయి. బిజెపి నాయకులు ఏం చేసినా వారిపై నీతీశ్ ఏ చర్యా తీసుకోలేకుండా ఉన్నాడని చెప్పడానికి యిది ఒక ఉదాహరణ. 2005-13 మధ్య బిజెపి-జెడియు సంకీర్ణ ప్రభుత్వం నడిచినప్పుడు నీతీశ్ మాటే చెల్లింది. అతని సెక్యులరిజాన్ని, సుపరిపాలనా విధానాన్ని బిజెపి ఆమోదించి ద్వితీయ స్థానంలో ఉండడానికి సమ్మతించింది. కానీ 2014లో మోదీ గెలుపు తర్వాత బిజెపి దూకుడు మీద ఉంది. అసెంబ్లీ ఎన్నికలలో ప్రత్యర్థులుగా పోటీ చేసి 71 స్థానాలు గెలిచిన జెడియు, 53 స్థానాలు గెలిచిన బిజెపి యిప్పుడు చేతులు కలిపాయి. పార్లమెంటులో తమకు 22 సీట్లు, జెడియుకు 2 సీట్లు ఉన్నాయి కాబట్టి రాష్ట్రంలోనూ తనే బిగ్ బ్రదర్ అనుకుంటోంది బిజెపి. కానీ అవతల లాలూ ఉధృతి తగ్గలేదు. ఉపయెన్నికలలో తన సత్తా చూపాడు. విడివిడిగా వీళ్లిద్దరి కంటె ఎక్కువగా 80 సీట్లు ఉన్నాయి అతని దగ్గర. అతని భాగస్వామి కాంగ్రెసు వద్ద 27 ఉన్నాయి. ఉపయెన్నికల ఫలితాల తర్వాత బిజెపికి ఒకటి అర్థమైంది. లాలూను నిలవరించాలంటే తను తిరిగి హిందూత్వ ఎజెండాకు తిరిగి మరలాల్సిందే, యాదవులను చీల్చాల్సిందే అని. అందుకే యీ భూమి తగాదా అంశాన్ని యాదవుల మధ్య ముసలంగా, బిజెపి కార్యకర్తల పట్ల దాడిగా చిత్రీకరిస్తోంది. ఇదంతా నీతీశ్‌కు నచ్చటం లేదు. ఉపయెన్నికలలో బిజెపి తన స్థానాన్ని నిలుపుకోగా, జెడియు తన జెహానాబాద్ స్థానాన్ని లాలూకు సమర్పించుకుంది. అసలు తనకు అభ్యర్థిని నిలపడం యిష్టం లేదని, కానీ బిజెపి ఒత్తిడికి లొంగి ఆ పని చేయాల్సి వచ్చిందని, దానివలన పార్టీ ప్రతిష్ఠ మసకబారిందని నీతీశ్ బహిరంగంగా వాపోయాడు.

బిజెపి పెద్దన్న ధోరణి మరో భాగస్వామి ఐన జితనే రామ్ మాంఝీకి నచ్చలేదు. అతను హిందూస్తానీ ఆవామ్ మోర్చా సెక్యులర్ పార్టీకి అధ్యక్షుడు, ఏకైక ఎమ్మెల్యే. అతను యీమధ్యే లాలూ కూటమిలోకి చేరిపోయాడు. మరో భాగస్వామి ఐన రాంవిలాస్ పాశ్వాన్ నీతీశ్ మార్గంలోనే బిజెపి నాయకుల పేర్లు ఎత్తకుండా బిహార్ సమాజాన్ని కులాల వారీగా విభజించి చూడడాన్ని తాను వ్యతిరేకిస్తానని ప్రకటించాడు. 2014 పార్లమెంటు ఎన్నికలలో బిహారులో బిజెపి, దాని మిత్రపక్షాలు 40లో 31 సీట్లు గెలుచుకున్నాయి. 2019లో అన్ని సీట్లు వస్తాయని ఎవరూ గట్టిగా చెప్పలేకుండా ఉన్నారు – బిజెపి, దాని ప్రస్తుత మిత్రపక్షాల లుకలుకలు చూస్తూ ఉంటే! – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2018)**

మన దేశంలో హిందువులం ఎక్కువ. మనం ఆవును పూజిస్తాం. తల్లిలాటిది కాబట్టి గోమాతగా పిలుస్తాం. దానికి సంబంధించిన ప్రతి పదార్థాన్ని పవిత్రంగా భావిస్తాం. అది పాలిస్తూన్నంతవరకు అంతా బాగానే ఉంటుంది. అది వట్టిపోయిన తర్వాత యీ విషయాలన్నీ గుర్తుకు రావు. ముసలి తలిదండ్రులనే వదిలించుకుంటున్న యీ సమాజంలో వట్టిపోయిన ఆవుకి దండగ్గా మేత పెట్టడం భారమనిపించదా? అందుచేత అమ్మేస్తే దాని మాంసం, చర్మం వగైరాలు తక్కినవాళ్లకు ఉపయోగపడతాయి కదా అనుకుంటాడు రైతు. కానీ ప్రస్తుత వాతావరణంలో అమ్మడం అసాధ్యమై పోయింది. చట్టాల్లో ఉన్నది కొంత అయితే, చట్టాలను అధిగమించి గోరక్షకుల పేరుతో అసాంఘిక శక్తులు చెలరేగుతున్నాయి. దాంతో అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. ఉదాహరణకి రాజస్థాన్‌లోని 10 పశువుల సంతల్లో 2010-11లో 30 వేల పశువుల అమ్మకాలు జరిగాయి. గత ఏడాదికి అవి 3 వేలకు తగ్గాయి. 2017 ఏప్రిల్‌లో పెహలూ ఖాన్ హత్య తర్వాత యిప్పటివరకు 460 అమ్మకాలు మాత్రమే అయ్యాయి. ఇలాటి పరిస్థితుల్లో వట్టిపోయిన ఆవులను యజమానులు అనాథలుగా వదిలేస్తున్నారు. అవి పొలాల్లో పడి పంటను మేసేస్తున్నాయి. దాంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఆవులను ఎక్కడైనా కట్టిపడేయమని, లేదా చంపించివేయమని ఆందోళనలు చేపడుతున్నారు. నాసిక్ నుంచి ముంబయికి 200 కి.మీ.ల యాత్ర నిర్వహించి విజయం సాధించిన ఆల్ ఇండియా కిసాన్ సభ యిప్పుడు దిల్లీలో రెండు రోజుల సమావేశం ఏర్పరచి అనాథ గోవుల సమస్యను పరిష్కరించమని ప్రభుత్వాన్ని కోరింది. గోశాలలను కట్టడంతో సరిపోదు. నిర్వహణకు, గోవుల ఆరోగ్యపరిరక్షణకు చాలా డబ్బు ఖర్చవుతుంది. అన్నదాతలను, గోమాతలను యిద్దరినీ సమన్వయపరిచే బాధ్యతను ప్రభుత్వం ప్రజలపై మోపి గోరక్షణ పేరుతో సెస్సులు విధిస్తోంది.

వట్టి పోయిన ఆవులను మేపే సమస్య ఎంత తీవ్రంగా ఉందో చెప్పాలంటే ఒక ఉదాహరణ చాలు - బుందేల్‌ఖండ్‌లో కరువు తాండవిస్తోంది. తమకే తిండి లేకుండా ఉంటే యిక వట్టిపోయిన ఆవులకు ఏం పెడతామనుకుని ప్రజలు వాటిని గాలికి వదిలేయసాగారు. ఇది చూసి అక్కడున్న ఓ కాలేజీ డైరక్టరు గత డిసెంబరులో తన ఫేస్‌బుక్ ద్వారా వట్టి పోయిన ఆవులకు మేత నిస్తానని ఆఫర్ యిచ్చాడు. ఏ మూడు వందల మంది రైతులో తమ ఆవుల్ని తెస్తారనుకున్నాడు. తీరా చూస్తే 7 వేల మంది వచ్చారు. ఇంకో 15 వేల మంది కూడా వచ్చారు కానీ పోలీసులు, కాలేజీ సిబ్బంది కలిసి వాళ్లను తరిమివేశారు. మేత పెట్టలేక రైతులు వట్టిపోయిన ఆవులను వదుల్చుకోవడంతో అనాథ ఆవులు పెరిగిపోతున్నాయి. రోడ్ల మీద విచ్చలవిడిగా తిరిగే వాటిని పట్టుకుని శిక్షిద్దామంటే దాని సొంతదారు ఎవరో ఎవరికీ తెలియదు.యుపికి చెందిన ఒక బిజెపి ఎంపీ పార్లమెంటులో అనాథ గోవుల సమస్యపై ఒక బిల్లు ప్రవేశపెట్టాడు. జాతీయ స్థాయిలో అనాథ గోవుల బోర్డు ఏర్పరచి, వదిలేసిన ఆవుల సమస్యను దానికి అప్పగించాలని ప్రతిపాదించాడు. 2012 నాటి లెక్కల ప్రకారం మన దేశంలో 53 లక్షల అనాథ గోవులున్నాయి. వాటిని పోషించడానికి ఏడాదికి రూ. 11,607 కోట్లు ఖర్చవుతుంది. ఇటీవలి కాలంలో ఈ అంకె యింకా పెరిగి ఉంటుంది. ప్రభుత్వం దగ్గర అంత డబ్బు లేదు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలను కూడా గోశాలలను నిర్మించి పోషించమంటోంది. వాళ్లు గోరక్షణ పేరుతో సెస్‌లు ద్వారా నిధులు సేకరిస్తూ, ప్రభుత్వపరంగా కొన్ని నిర్వహిస్తూ ప్రయివేటు గోశాలలు నిర్వహిస్తున్న సామాజిక సంస్థలకు నిధులు సమకూరుస్తున్నారు. సంస్థల ఎంపికలో పక్షపాతం ఉందనీ, స్కాములు జరుగుతున్నాయనీ ఆరోపణలు ఎలాగూ ఉన్నాయి.

రాజస్థాన్‌లో 1934 గోశాలలున్నాయి. వీటిలో 8 లక్షల ఆవులున్నాయి. ప్రతీ ఏటా 2 లక్షలు వచ్చి చేరుతున్నాయి. 2016-17లో వీటిపై రూ. 155.50 కోట్లు ఖర్చు పెట్టారు. ఆ డబ్బు రాబట్టడానికి స్టాంప్ డ్యూటీపై గోరక్షణ సెస్ పేరుతో అదనంగా 10% వసూలు చేస్తున్నారు. నందీ గోశాల పేర అనాథ మహిషాల కోసం శాలలు కడతామంటూ ఈ ఏడాది బజెట్‌లో రూ.16 కోట్లు కేటాయించారు. ఎందుకంటే మూడేళ్ల కంటె చిన్నవైన ఎద్దుల అమ్మకాన్ని నిషేధించారు. దాంతో వాటినీ గాలికి వదిలేస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్ కూడా తాజా బజెట్‌లో గోరక్షణ సెస్ ప్రతిపాదించింది. మద్యం అమ్మకాలపై సెస్ విధించి దాన్ని గోరక్షణకు మరలిస్తారట. దేవాలయాలు, మతపరమైన ట్రస్టులు తమ ఆదాయంలో 15% గోశాలలపై ఖర్చు పెట్టాలని ఆదేశించింది. హరియాణాలో 410 ఉన్నాయి. 2017 జులైలో గో సేవా ఆయోగ్ పేరిట మరిన్ని గోశాలలు కడతామంటూ రూ.20 కోట్లు బజెట్‌లో కేటాయించింది. మహారాష్ట్ర 2016లో 34 గోశాలలు కట్టడానికి రూ.34 కోట్లు కేటాయించింది కానీ యిప్పటిదాకా నిధులు విడుదల చేయలేదు. ఉత్తర ప్రదేశ్‌లో 486 గోశాలలు ఉన్నాయి. గోసంక్షేమం కోసం రూ.233 కోట్లు కేటాయించారు. 12 జైళ్లలో గోశాలలు నెలకొల్పడానికి రూ.2 కోట్లు అదనంగా కేటాయించారు. గుజరాత్ ప్రభుత్వం 667 గోశాలలో వసతులు పెంచడానికి రూ.44 కోట్లు కేటాయించింది. వాటికి విరాళాలు యిమ్మనమని కార్పోరేటు రంగాన్ని కోరింది. 2014కు ముందు అలాటి కార్యక్రమాలకు పైసా విదల్చని కార్పోరేట్లు యిప్పుడు కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకం కింద కోట్లు కుమ్మరిస్తున్నాయి.

మధ్యప్రదేశ్‌లో 2012 లెక్కల ప్రకారం ఆవులు, ఎద్దులు కలిపి 20 లక్షల దాకా ఉన్నాయి. మధ్యప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్‌లలో ధాన్యాల లావాదేవీలపై 2% సెస్ విధించి గోశాల నిర్వహణకు ఖర్చు పెడుతోంది. ప్రభుత్వం గుర్తింపు ఉన్న శాలలు 600. 472 హెక్టార్ల స్థలంలో 6 వేల ఆవులు పట్టే 'కామధేను కౌ శాంక్చువరీ' పేరుతో రూ.32 కోట్ల ఖర్చుతో ఏడేళ్ల పాటు కట్టిన 2017 సెప్టెంబరులో ప్రారంభమైంది. రైతులు 2 వేల వట్టిపోయిన ఆవుల్ని పట్టుకుని వచ్చి తీసుకోమని అడిగి భంగపడ్డారు. రాజస్థాన్ రైతులు దానికి వట్టిపోయిన 15 వేల ఆవులను దానం (!) యివ్వడానికి సిద్ధపడ్డారు. దాంతో జిల్లా యంత్రాంగం ఎవరి నుంచి తీసుకోవాలో, తీసుకోకూడదో తేల్చడానికి ఓ స్క్రీనింగ్ కమిటీ వేసింది. ఈ లోపున మూణ్నెల్లలో 100 ఆవులు చచ్చిపోయాయి. అనాథ గోసమస్యపై ప్రభుత్వం ఓ కమిటీ వేసింది. ఆ కమిటీకి రాష్ట్ర 'కౌ ప్రమోషన్ బోర్డ్' నుంచి ఒక వింత ప్రతిపాదన వచ్చింది.

ఆ అనాథ ఆవులను లాభదాయకంగా ఉపయోగించుకుంటే గోశాల నిర్వహణ ఖర్చు కలిసి వస్తుందని, దానికై ఆవుపేడతో ప్రతి గ్రామంలో హెలిపాడ్‌లు కట్టవచ్చని, గోమూత్రాన్ని ఔషధంగా అమ్మవచ్చని ప్రతిపాదించింది. ఇలాటి వింత ప్రయోగాలకు ఆ రాష్ట్రం పేరు తెచ్చుకుంటోంది. ఆడ దూడలు కావాలంటే ఏ వేద మంత్రాలు చదవాలి, కోడెదూడలు కావాలంటే ఏ వేద మంత్రాలు చదవాలి వంటి ప్రయోగాలు కూడా కామధేనులో జరుగుతున్నాయి. గోమూత్రం, పేడలపై ప్రయోగాలు సరేసరి. ఓట్ల కోసం నర్మదా నదిని ఎడాపెడా వాడేసుకుంటున్న ముఖ్యమంత్రి నర్మద నది ఒడ్డున 108 గోశాలలు కడతామని కూడా ప్రకటించారు. ప్రయివేటు గోశాలలను మరిన్ని ప్రోత్సహిస్తున్నాడు. ఇప్పటికే 900 ప్రయివేటు గోశాలలున్నాయి. అవన్నీ తమ పార్టీకి పరోక్షంగా నిధులు అందించడానికేనని ప్రతిపక్షాల ఆరోపణ. వట్టిపోయిన ఆవులు పాలివ్వకపోవచ్చు కానీ నిధులు పిండుకోవడానికి పాలకులకు పనికి వస్తాయి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2018)**

**2018 ఏప్రిల్ 14 టాబ్లాయిడ్‌కై** **ఎమ్బీయస్: మరాఠా సేవా సంఘ్‌లో చీలిక**

ఏ రాజకీయ పార్టీలను దరి చేరనీయకుండా మరాఠాల రిజర్వేషన్‌కై ఏడాదిన్నరగా పోరాడుతూ అన్ని పార్టీలకు దడ పుట్టించిన మరాఠా సేవా సంఘ్ (ఎమ్మెసెస్) యిప్పుడు చీలికలువాలికలు కాబోతోంది. సామాజిక సమస్యలపై ఉద్యమసంస్థల్లా ప్రారంభమైన సంస్థలన్నీ కొన్నాళ్లకు రాజకీయాల్లోకి ప్రవేశించాలా వద్దా అనే విషయంపై విడిపోతూ ఉంటాయి. బ్రాహ్మణ వ్యతిరేకతే పునాదిగా ద్రవిడ కళగాన్ని స్థాపించిన రామస్వామి నాయకర్ దాన్ని సామాజిక సంస్థగానే ఉంచాలని పట్టుబట్టగా అతని శిష్యుడు అణ్నాదురై రాజకీయాల్లోకి వెళ్లాలని పట్టుబట్టి ఆ సంస్థను చీల్చి డిఎంకె స్థాపించాడు. లోకసత్తా రాజకీయాల్లోకి వెళ్లాలని జెపి నిశ్చయించగానే కొందరు వీడి వెళ్లిపోయారు. అన్నా హజారే శిష్యుడుగా వెలుగులోకి వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ రాజకీయాల్లోకి వెళ్లగానే ఉద్యమం బలహీనపడింది. ఇప్పుడు ఎమ్మెసెస్ లోని ముఖ్యనాయకులు ముగ్గురూ మూడు పార్టీలకేసి చూస్తున్నారు. రాబోయే ఎన్నికలలో ఒకరితో మరొకరు తలపడతారే ఏమో!

రెండు దశాబ్దాల క్రితం ఈ సంస్థను స్థాపించిన పురుషోత్తమ్ ఖేడేకర్ ఒక ప్రభుత్వోద్యోగి. జనాభాలో దాదాపు మూడో వంతు మంది ఉన్న మరాఠాలు 12% ప్రభుత్వోద్యోగాలు కైవసం చేసుకున్నారు. రాజకీయాల్లో కూడా వారిది చాలా ముఖ్యమైన పాత్ర, దాదాపు 50% పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో వారి సంఖ్య తక్కినవారి కంటె అధికం. అందుకే ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిపి 366 మంది ఉంటే వారిలో 210 మంది మరాఠాలే. 48 మంది ఎంపీలలో 23 మంది వారే. రాష్ట్రాన్ని యిప్పటిదాకా పాలించిన 15 మంది ముఖ్యమంత్రుల్లో 10 మంది వారే. ఇంతటి ప్రాధాన్యత ఉన్నా బ్రాహ్మణశక్తులు తమని అణచి వేస్తున్నాయని, వారికి వ్యతిరేకంగా మరాఠాలలో అవగాహన పెంచడానికే యీ సంస్థను పెట్టానని వ్యవస్థాపకుడు చెప్పుకున్నాడు. దానికి తగ్గట్టుగానే ప్రస్తుతం లక్ష మంది ఉన్న సభ్యుల సహకారంతో బ్రాహ్మణ వ్యతిరేక పోరాటం సాగిస్తూనే ఉన్నాడు. బ్రాహ్మణ చరిత్రకారులు మరాఠా పాలకులను సవ్యమైన రీతిలో చిత్రీకరించలేదని ఆరోపిస్తూ ఉంటుందీ సంస్థ. 2004లో అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన భండార్కర్ ఓరియంటల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లోని పుస్తకాలను తగలబెట్టి తన తీవ్రస్వభావాన్ని చూపుకుంది. బాబాసాహెబ్ పురంధరే అనే బ్రాహ్మణకవికి మహారాష్ట్ర ప్రభుత్వం 2015లో మహారాష్ట్ర భూషణ్ అనే అత్యున్నత పురస్కారం యిచ్చినపుడు అభ్యంతర పెట్టింది. 2017 జనవరిలో పుణెలోని శంభాజీ పార్కులో రామ్ గణేశ్ గడ్కరీ (1885–1919) అనే బ్రాహ్మణ మరాఠీ కవి, నాటకకర్త విగ్రహాన్ని పగలగొట్టింది. నూరేళ్ల క్రితం అతను రాసిన 'రాజసన్యాస్' అనే అంసపూర్ణ నాటకంలో శంభాజీ పాత్రను సవ్యంగా చిత్రీకరించలేదట. అదీ అతని పాపం. అలాటి వాడి విగ్రహాన్ని శంభాజీ పేర పెట్టిన పార్కులో వుంచడానికి వీల్లేదని పుణె కార్పోరేషన్‌ను హెచ్చరించింది. వాళ్లు పట్టించుకోకపోతే తనే విరక్కొట్టి పడేసింది.

కిత్రం ఏడాది అహ్మద్‌నగర్ జిల్లాలో మరాఠా మైనర్ బాలికను హరిజన యువకులు బలాత్కారం చేయడంతో మరాఠాల ఆత్మగౌరవం నినాదంతో మొదలైన ఉద్యమం రిజర్వేషన్ల డిమాండుతో ముందుకు సాగింది. ఏ రాజకీయపార్టీ ప్రమేయం లేకుండా భారీ మౌనప్రదర్శనలతో అందరి దృష్టినీ ఆకర్షించింది. అయితే దాని వలన ఏ ప్రయోజనమూ ఒనగూడలేదు. దాంతో రాజకీయ పార్టీగా మారిస్తే తప్ప మన మాట ఎవరూ వినరని సంస్థ అధ్యక్షుడు మనోజ్ అఖారే వాదించసాగాడు. గతంలో మరాఠా కులానికి ప్రాతినిథ్యం వహించే పార్టీలుగా శివ్ సంగ్రామ్, మరాఠా స్వరాజ్య పార్టీ, శివ ధర్మ పార్టీ, ఛావాస్ సంఘటన అనే పేర పార్టీలు పెట్టినా వాటికి గిరాకీ లేకపోయింది. మరాఠాలు ఎన్‌సిపికో, కాంగ్రెసుకో మద్దతుదారులుగా ఉండిపోయారు. 'అందువలన మనం ఉద్యమసంస్థగా కొనసాగుతూనే బ్రాహ్మణవాదానికి, హిందూత్వవాదానికి వ్యతిరేకంగా పోరాడే పిడబ్ల్యుపి వంటి వామపక్ష పార్టీకి మద్దతు యివ్వాలి తప్ప ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగకూడదు' అని వాదిస్తాడు రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ గాయక్‌వాడ్. అతని సహచరులు శాంతారామ్ కుంజీర్, శ్రీమంత్ కోకటే. అయినా మనోజ్ వినలేదు. 2017 నవంబరులో జరిగిన స్థానిక ఎన్నికలలో రంగంలోకి దిగాడు. ప్రవీణ్ పక్షం వాళ్లు ఎవరూ ఓటేయలేదేమో, ఎమ్మెసెస్ అభ్యర్థి ఒక్కడూ గెలవలేదు. పైగా విరాళాలేమీ రాకపోవడంతో వాళ్లంతా అప్పుల పాలయ్యారు. అయినా మనోజ్ ఉత్సాహం చల్లారలేదు. పార్టీగా మారి తీరాలనే వాదిస్తున్నాడు.

మరాఠాల్లో కొంతమంది కాంగ్రెసుకు, మరి కొంతమంది ఎన్సీపికి, యింకొందరు పిడబ్ల్యుపికి, ఇంకా కొందరు కొత్త పార్టీకు ఓట్లేస్తే, యీ విధమైన చీలిక వలన బిజెపి లాభపడుతుందని ఎమ్మెసెస్ కార్యకర్తల భయం. అయితే సంస్థ వ్యవస్థాపకుడు ఖేడేకర్ బిజెపి–శివసేన కలిసి 2019లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాయని దానికి మద్దతు యిస్తానని ప్రకటించాడు. బిజెపిలో బ్రాహ్మణనాయకులైన దేవేంద్ర ఫడణవీస్, నితిన్ గడ్కరీలు పాల్గొన్న మూడు సభల్లో వాళ్లతో కలిసి పాల్గొన్నాడు. దానికి ప్రతిగా దేవేంద్ర శివాజీ తల్లి

జీజాబాయి పేర ఖేడేకర్ కట్టబోయే స్మారక చిహ్నానికి రూ.200 కోట్లు యిస్తానని హామీ యిచ్చాడు. అంతేకాదు బ్రాహ్మణేతర రచయితల రచనలపై పరిశోధన చేసేందుకు బలిరాజా రిసెర్చ్ యిన్‌స్టిట్యూట్ అనే సంస్థను ఎమ్మెసెస్ నాగపూర్‌లో 2017 ఆగస్టులో ప్రారంభించినపుడు దేవేంద్ర, నితిన్ హాజరయ్యారు కూడా. ఈ విధంగా మరాఠా సేవా సంఘ్ నాయకులు తలో పార్టీకేసి చూస్తూన్నపుడు అది రిజర్వేషన్ల కోసం రాజకీయ పోరాటం ఎలా చేయగలదో అనుమానమే. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2018)**

## 2018 ఏప్రిల్ 21 టాబ్లాయిడ్‌కై ఎమ్బీయస్: పాపాలభైరవుని లోపాల స్క్రిప్టు

రాంగోపాల వర్మ యిటీవల తీస్తున్న సినిమాలలో స్క్రిప్టు, స్క్రీన్‌ప్లే ఏమీ బాగుండటం లేదనీ, సినిమాలు ఫ్లాపవుతున్నాయనీ అందరికీ తెలుసు. ఆయన లేటెస్టుగా దర్శకత్వం వహించిన "భూమికా తల్పం" (కాస్టింగ్ కౌచ్) సినిమాకు కూడా అదే గతి పట్టింది. దాని డైరక్షన్ ఆయన ఏ దశలో చేపట్టారో ప్రస్తుతానికి తెలియరాలేదు. పాత్రధారే సొంత కథతో, సొంత తెలివితేటలతో, సొంత డైరక్షన్‌లో రంగంలోకి దిగితే 'ఇలా కాదమ్మాయ్, నా డైరక్షన్‌లో అయితే మరీ రక్తి కడుతుంది' అని మధ్యలో చేపట్టారా? లేక పాత్రధారి కాల్‌షీట్లు రెడీగా ఉన్నాయని తెలియగానే కథ, కథనం, సంభాషణలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం తలపెట్టారా? దీనికి ఆయన దర్శకనిర్మాతా? లేక నిర్మాత వేరే ఉన్నారా? వేరే ఉన్నారని నిన్న అరవింద్, యివాళ పవన్ అంటున్నారు. అరవింద్ గతాన్ని గుర్తు చేసి ప్రశ్నలతో ఆపేస్తే, పవన్ పేర్లే చెప్పేశారు. దానికి ఆధారాలేమైనా చూపుతారో లేక శేఖరరెడ్డి గురించిన ఆధారాలతో బాటే సరైన సమయంలో బయటపెడతానని అంటారో తెలియదు. కనీసం ఓ ఘట్టానికి దర్శకత్వం నాదే అని ముందుకు వచ్చి చెప్పుకున్న వర్మ నిర్మాత పేరు వెల్లడిస్తారో, లేదా తనే బినామీ నిర్మాతగా ఉంటారో తెలియదు. ఏది ఏమైనా ఒక వ్యాఖ్యతో తెలుగు ప్రజలందరూ ఉలిక్కిపడేలా చేసిన శ్రీరెడ్డి చేత ఆ మాట అనిపించింది తానే అని చెప్పుకుని వర్మ ఆ పాపాన్ని ఒప్పేసుకున్నారు. తెలుగు యిండస్ట్రీలో ఎదిగి, ఆ యిండస్ట్రీ పరువు తీయించి, తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన పాపాలభైరవుడిగా పేరు మూటకట్టుకున్నారు.

నిజానికి వర్మకు పాపాలభైరవుడి యిమేజి యిప్పటిదాకా లేదు. అరవింద్ ఆయన్ని 'ఇంటెలిజెంట్ క్రూక్' అన్నారు కానీ వర్మ క్రూకెడ్‌నెస్ యిప్పటిదాకా వెలుగులోకి రాలేదు. ఆయన గురించి చెప్పాలంటే – ట్రెండ్ సెట్టర్, ఒకప్పుడు మంచి సినిమాలు తీశాడు, చాలాకాలంగా కంటెంటు కంటె మార్కెటింగ్‌పైనే దృష్టి పెట్టి అభిమానులను పోగొట్టుకుంటున్నాడు, వ్యవస్థను ధిక్కరించే ప్రవచనాలు వల్లిస్తూ యువతను ఆకట్టుకుంటాడు, ఏదో ఒక తిక్క పనో, వ్యాఖ్యో చేసి నిరంతరం వెలుగులో ఉండేట్లు చూసుకుంటాడు – అనే అంటారు. ఆర్టిస్టుకో, టెక్నీషియన్‌కో యిస్తానన్న డబ్బు ఎగ్గొట్టాడనో, ఎవరినైనా ప్రలోభపెట్టి వాడుకున్నాడనో ఆరోపణలు లేవు. ఇటీవలి కాలంలో ఆయన్ను సినిమాలవర్మగా గుర్తించడం మానేసి వ్యాఖ్యానాలవర్మగానే గుర్తిస్తున్నారు. అవి ఒక్కోసారి వినోదం కలిగిస్తాయి, మరోసారి ఆగ్రహం కలిగిస్తాయి, చాలాసార్లు విసిగిస్తాయి. అంతకుమించి ఆయన అపకారం చేశాడని అనగా వినలేదు. కానీ తాజా ఉదంతంతో ఆయన ఒక డేంజరస్ స్కీమర్ అని రుజువైంది. తన సినిమాను మార్కెట్ చేసుకోవడానికి ఆయన రకరకాల స్కీములు వేసి, వివాదాలను రగిలించి, ఆసక్తి రగిలిస్తాడని ఎప్పుడో తెలుసు. అవన్నీ ఉదరపోషణార్థం కాబట్టి, పోనీలే అనుకుని ఊరుకుంటారు. కానీ యిదేమిటి? శ్రీరెడ్డి ప్రాణాలకే ముప్పు తెచ్చే స్కీము రచించడం, ఆమెను బలిపశువు చేయడం పాపం కాదా. మతకలహాలు రగిలించడానికి రాజకీయపార్టీలు ఆవుని చంపి గుడిలో పడేయడం, పందిని చంపి మసీదులో పడేయడం చేస్తూంటాయని అంటూంటారు. రాజకీయ నాయకులకు అది ఒప్పుతుందేమో కానీ, చిత్రపరిశ్రమలో పుట్టి పెరిగిన వ్యక్తి పరిశ్రమనే అతలాకుతలం చేయబూనడం ఘోరం కాదా!

వర్మ వాదిస్తున్నట్లు చిత్రపరిశ్రమ అంటే పవన్, అరవింద్ మాత్రమే కాదు, శ్రీరెడ్డి వంటి చిన్న ఆర్టిస్టులు కూడా! తన స్కీము కారణంగా ఆమె ఎంత నష్టపోతుందో అంచనా వేయలేకపోయాడా వర్మ? స్క్రీన్‌ప్లేలో ఒక డైలాగు ద్వారా కథలో ఎంత మలుపు వస్తుందో తెలియదా యీ సినీమానిసికి? అరవింద్ చెప్పినట్లు పవన్ అభిమానులు ఆవేశంలో ఏదైనా చేసి ఉంటే ఎంత అనర్థం జరిగేది? పవన్ ఎక్కడ మీటింగు పెట్టినా అతని అభిమానుల వీరావేశం చూస్తున్నాం. మనకు అతను ఎప్పుడేం చేస్తాడో తెలియని అయోమయ వ్యక్తిగా తోచవచ్చు, కానీ అతని అభిమానులకు అతను దేవుడు. అతన్ని అంతలేసి మాటలన్న వ్యక్తిపై కోపోద్రేకంతో ఏదైనా చేస్తే...? పోనీ అభిమానుల ముసుగులో అసాంఘిక శక్తులు (వారిని దర్శకుడు పంపిస్తాడా, నిర్మాత పంపిస్తాడా? అనేది వేరే ప్రశ్న) ఏమైనా చేస్తే..? దానివలన పవన్ యిమేజి తగ్గుతుందా, లేదా అన్న సంగతి అవతల. ముందు యీ అమ్మాయి దెబ్బ తినేది కదా. ప్రాణం తీయకపోవచ్చు, గాయపరచవచ్చు, అందవిహీనం చేయవచ్చు.. ఏదైనా జరగవచ్చు. దానికి కారణం ఆమె బయట పెట్టిన పేర్ల తాలూకు కుటుంబాలని పోలీసులు అనుమానించవచ్చు, కేసులు పెట్టవచ్చు. ఎంత రగడ! తను చేసే పనికి పర్యవసానం ఏ మేరకు వెళుతుందో ఊహించలేని అమాయకుడా వర్మ!?

దాడి జరగలేదు కానీ వర్మ ఒప్పుకోలును పవన్ రాజకీయంగా వాడుకుంటున్నాడు. తనపై జరిగిన దాడికి వెనక్కాల బాబు, లోకేశ్, అతని స్నేహితుడు రాజేశ్ ఉన్నారని, శ్రీరెడ్డి ద్వారా తన తల్లికి జరిగిన అవమానంలో టీవీ9 రవిప్రకాశ్, శ్రీని రాజు, వర్మ టిడిపికి సహకరించారని తీవ్రమైన ఆరోపణలు చేసి, టిడిపిని దోషిగా నిలబెడుతూ ఫిలిం ఛాంబర్‌లో దీక్ష చేపట్టాడు. అది కూడా సరిగ్గా చంద్రబాబు హోదా దీక్ష చేపట్టిన రోజున, ఆయన పుట్టిన రోజున, టిడిపి పార్టీ రాష్ట్రమంతా హోరెత్తిస్తున్న వేళ చేశాడు. ఒక్కరోజు దీక్షతో త్యాగమూర్తి, పోరాటమూర్తి, ఆంధ్ర ఆత్మాభిమానమూర్తి గట్రాగట్రా యిమేజులు తెచ్చేసుకుందామని బాబు ఖర్చుకి వెనకాడకుండా ప్రయత్నాలు చేసిన రోజునే ఆయన్ను కుటిలనాయకుడిగా చిత్రీకరిస్తూ యిది జరగడం నిజంగా షాక్. నిన్న అరవింద్ ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లి పిఆర్పీ రోజులు గుర్తు చేశారు. అప్పుడూ టిడిపియే దోషిగా నిలబడింది. చిరంజీవి పార్టీ పెట్టినపుడు మొదట్లో

టిడిపి సంతోషించింది. ఇప్పటిదాకా రెడ్లు, కాపులు కలిసి కాంగ్రెసు పక్క ఉన్నారని, కమ్మలు, బిసిలు తమ పక్క ఉన్నారని చిరంజీవి రాకతో కాపులు విడిపోయి కాంగ్రెసు దెబ్బ తింటుందని ఆశించారు. కానీ చిరంజీవి తన సొంత యిమేజితో కాంగ్రెసు ఓట్లకు, టిడిపి ఓట్లకు కూడా గండి కొడతాడని తేలేసరికి (అంతిమంగా అదే జరిగింది) ఇక అతన్ని తగ్గించడానికి మీడియా సహకారంతో సకలయత్నాలు చేశారు. అతనిపై కాపు యిమేజి బలంగా కొట్టారు. పిఆర్పీలో కోవర్టులను పెట్టారు. చిరంజీవి అనుభవరాహిత్యం, తెలివితక్కువ పనులు తోడై పీఆర్పీ అనుకున్నంతగా సాధించలేక పోయింది. ఆ రోజు పీఆర్పీకి వెన్నుపోటు పొడిచిన పరకాల ప్రభాకర్ యీనాడు సీనియర్ వెన్నుపోటుదారుడికి వెన్నుదన్నుగా ఉన్నారు. అలాటి ప్రమాదాలే యిప్పుడూ ఉంటాయని పవన్‌ను హెచ్చరించానని అరవింద్ అంటున్నారు. వర్మకు రూ.5 కోట్లు ఎక్కణ్నుంచి వచ్చాయని అరవింద్ అడిగారు. 5 కోట్లు తన దగ్గర ఉన్నాయని అనలేదని, సురేశ్‌ను అడిగి యిస్తానన్నానని వర్మ సమాధానం చెప్పారు. అయిదేమిటి, యిది పది కోట్ల కుట్ర అంటున్నాడు పవన్.

వర్మ మధ్యవర్తిత్వం కూడా వింతగానే ఉంది. ఇరుపార్టీలతో ఓ మాట మాట్లాడి ఎవరైనా ప్రతిపాదన చేస్తారు. ఈ 5 కోట్ల అంకె ఏ లెక్కన లెక్క వేశారో ఆయన! సొంత కుటుంబం బాగోగుల గురించే వర్రీ అవనని చెప్పుకునే వర్మ సురేశ్ కుటుంబం గురించి వ్యథపడి తనంతట తానే యినీషియేటివ్ తీసుకున్నారనడం.. అబ్బే, పాత్రకు అతకలేదు. మరి యీ ప్రయత్నం ఎందుకు చేసినట్లు? ఆర్థిక ప్రయోజనం ఏమైనా ఉందా? తెలియనిదే ఏమీ అనలేం. చెప్పగానే నమ్మేట్లు మాత్రం లేదని అని ఊరుకోవాలి. సురేశ్ కుటుంబం యిమేజి గురించి అంత వర్రీ అయి, మా కుటుంబం గురించి వర్రీ కాలేదేం అని అరవింద్ అడిగిన ప్రశ్నకు వర్మ దగ్గర సమాధానం లేదు. శ్రీరెడ్డి అర్ధనగ్న ప్రదర్శన ద్వారా అంతర్జాతీయ ఖ్యాతి వచ్చేసిందని వర్మ కితాబు యిచ్చాడు. ఆమెను ఝాన్సీ లక్ష్మీబాయితో పోల్చాడు. ఆమె ఉద్యమానికి మద్దతు యిద్దామనుకుంటే బొంబాయి రప్పించి, తనకున్న పరిచయాలతో అక్కడ కూడా ఓ అర్ధనగ్న ప్రదర్శన ఏర్పాటు చేయించి, యితర గ్రహాల్లో కూడా ఖ్యాతి వచ్చేట్లు చేయాల్సింది. బాలీవుడ్‌లోనూ కాస్టింగ్ కౌచ్ బాధితులుంటారు కాబట్టి వాళ్లను కూడా పోగేసి యిక్కడా “మీ టూ...” పోరాటం చేయడానికి అండదండలు అందించాల్సింది. శ్రీ రెడ్డి గురించి అక్కర ఉంటే చేయాల్సిన పని అది. దానికి బదులుగా ఆమె చేత టాక్టికల్ మిస్టేక్ చేయించి, ప్రమాదంలోకి నెట్టి, బలిపశువుని చేశాడు. ఆమె బూచిని చూపించి బేరాలాడబోయాడు.

శ్రీరెడ్డి చేత అనిపించిన మాట పవన్ తల్లిని ఉద్దేశించి అన్నది కాదని, అది మగవాళ్లను ఉద్దేశించి తిట్టే తిట్టని వర్మ వివరణ యిచ్చారు. తల్లికీ, పెళ్లానికీ తేడా తెలియదుట్రా అని తిడితే ఆ వ్యక్తికి నీచమైన కాముకదృష్టి ఉందని మాత్రమే అర్థం వస్తుంది. తల్లితో శయనించాడని అంటే మాత్రం తల్లిని కూడా దోషిగా నిలబెట్టినట్లవుతుంది. ఆపాటి తేడా తెలియదా వర్మకి? అర్జునరెడ్డి సినిమాలో అన్నారు కాబట్టి దానికి కావ్యగౌరవం రాదు. మగవాళ్లు మాత్రమే అనవచ్చా, ఆడవాళ్లు అనకూడదా? అనే సన్నాసి లాజిక్ ఒకటి. శ్రీరెడ్డికి యింత ఫోకస్ రావడానికి కారణం – ఆమె స్త్రీ కావడమే. ఆమె లేవనెత్తిన సమస్యలు స్త్రీలకు సంబంధించినవి కావడమే. వాటిని ప్రస్తావించినపుడు ఆమె వాడిన భాష వలన ఆమె ఉద్యమలక్ష్యం దెబ్బతినే ప్రమాదం ఉందని అనేకసార్లు తోచింది. మహిళా ఉద్యమకారిణులు మగవాళ్లని, సమాజాన్ని దారుణంగా విమర్శిస్తారు. కానీ యిలాటి బూతులు వాడరు. చెప్పదలచినది సభ్యమైన భాషలో చెప్తే ఆమెకు సానుభూతిపరులు పెరిగేవారు కదా అనుకుంటూండగా, యిప్పుడు పవన్‌మీద అనమని వర్మ రెచ్చగొట్టడమేమిటి? ఆ తిట్టుకు వేలు చూపిన అభినయం జోడించిందామె. అర్జునరెడ్డి మీద సొద్దేసినట్లనుకున్నారా? అది సూత్రధారి సూచనా? పాత్రధారి పైత్యమా?

వర్మకు వినయం ఉందని ఎవరూ ఆరోపించరు. కానీ యీమె విషయంలో మాత్రం తన పేరు చెప్పుకోకుండా ఘనతంతా ఆమెకే కట్టబెట్టాడు పాపం. అయితే తన యాక్షన్‌కు వచ్చిన రియాక్షన్‌ను తట్టుకోలేక పోయింది. వర్మ చెప్పడం బట్టే తాను చేశానని మహిళా సంఘం సంధ్యకు చెప్పుకుంది. ఆమెకు జియస్టీ సినిమా విషయంలో వర్మతో లడాయి ఉంది. అందుకే టీవీ ఛానెల్‌లో ఆ విషయం చెప్పేసింది. ఇక శ్రీరెడ్డి కూడా బయట పెట్టింది. ఇక లాభం లేదనుకుని వర్మే తెరలు చింపుకుని బయటకు వచ్చి నిలబడ్డాడు. పాత్రధారి ఎదురు తిరిగితే సూత్రధారికి దిక్కు లేదని తెలిసివచ్చి ఉంటుంది. ఇది తను ఎదురు చూసిన మలుపైతే ఖచ్చితంగా కాదు. ఇలా చెప్పేయడం వలన తను పునీతుడనై పోయానని వర్మ అనుకోవచ్చేమో కానీ, సగటు సినిమా ప్రేక్షకుడి దృష్టిలో వర్మ పట్ల వెగటు పుట్టింది. తన పాటికి తను సినిమాలేవో తీసుకోక, ఎందుకీ గేమ్స్ అనుకుంటున్నాడు. శ్రీరెడ్డి వ్యక్తిగతంగా ఎటువంటిది, పదేళ్లగా ఎటువంటి పొరపాట్లు చేసింది అనేది అప్రస్తుతం. ఆమె లేవనెత్తిన దుమారం వలన సినిమా జనాలు యికపైనైనా జాగ్రత్తగా ఉంటారు. బుద్ధులు మారిపోతాయని కాదు, ధారాళంగా కమిట్‌మెంట్లు అడగడానికి సంకోచించే స్థితి వచ్చింది. అవతలివాళ్లు రికార్డు చేసి యాగీ చేస్తారేమోనని భయపడతారు. పిచ్చి మెసేజిలు, ఫోటోలు పెట్టడానికి జంకుతారు. శ్రీరెడ్డి కారణంగా ‘మా’ తెలివితక్కువతనమూ బయటపడింది. కమిటీలు వేసి, తగు జాగ్రత్తలు తీసుకుని మర్యాదస్తులు సినీరంగంలోకి రావడానికి వెనుకాడకుండా చర్యలు తీసుకునే దిశగా అడుగులు పడుతున్నాయి.

ఇలాటి పరిస్థితిలో వర్మ దుష్టపుటాలోచన కారణంగా పరిస్థితి మొత్తం మారిపోయింది. శ్రీరెడ్డి గళం విప్పడానికి వెనుక ఎవరో బలమైన వ్యక్తులున్నారని తెలుస్తూనే ఉంది. సినీరంగంలో కొందరిపై అక్కసు ఉన్నవాళ్లయి ఉంటారని అనుకుంటూ వచ్చారు. కానీ దీని వెనుక ఒక పన్నాగం ఉందని తెలిసి తెలుగుజాతి నివ్వెరపోయింది. ఇప్పుడు పవన్ ఆరోపిస్తున్నట్లు రాజకీయ పార్టీ కూడా ఉందని రుజువైతే అసహ్యం పెరుగుతుంది. అభాగ్యస్త్రీ శరీరాన్ని అడ్డుపెట్టుకుని, మరొక భద్రమహిళ వ్యక్తిత్వానికి మసిపూసి రాజకీయ కక్షలు తీర్చుకుంటున్నారంటే అంతకంటె హేయమైన పని మరొకటి ఉండదు. ఈ కథకు వర్మ నిర్మాత అవునో కాదో తెలియదు కానీ దర్శకుడు.. కనీసం కీలకఘట్టాల్లో దర్శకుడు ఆయనే. కానీ క్లయిమాక్స్ ఆయన అనుకున్నట్లు తేలలేదు. అది ఆయన మరో

**2018 ఏప్రిల్ 28 టాబ్లాయిడ్‌కై ఎమ్బీయస్: పచ్చ మీడియా కచ్చ కడితే..? – పవన్ స్వానుభవం**

పవన్ కళ్యాణ్‌కు రాజకీయతత్త్వం క్రమంగా బోధపడుతోంది. ఇన్నాళ్లూ టిడిపి సర్కారు గెస్టుగా వారి నీడలో సేదదీరుతూ, వాళ్లకు కాల్‌షీటు ఆర్టిస్టుగా వ్యవహరిస్తూ, జనసేవ చేస్తున్నట్లు కూడా పేరు తెచ్చేసుకుంటూ వెలిగిపోయాడు. ప్రజాసమస్య ఉన్నపుడు దాని గురించి మథన పడినట్లు కనబడేవాడు. మంత్రులు పంపిన చార్టెర్డ్ ఫ్లయిట్లలో వెళ్లి ప్రజల్లోకి వెళ్లి మాట్లాడి స్పందించేవాడు, అప్పుడు ఆవేశపడేవాడు, అభిమానులు కేరింతలు కొట్టే స్పీచి యిచ్చేవాడు, ప్రభుత్వాధినేతతో మాట్లాడి మీ కష్టాలు తీరుస్తానంటూ హామీ యిచ్చేవాడు. తర్వాత ప్రభుత్వాధినేతతో మాట్లాడేవాడు కూడా. ఆయనేం చెప్పేవాడో, యీయనకేం అర్థమయ్యేదో కానీ హైదరాబాదు వచ్చేశాక 'అంతా సవ్యంగానే ఉంది. అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి సమస్య తీరుస్తారని నాకు గట్టిగా నమ్మకం కుదిరింది' అనేవాడు. మళ్లీ యింకో ఆర్నెల్లకు మేలుకొనేవాడు. దేని గురించైనా గట్టిగా అడిగితే 'దాని గురించి నా కంటె వాళ్లకే ఎక్కువ తెలుసు, నేను వాళ్లకు సమయం యిస్తున్నాను' అనేవాడు. 'ఈయనకు ప్రశ్నలకు సమాధానం యివ్వడం కాదు కదా, ప్రశ్నలడగడమే రాదు' అని జనాలకు గట్టిగా నమ్మకం కుదిరేలా ప్రవర్తించాడు. కానీ తనవరకు ఏ యిబ్బందీ లేదు. హ్యేపీగా టిడిపి ఆదరణలో ప్రజానాయకుడిగా గుర్తింపు పొందుతూ వచ్చాడు. ఇప్పుడు టిడిపికి వ్యతిరేకమయ్యాడు. ఇప్పుడు తెలుస్తోంది ఘర్షణ కలిగించే వేడి ఏమిటో! స్నేహంలో ఏం మాట్లాడినా కుదురుతుంది, చెడితే శ్రీరామా అన్నా బూతే అవుతుంది. ఇక నిందలు మోపితే ఎలా ఉంటుంది? టిడిపి ఊరుకుంటుందా? తన అనుకూల మీడియా చేత ఒక ఆట ఆడిస్తోంది. పవన్ నిలదొక్కుకోగలడో లేదో నిగ్గు తేలేది ఇప్పుడే!

బిజెపికి, టిడిపికి చెడింది. అనూహ్యంగా పవన్ టిడిపికి, బాబుకి, లోకేశ్‌కు వ్యతిరేకంగా మాట్లాడాడు. మోదీని పెద్దగా విమర్శించటం లేదు. దానివలన బిజెపి పవన్ ద్వారా టిడిపిని యిరుకున పెట్టాలని చూస్తోందన్న వాదన బలంగా వినిపించింది. పవన్ పూర్తి రాజకీయనాయకుడి అవతారం ఎత్తడానికి సిద్ధమయ్యాడు. ఆ సమయంలో శ్రీరెడ్డి తిట్టింది. దానిపై గోల జరిగింది. వర్మ ముందుకు వచ్చి తనదే తప్పంతా అని ఒప్పుకున్నాడు. పవన్ టార్గెట్టు వర్మ కాదు, వర్మను తిరిగి తిట్టినా ఏ ప్రయోజనం లేదు. అతనేమీ చలించడు. అతని సినిమాలను బహిష్కరించమని పిలుపు నివ్వడం దండగ. అలాటి పిలుపు లేకుండానే ప్రేక్షకులు వాటి జోలికి పోవటం లేదు. ఇప్పుడీ పిలుపు నిస్తే వర్మ ఫలానా సినిమా తీశాడని ఉచిత పబ్లిసిటీ జరిగి అతను లాభపడవచ్చు. అందువలన వర్మ వెనక్కాల టిడిపి వాళ్లున్నారంటూ ఆరోపణ చేశాడు. అంటే తనకు జరిగిన నష్టాన్ని రాజకీయంగా లబ్ధి కలిగేట్లా మలచుకున్నాడు. ఆశ్చర్యమేముంది? ఏ రాజకీయ నాయకుడైనా చేసేదదే. దానికి అవకాశం కల్పించింది ఎవరు? శ్రీరెడ్డి వ్యవహారం! శ్రీరెడ్డి చిన్న ఆర్టిస్టని అందరికీ తెలుసు. ఆమెకు ఒక టీవీ ఛానెల్ అంత ప్రాధాన్యత యివ్వడం ఆశ్చర్యం కలిగించింది. మొదట్లో ఆ కార్యక్రమానికి పెద్దగా ఆదరణ లేదు. ఏదో తన కష్టాలు చెప్తోంది, అయినా సినిమారంగంలో యిదేమైనా కొత్త విషయమా? మొదటిసారి వింటున్నామా? అని ఊరుకున్నారు. శేఖర్ కమ్ములను నిందించినా ఆయన తప్ప తక్కిన సినిమావాళ్లూ స్పందించలేదు. జనరల్‌గా ఆమె చేస్తున్న వాదనను ఖండించేవారూ లేరు. అయినా టీవీ ఛానెల్ రోజుల తరబడి ఆమెను పిలుచుకుని వస్తూ వచ్చింది. ఏ ఛానెలైనా వేరే ఎవరిపట్లయినా అంత ఉదారంగా ఉంటుందా? ఎవరూ చూడటం లేదండీ, మీరు చెప్పాల్సినది చెప్పేశారుగా యిక చాల్లెండి అనేసేస్తుంది. ఆమె చెప్పిన విషయాలే చెప్తూ ఉండటంతో చూడడం మానేశారని గ్రహించి, ఏదో ఒక రకమైన పబ్లిసిటీ రావాలని ఫిలిం ఛాంబర్ ముందు అర్ధనగ్న ప్రదర్శన జరిపించారు. (ఎవరు అన్నది ప్రస్తుతానికి తెలియరాలేదు) అభిరామ్ పేరు చెప్పించారు. సినిమారంగంలో పెద్ద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ఏదో ఒక చలనం వస్తుందని అందరూ అనుకుంటూన్న సమయంలో ఆ కుటుంబం గురించి ఆమె ఏమీ అనకుండా పవన్ పేరెత్తి తిట్టింది.

ఎవరైనా ప్రముఖుణ్ని తిడితే కత్తి మహేశ్‌కు వచ్చినట్లు ఫ్రీగా పబ్లిసిటీ వస్తుంది కాబట్టి పవన్‌ను తిట్టు అని నేనే చెప్పాను అని వర్మ చెప్పాడు. పవన్‌నే ఎందుకు తిట్టాలి? ప్రముఖుడు పవన్ ఒక్కడేనా? లేటెస్టుగా ఘోరమైన ఫ్లాప్ యిచ్చాడతను. సూపర్ హిట్ యిచ్చిన రామ్‌చరణ్‌ను తిట్టమనవచ్చుగా? ఇవ్వబోతున్న మహేశ్‌బాబును తిట్టమనవచ్చుగా? మరీ హైప్ వచ్చేది. సినీరంగంలో ప్రఖ్యాతులైన నిర్మాతలు, దర్శకులు, హీరోయిన్లు, కారెక్టరు ఆర్టిస్టులు కూడా ఉన్నారుగా! సినీరంగమే ఎందుకు, సినీతారలను తమకోసం, యితరుల కోసం వాడుకుంటూ ఉండే రాజకీయ ప్రముఖుల పేర్లు కూడా చెప్పవచ్చుగా! పవన్ ఒక్కడి పేరే చెప్పమనడం దేనికి? పోలీసుల వద్దకు వెళ్లి కేసు ఫైల్ చేయమనే సలహా యివ్వడం చేతనేనా? అది అంత చేటు సలహా కాదే! ఎవరైనా అనే మాటేగా! ఈ ప్రశ్నకు వర్మ సరైన సమాధానం చెప్పలేరు. అందుకే ఆయన సూత్రధారి కాదేమో, పాత్రధారి మాత్రమేనేమో అన్న అనుమానాన్ని తోసిరాజనలేం. అందువలన పవన్ దీని వెనక లోకేశ్ ఉన్నాడని అంటే ఓహో అనుకుంటాం. దానికి ఆధారం చూపించలేకపోయాడు అంటే ఏ రాజకీయ నాయకుడైనా ఆధారాలు చూపిస్తున్నారా? ఆరేడేళ్లగా టిడిపి జగన్ లక్ష కోట్లు తిన్నాడని ఆరోపిస్తూ వచ్చింది. ఆధారాలు చూపించిందా? బాబుకి సింగపూరులో ఆస్తులున్నాయని వైసిపి ఆరోపణలు చేస్తూ వచ్చింది. ఆధారాలు చూపిందా? ఆధారాలుంటే కోర్టుకే వెళుదురు. కర్ణాకర్ణిగా విన్న వార్తలు కావడంతోనే ఆరోపణలు చేసేసి, కాదని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత అవతలివాళ్లది అనుకుంటారు నాయకులు.

పవన్ మీద ప్రయోగించిన మాట మరీ అంత చెడ్డపదమేమీ కాదని ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ వాదించారు. అలాటప్పుడు దాన్ని తమ యూట్యూబ్ ఛానెల్‌లో మ్యూట్ ఎందుకు చేశారు? ఈ మాటను అన్ని ఛానెళ్లూ మాటిమాటికీ ఎందుకు చూపించాయి? దాన్ని బట్టి అర్థమవుతోంది, ఆమె చాలా తీవ్రమైన పదం వాడిందని. ఆమె అభినయంలో కూడా అనౌచిత్యమేమీ కనబడలేదా వీళ్లకు? పవన్ నా

వేలి ఉంగరంతో సమానం అనే అర్థంలో వేలు చూపించిందని సమర్థిస్తారా? పవన్ ఫ్యాన్స్ బూతులు ఉపయోగిస్తారు కాబట్టి మేమూ ఉపయోగిస్తాం అనడంలో అర్థమేమైనా ఉందా? కామెంట్లు రాసేవాళ్లు బూతులు వాడుతున్నారని వ్యాసకర్త కూడా బూతులు వాడతాడా? రోడ్డు మీద పిచ్చివాడు జిప్ తీసి తిరుగుతాడని మనమూ తిరుగుతామా? పవన్ ఎప్పుడైతే యీ కుట్రను బాబు తలకి చుట్టాడో, అప్పుడు పచ్చమీడియా తనేమిటో చూపించింది. టిడిపి అభిమానిగా పవన్ ఉన్నంతకాలం అతని మీటింగుకు షామియానా వేసిన దగ్గర్నుంచి ప్రత్యక్ష ప్రసారం చేసిన టీవీలు టిడిపితో బంధాలు తెంపుకున్నాక అతనూ, మరి కొందరు నటులు ఫిలిం ఛాంబర్‌కి వెళ్లినా, అభిమానులు వీరంగం చేసినా కవర్ చేయలేదు. ఏప్రిల్ 20న రోజంతా బాబు భజనే. పూట నిరాహారదీక్షలు దేశంలో పూటకు వందమంది చేస్తారు. బాబు చేస్తే భూమి బద్దలయిందా? భువనం దద్దరిల్లిందా? హోదా వచ్చిందా? కనీసం హామీ వచ్చిందా? దాని కోసం అన్ని కార్యక్రమాలూ రద్దు చేసుకుని అదే చూపించాయి చాలా తెలుగు ఛానెళ్లు. నేను గమనించినంత వరకు 2,3 ఛానెళ్లు మాత్రమే కొంత కవరేజితో సరిపెట్టాయి.

తెలుగు టీవీ ఛానెళ్లు ఒక పార్టీకి, ఒక కులానికి మాత్రమే అనుకూలంగా పనిచేస్తాయని అంటే 'ఛ, అలా ఆలోచించడం మన కుసంస్కారం' అని అనుకునేవాళ్లు సైతం 'ఈ పరిశీలనలో నిజం ఉంది' అని అనుకునేట్లా చేశాయి ఆనాటి ఆ ఛానెళ్లు. పవన్ వ్యవహారం స్క్రోలింగులో కూడా చూపలేదు. తమకు అనుకూలంగా లేనివాళ్లను యివి ఎలా తొక్కివేస్తాయో ఆ రోజు కళ్లకు కట్టినట్లు చూపారు. ఆ దీక్ష అయిపోయిన మర్నాడు ఆంధ్రజ్యోతి టీవీ చర్చ పెట్టింది. దానిలో 'రేపు' నరసింహారావుగారు చెలరేగిపోయారు. పవన్‌ను తిట్టని తిట్టు లేదు, మానసిక రోగి అన్నాడు, మరోటన్నాడు. టిడిపికి వ్యతిరేకంగా ఉన్నవాళ్లందరి మానసిక విశ్లేషణ చేసి, వాళ్లను రోగులుగా తేల్చడం ఆయన వృత్తి. సోనియాను చేశాడు, వైయస్‌ను చేశాడు, జగన్‌ను చేశాడు, టిడిపితో విడిపోయాక మోదీని చేశాడు, యిప్పుడు పవన్‌ను చేశాడు. టిడిపిని తప్పుపట్టిన వాళ్లందరూ మతిస్థిమితం లేనివాళ్లగా ఆయన వద్ద సర్టిఫికెట్టు పొందుతారు. ఆయన అంతటితో ఆగలేదు, పవన్ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు రావన్నాడు, వాళ్ల మానసిక విశ్లేషణ కూడా చేసేశాడేమో మరి. అభిమాన సంఘాలు చట్టవిరుద్ధమైనవన్నాడు. వాటిని రద్దు చేయాలన్నాడు. ఎన్టీయార్ అభిమాన సంఘాల మద్దతుతో అధికారంలోకి వచ్చిన టిడిపిని వీపున మోస్తున్న యీయన అభిమాన సంఘాల గురించి యిలా ఎలా అంటాడో తెలియదు. బాలకృష్ణ అభిమాన సంఘాలు అతని సినిమా రిలీజు రోజున ఎనుబోతును బలియిచ్చిన రోజున యీ సలహా యివ్వలేదేం యీయన? ఫలానా వారి వ్యాఖ్యల వలన నా పరువు పోయిందని రాధాకృష్ణలా కేసు పెట్టడం అనేక సందర్భాల్లో జరుగుతుంది. కేసు పర్యవసానం తేలేటప్పటికి ఏళ్లూ, పూళ్లూ పట్టవచ్చు. అయితే యీ లోపున తన ఛానెల్లో సమీక్ష పేర యిలా తిట్టించడానికి వీళ్లకేం హక్కుంది? ఛానెలు చేతిలో లేని మన బోటి వాళ్లకు యీ అడ్వాంటేజి లేదు కదా. మీడియా తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందంటే యిదే మరి!

మీడియాని అంటే మీడియా యాజమాన్యాన్ని అన్నట్లే. ఏదైనా పత్రికలో అభ్యంతరకరమైన రచన ప్రచురింపబడినప్పుడు ఆ వ్యాసరచయిత పేరు బయటకు చెప్పినప్పుడు అతనూ, సంపాదకుడు, ప్రచురణకర్తా బాధ్యులు, నిందితులు అవుతారు. విడిగా రచయిత పేరు ప్రస్తావించకుండా ఫలానా టీవీ, ఫలానా పత్రిక అంటే ప్రచురణకర్త, సంపాదకుడు మాత్రమే బాధ్యులు. వాళ్లని అంటే జర్నలిస్టులు ఫీలై పోవడం దేనికో నాకు అర్థం కాలేదు. వాళ్లు ఉద్యోగులు, ఏ టీవీలో పనిచేస్తూ ఉంటే దాని యాజమాన్యానికి అనుగుణంగా వార్తలు, వ్యాఖ్యలు రాయవలసినవారు. పవన్ మమ్మల్ని ఏదో అనేశాడంటూ వాళ్లు రోడ్డెక్కడం వింతగా లేదా? విజయ్ మాల్యా బ్యాంకులను మోసం చేసి విదేశాలకు పారిపోయాడు అంటే అతని సంస్థల ఉద్యోగులందరూ నిరసనలు తెలిపారా? చందా కొచ్చర్ అవకతవకలకు పాల్పడింది అని వార్త వస్తే ఐసిఐసిఐ ఉద్యోగులు రోడ్డు ఎక్కారా? ఎవరైనా జర్నలిస్టు ప్రత్యేకంగా యిన్‌వాల్వ్ అయిన చోట (మహాటీవీ మూర్తి లాగ) కేసులో వారి పేరు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. ట్విటర్‌లో జర్నలిస్టుల పేర్లు వచ్చాయా? టీవీ యజమానుల పేర్లు వచ్చాయా? నేను పవన్ ట్వీట్లను సమర్థించటం లేదు. చాలా వింతవింత పుంతలు తొక్కుతోంది అతని ధోరణి. లోకేశ్‌పై ఆరోపణలు చేసినపుడు వెనక్కాల అమిత్ షా మద్దతుతో పాటు ప్లానింగూ ఉందనుకున్నాను. కానీ పవన్‌ను చూస్తే అమెచ్యూరిష్ వ్యవహారంగా ఉంది. అతన్ని బెదరగొట్టిన ఘనత మాత్రం తెలుగు మీడియాదే. పచ్చ మీడియా కచ్చ కడితే ఎలా ఉంటుందో తెలిసేందుకు యిది వెల్‌కమ్ డ్రింక్ లాటిదే. అసలు విందు ముందుంది.

మొన్నటిదాకా పవన్‌ను జగన్‌ను తెగ విమర్శించాడు. హోదా గురించి, ప్రజాసమస్యల గురించి అధికారంలో ఉన్న బిజెపి, టిడిపి ఏం చేశాయని అడగని పవన్ మాటిమాటికీ ప్రతిపక్ష నాయకుడు ఏం చేశాడని అడుగుతూ వచ్చాడు. టిడిపిని కాస్త గిల్లినందుకే యిన్ని పాట్లు పడవలసి వస్తోంది కదా, టిడిపికి పీడకలగా ఉన్న జగన్ యింకెన్ని అపనిందలు, అవమానాలు, అఘాయిత్యాలకు గురై ఉంటాడో పవన్‌కి యిప్పటికైనా బోధపడి ఉండాలి. అయినా జంకకుండా ముందుకు సాగుతున్న అతని పోరాటస్ఫూర్తిని మనసులోనైనా అభినందించాలి. సాక్షి, విశాలాంధ్ర, ఆర్గనైజర్ వంటి పత్రికలు తమ రాజకీయ లక్ష్యాలను తేటతెల్లంగా చెప్పేసుకుంటాయి. కానీ కొన్ని పత్రికలు, టీవీ ఛానెళ్లు స్వతంత్ర సంస్థలనే ముసుగులో మిస్‌యిన్‌ఫర్మేషన్, డిస్‌ఇన్‌ఫర్మేషన్ సరఫరా చేస్తూంటాయి. మొన్నటిదాకా మోదీని ఆకాశానికి ఎత్తిన తెలుగు మీడియా టిడిపితో చెడిపోయిన తర్వాత మోదీని ఎంత తిడుతున్నాయో చూస్తున్నాం. కర్ణాటకలో బిజెపి ఓటమి ఖాయం అనే వార్తలు పుంఖానుపుంఖాలుగా వెలువరిస్తున్నాయి. టిడిపితో యింకా అంటకాగుతూ ఉంటే కథనాలు మరోలా ఉండేవి. మీడియాయే కాదు, సోషల్ మీడియా కూడా హఠాత్తుగా రంగు మార్చుకుంది. మోదీని తిడుతూ, వెక్కిరిస్తూ ఎన్ని వాట్సప్‌లు వచ్చిపడుతున్నాయో! టివి 5 వంటి ఛానెళ్లలో యాంకర్లు ఉదయపు చర్చాకార్యక్రమాల్లో పాల్గొనే బిజెపి నాయకులను హోదా గురించి నిలదీస్తున్నారు. వాళ్లేం మాట్లాడబోయినా, 'ఓహో అందుకేనా హోదా యివ్వలేదు?' అంటూ వెక్కిరిస్తున్నారు. గత నాలుగేళ్లగా యిలాటి వెక్కిరింపులేవీ లేవే! హోదా గురించి టిడిపి గప్‌చుప్‌గా ఉన్నంతకాలం వీళ్లూ గప్‌చుప్. వాళ్లు లేస్తేనే వీళ్లూ లేస్తారు. ఇది యాంకరు సొంత ప్రతాపం కాదు, యాజమాన్యపు నిర్ణయం.

పవన్ యిప్పుడు ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కుంటున్నాడు. ఇది సినిమా స్క్రిప్టు ప్రకారం నడిచే వ్యవహారం కాదు కాబట్టి హీరో గెలిచి తీరతాడన్న నమ్మకం లేదు. కంటకప్రాయమైన రాజకీయపథంలో క్లిష్ట పరిస్థితులు వచ్చినపుడు మాత్రమే నాయకత్వ పటిమ బయటపడుతుంది. దీన్ని పవన్ ఎలా హేండిల్ చేస్తాడో వేచి చూడాలి. ఒక్కటి మాత్రం నిజం. అతను సంయమనంతో వ్యవహరించక పోవడం తటస్థులకు నచ్చకపోవచ్చు. కానీ అభిమానులకు అటువంటి ఎక్సెంట్రిసిటీయే నచ్చుతుంది. ఎన్టీయార్ హావభావాలు, నాటకీయత, విపరీత ఆలోచనలు, ఛాందసం – అన్నీ మేధావులనుకునే పాత్రికేయులకు, కార్టూనిస్టులకు వేలంవెర్రిగా తోచి వ్యతిరేకంగా ఉండేవారు. కానీ అవే అభిమానులను వెర్రెక్కించాయి. డ్రామారావు అని కాంగ్రెసు వాళ్లు వెక్కిరించినా, సోబర్‌గా ఉండే విజయభాస్కర్ రెడ్డిని కాదని తెలుగు ప్రజలు రామారావుని ముఖ్యమంత్రి చేశారు. పవన్ యిప్పుడు ట్వీట్లతో గందరగోళం చేస్తున్నట్లే, ఎన్టీయార్ కూడా రాజకీయప్రవేశం చేసిన తొలి రోజుల్లో గందరగోళంగా, తికమకగా కామెంట్లు చేసి విమర్శల పాలయ్యారు. ఒక తీవ్రమైన తెలివితక్కువ వ్యాఖ్య చేసినప్పుడు 'దుర్యోధనుడు మయసభలో ప్రవేశించి జారిపడినట్లుంది' అని కాంగ్రెసు వారు వెక్కిరించారు కూడా. అయినా అభిమానులు పట్టించుకోలేదు.

చూడబోతే కాస్త ఎక్సెన్ట్రిక్‌గా ఉన్నవాళ్లంటేనే మోజుంటుందేమో. చిరంజీవి ప్రజారాజ్యం పెట్టినపుడు హుందాగా ప్రసంగాలు చేసేవారు. పవన్ ఆవేశంగా పంచెలూడగొట్టండి మార్కు ఉపన్యాసాలిచ్చేవాడు. చిరంజీవి కంటె పవన్ సభలకే ఎక్కువమంది జనం వచ్చారు. పవన్ యిప్పటి తీవ్రావేశం ఓటర్లను ఆకర్షిస్తుందో, విముఖులను చేస్తుందో ఎటూ చెప్పలేం. పైగా పవన్ పట్ల పచ్చ మీడియా కత్తి కట్టి విలన్‌గా చూపించిన కొద్దీ అతని అభిమానులకు, కులస్తులకు అతనిపై సానుభూతి పెరగడం ఖాయం. మొన్నటిదాకా మీరు ఆడించినట్లు ఆడినందుకు యిదా ఫలం? అని వారూ అనుకుంటారు. 'అతి చేస్తే గతి చెడుతుంది' అని మీడియా మోతుబర్లు కూడా గుర్తించాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2018)**

**2018 ఏప్రిల్ 28 టాబ్లాయిడ్‌కై** **ఎమ్బీయస్: బయోపిక్ భయాలు**

ఎన్టీయార్ అఫీషియల్ బయోపిక్ నుంచి తేజ తప్పుకున్నారు. ఆయన స్థానంలో ఫలానావారు దర్శకత్వం వహిస్తారన్న వార్త రాలేదు. ఎందుకంటే బయోపిక్ అంటే మాటలు కాదని దర్శకులందరికీ తెలుసు. తేజ నిష్క్రమణకు కారణాలు ఫలానా అని ఊహాగానసభలు జరిగాయి. నిజమేమిటో సినిమా యూనిట్‌కు మాత్రమే తెలియాలి. చంద్రబాబు తిరుగుబాటు చూపించే అగత్యం నుంచి తప్పించుకోవడానికి ఎన్టీయార్ జీవితం మొత్తం తీయరని తెలియగానే వర్మ 'లక్ష్మీస్ ఎన్టీయార్' ప్రకటించారు. దాని అతీగతీ తెలియదు. ఈ సినిమాలో ఏం చూపిస్తారో స్పష్టంగా చెప్పలేదు. నాదెండ్ల భాస్కరరావు ఉదంతం తర్వాత ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడి, ఎన్టీయార్ మళ్లీ ముఖ్యమంత్రి కావడంతో సినిమా పూర్తి చేద్దామనుకున్నారనీ, కానీ రాజకీయాల జోలికంటూ వెళితే అక్కడే ఎందుకు ఆపారు, పూర్తిగా ఎందుకు చూపలేదని అడుగుతారని జంకి, ఎన్టీయార్ సినిమా జీవితం వరకే పరిమితం చేద్దామనుకున్నారనీ, దానిలో కూడా తేజకు, బాలకృష్ణకు దృక్పథభేదం వచ్చిందనీ వెబ్‌సైట్ల సమాచారం.

మామూలుగానే బయోపిక్ తీయడం కష్టం. జీవితచరిత్రలే కాదు, చారిత్రాత్మక చిత్రాలు తీయడమూ కష్టమే. కొన్నిటికి చరిత్ర దొరకదు, దొరికిన వాటిల్లో వైరుధ్యం ఉంటుంది. మరి కొన్నిటిలో సమాచారం మరీ ఎక్కువగా ఉంటుంది. ఏది వదిలేయాలో, ఏది ఉంచాలో తేల్చుకోవడం మహా కష్టం. అనేక సంఘటనలను యథాతథంగా చూపిస్తే యీ కాలానికి నప్పదు, గొడవలు రావచ్చు. గాంధీ లాటి సినిమాలు తీసినప్పుడే యీ కష్టాలన్నీ వెలుగులోకి వచ్చాయి. సినిమాలు, రాజకీయాలు కలబోసిన ఎమ్జీయార్ జీవితంలో చాలా కథ ఉంది. దాన్ని ఎమ్జీయార్, కరుణానిధిల రూపేణా చెప్పాలని మణిరత్నం అనుకుని "ఇరువర్" (1997) తలపెట్టాడు. వారి జీవితాలలో మొదట్లో గాఢస్నేహం, తర్వాత తీవ్రశత్రుత్వం ఉన్నాయి కాబట్టి నాటకీయత ఉంటుందనుకున్నాడు. కానీ మణిరత్నం సినిమా మొదలుపెట్టినపుడు ఎడిఎంకె పాలన ఉందని, 1996లో కరుణానిధి ముఖ్యమంత్రి అయ్యాక మణిరత్నాన్ని పిల్చి స్క్రిప్టు మార్పించాడని, అందుకే నాటకీయత తగ్గి, సినిమా ఫెయిలై డబ్బింగు రైట్స్ తీసుకున్న తను చాలా నష్టపోయానని మురళీమోహన్ తన ఆత్మకథలో రాశారు.

ఇక ఎన్టీయార్ సినిమా విషయానికి వస్తే ఆయనది మోస్ట్ కలర్‌ఫుల్ జీవితం. ఎమ్జీయార్‌కు రాజకీయాల్లో ఓటమి లేదు. చాలా ఏళ్లు రాజకీయాల్లో నలిగి, డిఎంకె పార్టీలోంచి బహిష్కరించబడి, కొత్త పార్టీ పెట్టి గెలుస్తూ పోయాడు. అతనికి వెన్నుపోటులు తెలియవు. అనారోగ్య పీడితుడై ఉండి కూడా తన అనుచరులను చెప్పు కింద తేలుగా ఉంచి పాలించాడు. కానీ ఎన్టీయార్ రాజకీయనాయకుడిగా ఎత్తులు, పల్లాలు అన్నీ చూశాడాయన. ప్రాంతీయ పార్టీ పెట్టి పది నెలల్లో ఏకంగా ముఖ్యమంత్రి కావడం ఒక రికార్డు. గ్రామాధికారాల తొలగింపు, ఉద్యోగస్తుల రిటైర్‌మెంటు వయసు తగ్గింపు వంటి హఠాన్నిర్ణయాలు, ఏకపక్షంగా వ్యవహరించి అనుచరుల అసంతృప్తికి గురి కావడం, రాజకీయపు టెత్తుగడలు తెలియక వెన్నుపోటుకి గురి కావడం, ప్రజా ఉద్యమం లేవదీసి అధికారాన్ని మళ్లీ దక్కించుకోవడం, ఉద్యోగుల ఆగ్రహానికి గురై తిట్టించుకోవడం, మంత్రులకు తగినంత గౌరవం యివ్వక అహంకారం ప్రదర్శించడం, వినూత్న సంక్షేమ పథకాలతో ప్రజల ఆదరాన్ని చూరగొనడం, రాష్ట్రాల అధికారాలకై పోరాడడం, జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలను ఏకం చేయడానికి నాయకత్వం వహించడం, సొంత తప్పిదాలతో ఎన్నికలలో ఓడిపోవడం, ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీలో కూర్చోవడం, అలిగి వెళ్లిపోవడం, కుటుంబం మాట తోసిరాజని ద్వితీయ వివాహం చేసుకోవడం, ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి ఆమెను ఎన్నికల ప్రచారంలో భాగస్వామిని చేయడం, ఎన్నికలలో గెలిచాక ఆమెకు విపరీతంగా ప్రాధాన్యత యిచ్చి పాత సహచరులను దూరం చేసుకోవడం, రెండోసారి కుటుంబసభ్యుల చేతిలోనే వెన్నుపోటుకు గురి కావడం, గడ్డిపోచలుగా చూసిన వారి చేతిలోనే

చెప్పుదెబ్బలు తినడం, గాయపడిన ఒంటరి సింహంలా ఆవేదనతో ఆక్రోశిస్తూ, యింకో పోరాటానికి సిద్ధపడుతూ ఉండగానే హఠాత్తుగా మరణించడం. ఈ కథను మొత్తంగా తీస్తే ఒక గొప్ప గ్రీక్ ట్రాజెడీ అవుతుంది. ఎన్టీయార్ పార్టీ ఆయనతోనే మూతబడి ఉంటే యీ కథను యథాతథంగా తీసి గొప్ప డ్రామా పండించేవారు.

కానీ దురదృష్టవశాత్తూ ఎన్టీయార్ చేతుల్లోంచి పార్టీని లాక్కున్న వాళ్లు అధికారంలో ఉన్నారు కాబట్టి, మళ్లీ అధికారంలోకి వద్దామని చూస్తున్నారు కాబట్టి యీ కథలో తమకు అనుకూలమైనది మాత్రమే వాడుకుందామని చూస్తున్నారు. వారి ప్రతికక్షులు వారికి ప్రతికూలమైనది మాత్రమే వాడుకుందామని చూస్తున్నారు. ఆ ప్రతికక్షులకు ప్రత్యర్థులు దానికి విరుగుడు సినిమా తీస్తామన్నారు. వీరెవ్వరికీ పూర్తి వాస్తవాలు అక్కరలేదు. పూర్తి చరిత్ర అక్కరలేదు. దాన్ని కూడా తప్పు పట్టలేము. రామాయణాన్ని సీతారాముల కళ్యాణం వరకే చూపవచ్చు. భారతంలో పాండవ వనవాసం మాత్రమే చూపవచ్చు. చూపించిన కాస్తా నిజాయితీగా చూపించారా లేదా అన్నదే ప్రశ్న. ఎన్టీయార్‌ను మామూలు మనిషిగా చూపిస్తే లోపాలతో సహా అన్నీ చూపించాలి. దైవాంశ సంభూతుడిగా, తప్పులేవీ చేయనివాడిగా చూపిస్తే అది చరిత్ర అవదు, జానపద కథ అవుతుంది. సంజయ్ దత్‌పై వస్తున్న చిత్రంలో అతని దుర్గుణాలతో, దురలవాట్లతో సహా అన్నీ చూపిస్తారట. అప్పుడే అది రసవత్తర గాథ అవుతుంది. చూడబుద్ధవుతుంది. అలాటి ధోరణిలో ఎన్టీయార్ సినిమా తీసే స్వేచ్ఛ దర్శకుడికి యిస్తారని ఊహించడం కూడా కష్టం.

ఎన్నికలకు ముందు వస్తోంది కాబట్టి, బాలకృష్ణ నిర్మాతల్లో ఒకరుగా ఉన్నారు కాబట్టి, టిడిపి తరఫు ప్రాపగాండా సినిమాగా దీన్ని తీర్చదిద్దవలసిన భారం దర్శకుడిపై ఉంది. రాజకీయ ప్రవేశం చూపిస్తే చంద్రబాబు ఎన్టీయార్‌ను ఛాలెంజ్ చేసిన విషయం, టిడిపి అభ్యర్థి చేతిలో ఓడిపోయిన విషయం చూపవలసి వస్తుంది. చూపిస్తే ప్రస్తుత తెలుగుదేశాధినేత బాబుని తక్కువ చేసినట్లవుతుంది. చూపకుండా వదిలేస్తే అందరూ నిలదీస్తారు. ఎన్టీయార్, చంద్రబాబు కుమ్మక్కయి యిద్దరూ చెరో పార్టీలో ఉంటామని ముందే అనుకుని కాంగ్రెసును జెల్ల కొట్టారని చూపిస్తే ఎన్టీయార్ వ్యక్తిత్వానికి మచ్చ. మొదటి వెన్నుపోటు చూపిస్తే రెండో వెన్నుపోటు వదిలేశారేం అనవచ్చు. ఇలా రాజకీయ రంగాన్ని కాస్త కవర్ చేసినా వివాదాలు రావచ్చు. అందువలన ఎందుకొచ్చిన గొడవని సినిమాల వరకే పరిమితమౌదామని నిర్మాతలు అనుకోవచ్చు.

అదే జరిగితే నాటకీయత ఎక్కణ్నుంచి వస్తుందని దర్శకుడు వేసే మౌలిక ప్రశ్న. సినిమాల్లో ఎన్టీయార్ ఉత్థానపతనాలు ఎక్కడున్నాయి? నిర్మాతగా మొదటి రెండు సినిమాలు ఫ్లాపయ్యాయి తప్ప నటుడిగా స్లంప్ వచ్చిందెక్కడ? కొన్ని సినిమాలు ఫెయిలయినా, వాటికి రెట్టింపు హిట్టయిన సినిమాలు అదే ఏడాదిలో వచ్చాయి. పారితోషికం పెరుగుతూనే వచ్చింది. వేషాలు లేని స్థితి ఎన్నడూ రాలేదు. దర్శకుడిగా కూడా రాణించి, నిర్మాతగా కూడా అనేక హిట్ సినిమాలు తీయడం జరిగింది. దర్శకనిర్మాతగా వైఫల్యం అంటూ ఉందంటే కెరియర్ చివరి దశలో తీసిన పౌరాణిక, చారిత్రాత్మక సినిమాలు మాత్రమే. ప్రజలకు ఆ వైఫల్యాలు గుర్తులేనంతగా అదే సమయంలో సాంఘిక సినిమాలు హిట్టయి యువతను కూడా ఆకర్షించడం జరిగింది. ఈ యునిలేయర్డ్ విజయగాథను రసవత్తరమైన కథగా చెప్పడమూ, తెర కెక్కించడమూ కష్టం. జీవితంలో తొలిదశలో కొద్దిపాటి స్ట్రగుల్ ఉన్నా, సినిమా రంగంలో వరుస విజయాలే. అక్కినేనిపై సినిమా తీసినా యిదే చిక్కు. 60 సినిమాల వరకు సాగిన ఆయన జీవిత గాథను ముళ్లపూడి వెంకటరమణగారు "కథానాయకుని కథ" పేరుతో రాశారు. సూపర్ హిట్టయింది. 200 సినిమాలు పూర్తయ్యాక ఆ పుస్తకానికి సీక్వెల్ రాయమని అక్కినేనిగారు ముళ్లపూడిగారిని అడిగారు. 'మొదట్లో ఉన్న స్ట్రగుల్ తర్వాత ఎక్కడుంది? మీ పాత్రలు మీరు ఎంచుకునే స్థాయికి చేరాక డ్రామా ఎక్కడుంది? రాస్తే రక్తి కట్టదు' అంటూ ముళ్లపూడి సున్నితంగా తిరస్కరించారు. సినిమాల్లో తొలిదశలో ఎయన్నార్‌కు క్లిష్టకాలం ఉంది. ఎన్టీయార్‌కు అదీ లేదు. రెండో సినిమా నించే హీరో. వరుస విజయాలు.

ఏ కథలోనైనా విలన్ ఉండకపోతే రక్తి కెక్కదు. ఈయన కథలో విలన్ ఎవరవుతారు? సహనటుడు నాగేశ్వరరావా? ఇద్దరి మధ్య స్పర్ధ ఉంది కానీ బద్ధవైరం ఉందా? ఉందని నిరూపించగలరా? కొన్ని వాస్తవాలను చూపుతారా? మరుగుపరుస్తారా? కొంతకాలం పాటు తెలుగు సినిమా పరిశ్రమ ఎయన్నార్ క్యాంప్, ఎన్టీయార్ క్యాంప్‌లుగా విడిపోయిందని యీ సినిమాలో చూపిస్తారా? ఇద్దరి అభిమాన సంఘాలూ పోస్టర్ల మీద పేడముద్దలు వేసుకోవడం చూపిస్తారా? ఇరువురి నటవారసులు సఖ్యంగా ఉన్న యీ రోజుల్లో యివన్నీ చూపించి కెలుక్కుంటే బాగుండదని మానేస్తారా? చిత్రపరిశ్రమను హైదరాబాదు తరలించడానికి ప్రయత్నించే ముందు నాగేశ్వరరావు తనను సంప్రదించలేదనే కోపంతో (విరాళాల సేకరణకు వెళ్లేటప్పుడు తనను సంప్రదించలేదని నాగేశ్వరరావు కౌంటర్) ఎన్టీయార్ తరలింపును అడ్డుకుని, మద్రాసులోనే సినిమాలు తీయాలని నిర్మాతలను అడిగారని చూపితే రాజకీయాల్లోకి వచ్చాక తెలుగు, తెలుగు అంటూ కలవరించిన ఎన్టీయార్ యిమేజి ఏం కాను? ఇలాటివన్నీ తీసి పారేస్తే యింక ట్విస్టులెక్కడుంటాయి? ప్రతినాయకుడు, ఘర్షణ, డ్రామా లేని కథ ఏం పండుతుంది?

ఎన్టీయార్ పెట్టిన పార్టీ మనుగడలో లేకపోతే కొన్నయినా డ్రమటిక్ పాయింట్స్ ఉంచేవారు. కానీ తెలుగుదేశం 2019లో పోటీ చేస్తోంది. 25కి 25 సీట్లు గెలిచి బిజెపికి బుద్ధి చెప్పాలని ఉవ్విళ్లూరుతోంది. దానికై ఎన్టీయార్ లార్జర్ దాన్ లైఫ్ యిమేజిని ఉపయోగించుకుందామని చూస్తోంది. ఇలాటప్పుడు తమను యిబ్బంది పెట్టే ఘట్టాలన్నీ తీసేసి, నాటకీయత లేని సినిమా తీస్తే డాక్యుమెంటరీలా తయారవుతుంది. ఎన్టీయార్ గెటప్స్‌లో బాలకృష్ణ కనబడి డాన్సులు అవీ చేస్తారు కాబట్టి, మహా అయితే రీ-హేష్డ్ ఎన్టీయార్ చిత్రలహరిలా తయారవుతుంది. ఇది బాలకృష్ణ అభిమానులను అలరిస్తుందేమో కానీ ఎన్టీయార్ అభిమానులకు ఏ మేరకు నచ్చుతుంది? ఏ కథకైనా క్లయిమాక్స్ ఉండాలి. ఎన్టీయార్ సినిమా కెరియర్ వరకే తీస్తారనుకుంటే క్లయిమాక్స్ ఏముంటుంది? సినిమాల నుంచి తప్పుకుంటానని ప్రకటించి రాజకీయాల్లోకి వెళ్లడమా? లేక రాజకీయాల్లో ఉంటూనే "విశ్వామిత్ర", "అశోక", "శ్రీనాథ" వంటి ఫ్లాప్ సినిమాలు తీయడమా? రెండూ నప్పవు. అందువలన రాజకీయాలు చూపి తీరాలి. చైతన్యరథం వంటి కొత్త

కాన్సెప్టులు, జనాలు వెర్రెత్తినట్లు పరుగులు పెట్టడాలు చూపి తీరాలి. రాజకీయాలంటే చూపితే బాబు వ్యతిరేకించినట్లు చూపి తీరాల్సిందే. లేకపోతే మొత్తం సినిమాని వదిలేసి అందరూ దాన్నే ఎత్తి చూపుతారు. కానీ ఆ దృశ్యాలు చూపాలంటే బాబు వియ్యంకుడైన బాలకృష్ణను ఒప్పించాలి. ఏ దర్శకుడికైనా అది సులభమైన పని కాదు. తటపటాయిస్తూండవచ్చు. అందుకే కాబోలు, ఓ పట్టాన పేరు వెలువడటం లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2018)**

**2018 మే 5 టాబ్లాయిడ్‌కై** **ఎమ్బీయస్: కర్ణాటక తెలుగు ఓటర్లు హోదా విషయంలో స్పందిస్తారా?**

ఆంధ్రకు ప్రత్యేక హోదా యివ్వకుండా బిజెపి మోసం చేసింది కాబట్టి ప్రపంచంలోని తెలుగువాళ్లందరూ బిజెపికి బుద్ధి చెప్పాలని తిరుపతి సభలో బాబు పిలుపు నిచ్చారు. రాబోతున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో బిజెపిని ఓడించి దానికి తగిన శాస్తి చేయాలని టిడిపి నాయకులు పదేపదే చెపుతున్నారు. అక్కడకు వెళ్లి ప్రచారం కూడా చేస్తున్నారు. ఆరెస్సెస్ చేసిన అంతర్గత సర్వే ప్రకారం కర్ణాటకలో బిజెపికి 70 సీట్లు, కాంగ్రెసుకు 115-120, జెడిఎస్‌కు 29-34 సీట్లు వస్తాయని తాజాగా వెలువడిన వార్త. దానికి తగ్గట్లుగానే మోదీ ప్రచారాన్ని మరో నాలుగు జిల్లాలకు విస్తరించడానికి నిశ్చయించుకున్నారు. అంతిమంగా ఆ సర్వే ఫలితాలు నిజమైతే ఆ ఘనతంతా తమదే అని టిడిపి ప్రచారం చేసుకోవచ్చు. ఆ మాటకొస్తే కాంగ్రెస్సూ చెప్పుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల కాంగ్రెసు నాయకులు మాత్రం కర్ణాటకకు వెళ్లి మోదీ ఆంధ్రుల పాలిట నరకాసురుడని, బిజెపిని ఓడించి ఆంధ్రఖు న్యాయభిక్ష పెట్టాలనీ విజ్ఞప్తి చేశారు. వాళ్లతో బాటు కెసియారూ చెప్పుకోవచ్చు – ఎందుకంటే తెలంగాణకు ఆనుకుని వున్న కర్ణాటక జిల్లాలలోని తెలుగువారు కాంగ్రెసు, బిజెపిలను తిరస్కరించి జెడిఎస్‌కు ఓటేయాలని కెసియార్ పిలుపు నిచ్చారు. వైసిపి అలాటి పిలుపు నిచ్చినట్లు లేదు. ఎందుకంటే హోదా విషయంలో టిడిపిది వంచన, బిజెపిది నిర్లక్ష్యం అని వైసిపి ఉవాచ. కర్ణాటకలో బిజెపి ఓటమిని వైసిపి స్వాగతిస్తుందన్న నమ్మకమూ లేదు.

తమ రాష్ట్రంలో ఉన్న యితర భాషల వారిని ఆకట్టుకోవడానికి ఆ యా భాషారాష్ట్రాల నుంచి రాజకీయ నాయకులను, కళాకారులను తెప్పించి ప్రచారం చేసుకోవడం ప్రతి రాజకీయ పార్టీ చేసే పనే. బిజెపి తరఫున భోజపురి నటుడు మనోజ్ తివారి కూడా వచ్చాడు, ఆ భాష మాట్లాడే కొద్దిమందినైనా ఆకట్టుకోవడానికి! కానీ కర్ణాటకలో నివాసం ఉండేవారు తమ జన్మస్థానాలలో జరిగే రాజకీయ సంఘటనలను పట్టించుకుని స్పందిస్తూ ఉంటారని అనుకోవడానికి పెద్దగా ఆధారాలు కనబడవు. ఆంధ్రకు హోదా యివ్వలేదు కాబట్టి తెలుగువారికి కోపం వచ్చి బిజెపిని శిక్షిస్తారా? అనేదాని గురించి ఆలోచించి చూస్తే, మొదటగా తట్టే ప్రశ్న – 2014లో ఏం జరిగింది అని. రాష్ట్రాన్ని అడ్డగోలుగా చీల్చినందుకు ఆంధ్రప్రజలు కాంగ్రెసును తుక్కుతుక్కుగా ఓడించారు. దేశంలో అనేక ప్రాంతాల్లో కాంగ్రెసు ఘోరంగా ఓడిపోయింది. కానీ కర్ణాటక వారు కాంగ్రెసును ఆదరించారు, పట్టం కట్టారు. ఆ ఎన్నికలలో తక్కిన వారి మాట ఎలా వున్నా తెలుగువారు మాత్రం కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఓటేశారు అని చెప్పడానికి ఆధారాలు లేవు. ఒకవేళ వేసినా కాంగ్రెసును ఓడించడానికి అవి చాలలేదు అని అర్థమైంది కదా.

కర్ణాటకలో ఉన్న తెలుగువారందరూ ఒక ప్రాంతం వాళ్లు కాదు. కొందరు తెలుగు మూలాలున్న కర్ణాటకవాసులు. ఎన్నో తరాల కింద వచ్చేశాం, మా సొంత ఊరు కూడా మాకు తెలియదు, ఇంట్లో తెలుగు మాట్లాడతామంతే అనేవారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. 'మేము ఎప్పుడూ యిక్కడే ఉన్నాం, రాష్ట్రాల సరిహద్దులు మారి కొంతకాలం మద్రాసు రాష్ట్రమన్నారు, తర్వాత కర్ణాటక అన్నారు, మాకు యీ ప్రాంతం తప్ప వేరే వాటి గురించి తెలియదు' అనేవారు బళ్లారి జిల్లాలో కనబడతారు. హైదరాబాదు – కర్ణాటక ప్రాంతంలోని తెలుగువాళ్లూ యిదే మాట చెప్తారు – 'మాది అప్పుడు నైజాంలో అన్నారు, యిప్పుడు కర్ణాటక అన్నారు' అని. గత వందేళ్లగా వెళ్లినవాళ్లలో వ్యాపారాల కోసం, ఉపాధి కోసం వెళ్లిన రాయలసీమ వారు ఎక్కువ. సాగుభూములు చౌకగా లభించే రోజుల్లో అక్కడికి వ్యవసాయం చేయడానికి వెళ్లినవారిలో కోస్తా జిల్లాల వారు కనబడతారు. ఉద్యోగాల రీత్యా, వ్యాపారాల రీత్యా బెంగుళూరు నగరంలో స్థిరపడిన వారిలో అన్ని జిల్లాల వారూ ఉన్నారు. వారందరికీ ఆంధ్రకు హోదా యివ్వలేదన్న బాధ ఉందా? ఇవ్వనందుకు బిజెపిపై కసి ఉందా? ఇప్పించలేనందుకు టిడిపిపై చికాకు ఉందా?

ముందుగా చూడవలసినది, అక్కడ శాశ్వతంగా నివాస మేర్పరుచుకున్న వారిలో తెలుగు రాష్ట్రాల రాజకీయాలపై ఆసక్తి ఏ మేరకు ఉంది? అని. మనుషులు స్వార్థపరులు. హైదరాబాదు ఎంఎంటిఎస్ రైలెక్కేవాడు సికింద్రాబాదు ఎంఎంటిఎస్ రూట్లో బళ్లు పెంచారంటే పట్టించుకోడు. తన రూట్లో బోగీలు పెంచారా, ఫ్రీక్వెన్సీ పెంచారా అన్నదే చూస్తాడు. అమరావతికి మెట్రో యివ్వకుండా బెంగుళూరు మెట్రోకు నిధులు యిచ్చారని అలిగిన బెంగుళూరు తెలుగువాణ్ని చూపండి, చూద్దాం. తను ఉన్న చోట శాంతియుతంగా ఉండాలి, సౌకర్యాలు ఉండాలి, తన యిల్లున్న చోట స్థలాల ధరలు పెరగాలి... అంతే. ఆంధ్రకు హోదా యిచ్చేస్తే కర్ణాటక నుండి పరిశ్రమలు తరలిపోతే ఏ కర్ణాటక తెలుగువాడైనా సంతోషిస్తాడా? పధ్నాలుగేళ్లు ప్రవాసాంధ్రుడిగా ఉండి నేను గమనించినది – తెలుగువాళ్లు ఎక్కడ ఉంటే అక్కడి స్థానికులతో, స్థానిక పరిస్థితులతో కలిసిపోతారు. సొంత ఐడెంటిటీకై పోరాడరు. సొంత రాష్ట్రంలో జరిగే రాజకీయ పరిణామాలు శ్రద్ధగా ఫాలో అవరు. కలకత్తాలో లేక్ మార్కెటుకు సమీపంలో ఉన్న న్యూస్‌పేపరు స్టాల్‌లో తమిళ, మలయాళ దిన, వార పత్రికలు అమ్మేవారు. తెలుగు పత్రికలు అతి తక్కువ వచ్చేవి. నేను స్థానిక ఆంగ్ల దినపత్రిక "టెలిగ్రాఫ్" కొనేవాణ్ని, దక్షిణాది వార్తలకై "హిందూ" పోస్టులో తెప్పించేవాణ్ని (రోజున్నర లేటుగా వచ్చేది). 1983 ఎన్నికల సమయంలో ఓ మూణ్నెళ్ల పాటు "ఈనాడు" పోస్టులో తెప్పించాను. నాదెండ్ల తిరుగుబాటు రోజున ఎన్టీయార్ పదవీభ్రష్టుడయ్యాడని, అరెస్టయ్యాడని విని వెంటనే ఆ న్యూస్‌స్టాల్‌కి వెళ్లి తెలుగు పేపరు ఉందా అని అడిగితే తిట్టిపోశాడు. 'మీ తెలుగు వాళ్లంతా యింతే. రోజూ పేపరు తెప్పించుకోరు.

ఇవాళ మాత్రం వచ్చి తెగ అడుగుతున్నారు. తమిళ, మలయాళ వాళ్లని చూడండి, ఎక్కడున్నా వాళ్ల రాష్ట్ర విశేషాలు తెలుసుకుంటారు.' అని. తమిళనాడులో ఉండగా తెలుగు పేపరు రోజూ తెప్పించుకునేవాణ్ని. అక్కడున్న తెలుగు మూలాల వాళ్లని కదలేస్తే, వాళ్లకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఫలానా అని తెలుసు తప్ప యింకేమీ తెలియదు. తమిళ పత్రికల్లో ఏ న్యూస్ వస్తే అదే చదువుతారు. ఇప్పుడు యింటర్నెట్ వచ్చింది కాబట్టి తెలుసుకుందా మనుకునేవాడికి తెలుసుకునే అవకాశం పుష్కలంగా ఉంది. కానీ ఆసక్తి ఉండాలిగా. తెలుగువాళ్లకి సహజంగా అది తక్కువ. హోదా విషయంలో ఉన్న మతలబులన్నీ అర్థం చేసుకునే ఓపిక, తీరిక వాళ్ల కుంటాయనుకోను.

కర్ణాటకలో ఉన్న తెలుగువాడు ఓటేసేముందు స్థానిక పరిస్థితులను లెక్కలోకి తీసుకుంటాడు తప్ప ఫలానా రాష్ట్రానికి ఫలానాది చేయలేదు కనుక.. అనుకోడు. తెలంగాణలో ఉన్న ఆంధ్రమూలాల ఓటరు ఓటేసేముందు తెరాస పరిపాలనను, తన రక్షణను, అభివృద్ధిని గణిస్తాడు తప్ప ఆంధ్ర పాలకుడికి యితను అనుకూలుడా, ప్రతికూలుడా అని పట్టించుకోడు. ఆ మాట కొస్తే ఆంధ్రలో పెట్టుబడులు పెడదామనుకుంటే తప్ప అక్కడ ప్రత్యేక హోదా యిచ్చారా లేదా అన్నది కూడా తెలంగాణా పౌరుడు పట్టించుకునే అంశం కాదు. తెలంగాణ, కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో ఉన్నవారు కూడా పట్టించుకోరు. టిడిపి తమ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, హైకోర్టుతో సహా అన్నీ అమరావతికే కట్టబెడుతోందనీ ఆంధ్రలో ఉన్న రాయలసీమ వారికే విముఖత ఉన్నపుడు, రాయలసీమ నుండి కర్ణాటకకు వెళ్లి స్థిరపడిన వారికి టిడిపిపై ఆదరం ఉంటుందా? నిజానికి కర్ణాటకలో ఉన్న రాయలసీమ ప్రాంతీయుల ఓటర్లను దృష్టిలో పెట్టుకునే ఆంధ్ర బిజెపి రాయలసీమ హక్కుల ఉద్యమం చేపట్టిందని అన్నారు.

తను ఏర్పరచబోయే కూటమిలో జెడిఎస్ చేరుతుందనే ఆశతో, కెసియార్ జెడిఎస్‌కు ఓటేయమని తెలుగువారికి పిలుపు నివ్వవచ్చుగాక, వాళ్లెందుకు వినాలి? తెలుగు ఓటర్లు కర్ణాటక ఫలితాలను అటూయిటూ చేసేయగలరనే భ్రమలోనే యీ పిలుపులన్నీ. నిజానికి కర్ణాటకలో తెలుగు వారే కాదు, తమిళులు, మలయాళీలు, మరాఠీలు, కొంకణివారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. బెంగుళూరు అనేక రంగాల్లో పుంజుకున్న తర్వాత ఉత్తర భారతం నుంచే కాదు, ఈశాన్య భారతం నుంచి కూడా వచ్చి ప్రజలు స్థిరపడ్డారు. ఇతర రాష్ట్రాల సరిహద్దుల్లో 64 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటితో బాటు 60 నియోజకవర్గాల్లో యితర భాషీయుల సంఖ్య గణనీయంగా ఉంది. బెంగుళూరులో అయితే మరీ పెద్ద సంఖ్యలో ఉన్నారు. గత ఎన్నికలలో ఫలానా భాషావర్గం వారు ఓటేశారు కాబట్టి ఫలానా పార్టీ నెగ్గిందన్న విశ్లేషణలు నేను చదవలేదు. స్థానిక కుల, ప్రాంతీయ, ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలే ఎప్పుడూ ప్రాధాన్యత వహిస్తూ వచ్చాయి. ఈసారీ అదే జరగవచ్చు. బిజెపి ఓడిపోతే స్వయంకృతాపరాధాల వలన ఓడిపోవచ్చు తప్ప దానికై తెలుగు రాష్ట్రాల నాయకులు చంకలు గుద్దుకోనక్కరలేదు. – – **ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

**2018 మే 5 టాబ్లాయిడ్‌కై మెమరీ నెమరేస్తే.... శీర్షికకై ఎమ్బీయస్: బార్‌ట్లేకు ఎస్వీయార్ అంటే అంత గౌరవం ఎందుకు?**

వాహినీ స్టూడియోలో కెమెరా డిపార్టుమెంటుకి చీఫ్‌గా, విజయా వారి సినిమాలకు ఫోటోగ్రాఫర్‌గా మార్కస్ బార్‌ట్లే అందరికీ సుపరిచితుడు. చాలా క్రమశిక్షణ గల వ్యక్తి. సెట్, లైటింగ్ వగైరాలు జాగ్రత్తగా చూసుకునేవాడు. ఆర్టిస్టులు ఏదైనా పొరబాటు చేస్తే నిర్మొగమాటంగా చెప్పి మందలించేవాడు. అందరికీ ఆయనంటే అడలు. "రాముడు భీముడు" సినిమా ఆధారంగా దిలీప్ కుమార్ ద్విపాత్రాభినయంతో నాగిరెడ్డిగారు హిందీలో నిర్మించిన "రామ్ ఔర్ శ్యామ్" (1967) షూటింగు ముచ్చట్లను రచయిత డివి నరసరాజుగారు "తెర వెనుక కథలు"లో గ్రంథస్తం చేశారు. ఆ సినిమాకు దర్శకుడిగా తాపీ చాణక్య పేరు వేసినా, నిజానికి దిలీప్ కుమారే దర్శకత్వం వహించాడు. సెట్స్ మీదకు ఆలస్యంగా రావడం అతని అలవాటు. హిందీ చిత్రరంగంలో రారాజు కాబట్టి బొంబాయిలో చెల్లిపోయింది. మద్రాసులో అలా కుదరదని చెప్పినా ఓ రోజు 12 గం॥లకు వచ్చాడు. "1 గంటకి లంచ్ కదా. ఒక గంటలో ఏం పనిచేస్తాం? ఒకేసారి లంచ్ తర్వాత షూటింగు చేద్దాం." అన్నాడు. బార్‌ట్లే 9 గం॥ల నుంచి లైటింగు అదీ చేసుకుని సిద్ధంగా ఉన్నాడు. దిలీప్ యిలా అన్నాడని వినగానే "నాకీ మాట ముందే చెబితే నేనూ లంచ్ తరువాత వచ్చేవాణ్ణి కదా" అని దిలీప్ మీద కొంత పరుషపదజాలం విసిరాడు. అది దిలీప్‌కి చేరింది. అప్పణ్నుంచి బార్‌ట్లే అంటే భయం పట్టుకుంది.

దిలీప్ కథలో కొన్ని మార్పులు చేద్దామనుకున్నాడు. ఒరిజినల్ కథారచయిత నరసరాజుగారిని పిలిపించి, చర్చించి మార్పులు చేసేవాడు. ఓ రోజు సాయంత్రం 6 గం॥లకు నరసరాజుగారు వేరే పని మీద స్టూడియోకి వెళ్లి షూటింగు చూడబోయారు. దిలీప్ ఒక సీను ప్లాను చేశానని, అది తీయబోతున్నాననీ చెప్పాడు. 'ఈ సీను సినిమాలో ఎలా అతుకుతుంది? దీనివలన సస్పెన్సు పోతుంది కదా' అని యాయన అంటే "మీరు చెప్పినది కరక్టే. ఆ విషయం నాకూ మధ్యాహ్నమే తట్టింది. కానీ వెళ్లి సీను తీయనక్కరలేదని చెబితే బార్‌ట్లే ఎగిరి నా గొంతు పట్టుకుంటాడు. 2 గంటల నుంచి ఫుల్ ఫ్లోర్ ఎంతో కష్టపడి లైటప్ చేశాడు. అందువలన సీను తీస్తాను, కానీ సినిమాలో పెట్టను. ఈ రహస్యం ఎవరికీ చెప్పకండి." అని దిలీప్ చెప్పాడు. అంటే బార్‌ట్లేకు కోపం వస్తుందని దిలీప్ ఉత్తుత్తి సీను ఒకటి తీశాడన్నమాట. అదీ బార్‌ట్లే యిమేజ్! కడదాకా అది అలాగే సాగింది.

రామానాయుడు గారి "చక్రవాకం" (1974) సినిమాకు బార్‌ట్లే కెమెరామన్. హీరోయిన్ వాణిశ్రీ. వాహినీ స్టూడియోలో షూటింగు. ఓ సీనులో ఆయన కెమెరాలో చూస్తూ లైట్‌మన్‌కి ఏదో చెబుతూంటే వాణిశ్రీ అటూయిటూ కదులుతూ పక్కనున్న మేకప్‌మన్‌తో ఏదో మాట్లాడుతూ టచప్ చేసుకుంటోంది. 'లైటింగు చూసుకుంటున్నాను కదా కదలకుండా నిలబడమని వాణిశ్రీకి చెప్పండి' అని బార్‌ట్లే అసిస్టెంటు డైరక్టరుగా పని చేస్తున్న మురారి (తర్వాతి రోజుల్లో 'యువచిత్ర' బ్యానర్‌లో చాలా మంచి సినిమాలు తీశారు)కి చెప్పారు.

ఆయన వెళ్లి చెపితే వాణిశ్రీ కాస్సేపు కదలకుండా నిలబడి ఆ తర్వాత మళ్లీ కదలడం మొదలుపెట్టింది. బార్‌ట్లేకి విసుగు పుట్టి 'ఐ కాంట్ డూ దిస్ నాన్సెన్స్' అని స్టూల్‌ను ఒక్క తన్ను తన్ని సెట్‌లో నుండి వెళ్లిపోయాడు. దూరంగా నిలబడి ఉన్న చక్రపాణి, రామానాయుడు, నాగిరెడ్డిలకు విషయం అర్థమై, దర్శకుడు వి.మధుసూదనరావుతో మాట్లాడి 'బార్‌ట్లే దగ్గర వాణిశ్రీని బుద్ధిగా మసులుకోమని చెప్పు' అన్నారు. ఈ విషయాన్ని మురారి తన ఆత్మకథ 'నవ్విపోదురుగాక..'లో రాశారు. ఆయనే బార్‌ట్లే-ఎస్ వి రంగారావు పరస్పరగౌరవం గురించి కూడా రాశారు.

అదే సినిమా షూటింగులో హీరోయిన్ యింట్లోకి వరదనీరు వస్తే, తండ్రి పాత్ర చేస్తున్న ఎస్వీయార్ నీళ్లలో చిక్కుకున్న వాణిశ్రీ (కుమార్తె), అంజలి (భార్య)లను బయటకు తీసుకెళ్లే దృశ్యం తీయాలనుకున్నారు ఒకరోజు. సెట్టు నిండా అరడుగులోతు నీళ్లు పోసి, నీళ్లలోనే కెమెరా పెట్టి బార్‌ట్లే రెడీగా కూర్చున్నారు. కానీ తక్కిన యిద్దరూ సెట్‌లోనే ఉన్నా ఎస్వీయార్ మేకప్ రూములోంచి బయటకు రావటం లేదు. మరో అసిస్టెంటు డైరక్టరు కోదండరామిరెడ్డిని పంపినా ఆయన రాలేదు. మురారి కాస్త పోజుగా 'షాట్ రెడీ అయింది కదా, ఏంటీ ఆయన యింకా రాలేదు' అన్నారు. అప్పుడు బార్‌ట్లే చిరునవ్వి నవ్వి 'మురారీ, నువ్వే వెళ్లి పిలుచుకుని రా' అన్నాడు. లోపలికి వెళ్లి చూస్తే రంగారావు తాగుతూ కూర్చున్నారు. ఇక లాభం లేదని బయటకు వచ్చి బార్‌ట్లేతో 'హీ ఈజ్ డ్రంక్ సర్' అన్నారు మురారి. ఇక అవేళ ఆయనతో పని కాదని అర్థమై, కాస్సేపటికి ప్యాకప్ చెప్పేశారు. బార్‌ట్లే నొచ్చుకోలేదు. మురారి ప్రశ్నార్థకంగా చూస్తే భుజం మీద చేయి వేసి తన గదిలోకి తీసుకుని వెళ్లి "ఆయన ఒక్కోసారి అలాగే ఉంటారు. దాని అర్థం యింట్లో ఏదో గొడవ జరిగి ఉంటుంది. మహానటుడు, కానీ వ్యక్తిగత సుఖం లేదు. ఇదీ ఆయన పరిస్థితి. విజయా వారి సినిమాలలో ఎప్పుడూ ఆయన్ని యిలాగ చూడలేదు. చక్రపాణి అంటే ఆయనకు విపరీతమైన గౌరవం. గొప్ప కమిటెడ్ ఆర్టిస్ట్. మాయాబజారులో ఓ ట్రిక్ షాట్ తీయాల్సి వచ్చినపుడు ఘటోత్కచుడి భారీ మేకప్, గెటప్‌తో ఆరుగంటలపాటు కదలకుండా నుంచున్నారు." అని మెచ్చుకున్నారు. ఎస్వీయార్‌కు ఆంగ్లభాషపై మంచి పట్టు ఉంది. షేక్‌స్పియర్ నాటకాల్లో నటించేవారు. షైలాక్ ఆయన అభిమాన పాత్ర. బార్‌ట్లే అంటే అందరూ భయపడినా ఆయన నవ్వుతూ ఇంగ్లీషులో మాట్లాడేవారు. ఈయన కూడా నవ్వుతూ లైటింగ్ చేసేవారు. ఎస్వీయార్‌తో "రంగారావ్, జస్ట్ లుక్ దిస్ సైడ్" అంటూ అటూయిటూ తిరుగుతూ లైట్లు అడ్జస్ట్ చేసుకునేవారు.

కొసమెరుపు ఏమిటంటే – "చక్రవాకం" సినిమా షూటింగు సమయంలోనే రంగారావు మరణించారు. కథ ప్రకారం ఆ పాత్ర చివరిదాకా ఉండాలి. కానీ మధ్యలో మరణించడంతో ఊరెళ్లారని, రైల్లో తిరిగి వచ్చేటప్పుడు చనిపోయారని మార్పు చేసేశారు. దానివలన క్లయిమాక్సులో పండవలసిన డ్రామా మిస్సయి, సినిమా సరిగ్గా ఆడలేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

**2018 మే 12 టాబ్లాయిడ్‌కై** **ఎమ్బీయస్: "మహానటి"కి నేపథ్యం**

"మహానటి" సినిమా విడుదలై దుమ్ము దులుపుతోంది. సావిత్రి తెలుగువారికి అభిమాన నటీమణి కాబట్టి అని కాదు. జీవితగాథను ఎలా చూపాలో అలా చూపారు కాబట్టి! నిజానికి సినిమా ప్రకటించిన దగ్గర్నుంచి అందరికీ ఒకటే కుతూహలం – జెమినీ గణేశన్‌తో బాంధవ్యాన్ని ఎలా చూపిస్తారు? అంత్యదశను జరిగినది జరిగినట్లుగా చూపిస్తారా? లేక వైట్‌వాష్ చేసి చూపిస్తారా అని. ఆమె అంత్యదశ చాలా దారుణంగా గడిచిందని అందరికీ తెలుసు. దానికి కారణం ఆమె భర్త జెమినీ గణేశనే అని చాలామంది గాఢంగా నమ్ముతారు. సావిత్రి జీవితచరిత్రలు రాసినవారు కూడా ఆమెను అన్ని విధాలా దోచుకున్న విలన్‌గా అతన్ని చిత్రీకరిస్తారు. అయితే సావిత్రి పిల్లలు తమ తండ్రిని అలా చూడరు. మరి అలాటప్పుడు సినిమాలో ఎలా చూపిస్తారు? ముఖ్యంగా దుల్కర్ వంటి హీరో ఆ పాత్ర వేస్తున్నప్పుడు..? వాళ్ల కాపురం అలా కావడానికి కారణం ఎవరు? ఎవరి పొరపాటు ఎంత వుంది? ఇది తెలుసుకోవాలనే ఆసక్తి మనలో చాలామందికి వుంది. అవన్నీ సినిమాలో ఎలా చూపిస్తారు అనేది ఓ పెద్ద ప్రశ్నగా మిగిలింది. ఫైనల్‌గా ఎలా చూపించారో ముందుగానే చెప్పడం భావ్యం కాదు. జరిగినదేమిటో తెలుసుకుంటే సినిమా చూసేటప్పుడు వాస్తవాలతో పోల్చి చూసుకోవచ్చు.

నిజానికి సాంసారికమైన విషయాలు పబ్లిగ్గా చర్చించడం సబబు కాదు. కానీ సావిత్రి సెలబ్రిటీ కాబట్టి అది చర్చకు వస్తోంది. వీరిద్దరి విషయాలూ క్షుణ్ణంగా తెలిసినవారు మాత్రమే బాలన్స్‌డ్ వ్యూ యివ్వగలరు. అలాటి ఎనాలిసిస్ ఎక్కడైనా దొరుకుతుందా అని వెతుకుతున్న నాకు పసుపులేటి రామారావుగారు రాసిన ''వెండితెర విషాద రాగాలు'' పుస్తకంలో కొంత సమాచారం లభించింది. దాని గురించి చెప్పేముందు అందరికీ తెలిసున్న విషయాలు ముందర చెప్పేస్తాను. సావిత్రి భర్త జెమినీ గణేశన్. సావిత్రి పేదరికం నుంచి, విద్యాగంధం లేని నేపథ్యం నుంచి వస్తే యీయన నేపథ్యం దానికి పూర్తి వ్యతిరేకం. పేరు గణేశన్. ఊరు పుదుక్కోటై. జెమినీలో పనిచేశాడు కాబట్టి జెమినీ గణేశన్ అయ్యాడు. సైన్సు గ్రాడ్యుయేట్. మద్రాసులో లెక్చరర్‌గా పనిచేశాడు. స్పోర్ట్స్‌మన్. అందగాడు. మంచి నటుడు. అనేక హిట్ సినిమాల్లో హీరోగా, తర్వాతి రోజుల్లో కారెక్టర్ యాక్టర్‌గా నటించాడు. తమిళ, తెలుగు, హిందీ సినిమాల్లో కూడా నటించాడు. జంటిల్‌మన్‌గా పేరు. సహ నటీనటులతో, సాంకేతిక నిపుణులతో ఎవరితో ఎలాటి వివాదాలు లేవు. సరదా మనిషి. మాటకారి. సంగీతప్రియుడు. కర్ణాటక, హిందుస్తానీ సంగీతం బాగా పాడేవాట్ట. తనకు యిష్టమైన కీర్తన 'ఎన్నగాను రామభజన..' అని సావిత్రి ఒకసారి చెప్పారు. మంచి లక్షణాలు ఎన్ని వున్నా కానీ ఉమనైజర్‌గా పేరుబడ్డాడు. తమిళ రంగంలో అతనికి 'కాదల్ మన్నన్' అని బిరుదు. అంటే 'ప్రేమకు రారాజు' అన్నమాట. నాలుగు పెళ్లిళ్లు చేసుకున్నాడు. జీవిత చరమాంకంలో 79 వ యేట సెక్రటరీని పెళ్లాడితే ఆమె అతన్ని హింసించి వదిలిపెట్టింది. మొదటిభార్య సంప్రదాయబద్ధంగా పెళ్లాడినావిడ బాబ్జీ. ఆమెతో ఐదుగురు కూతుళ్లు. రెండో భార్య (ఈమెను పెళ్లి చేసుకున్నాడో లేదో స్పష్టత లేదు) నటీమణి పుష్పవల్లి. రేఖ తల్లి. మూడో భార్య సావిత్రి.

జెమినీ గణేశన్ 1948 ప్రాంతాల్లో జెమినీ స్టూడియోలో కాస్టింగ్ డిపార్టుమెంటులో పనిచేసేవాడు. సావిత్రి వేషాలకోసం వెతుకుతూ జెమినీ స్టూడియోకి వచ్చింది. 'మూణ్రు పిళ్లయిగళ్' అనే తమిళ సినిమాలో వేషం యిద్దామనుకున్నారు. కానీ వయసు, పొడుగు చాలదని ఫెయిలయింది. ఫైనల్‌గా జానకిని బుక్ చేశారు. జెమినీ స్టూడియోలోనే గణేశ్ సావిత్రిని చూడడం జరిగింది. తర్వాత కొన్నాళ్లకి అతను వేషాలిప్పించే వుద్యోగం మానేసి సినిమాల్లో వేషాలు వేయడం మొదలెట్టాడు. పి.పుల్లయ్య గారు తీసిన 'మనం పోల్ మాంగల్యం' అనే 1952 సినిమాలో ఇద్దరూ కలిసి వేశారు. అక్కడ మనసులు కలిసాయి. మాంగల్యం వైపు ఊహలు పోయాయి. అప్పటికే గణేశ్ వివాహితుడు, పిల్లల తండ్రి. అయినా గుట్టు చప్పుడు కాకుండా గుళ్లో పెళ్లి చేసేసుకున్నారు. అది 1952. 'మిస్సమ్మ' ప్లాను చేసినపుడు తమిళ వెర్షన్‌లో జెమినీగణేశ్ హీరో. హీరోయిన్ భానుమతి. భానుమతిని తీసేసి సావిత్రిని ప్రమోట్ చేయడంతో జెమినీకి పక్కన వేయడానికి, ఎక్కువ సమయం గడపడానికి సావిత్రికి అవకాశం చిక్కింది. మిస్సమ్మలో పాట వుంది చూడండి 'ఏమిటో ఈ మాయా' అని, పాత్రే కాదు, పాత్రధారిణి కూడా ఆ మాయలో పడిపోయింది. మాడరన్ థియేటర్స్ వాళ్లు సేలంలో సినిమా తీస్తూ వీళ్లను తీసుకెళ్లారు. అక్కడ మరింత సన్నిహితం అయ్యారు.

నటీమణులు పెళ్లి చేసుకుంటానన్నపుడు యింట్లో వాళ్లు అభ్యంతర పెడుతూంటారు. సినిమా తారల విషయంలో వాళ్ల డబ్బు ఒక మెయిన్ ఫ్యాక్టర్. కామధేనువు విడిచి వెళ్లిపోతుంటే ఎవరు ఊరుకుంటారు? సావిత్రికీ అదే అనుభవం. అందునా బినామీ ఆస్తులూ అవీ వుంటాయి కదా! అవన్నీ సార్ట్ అవుట్ చేసుకుని ఫైనల్‌గా 1956లో పెళ్లి ఎనౌన్స్ చేసేసి, కలిసి జీవించడం మొదలెట్టారు. జెమినీ పూర్వ భార్యలను వదిలిపెట్టలేదు. వీళ్లిద్దరికీ విజయ చాముండేశ్వరి అనే అమ్మాయి, సతీష్ అనే అబ్బాయి పుట్టారు. కానీ ఈ బంధం జెమినీని కట్టిపడేయ లేకపోయింది. సావిత్రికి దూరమయిపోయాడు. 200 సినిమాలు వేసి బోల్డంత సంపాదించిన సావిత్రి అన్నీ కోల్పోయింది. అప్పట్లోనే మద్రాసులో ఆవిడకు నాలుగిళ్లు. ఊటీలో ఓ బంగళా. హైదరాబాదులో, విజయవాడలో ఆస్తులు. అన్నీ పోయాయి. ఇన్‌కమ్‌టాక్స్ రెయిడ్స్ జరిగి, కొన్ని కోర్టులో ఇరుక్కుపోయాయి. ఈవిడ అద్దె యింట్లో వుండాల్సి వచ్చింది. కష్టకాలానికని డైమండ్ నెక్లెసు, నగలు ఆప్తుల వద్ద దాచుకుంటే, వాళ్లు అది దిగమింగేసి, నువ్వెక్కడిచ్చావ్ అన్నారు. భరించలేని నిరాశ. జెమినీ అలవాటు చేసిన తాగుడికి క్రమంగా సావిత్రి బానిస అయింది. మత్తు సరిపోకపోతే కాంపోజ్ మాత్రలు కలుపునేది. ఆరోగ్యం నాశనమైంది. చివరి దశలో సినిమాల్లో వేషాలు వేసింది. అంతటి మహానటికి యింతటి దుస్థితి వస్తే భర్త ఏం చేశాడన్న సందేహం వస్తుంది?

ఇప్పుడు పైన ఉదహరించిన పుస్తకంలోని సంగతి రాస్తాను. పసుపులేటి రామారావుగారు, ఆయన కంటె సీనియరైన జీవిజి అనే జర్నలిస్టు (సినిమారంగం మాసపత్రికకు యిన్‌చార్జి) మద్రాసులో పని చేసే రోజుల్లో దీనావస్థలో సావిత్రి అణ్ణా నగర్ యింటిలో వుండగా వెళ్లారు. జీవిజి సావిత్రిపై పుస్తకం రాస్తున్నారు. ఏమైనా మేటరు చెప్తే రాసుకుని పుస్తకం పూర్తి చేస్తా అని జీవిజి అంటే 'మీకు తెలిసింది మీ వెర్షన్‌లో రాసుకోండి. నా స్టేటుమెంటుగా ఏమీ యివ్వను. నా గురించి నేను చెప్పి బావుకునేదేమిటి? అంతా అయిపోయాక ఎవరి మీద కసి తీర్చుకోను?" అన్నారు సావిత్రి. ఇంతలో బయట కారు ఆగింది. జెమినీ గణేశన్ లోపలకి వచ్చి వీళ్లను పలకరించి కుర్చీలో కూర్చున్నాడు. సావిత్రి అతన్ని చూసి లేవలేదు. 'షూటింగు లేదా?' అని అడిగాడు జెమినీ. 'షూటింగు వుంటే ఏమిటి, లేకపోతే ఏమిటి? అసలు నేను బ్రతికున్నానా లేదా అనేది కూడా మీకు అవసరం లేదు కదా, అది సరే, యిప్పుడు ఎందుకు వచ్చినట్లు?' అంది సావిత్రి. 'రోజూ రావటం ఎక్కడ కుదుర్తుంది? పనులుంటాయి కదా' – 'అవును, రాత్రింబవళ్లు షూటింగులు చేస్తున్నారు కదూ, అమ్మాయిలతో... నాకు తెలీదనుకుంటున్నారా? వెధవ్వేషాలు..నన్నింకా మోసం చేద్దామనేనా? నేను చచ్చిపోయే స్థితికి వచ్చినా నన్నింకా మోసం చేయాలనుకుంటున్నారా? నేను మీ నుండి దూరంగా వచ్చేసినా యింకా ఎందుకు యిక్కడకు రావడం?' అంటూ సావిత్రి ఎమోషనల్ అయిపోతూ వుంటే జెమినీ ఆమె చేయి పట్టుకుని లోపలికి తీసుకెళ్లాడు.

బయటకు వచ్చాక రామారావు, జీవిజిని వారిద్దరి మధ్య బంధం గురించి అడిగితే జీవిజి చెప్పినది యిది – "జెమినీ దుర్మార్గుడు, చెడ్డవాడు కాదు, అమ్మాయిల బలహీనత. తాగుడు బలహీనత. రెండిటికి అతను దాసుడు. సావిత్రి అంటే యిప్పుడు అతనికి యిష్టం లేదు, అయిష్టమూ లేదు. మెకానికల్‌గా తయారయ్యాడు. ఎప్పుడైనా గాలి మళ్లినపుడు అలా వచ్చి యిలా వెళ్లిపోతూంటాడు. వాళ్లిద్దరూ హృదయపూర్వకంగా ప్రేమించుకున్న మాట నిజమే. పెళ్లికి ముందు సావిత్రికి అప్పట్లో యింటా బయటా సమస్యలు. తనకు సరైన గైడెన్స్ లేకపోవడం, నేనున్నాననే మనిషి లేకపోవడంతో మగదిక్కుకోసం జెమినీని తొందరపెట్టి పెళ్లి చేసేసుకుంది. పెళ్లయిన చాలా రోజుల వరకు సంతోషంగానే వున్నారు. జెమినీ సరదాకి తాగుడు అలవాటు చేస్తే సావిత్రి రోజూ మందు తీసుకుని యింటికొచ్చిన జెమినితో కోపతాపాలకు దిగేది, అరిచేది, దెబ్బలాడేది. దానికి కారణాలు అనేకం. 1970 తర్వాత ఆమెకు హీరోయిన్ వేషాలు తగ్గి సైడ్ కారెక్టర్స్ రావడంతో నిర్మాత, దర్శకురాలిగా మారింది. అది జెమినీకి యిష్టం లేదు. అయినా ఆమె ఖాతరు చేయలేదు. ఆమె తీసిన సినిమాలన్నీ ఫ్లాప్ కావడంతో అప్పులపాలై అవి తీర్చడానికి ఆస్తులు అమ్ముతూండడంతో, యీ అప్పులు తనకు చుట్టుకుంటాయన్న భయంతో యీవిడకు ఎంత దూరంగా వుంటే అంత మంచిదనుకున్నాడు.

"సావిత్రి కంటె ముందే జెమిని హీరోగా ఫేడవుట్ అయ్యాడు. అందువలన అతనికి సావిత్రే స్వయంగా డబ్బు యిచ్చేది. అతను పట్టుకెళ్లేవాడు. ఇప్పుడు సావిత్రి సినీనిర్మాణంలో డబ్బు పోగొట్టుతూండడంతో అతను రావడం తగ్గించాడు. అతను అనేకమంది స్త్రీలతో సంబంధాలు పెట్టుకోవడం వలన అతని పట్ల ద్వేషం పెంచుకుంది. నిజానికి యిద్దరూ బాగున్నపుడు కూడా అతని ప్రవర్తన అలాగే వుండేది. అన్ని విషయాలూ ఎవరో ఒకరు సావిత్రికి చెప్పేవారు. కొన్నాళ్లు సర్దుకుపోయినా, చాలామంది యివే విషయాలు చెప్తూండడంతో ఆమె తట్టుకోలేకపోయేది. అతను యింటి కొచ్చాక గొడవ పెట్టుకునేది. దాంతో రావడం కొద్దికొద్దిగా తగ్గించాడు. తను కష్టాలలో వున్నపుడు ఆదుకోవడానికి, సమస్యలు పరిష్కరించడానికి, కనీసం ఓదార్చడానికి అతను రావడం లేదన్న బాధతో

సావిత్రి యింకా కోపం తెచ్చుకునేది. జెమినీ గురించి బాగా తెలిసుండి అతన్ని పెళ్లాడి ఆమె తప్పు చేసింది. ఇలా వివాహితుణ్ని పెళ్లి చేసుకున్నవారెవరూ నాకు తెలిసి సుఖంగా లేరు.” అన్నారాయన.

నిజానికి వివాహితుణ్ని పెళ్లి చేసుకునే స్త్రీలందరూ అతని తిరుగుళ్లు తనతో ఆగిపోయేట్లా చేయగల శక్తి తమకు వుందని భ్రమ పడతారు. తిరిగే తుమ్మెదను ఆపలేమని గ్రహించరు. యవ్వనంలో వుండగా రెండో భార్య, ఉంపుడుకత్తెల మాట చెల్లుబాటు కావచ్చు కానీ యవ్వనం ఉడిగేక అసలు భార్యదే పై చేయి అవుతుంది. సమాజం, అతని కుటుంబం యొక్క మద్దతు ఆమెకే వుంటుంది. మొదటి భార్య కూతుళ్లు పెళ్లివయసుకి వచ్చేసరికి యితను హఠాత్తుగా పెద్దమనిషి తరహాగా వ్యవహరించవలసి వస్తుంది. ‘లేకపోతే నీ అల్లుడూ నీలాగే తయారవుతాడు’ అని కుటుంబసభ్యులు తిడతారు. ఇక రెండో భార్య విలువ సంఘంలో మరింత దిగజారుతుంది. ఆమె పిల్లల పెళ్లికి భర్త రావడమే మహద్భాగ్యం అవుతుంది. మొదటి భార్యతో దూరంగా వుంటానని మాట యిచ్చినా, ఆమె వలన పుట్టిన పిల్లలకోసం రెండో భార్య సంపాదనను ఖర్చు చేయడానికి యితను వెనకాడడు. (శ్రీదేవి, బోనీ కపూర్‌ల మధ్య యిందుకే గొడవ వచ్చి, అది ఆమె చావుకి కారణమైంది) ఆ విధంగా వివాహితుణ్ని చేసుకోవడం ఎప్పటికైనా ముప్పే. హేమమాలినికి యిన్‌కమ్ టాక్స్ కష్టాలు వచ్చినపుడు ధర్మేంద్ర పట్టించుకోలేదు. అయితే ఆమె తెలివైనది కాబట్టి, తండ్రి, అన్నగార్ల తోడ్పాటు వుంది కాబట్టి నిలదొక్కుకోగలిగింది.

సావిత్రి విద్యావంతురాలు కాదు. కుటుంబం సపోర్టు లేదు. బోళా మనిషి, ఉబ్బేస్తే చాలు డబ్బులిచ్చేసేది. మితిమీరిన దానధర్మాలు ఆమెను నాశనం చేశాయి. ఇన్ని దానాలు చేసినామెకు యిన్‌కమ్ టాక్సు కట్టాలని తోచకపోవడం చిత్రం. సరైన సమయంలో ఆమె టాక్సు చిక్కుల్లో పడి, దెబ్బ తింది. భోగలాలసుడైన జెమినికి మూడో భార్యగా వచ్చిన సావిత్రి అతన్ని ఆకట్టుకోవడానికైనా శరీరాకృతిపై శ్రద్ధ పెట్టాల్సింది. అదీ జరగలేదు. మద్యపానం కారణంగా కారెక్టరు నటిగా కూడా పాత్రలు రావటం లేదని గుర్తించినపుడు దాన్ని తగ్గించుకోవలసింది. కానీ అదీ చేయలేదు. సావిత్రిలో మూర్ఖత్వం వుంది. హితైషులు  చెప్పినా వినేది కాదుట. తను డైరక్ట్ చేసిన, నిర్మించిన సినిమాలు ఫెయిలవుతున్న కళ్లు తెరుచుకోలేదు. బయటివాళ్లే వారించగా లేనిది భర్త వారించి వుండడా? శివాజీ, ఎమ్జీయార్ నిర్మాతలుగా మారినా జెమినీ సినీనిర్మాణం జోలికి పోలేదు. అలాటప్పుడు సావిత్రి అప్పులు చేసి సినిమాలు తీస్తూంటే హర్షిస్తాడా? తన భార్య తను చెప్పిన మాట వినలేదన్న కోపం అతనికి వుండవచ్చు. మద్యం, మత్తుపదార్థాల మత్తులో సావిత్రి జెమినీని ఏమేమి అనేదో తెలియదు. గతంలో తన దగ్గర నుంచి డబ్బు పట్టుకెళ్లిన విషయం మళ్లీ మళ్లీ గుర్తు చేసేదేమో! వచ్చి తిట్లు తినడం దేనికి? వెళ్లడానికి అతనికి చాలా యిళ్లున్నాయి. మొదటి భార్య బాబ్జీ ద్వారా ఐదుగురు కూతుళ్లు, రెండో భార్య నటీమణి, పుష్పవల్లి ద్వారా ఇంకో కూతురు హిందీ సినీనటి రేఖ వున్నారు. ఏకాకిగా మిగిలిన సావిత్రి మరింత నిరాశకు లోనైంది.

ఆమె అనారోగ్యం పాలైనప్పుడు జెమినీ అస్సలు పట్టించుకోలేదని కొందరనుకుంటారు. అది నిజం కాదు. 1980 మేలో ఒక కన్నడ సినిమాలో చిన్న వేషం వేయడానికి ఆమె బెంగుళూరు వెళ్లి ‘చాణక్య’ హొటల్‌లో వుండగా రాత్రంతా భోజనం లేకుండా, విపరీతంగా మద్యం సేవించింది. బిపి, సుగర్ విపరీతంగా వున్నా అంతకు కొన్ని వారాలముందే ఆమె మందులు వాడడం మానేసింది. దాంతో  కోమాలోకి వెళ్లింది. ప్రయివేటు హాస్పటల్స్ చేర్చుకోవడానికి ఒప్పుకోలేదు. గవర్నమెంటు హాస్పటల్‌కు తీసుకెళ్లి బెడ్స్ లేక నేలమీద పడుక్కోబెట్టారు. ఫిల్మ్ యూనిట్ వాళ్లకు తెలిసి బెడ్ ఏర్పాటు చేయించారు. కానీ ఆమె కోలుకోలేదు. జెమినీ కోరిక మీద, సావిత్రి కుటుంబసభ్యుల అనుమతితో 16 రోజుల తర్వాత ఆమెను మద్రాసులోని అన్నానగర్ యింటికి తరలించారు. డాక్టర్ల బృందం పరీక్షించి కోమాలోంచి ఎన్నాళ్లకు కోలుకుంటుందో చెప్పలేమని అన్నారు. కోమాలోకి వెళ్లిన 596వ రోజున 1981 డిశంబరు 26 న ఆమె మరణించింది. పోయేనాటికి ఆమె వయసు 50 సం.ల లోపే. ఆమె కోమాలో వున్నపుడు జెమినీ అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్లేవాడు. స్వామీజీల చేత తాయెత్తు కట్టించడం, ఆయుర్వేదం మందులు యిప్పించడం వంటివి చేసేవాట్ట. పోయాక శవాన్ని జెమినీ యింటికి తరలించి, అక్కణ్నుంచి శ్మశానికి తీసుకెళ్లారు. ఈ విషయాలన్నీ సావిత్రి పిల్లలు అర్థం చేసుకున్నారనుకుంటాను. అందుకే తల్లి మరణం తర్వాత వాళ్లు తండ్రిని అంటిపెట్టుకున్నారు. సావిత్రి కుమార్తె తండ్రికి వ్యతిరేకంగా మాట్లాడరు. మా వ్యవహారాలు చక్కదిద్ది, మాకు మార్గదర్శనం చేశారు. మా సవతి తల్లి పిల్లలతో మేము కలిసే వుంటాం అంటారు. సావిత్రి మరణం నాటికి  విజయకు పెళ్లయి ఎనిమిదేళ్లయింది. సతీశ్ పదేళ్ల చిన్నవాడు కాబట్టి తండ్రిని నమ్ముకోవాల్సి వచ్చింది అనుకున్నా, పెరిగి పెద్దవారయ్యాక కూడా తండ్రికి దూరం కాలేదు. సతీశ్ యింజనీరింగు చదువు బాధ్యతలు జెమినీ చూసుకున్నాట్ట. అతనికి యితర భార్యల వలన కొడుకులు లేరు.

సావిత్రి విషాదగాథలో విలన్లు చాలామంది వున్నారు, వారిలో జెమినీ ఒకడు. ఆమె పొరపాట్లు కూడా చాలా వున్నాయని ఆవిడే చెప్పుకున్నారు. పైన ఉదహరించిన పుస్తకంలోనే రామారావుగారికి సావిత్రి యిచ్చిన యింటర్వ్యూ వేశారు – ‘తెలిసీ, తెలియక చేసిన తప్పులన్నీ ఏకమై కక్ష గట్టి నన్ను పతనానికి గెంటాయి. నా మనసు చాలా సందర్భాలలో అజ్ఞానంగా మూర్ఖంగా ప్రవర్తించి నన్ను అటు మానసికంగా, భౌతికంగా పాడు చేసింది. జెమినీ ఒక్కర్నే అనుకోవాల్సిన పనేముంది? నిజానికి జెమినీ నన్ను ప్రేమించారు, బాగా చూసుకున్నారు. కొన్ని విషయాల్లో ఆయన మాటలు నేను వినలేదు. డైరక్షనే తీసుకోండి. “చిన్నారి పాపలు” డైరక్షన్ విషయం చెప్పగానే కొన్ని రోజులు సమాధానం చెప్పలేదు. ఆయన మనసులో నేను డైరక్షన్ చేయకూడదని వుంది. సినిమా తీద్దామని వచ్చినవాళ్లు నాకు ప్రెజర్ యిస్తూంటే నేను ఆయనమీద ఆయన మీద ప్రెజర్ యివ్వడంతో సరేనన్నారు కానీ నేను ఎలా చేస్తున్నానో చూడడం కాని, మంచిచెడ్డలు తెలుసుకోవడం కాని చెయ్యలేదు. షూటింగ్‌కు కూడా రాలేదు. నిజానికి నేను డైరక్షన్ చేయడం మొదటి తప్పు, నిర్మాత కావటం రెండో తప్పు. నా ఆత్మకథ చెప్పవలసి వస్తే యివన్నీ రాయాలి, నా గురించి కూడా నేను చెడ్డగా రాయాలి. జెమినీ గురించి, నన్ను మోసం చేసిన, దొంగదెబ్బ తీసిన ఎందరో వ్యక్తుల గురించి రాయాలి. మా అమ్మ తప్ప అందరూ

స్వార్థంగానే ప్రవర్తించారు. ఇవన్నీ రాయడం వలన నాకు ఒరిగేదేమిటి?" అందామె.

ఆవిడ రాయకపోయినా ఆవిడ కథ "మహానటి" సినిమా రూపంలో వచ్చింది. అందర్నీ మెప్పించింది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

### 2018 మే 12 టాబ్లాయిడ్‌కై మెమరీ నెమరేస్తే.. శీర్షికకై ఎమ్బీయస్: సావిత్రి ఆత్మాభిమానం

కారెక్టరు యాక్టర్ పదానికి నిర్వచనంగా రాణించిన గుమ్మడి గారు "తీపి గురుతులు, చేదు జ్ఞాపకాలు" అనే పేర తన ఆత్మకథను గ్రంథస్తం చేశారు. దానిలో తన గురించి, సహనటీనటుల గురించి నిర్మొగమాటంగా అనేక విషయాలు రాశారు. పుస్తకాలు బాగా చదువుతూ, దేశవిదేశాల సినిమాలు కూడా విస్తారంగా చూసే ఆయన దేన్నయినా, ఎవరినైనా లోతుగా విమర్శనాదృష్టితో పరిశీలించగలరు. అందువలన ఆయన సావిత్రి గురించి రాసిన కొన్ని వాక్యాలు మనసుకు హత్తుకుపోతాయి. 'మన నటీమణుల్లో సహజ నటనకు ఆద్యురాలు జి.వరలక్ష్మి అయితే, ఆ సహజత్వాన్ని యింకా అందంగా, ఆత్మీయంగా ప్రదర్శించిన నటి సావిత్రి. ఆమె తెరమీద కనిపిస్తే ఒక దగ్గరతనం ఫీలై అనుబంధాన్ని పెంచుకుంటాం. ఆమె కంఠస్వరంలో ఉన్న మంత్రశక్తియేమో గానీ ఆమె ఏ మాట పలికినా అది సూటిగా మన గుండెలకు హత్తుకునేలా వుంటుంది.' అని రాశారాయన. అవి అక్షరసత్యాలు.

ఇక వ్యక్తిగా ఆవిడ గురించి చెపుతూ 'పరిశ్రమలో ఎంతో ఉన్నతస్థానంలో ఉన్నపుడు కూడా ఎటువంటి భేషజాలు లేకుండా అందరితో ఆప్యాయంగా, కలుపుగోలుగా ఉండేది. ఆమె వల్ల యే నిర్మాతా యెప్పుడూ నష్టపడలేదు, యిబ్బంది పడలేదు.' అన్నారు. ఆవిడ ఆత్మాభిమానం గురించి చెపుతూ ఒక సంఘటన గురించి రాశారు. స్టార్ వేల్యూ తగ్గి సహాయపాత్రలు వేసే రోజుల్లో లంచ్ టైములో ఆవిడకు యింటి నుంచి క్యారేజీ ఏదీ రాకపోవడం, నిర్మాత కూడా ఏమీ పట్టించుకోకపోవడం గమనించారు, ఆమెతో పాటు నటిస్తున్న గుమ్మడి. భోజనం చేస్తూ వెళ్లి అడిగితే 'ఆకలిగా లేదు' అని మొహమాట పడింది సావిత్రి. చివరకు యీయన ఎంతో బలవంతం చేస్తే వచ్చి తింది. అనేకమందిని ఆపదల్లో ఆదుకుని దానధర్మాలు చేసిన వ్యక్తి యీ స్థితికి రావడం ఆయనకు కన్నీళ్లు తెప్పించింది.

ఓ సారి గుమ్మడిగారికి జ్వరం వచ్చి అయిదారు రోజులు మంచం మీద ఉండాల్సి వచ్చింది. సావిత్రి చూడడానికి వచ్చి, కాస్సేపు మాట్లాడి వెళ్లిపోయింది. వెళ్లిపోయేటప్పుడు తన తలగడ పక్కకు ఏదో కదిలినట్లు అనిపించింది ఇంజక్షన్ మగతలో ఉన్న గుమ్మడిగారికి. తర్వాత తీసి చూస్తే రెండు వేల రూపాయలు కనిపించాయి. కోలుకున్నాక ఆయన ఫోన్ చేసి అడిగితే "చాలా రోజుల క్రితం మీ దగ్గర ఆ మొత్తం తీసుకున్నాను. మీరు మర్చిపోయి వుండవచ్చు. నేను పోయేలోగా ఒక దమ్మిడీ కూడా ఎవరికీ బాకీ వుండకూడదనుకున్నాను. ఈ రోజే ఓ ప్రొడ్యూసర్ వచ్చి అయిదువేలు అడ్వాన్సు యిచ్చాడు. దానిలోంచి మీ బాకీ తీర్చేశాను." అందావిడ. అటువంటి ఆత్మాభిమాని ఆపదలో ఆదుకుంటుందని యెప్పుడో ఆత్మీయుల దగ్గర దాచుకున్న డైమండ్ నెక్లెస్ కోసం వారి దగ్గరకి వెళితే ఏమీ తెలియనట్లు ప్రవర్తించారని, దానితో ఆమె విపరీతమైన షాక్‌కు గురి కావటం, దానిలోంచి కోమా లోకి వెళ్లడం జరిగిందని ఆయన రాశారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

### 2018 మే 12 టాబ్లాయిడ్‌కై ఎమ్బీయస్: కమల్‌నాథ్ ఎందుకు?

కాంగ్రెసులో పాత తరాన్ని తప్పించి కొత్త రక్తం తెస్తానని రాహుల్ గాంధీ అనేక సార్లు చెప్పారు. అప్పుడప్పుడు యువకులను (అనగా 60 కంటె తక్కువ వయసున్నవారని అర్థం) కొన్ని ముఖ్యమైన పోస్టులలో నియమించడం కూడా జరుగుతోంది. త్వరలో ఎన్నికలు రాబోతున్న మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా యువకుడైన జ్యోతిరాదిత్య సింధియాను ఎంపిక చేసి అతనికే రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పగిస్తారని అతనితో సహా అందరూ అనుకుంటూ ఉండగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా 71 ఏళ్ల కమల్‌నాథ్‌ను నియమించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రాష్ట్ర అధ్యక్షుడు కావడమంటే ముఖ్యమంత్రి కావడానికి దారి సుగమం చేసినట్లే. ఎందుకంటే టిక్కెట్ల పంపిణీలో అతనిదే ప్రధాన భూమిక అవుతుంది. ఎన్నికల అనంతరం కాంగ్రెసు ఎక్కువ సీట్లు గెలిస్తే ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడే అవకాశం మాత్రం తప్పకుండా ఉంది. రాష్ట్రంలోని ఓటర్లలో 30 సం.ల కంటె తక్కువ వయసున్న యువకులు 25% మంది ఉన్నారు. వారు కమల్ నియామకంతో ఉసూరుమన్నారన్న వార్తలు కూడా వచ్చాయి. మరి రాహుల్ ఎందుకు యీ పని చేసినట్లు అంటే వేదికలపై ప్రసంగాలు యివ్వడం వేరు, క్షేత్రస్థాయిలో కఠోర వాస్తవాలు ఎదుర్కోవడం వేరు అని సమాధానం వస్తుంది.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెసును గెలుపు పలకరించి 15 ఏళ్లయింది. 1998లో 172 సీట్లున్న కాంగ్రెసు రాష్ట్రవిభజన తర్వాత 2003లో 38 సీట్లకు పడిపోయింది. తర్వాతి ఎన్నికలలో 71, 58 తెచ్చుకుంది. అవే ఎన్నికలలో బిజెపి 173, 143, 165 తెచ్చుకుంది. రెండు పార్టీల మధ్య ఓట్ల వ్యత్యాసం యీ మూడు ఎన్నికలలో 9%, 5%, 8% ఉంది. వరుస ఓటముల కారణంగా కాంగ్రెసు గుణపాఠాలు నేర్చుకుని నాయకులందరూ సంఘటితం కావటం లేదు. ముఠాలుగా విడిపోయి ఉన్నారు. అటు బిజెపి తరఫున చూస్తే ఈ 15 సం.లు శివరాజ్ చౌహాన్ ఏకఛత్రాధీగా పాలించుకుంటూ పోతున్నాడు. వచ్చేసారికి కూడా బిజెపి తరఫున అతనే ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉండేట్లున్నాడు. ఈ దీర్ఘపాలన వలన ప్రభుత్వ వ్యతిరేకత ఏర్పడడం సహజం కాబట్టి దాన్ని అధిగమించడానికి అతను చేయని గిమ్మిక్కు లేదు. ఎన్నికలు దగ్గర పడిన కొద్దీ సంక్షేమ పథకాల జోరు మరీ పెంచేశాడు. సగటున వారానికి ఒకటి

చొప్పున పథకాలు వెలువడుతున్నాయి. అసంఘటిత కార్మిక వర్గాన్ని ఆకర్షించడం కోసం రూ.5 వేల కోట్లు ఖర్చుతో పథకాలు ప్రవేశపెట్టారు. గర్భం ధరించిన స్త్రీకి 4,000 రూ.లు యిస్తారు. ప్రసవం తర్వాత 12,500 యిస్తారు. ఈ పథకం కింద రిజిస్టర్ చేసుకున్న కుటుంబాలలో ఇంటి యజమాని మరణిస్తే పరిహారం, వైద్యచికిత్స, గృహవసతి, డాక్టరేటు స్థాయి వరకు పిల్లల చదువుల భారం, వాళ్లకు కోచింగు ఫీజు, సొంత వ్యాపారం మొదలుపెట్టడానికి ఋణాలు –యివన్నీ ప్రభుత్వం భరిస్తుంది. ఇప్పటికే 2 కోట్ల మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఏప్రిల్ 16 న ప్రకటించిన మరో పథకం ప్రకారం గోధుమ, వరి పండించినవారికి క్వింటాల్‌కు రూ.200 రూ.ల చొప్పున బోనస్సు, అదీ పాత తేదీల నుండి, యిస్తామన్నారు. దీనికి గాను రూ.1,670 కోట్ల ఖర్చు. అదే నెలలో 97 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగుల జీతాలు మూడున్నర రెట్లు పెంచారు. ఉద్యోగుల పదవీవిరమణ వయసు 60 నుంచి 62 చేశారు. జర్నలిస్టులకు రూ.4 లక్షల వరకు యిన్స్యూరెన్సు, వాళ్లు తీసుకున్న గృహఋణాలకు సబ్సిడీ. ఇలా ఎన్నికల సంవత్సరంలో ధారాళంగా వరాలు కురిపిస్తున్నాడు. పైగా 'కాంగ్రెసు తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా వస్తున్న జ్యోతిరాదిత్య రాజవంశీకుడు, నేను సామాన్యుణ్ని. నాకు సామాన్యుల కష్టాలు తెలుసు. అందుకే యివన్నీ..' అని చెప్పుకుంటున్నాడు. 15 ఏళ్లగా ఎందుకు చేయలేదు అని అడిగితే సమాధానం రాదనుకోండి.

ఇతన్ని జ్యోతిరాదిత్య ఒక్కడూ ఎదుర్కోవడం అంత సులభమైన పని కాదని రాహుల్‌కు అర్థమైంది. అందుకే కమలనాథ్‌ను రంగంలోకి దించాడు. కమల్‌ది కలకత్తాకు చెందిన ధనిక వ్యాపార కుటుంబం. కాన్పూరులో పుట్టాడు. డూన్ స్కూలులో సంజయ్ గాంధీతో బాటు చదివాడు. అనేక వ్యాపారాలు చేస్తాడు. ఎన్నికలకు ముందు యిచ్చిన అఫిడవిట్ ప్రకారం అతని ఆస్తి రూ.187 కోట్లు. సంజయ్ తను రాజకీయాల్లోకి వచ్చాక యితన్నీ లాక్కుని వచ్చాడు. అతనికి ఏ మాత్రం పరిచయం లేని గిరిజనులు ఎక్కువగా ఉండే మధ్యప్రదేశ్‌లోని చింద్వారా అనే నియోజకవర్గంలో 1980లో పార్లమెంటు అభ్యర్థిగా నిలబెట్టాడు. ఇందిరా గాంధీ వచ్చి 'ఇతను నా మూడో కొడుకు, గెలిపించండి' అని ప్రచారం చేసింది. ఇతను గెలిచాడు. అప్పణ్నుంచి వరుసగా గెలుస్తూనే వచ్చాడు. 37 ఏళ్లగా, 9 సార్లు గెలిచిన రికార్డు యితనిదే. అనేక సార్లు మంత్రిగా పని చేసి సమర్థుడిగా నిరూపించుకున్నాడు. స్వయంగా వ్యాపారస్తుడు కావడంతో అనేకమంది వ్యాపారస్తులతో సత్సంబంధాలున్నాయి. మధ్యప్రదేశ్ కాంగ్రెసును నిధుల కొరత వేధిస్తోంది. కమల్ అయితే నిధులు బాగా సేకరించగలడని అతన్ని నియమించారు అని వినికిడి. అంతేకాదు, రాష్ట్ర కాంగ్రెసులో ఒక వర్గానికి నాయకత్వం వహిస్తున్న దిగ్విజయ్ సింగ్ కమల్‌కు మద్దతు పలికాడు. కమల్‌కు ఎవరితోనైనా సర్దుకుపోయే మనస్తత్వం ఉంది. సంజయ్ అనుచరుడిగా ఉన్నా, రాజీవ్‌కు సన్నిహితుడయ్యాడు. ఆ తర్వాత పివి కాబినెట్‌లోనూ పనిచేశాడు. పివి అంటే పడని సోనియాకూ దగ్గరయ్యాడు. ప్రతిపక్షాల వారితో బేరసారాలకు సోనియా కమల్‌నే పంపేది. 2016లో రాజ్యసభ ఎన్నికలు జరిగినప్పుడు మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యుణ్ని పంపడానికి ఇద్దరు ఎమ్మెల్యేల సాయం పడింది. సోనియా చెప్పగా కమల్ మాయావతితో చెప్పి ఏర్పాటు చేశాడు. ప్రతి సారి 5% ఓట్లు గెలుస్తున్న బిఎస్పీ రాబోయే ఎన్నికలలో కాంగ్రెసుకు అక్కర రావాలంటే కమల్ ఉపయోగం ఎంతైనా ఉంటుంది.

కులాల సమీకరణలు కూడా రాజకీయాల్లో ముఖ్యమే. రాష్ట్ర జనాభాలో ఎస్సీలు 15%, ఎస్టీలు 20%, ఒబిసిలు 51% ఉన్నారు. జ్యోతిరాదిత్య, కమల్ యిద్దరూ అగ్రకులాలకు చెందిన వారే కాబట్టి, బాలా బచ్చన్ అనే ఎస్టీని, సురేంద్ర చౌదరి అనే ఎస్సీని, జీతూ పట్వారీ, రామ్‌నివాస్ రావత్ అనే ఒబిసిలని, మొత్తం నలుగురు యితర కులాల వాళ్లను వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమించారు. జ్యోతిరాదిత్యను వదిలేయకుండా అతన్ని ప్రచార కమిటీకి అధినేతగా నియమించారు. ఇద్దరూ కలిసి ట్రక్కులో తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. నేనెప్పుడూ పదవుల గురించి ఆశపడలేదు అని కమల్ అంటున్నా, కమల్ అంటే నాకు చాలా గౌరవం అని జ్యోతిరాదిత్య అంటున్నా ఫలితాల అనంతరం ఏమవుతుందో ఎవరికీ తెలియదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

## 2018 మే — ఎమ్బీయస్: కర్ణాటక ఎన్నికలు

5 కోట్ల మంది ఓటర్లున్న కర్ణాటకలో ఇవాళ పోలింగు జరిగింది. 2013లో కంటె కాస్త ఎక్కువ పోలింగు శాతమే, 71-72% నమోదయ్యేట్లుంది. సాయంత్రానికి ఎగ్జిట్ పోల్ రిజల్ట్స్ వచ్చేశాయి. అసలు ఎన్నికల వేళ వచ్చేసరికి గతంలో 150 సాధిస్తామని చెప్పిన పార్టీ నాయకులు తగ్గారు. బిజెపి 130 ప్లస్ వస్తాయంది, కాంగ్రెసు 120 ప్లస్ అంది. జెడిఎస్ 113 ప్లస్ అంది. కానీ ఎవరికీ స్పష్టమైన ఆధిక్యత రాదని, హంగ్ అసెంబ్లీ తప్పదని సర్వేలన్నీ చెపుతూ వచ్చాయి. అందరి కంటె ఎక్కువ సీట్లు ఎవరికి వస్తాయన్న దానిపై ఒక్కోళ్లు ఒక్కో అంకె చెప్పారు. సర్వేలలో కాంగ్రెసుకు, బిజెపికి మధ్య ఓట్లలో 2%, సీట్లలో 10-15 కంటె తేడా కనబడటం లేదు. తాజాగా కచ్చితత్వానికి మారుపేరైన సెఫాలజిస్టు, రాజకీయ నాయకుడి సర్వేలో బిజెపికి 110-120, కాంగ్రెసుకు 70-80, జెడిఎస్‌కు 40 వస్తాయని చెప్పారని తాజాగా వార్త వచ్చింది. బహుశా యిది టుడేస్ చాణక్య అయి వుంటుంది. ఎగ్జిట్ పోల్స్‌లో కూడా 6 బిజెపికి ఆధిక్యత వస్తాయని అంటే 2 కాంగ్రెసుకు ఆధిక్యత వస్తాయన్నాయి. గెలిచే పార్టీకి 120 కంటె ఎక్కువ వస్తాయని ఎవరూ ఘంటాపథంగా చెప్పలేదు.

ఎప్పటిలాగా కాంగ్రెసు ఇవిఎంల గురించి ఫిర్యాదు చేసింది. మొత్తం 224 సీట్లలో 222 సీట్లకు మాత్రమే పోలింగు. ఒక దాంట్లో బిజెపి అభ్యర్థి చనిపోయాడు. మరో దాంట్లో 10 వేల నకిలీ ఓటరు కార్డులు కూడా పట్టుబడడంతో కాన్సిల్ చేశారు. (అన్నిటిని ఆధార్‌తో లింకు చేసే ప్రభుత్వం ఓటరు కార్డును ఎందుకు లింక్ చేయదో అర్థం కాదు. బిజెపియే కాదు, మరో పార్టీ వచ్చినా ఆ సంస్కరణ చేస్తుందన్న నమ్మకం లేదు). నోట్ల కట్టలు పట్టుబడుతూనే ఉన్నా (దొరికిన వాటి విలువ రూ.112 కోట్లు) వాటి ప్రవాహం

ఆగలేదు. చీరలు, ముక్కుపుడకలు, సెల్‌ఫోన్లు, ప్రెషర్ కుక్కర్లు, క్రికెట్ కిట్ల పంపిణీ (పట్టుబడిన వస్తువుల విలువ రూ.65 కోట్లు) జరిగిపోయింది. మద్యం పారింది. (దొరికిన దాని విలువ రూ.25 కోట్లు) బిజెపి, కాంగ్రెసు యీ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. కాంగ్రెసు తరఫున రాహుల్ గత మూడు నెలలుగా ప్రచారం చేస్తున్నాడు. 60% నియోజకవర్గాలకు వెళ్లాడు. ఖర్గే, శివకుమార్‌లు కూడా ప్రచారంలో ఉన్నారు. రెండేళ్లగా ప్రచారంలోకి దిగని సోనియా కూడా దిగింది. తన మానిఫెస్టోలో ప్రభుత్వోద్యోగాలలో మహిళల సంఖ్య 50%కు పెంచుతానంటోంది. 10 జిల్లాలను కలుపుతూ వ్యవసాయ కారిడార్ పెడతానంటోంది. చాలా చోట్ల నియోజకవర్గానికి రూ.100 కోట్ల దాకా ఖర్చు చేస్తున్నారని వినికిడి. 30 మంది ఫిరాయింపుదార్లకు పార్టీలు టిక్కెట్లిచ్చాయి. గత కొద్ది నెలలుగా మన దగ్గర క్యాష్ దొరకడం మానేసింది. కర్ణాటక ఎన్నికలలో పంచడానికి పట్టుకుని పోయారంటున్నారు. అక్కడ కట్టలు కట్టలు దొరుకుతున్నాయి. బిజెపి తరఫున 208 మంది, కాంగ్రెసు తరఫున 207 మంది కోటీశ్వరులు పోటీ చేశారు. బిజెపి అభ్యర్థుల్లో 37% కాంగ్రెసు అభ్యర్థుల్లో 27%, జెడిఎస్ అభ్యర్థుల్లో 21% మంది నేరచరితులు. ఇన్ని ప్రలోభాలు, కుతంత్రాల మధ్య వెలువడే ఫలితం ప్రజాభిప్రాయాన్ని ఫలితాలు ఎంతవరకు సూచిస్తాయో అర్థం కావటం లేదు.

2008లో 110 సీట్లు తెచ్చుకున్న బిజెపి ఎడియూరప్ప అవినీతితో, ఆ తర్వాత పార్టీ ముఖ్యమంత్రుల మధ్య కలహాలతో, 2013లో అంత:కలహాలతో ఓడింది. 11 జిల్లాల్లో చిరునామా గల్లంతైంది. 110 చోట్ల డిపాజిట్లు గల్లంతయ్యాయి. 2014లో 43% ఓట్లతో 17 సీట్లు (132 అసెంబ్లీ సెగ్మెంట్లు) గెలిచింది. ఎడియూరప్ప బృందం కలిసింది కాబట్టి, 2014 మ్యాజిక్‌ను పునరావృతం చేయగలనని బిజెపి అనుకుంటోంది. తన మానిఫెస్టోలో జాతీయ, సహకార బ్యాంకుల నుంచి తీసుకున్న రైతు ఋణాలు లక్ష వరకు రద్దు చేస్తానని హామీ యిచ్చింది. అన్ని జిల్లాలను కలుపుతూ 6 లైన్ల హైవే వేస్తానంది. అమిత్ షా ఎన్నాళ్లనుంచో కష్టపడి ప్రణాళికలు రచించగా, ఎప్పటిలాగానే మోదీ ప్రచారంలో పాల్గొని తన ఉపన్యాసాల్లో రాహుల్ మీద, సిద్ధరామయ్యమీద విసుర్లు విసిరాడు. శ్రుతి మించిన సందర్భాలూ ఉన్నాయి. ఆఖరి నిమిషంలో చేసే ప్రయత్నాలలో కూడా బిజెపి లోటు చేయలేదు. గుజరాత్ ఎన్నికల సమయంలో తనపై కాంగ్రెసు, పాకిస్తాన్ కలిసి కుట్ర చేశాయని మోదీ ప్రచారం చేసుకున్నాడు. ఈ కర్ణాటక ఎన్నికలకు ముందు కూడా మోదీకి అలాటి అమరవీర యిమేజి కట్టబెట్టడానికి ప్రయత్నం జరిగింది. మోదీ హత్యకు ఐఎస్ కుట్ర పన్నిందట. వాట్సప్ సంభాషణ వలన బయటపడిందట. గుజరాత్ ఏంటీ టెర్రరిస్టు స్క్వాడ్‌కు గత ఏడాది యీ విషయం తెలిసిందట. గత నెలలో చార్జిషీటు కూడా దాఖలు చేశారట. ఆ విషయాన్ని యిన్నాళ్లూ దాచి, నిన్ననే వెలుగులోకి తెచ్చారు. జమ్మూలో జరిగిన రేప్ సంఘటనలో సిబిఐ విచారణ సందర్భంగా నిందితురాలు బిజెపి ఎమ్మెల్యే పేరు చెప్పిందని జాతీయ మీడియాలో వచ్చిన వార్తను సిబిఐ అర్జంటుగా ఖండించింది. ఇక కాంగ్రెసు అర్జంటుగా విడుదల చేయించిన పాతకాలపు వీడియోలో కేసులు కొట్టివేతకై బిజెపి నాయకుడు శ్రీరాములు జడ్జికి లంచం యివ్వబూనడం చిత్రీకరించి ఉంది.

జరగబోతున్న అసెంబ్లీ ఎన్నికలపై జాతీయ మీడియాతో బాటు తెలుగు మీడియా కూడా కవరేజి బాగా యిచ్చింది. పొరుగు రాష్ట్రమే అయినా గతంలో మనం యింతగా పట్టించుకున్నది లేదు. అప్రతిహతంగా సాగిపోతున్న బిజెపి రథానికి కర్ణాటకలోనైనా గండి పడుతుందా అనేది ఆసక్తికర అంశమైంది. దానితో పాటు కాంగ్రెసు చేతిలో ఉన్న ఒక్క పెద్ద రాష్ట్రమూ చేజారుతుందాని చూడాలన్న కుతూహలమూ ఉంది. కర్ణాటకలో బిజెపి ఓడితే నెత్తి మీద ఉన్న దాని కళ్లు దిగుతాయని, తాజాగా విడాకులు పుచ్చుకున్న టిడిపి ఆశ. గుజరాత్‌లోలా యిది బిజెపి-కాంగ్రెసు ముఖాముఖీ పోరాటం కాదు. మధ్యలో జెడిఎస్ అనే బలమైన, 20% ఓటు బ్యాంకు ఉన్న, ఒకప్పుడు రాజ్యమేలిన ప్రాంతీయ పార్టీ ఉంది. వాళ్లకు ఎన్ని సీట్లు వస్తాయి, వాటితో వాళ్లు రెండు జాతీయపార్టీలను ఎలా ఆడుకుంటారు అనేది కూడా చూడవలసిన ప్రహసనమే.

కర్ణాటకపై నేను సేకరించిన సమాచారాన్ని గుదిగుచ్చి సాధ్యమైన సంక్షిప్తంగా యివ్వాలని చూస్తున్నాను. దీని ద్వారా అక్కడ ఎవరు గెలుస్తారో చెప్పలేము. మే 15 ఫలితాల రోజున టీవీల్లో సెఫాలజిస్టులు, ప్రాతికేయులు విశ్లేషించేటప్పుడు విషయం మనకు బాగా బోధపడడానికి మాత్రం యిది ఉపయోగపడుతుంది. ఈ లోగా జనరల్‌గా మనం గమనించవలసిన అంశాలేమిటంటే – దీన్ని గుజరాత్‌లోలా మోదీ వెర్సస్ రాహుల్ పోరాటంగా మార్చాలని బిజెపి చూస్తే సిద్ధరామయ్య మాత్రం తనను కేంద్రబిందువుగా మార్చుకున్నాడు. ఎందుకంటే బలమైన ప్రాంతీయ నాయకుడు ఉన్నచోట – ఢిల్లీ, బిహార్, పంజాబ్ – బిజెపికి దెబ్బ తగులుతూ వచ్చింది. గుజరాత్‌లో బలమైన స్థానిక నాయకుడు లేక కాంగ్రెసు విజయావకాశాలు పోగొట్టుకుంది. పంజాబ్‌లో కాంగ్రెసు అమరీందర్ సింగ్‌కు మొత్తమంతా వదిలి పెట్టేసింది. ఆయన గెలిపించి చూపాడు. అలాగే యిక్కడ సిద్ధరామయ్యకు అప్పచెప్పేశారు. అతను చెప్పినవాళ్లకే టిక్కెట్లిచ్చారు. అతని యిమేజితోనే ముందుకు వెళ్లారు. బిజెపి తరఫున ఉన్న ఎడియూరప్ప ఒకప్పుడైతే సిద్ధరామయ్యకు సమ ఉజ్జీగా ఉండేవాడేమో కానీ అతని యిమేజి చెడిపోయింది. అందువలన మోదీ, అమిత్ సాయం పట్టవలసి వస్తోంది.

సిద్ధరామయ్య అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా, అవినీతి ఫర్వాలేదన్న స్థాయిలో ఉండటం చేత బిజెపి ఆశించినంత స్థాయిలో ప్రభుత్వవ్యతిరేకత లేదు. అందువలన జెడిఎస్‌తో బిజెపి లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుందని అనుమానాలున్నాయి. ఆ యా పార్టీలకు ప్రాబల్యం ఉన్న ప్రాంతాలు వేరేవేరే కాబట్టి ఒకళ్ల ఓటుబ్యాంకుని మరొకరు తినేసే ప్రమాదం లేదు. దేవెగౌడ ఎవరితోనైనా చేతులు కలపగల టక్కరి. ప్రాంతీయ పార్టీల సమాఖ్యలో చేరతానని ఆశ చూపించి బిజెపికి వ్యతిరేక పార్టీలైన బిఎస్‌పి, మజ్లిస్, తెరాసల మద్దతు తీసుకున్నా ఎన్నికల అనంతరం వీరందరినీ ముంచి బిజెపితో చేతులు కలపగలడు. కాంగ్రెసును 'పిపిపి' (పుదుచ్చేరి, పంజాబ్, పరివార్)కు పరిమితం చేయడానికై బిజెపి జెడిఎస్ పెట్టే షరతులకు అంగీకరించినా అంగీకరించవచ్చు. చిక్కంతా ఎక్కడ వస్తుందంటే ముఖ్యమంత్రి పదవి దగ్గర! కుమారస్వామికి ముఖ్యమంత్రి పదవి ఎవరిస్తానంటే వాళ్లకే 35-40 సీట్ల మా మద్దతు అని దేవెగౌడ అంటే కాంగ్రెసు సిద్ధరామయ్యను త్యాగం చేస్తుందా? చేయకపోవచ్చు. తమ నుండి విడిచి వెళ్లిపోయిన

సిద్ధరామయ్య పొడ దేవెగౌడకు అస్సలు కిట్టదు, ఉపముఖ్యమంత్రిగా కూడా యివ్వనంటాడు. అదే బిజెపి ఐతే ఎడియూరప్పను ఉపముఖ్యమంత్రి పదవికి ఒప్పించవచ్చు. శివసేననే టేకిల్ చేయగాలేనిది, జెడిఎస్‌ను చేయలేమా అనే ధైర్యంతో ముందుకు వెళ్లవచ్చు.

ఎగ్జిట్ పోల్స్ కూడా నిజం కావాలని లేదు. కర్ణాటక ఓటరు ఏదో ఒక పార్టీకి కచ్చితమైన మెజారిటీ కట్టబెట్టినా కట్టబెట్టవచ్చు. అలా కట్టబెట్టని పక్షంలో బిజెపికి 90 సీట్లు వచ్చినా జెడిఎస్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కర్ణాటక రాజకీయ రంగాన్ని చర్చించడానికి తర్వాతి వ్యాసాల్లో ప్రాంతాల వారీగా డీల్ చేస్తున్నాను. అక్కడే యితర అంశాల ప్రస్తావన కూడా వచ్చేస్తుంది. ఆ విధంగా సమగ్రమైన అవగాహన ఏర్పడుతుందని ఆశ. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

## 2018 మే ఎమ్బీయస్: హైదరాబాద్ కర్ణాటక దృశ్యం

కర్ణాటక రాజకీయాలను అర్థం చేసుకోవాలంటే దాన్ని ఆరు ప్రాంతాలుగా విడగొట్టి విశ్లేషించాలి. దశాబ్దాలుగా అధ్యయనం చేసిన పరిశీలకులు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన రాజకీయ వాతావరణం, ఒక్కో తరహా ఓటింగు ధోరణి వున్నాయని గమనించారు. ఇవన్నీ కలిపి చూస్తేనే సమగ్రరూపం తెలుతుంది. ఈ ప్రాంతాలను ఐడెంటిఫై చేయడంలో పరిశీలకులందరూ ఒక్క తాటిపై లేరు. కొన్ని సరిహద్దు జిల్లాలను కొందరు ఒక ప్రాంతంలోకి వేస్తే, మరి కొందరు పక్క ప్రాంతంలో వేస్తున్నారు. ఏది ఏమైనా స్థూలంగా చూస్తే – హైదరాబాదు కర్ణాటకలో లింగాయతులు, మైనారిటీలు, దళితులు బలంగా ఉన్నారు. కాంగ్రెసు, బిజెపి సమాన బలంతో ఉన్నాయి. బొంబాయి కర్ణాటకలో లింగాయతులకు, బిజెపికి బలం ఎక్కువ. మధ్య కర్ణాటకలో లింగాయతులు, ఒక్కళిగలు బలంగా ఉన్నారు. కాంగ్రెసు, బిజెపి, జెడిఎస్ మూడు బలంగానే ఉన్నాయి. కోస్తా కర్ణాటకలో మైనారిటీలు, హిందూత్వ శక్తులు బలంగా ఉన్నాయి. బిజెపికి బలం ఉంది. దక్షిణ కర్ణాటక (పాత మైసూరు) ప్రాంతంలో ఒక్కళిగలు బలంగా ఉన్నారు. జెడిఎస్‌కు ప్రధాన కార్యస్థానం. కాంగ్రెసుకు కూడా ఉంది కానీ బిజెపికి బలం లేదు. బెంగుళూరు నగరం కాంగ్రెసు, బిజెపిల మధ్య ఊగుతూ ఉంటుంది. జెడిఎస్‌కు 1,2 మించి రావు. ఇప్పుడు వీటి గురించి విపులంగా తెలుసుకుందాం. సందర్భం బట్టి స్థానిక అంశాలను ప్రస్తావిస్తాను. రేపు ఉదయంలోపున యివన్నీ చదివేయగలిగితే ఫలితాలు ఎందుకలా వచ్చాయో అర్థం కావటం సులభం.

### హైదరాబాద్ కర్ణాటక

ఒకప్పుడు నైజాం ఏలుబడిలో వుండి కర్ణాటకలో కలిసినదే 19 స్థానాలున్న హైదరాబాద్ కర్ణాటక ప్రాంతం. బీదర్, కలబురిగి (గుల్బర్గా), యాదగిర్ జిల్లాలున్నాయి. బాగా వెనుకబడిన ప్రాంతం. పొరుగునే ఉన్న రాయచూరు, కొప్పల్, బళ్లారి జిల్లాల (వీటిని మధ్య కర్ణాటకలో భాగంగా లెక్క వేస్తున్నారు కొందరు)ను కూడా వీటిలో కలిపి కొందరు వ్యవహరిస్తారు. కాంగ్రెసు దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గే యిక్కడివాడే. ఇక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న ముస్లిములు, దళితులు, గిరిజనులు, కాంగ్రెసుకు మద్దతుగా నిలుస్తూ వచ్చారు. ఒక అధ్యయనం ప్రకారం 2013 ఎన్నికలలో ఎస్సీ ఎస్టీల ప్రాబల్యం ఉన్న 54 సీట్లలో కాంగ్రెసు 28, బిజెపి 9, జెడిఎస్ 11 గెలిచాయి. ఇతరులకు 6 వచ్చాయి. మైనారిటీల ప్రాబల్యం ఉన్న 14 సీట్లలో కాంగ్రెసు 9, జెడిఎస్ 2 గెలిచాయి. ముస్లిములు జనాభాలో 12.5% ఉన్నారు. హైదరాబాద్–కర్ణాటక ప్రాంతంలో, ముంబయి–కర్ణాటక ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నా రాష్ట్రంలో అన్ని చోట్లా ఉన్నారు. 15%, అంతకంటె తక్కువగా 174 స్థానాల్లో, 16–20%గా 35 స్థానాల్లో 20% కంటె ఎక్కువగా 15 స్థానాల్లో ఉన్నారు. వీళ్లల్లో ఎక్కువమంది కాంగ్రెసు మద్దతుదారులు. కొందరు జెడిఎస్‌కు మద్దతు పలుకుతారు. 8 మంది ముస్లిములకు టిక్కెట్లు యిచ్చిన కుమారస్వామి తాము నెగ్గితే ముస్లిముకు ఉపముఖ్యమంత్రి పదవి యిస్తానన్నాడు. బిజెపి ఒక్క ముస్లిముకూ టిక్కెట్టు యివ్వలేదు. ముస్లింలు ఎక్కువగా ఉన్న చోట ఛోటా పార్టీల చేత ముస్లిం అభ్యర్థులను నిలబెట్టి వాళ్ల ఓట్లు గంపగుత్తగా కాంగ్రెసుకు పడకుండా జాగ్రత్తలు పడుతోందట. కాంగ్రెసును ముస్లిం పక్షపాత పార్టీగా చూపించడానికి మాటిమాటికి 2015 నుంచి ప్రభుత్వం నిర్వహిస్తున్న టిప్పు జయంతి గురించి మాట్లాడుతోంది. నిజానికి ప్రభుత్వం నిర్వహించే జయంతులు అనేకం ఉన్నాయట.

కాంగ్రెసు ప్రభుత్వం ఆర్టికల్ 371 (జె) కింద యీ ప్రాంతాభివృద్ధికి బోర్డు పెట్టి రూ. 2500 కోట్ల నిధులు సమకూర్చడంతో బాటు మెడికల్, ఇంజనీరింగ్, డెంటల్ కాలేజీల్లో 75% సీట్లు స్థానిక విద్యార్థులకు రిజర్వ్ చేయడం వలన కాంగ్రెసు పట్ల ఆదరణ ఉంది. ఆ ప్రతిపాదనను 2002 నాటి ఎన్‌డిఏ ప్రభుత్వం తిరస్కరించగా తర్వాత వచ్చిన యుపిఏ ప్రభుత్వం ఆమోదించింది. అందువలన గతంలో కాంగ్రెసు యిక్కడా బాగా గెలిచినా యీసారి బలహీనపడిందనే వాదన వినబడుతోంది. ఎందుకంటే ఈ ప్రాంతంలో షెడ్యూల్ కులాలలో వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్న మాదిగలు, యితరులు వున్నారు. వర్గీకరణకు ఎజె సదాశివ కమిటీ ఆమోదం తెలిపినా, అమలు చేయనందుకు కాంగ్రెసుపై కోపగించుకున్న మాదిగలు బిజెపిని ఆదరించవచ్చంటున్నారు. పైగా ఇక్కడ అధికసంఖ్యలో ఉన్న లింగాయతుల మద్దతు బిజెపికి ఉంది. దానికి తోడు బిజెపికి అండగా నిలిచిన బళ్లారి మైనింగు వ్యాపారస్తులు గాలి సోదరుల ప్రభావం యీ ప్రాంతంపై కూడా ఉంది.

గాలి సోదరుల్లో జనార్దనరెడ్డి చిన్నవాడు. అన్నలు కరుణాకర్, సోమశేఖర్. కానీ అందరూ జనార్దన్ మాటే వింటారు. బళ్లారి వీళ్ల అధీనంలోకి రావడానికి కొంత నేపథ్యం ఉంది. 2000 సం. వరకు మైనింగులో భారీ లాభాలు లేవు. టన్ను ముడి యినుము తవ్వడానికి రూ.150 ఖర్చయితే, మార్కెట్ రేటు రూ.250 ఉండేది. వచ్చిన దానిలో రాయల్టీ కింద రూ.16.50 కట్టేవారు. బళ్లారి ఖనిజం క్వాలిటీ తక్కువ కాబట్టి అమ్మకాలూ అంత బాగుండేవి కావు. అయితే 2000 సం. తర్వాత యినుము కొనడానికి చైనా ముందుకు రావడంతో టన్ను రేటు రూ.600 నుంచి 1000 దాకా పెరిగింది. కొన్నాళ్లకి ఏకంగా రూ.6 వేలైంది. ఇక గనుల యజమానులందరికీ భాగ్యం పట్టింది. దెబ్బకు జీవనశైలే మారిపోయింది. ఎలాట్ అయిన గనులే కాక, పక్క గనులు కూడా తవ్వడం

మొదలుపెట్టారు. మాఫియా ప్రవేశించింది. బళ్లారి పరిసర ప్రాంతాల్లో 23 అసెంబ్లీ స్థానాలున్నాయి. అంటే మొత్తం స్థానాల్లో 10% అన్నమాట. గాలి సోదరులు బిజెపికి అండగా నిలిచి తమ ప్రాధాన్యతను పెంచుకున్నారు. సోనియాకు వ్యతిరేకంగా సుష్మా స్వరాజ్‌ను నిలబెట్టి ఆమె మా యింటి ఆడపడుచు అన్నారు. ఎడియూరప్పకు అండగా నిలబడి అతను ముఖ్యమంత్రి అయ్యాక గాలి సోదరులిద్దరూ, అతని అనుచరుడు శ్రీరాములు మంత్రిపదవులు తీసుకున్నారు. వాళ్లపై ఎన్నో ఆరోపణలు, మరెన్నో కేసులు. చివరకు లోకాయుక్త నివేదిక ఆధారంగా గాలి సోదరులపై ఎడియూరప్ప ప్రభుత్వం చర్యలు తీసుకోవడం వాళ్లు తిరుగుబాటు చేశారు. బిజెపి ప్రభుత్వం సంక్షోభంలో పడింది. అలాటి వారినే యిప్పుడు బిజెపి మళ్లీ ఆశ్రయించింది.

ఇక్కడ తమ బేస్ పోగొట్టుకుంటే కష్టమని రాహుల్ తన కర్ణాటక ప్రచారాన్ని యిక్కడ నుంచి ప్రారంభించాడు. తమ వంతుగా బిజెపి రామ్ మాధవ్‌కు యీ ప్రాంత బాధ్యతలు అప్పగించింది. క్లిష్టమైన అనేక రాష్ట్రాలలో నెగ్గుకుని వచ్చిన రామ్ మాధవ్ యిక్కడ ఏ మేరకు సాధిస్తాడో చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

## 2018 మే — ఎమ్బీయస్: బొంబాయి – కర్ణాటక దృశ్యం

బొంబాయి – కర్ణాటక ప్రాంతం ఒకప్పుడు బొంబాయి ప్రాంతంలోని కన్నడిగ ప్రాంతాలతో ఏర్పడినది. బీజాపూర్ (విజయపుర), బెల్గాం (బెళగావి), బాగల్‌కోట్, ధార్వాడ, జిల్లాలున్నాయి. 40 సీట్లున్నాయి. మధ్య కర్ణాటకలోని హావేరి, గదగ్ జిల్లాలను కూడా యీ ప్రాంతంతో కొందరు కలుపుతారు. ఇక్కడ సాగునీటి కొరత ఎక్కువ. అందువలన రైతులు అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారు. 2017 డిసెంబరులో ఎడియూరప్ప, యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి యిక్కడ ఒక యాత్ర నిర్వహించి ప్రభుత్వ వ్యతిరేకతను రెచ్చగొట్టాడు. ఆలమట్టి జలాశయం వెనుక జలాల నుంచి కొన్ని వందల చెరువులకు తాగునీటిని మళ్లించడం, సూక్ష్మ సాగు పద్ధతిలో వేయి ఎకరాల భూమికి నీటి సరఫరా చేశామనీ కాంగ్రెసు ప్రజలకు నచ్చచెపుతోంది. సిద్ధరామయ్య పెట్టిన అన్న భాగ్య, క్షీర భాగ్య, వంటి అనేక సంక్షేమ పథకాలు ఉత్తర కర్ణాటకలో పేదలను ఆకట్టుకున్నాయి.

మహదాయి నదీజలాల పంపకం విషయంలో గోవాతో తగాదా ఉంది. గోవాలో బిజెపి ప్రభుత్వమే ఉంది కాబట్టి తమను గెలిపిస్తే సమస్యను పరిష్కరిస్తామని బిజెపి హామీ యిచ్చింది. దాన్ని నమ్మవద్దని కాంగ్రెసు అంటోంది. పారిశ్రామికంగా ప్రగతి లేదు. నిరుద్యోగ సమస్య ఎక్కువే. ఎడియూరప్ప కులస్తులైన లింగాయతులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. 2004, 2008లో ఎడియూరప్ప సారథ్యంలో యిక్కడ బిజెపికి ఎక్కువ సీట్లు వచ్చాయి. 2013 వచ్చేసరికి ఎడియూరప్ప విడిగా విడిపోయి కెజెపి అనే వేరే పార్టీ పెట్టుకుని లింగాయతుల ఓట్లు తెచ్చుకుని 9.8% ఓట్లు చీల్చడంతో బిజెపికి బాగా తగ్గి, కాంగ్రెసుకు ఎక్కువ వచ్చాయి. ఈ సారి ఎడియూరప్ప బిజెపితో కలిసిపోయాడు కాబట్టి బిజెపికి ఎక్కువ సీట్లు వస్తాయని అంచనా. దాన్ని నివారించడానికి సిద్ధరామయ్య లింగాయతుల అంశాన్ని ముందుకు తెచ్చాడు.

జనాభాలో 9.8% ఉన్న లింగాయతులు (వారిలో 20% ఉన్న వీరశైవుల్ని కలుపుకుని) రాజకీయాల్లో బహు చురుకు. ఏడుగురు ముఖ్యమంత్రులు లింగాయతులే. 100 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, ముఖ్యంగా బొంబాయి–కర్ణాటక ప్రాంతంలో లింగాయతుల ప్రాబల్యం ఉంది. తొలి నుంచి కాంగ్రెసుకు మద్దతుదారులుగా ఉండేవారు. వీరేంద్ర పాటిల్ అనే లింగాయతు ముఖ్యమంత్రిని 1990లో రాజీవ్ గాంధీ అర్ధాంతరంగా తీసివేయడంతో అప్పణ్నుంచి ఆ పార్టీపై కోపం పెంచుకున్నారు. 1994లో జనతాదళ్ వైపు మళ్లారు. క్రమేపీ బిజెపి వారిని తమ పక్షాన తిప్పుకోగలిగింది. లింగాయతులకు సామాజికంగా, రాజకీయంగా ప్రత్యర్థులు ఒక్కళిగలు. దేవెగౌడ ఆ వర్గానికి చెందినవాడు. దేవెగౌడతో బాటు ఒక్కళిగుల ప్రాధాన్యత పెరగడంతో స్వయంగా లింగాయతు అయిన ఎడియూరప్ప లింగాయతులను బిజెపి వైపు మరలించాడు. అతను విడిగా వెళ్లినపుడు పెద్దగా ఓట్లు పడలేదు. ఎడియూరప్ప బిజెపిలో మళ్లీ చేరడంతో లింగాయతులు బిజెపికి వేస్తారని కురుబ కులానికి చెందిన సిద్ధరామయ్య లెక్క వేశాడు.

బిజెపి కున్న లింగాయతు బేస్‌ను చెదరగొట్టడానికి ఏడాదిగా విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. మొత్తం అందరినీ కలిపి లింగాయతులని వ్యవహరిస్తున్నా లింగాయతులకు, వీరశైవులకు కొన్ని పోలికలున్నాయి, కొన్ని తేడాలున్నాయి. వీరశైవులు వైదిక, హిందూ ఆచారా విధానాల్ని పాటిస్తారు. విగ్రహారాధన చేయని లింగాయతులను శిక్కులు, జైనులు వంటి హిందూయేతరులుగా, మైనారిటీలుగా గుర్తించాలని సిద్ధరామయ్య వాదించసాగాడు. కితం ఏడాది లింగాయతులు ఆరాధించే సంఘ సంస్కర్త బసవేశ్వరుడి చిత్రపటాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోను వేలాడేయాలని ఆదేశాలు యిచ్చాడు. బసవేశ్వరుడి అనుయాయి అక్క మహాదేవి పేరును విజయపురలోని మహిళా విశ్వవిద్యాలయానికి పెట్టాడు. బసవేశ్వరుడి సిద్ధాంతాలు ఆవిష్కరించిన అనుభవ మంటపాన్ని బీదరులో కట్టాడు.

ఎన్నికలు దగ్గర పడుతూండగా సిద్ధరామయ్య సర్కారు లింగాయతుల్ని మైనారిటీగా ప్రకటించి, గుర్తింపు కోసం కేంద్రానికి సిఫార్సు చేసింది. దీన్ని ఒప్పుకుంటే లింగాయతులు నిర్వహించే అసంఖ్యాకమైన విద్యాసంస్థలకు మైనారిటీ స్టేటస్ వచ్చి అనేక రాయితీలు లభిస్తాయి. అందువలన లింగాయతులకు యీ గుర్తింపు పట్ల సంతోషంగా ఉన్నారు. అయితే కేంద్రంలోని బిజెపి ఎటూ తేల్చుకోలేకుండా ఉంది. మైనారిటీ హోదా యిస్తే సిద్ధరామయ్యకు క్రెడిట్ పోతుంది. ఇవ్వకపోతే లింగాయతులకు కోపం వచ్చి ఓట్లు వేయకపోవచ్చు. వీళ్లను మైనారిటీలుగా గుర్తిస్తే సంఖ్యాపరంగా హిందువుల సంఖ్య తగ్గిపోతుందని ఆరెస్సెస్ ఆందోళన పడుతోంది. అందువలన బిజెపి దీనిపై ఎటూ చెప్పకుండా కాలక్షేపం చేస్తోంది. లింగాయతులకు కర్ణాటకలో చిన్నాపెద్దా 1200 మఠాలున్నాయి. వీటికి అపారంగా నిధులున్నాయి. వీళ్లు ఓటర్లను కూడా ప్రభావితం చేయగలరు. వీరశైవులకూ మఠాలున్నాయి కానీ, యిన్ని లేవు, పైగా యింత డబ్బున్నవీ కావు. లింగాయతులకు మైనారిటీ హోదా యిచ్చి తమను విడగొడుతున్నాడన్న కోపం వీరశైవులకు ఉంది.

బిజెపి, కాంగ్రెసు నాయకులందరూ యీ మఠాల్నీ, మఠాధిపతులనూ దర్శించుకున్నారు. చివరకు ఎన్నికలను ఏ మేరకు ప్రభావితం చేస్తుందో చూడాలి.

కాంగ్రెసు 48 మంది లింగాయతులకు సీట్లిచ్చింది. ఒక్కళిగలకు 39, ముస్లింలకు 15, ఎస్సీలకు 36, ఎస్టీలకు 17, యితర వెనుకబడిన కులాలకు 52, బ్రాహ్మణులకు 7, క్రైస్తవులకు 2, జైనులకు 2 యిచ్చింది. ఒక అధ్యయనం ప్రకారం 2013 ఎన్నికలలో లింగాయతుల ప్రాబల్యం ఉన్న 50 సీట్లలో కాంగ్రెసుకు 29, బిజెపి 16, జెడిఎస్ 1 గెలిచాయి. ఈ సారి యిక్కడున్న సగానికి పైగా సీట్లు బిజెపి గెలుచుకుంటుందని, తక్కినవి కాంగ్రెసు, జెడిఎస్ పంచుకుంటాయని అంచనా. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

## 2018 మే — ఎమ్బీయస్: మధ్య కర్ణాటక దృశ్యం

మధ్య కర్ణాటకలో 57 స్థానాలున్నాయి. రాయచూరు, కొప్పల్, గదగ్, బళ్లారి, హావేరి, దావణగెరె, శివమొగ్గ, చిత్రదుర్గ, చిక్‌మగళూరు దీని కిందకు వస్తాయి. బళ్లారి గనుల ప్రభావం వీటిపై చాలా ఉంది. గాలి కుటుంబమే కాదు, యీ ప్రాంతాల్లో పోటీ చేసేవారందరూ గనుల యజమానులే. వారిలో క్లీన్ యిమేజి ఉన్నవారు చాలా తక్కువ. డబ్బు కారణంగా వారిని అన్ని పార్టీల వారూ ఆదరిస్తున్నారు. అప్రతిష్ట పాలైన యిద్దరు గని యజమానులు ఆనంద్ సింగ్, బి నాగేంద్ర యిప్పుడు కాంగ్రెసులో చేరారు. గాలి సోదరుల వాళ్ల కారణంగా బిజెపి 2008లో యిక్కడ ఎక్కువ సీట్లు గెలిచింది. 2013 వచ్చేసరికి గాలి జనార్దన రెడ్డి అనుచరుడు శ్రీరాములు బిఎస్ఆర్ అని వేరే పార్టీ పెట్టడంతో ఓట్లు చీలాయి. బిజెపికి నాలుగే వచ్చాయి. గాలి మళ్లీ బిజెపికి మద్దతుగా నిలిచాడు కాబట్టి ఈసారి అక్కడ బిజెపి సగమైనా గెలుస్తుందని అంచనా. తక్కిన సగం కాంగ్రెసు గెలవవచ్చు. తుంగభద్ర ప్రాజెక్టు వచ్చాక వ్యవసాయం చేయడానికి ఆంధ్ర కోస్తా జిల్లాల నుండి వెళ్లి సెటిలైన రైతులు కొప్పళ, రాయచూరు జిల్లాలలో ఉన్నారు. ప్రత్యేక హెూదా అంశం వారిని ప్రభావితం చేస్తుందా లేదా అన్నది వేచి చూడాలి. ఇప్పటివరకు తెలుగువారు అక్కడి మూడు ప్రధాన పార్టీలలోనూ మద్దతుదారులుగా, నాయకులుగా ఉండి పదవులు పొందుతున్నారు. అభ్యర్థుల బట్టే ఓట్లు పడతాయి తప్ప యితర రాష్ట్ర పరిణామాల ప్రభావం ఉండకపోవచ్చు.

కర్ణాటకలో బిజెపి అంటే ఎడియూరప్ప అనేటంతగా పార్టీ అతనితో ఐడెంటిఫై అయింది. శివమొగ్గకు చెందిన ఎడియూరప్ప లింగాయతు కులస్తుడు. 2004లో బిజెపికి అత్యధికంగా సీట్లు వచ్చినా, ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయింది. కాంగ్రెసు, జెడిఎస్ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. కాంగ్రెసు వాడైన ధరమ్‌సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నాడు. అతని ప్రభుత్వాన్ని కుప్పకూల్చడానికి ఎడియూరప్ప 2005లో జెడిఎస్‌తో చేతులు కలిపాడు. కుమారస్వామి బిజెపితో చేతులు కలపడాన్ని నేను ఆమోదించటం లేదు అని దేవెగౌడ తెగ హడావుడి చేశాడు. 2006 జనవరి నుంచి 20 నెలలు కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉండి, తర్వాత ఎడియూరప్పకు పదవి అప్పగించాలని ఒప్పందం. 20 నెలలు పూర్తయి అధికారం అప్పగించేవేళ 2007 అక్టోబరులో కుమారస్వామి మొండికేశాడు. దాంతో బిజెపి ప్రభుత్వం నుంచి వైదొలగింది. నెల్లాళ్ల ప్రతిష్టంభన తర్వాత కుమారస్వామి సరే అన్నాడు కానీ 8 రోజుల తర్వాత మద్దతు ఉపసంహరించి, ఎడియూరప్ప ముచ్చటను ఎనిమిది రోజులకు కుదించాడు.

ఇదంతా కుమారస్వామి, అతని తండ్రి దేవెగౌడ కలిసి ఆడిన నాటకం అని ప్రజలకు తేటతెల్లం కావడంతో ఓటర్లకు వారిపై అసహ్యం, ఎడియూరప్పపై సానుభూతి కలిగి 2008 ఎన్నికలలో 34% ఓట్లతో 110 సీట్లు సాధించి, ఆరుగురు స్వతంత్రుల మద్దతుతో ఎడియూరప్ప రెండోసారి ముఖ్యమంత్రి అయ్యాడు. అయితే త్వరలోనే ప్రభుత్వ భూములను కుటుంబ సభ్యులకు అప్పచెప్పిన విషయంలో, గనుల విషయంలో అవినీతి కారణంగా ఆ సానుభూతి యిగిరిపోయింది. బిజెపి అధిష్టానం పరిస్థితిని చక్కదిద్దలేక పోయింది. తమకు విజయాన్ని సమకూర్చిన గాలి సోదరుల ఆగడాలను బిజెపి సహించింది. వారిపై చర్య తీసుకోవడానికి వెనకాడింది. చివరకు లోకాయుక్త రిపోర్టు తర్వాత తీసుకుంటే వాళ్లు ఎడియూరప్పపై అలిగారు. ఎడియూరప్పపై కూడా కేసులు వచ్చేసరికి తప్పుకోమంటే ఎడియూరప్ప పార్టీపై 2010 నవంబరులో తిరగబడ్డాడు. ఆరునెలల తర్వాత లోకాయుక్త అభిశంసించాక దిగమన్నా ఓ పట్టాన దిగకుండా హిరణ్యాక్ష వరాలు కోరి సాధించుకుని 2011 జులైలో రాజీనామా చేశాడు. జగదీశ్ షెట్టార్‌ను ముఖ్యమంత్రి చేద్దామని పార్టీ అనుకుంటే కాదు, సదానంద గౌడను చేయమన్నాడు. రెండు నెలలు గడవకుండానే అతన్నీ దించేయమన్నాడు. ఏడాది గడవకముందే అతను రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ సారి జగదీశ్ షెట్టార్‌కు మద్దతిచ్చాడు. అదీ నాలుగు నెలల ముచ్చటే. బిజెపి అధిష్టానాన్ని తిట్టి, సోనియా గాంధీని పొగిడి 2012 నవంబరులో పార్టీ విడిచి వెళ్లి వేరే పార్టీ పెట్టుకున్నాడు.

ఎడియూరప్ప ఆగడాలు, ఆ ఆగడాలను అదుపు చేయలేని బిజెపి అసమర్థత ఓటర్లకు అసహ్యం పుట్టించింది. 2013 ఎన్నికలలో ఎడియూరప్ప పార్టీని, బిజెపిని రెండింటినీ ఓడించి కాంగ్రెసుకు అధికారం కట్టబెట్టారు. కాంగ్రెసుకు 37% ఓట్లతో 122 వస్తే బిజెపి, జెడిఎస్‌లకు చెరో 20% ఓట్లు, 40 సీట్లు వచ్చాయి. లింగాయతులు అధికంగా ఉన్న 30 సీట్లలో ఎడియూరప్ప బిజెపి అవకాశాలను చెడగొట్టాడు. ఎడియూరప్ప జైలుకి వెళ్లి వచ్చాడు కూడా. విడిగా వెళ్లి పార్టీలు పెట్టుకున్న ఎడియూరప్ప, అతని భాగస్వాములు గాలి సోదరులు మోదీకి ఆత్మీయులు కావడంతో పార్టీ పగ్గాలు మోదీ చేతికి రాగానే వాళ్లందరూ బిజెపిలోకి మళ్లీ వచ్చేశారు. ఎడియూరప్ప తనకు పదవులు అక్కరలేదని ప్రకటించి 2014 జనవరిలో పార్టీలో చేరాడు. ఇప్పుడు అతను బిజెపి తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థి. అతని అవినీతిని వెనకేసుకుని వచ్చే భారం బిజెపిపై, మోదీపై పడింది. అతనిపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని అంటూ మోదీ నేషనల్ హెరాల్డ్ కేసులో నిందితులైన సోనియా, రాహుల్‌లకు వేలెత్తి చూపే అధికారం లేదన్నాడు మోదీ. ఆరోపణల్లో నిజముందని నమ్మకపోతే ఎడియూరప్పను అప్పటి బిజెపి అధిష్టానం తప్పించేదే కాదు, బయటకు పంపించేదే కాదు.

ఈ ఎన్నికలలో గాలి జనార్దనరెడ్డికి టిక్కెట్టు యివ్వకపోయినా, అతని అనుచరులు 8 మందికి టిక్కెట్లిచ్చారు. ముఖ్య అనుచరుడు శ్రీరాములుకి ఉపముఖ్యమంత్రి పదవి యిస్తారని ప్రచారం జరుగుతోంది. ఇలాటి వాళ్లను ముందు పెట్టుకుని, సిద్ధరామయ్యను 10% అని, మరొకని అనడానికి చాలా ధైర్యమే కావాలి. మోదీకి ఆ ధైర్యం ఉంది. బిజెపి కేంద్ర ఏజన్సీలన్నిటినీ దుర్వినియోగం చేస్తోందని యీ ఎన్నికలలో మరోసారి నిరూపితమైంది. పోలింగు ముందు రోజు వరకు కాంగ్రెసు మంత్రులు, యితర నాయకుల యిళ్లపై ఇన్‌కమ్‌టాక్స్ దాడులు జరిపించింది. సిద్ధరామయ్య క్యాంప్ చేసిన రిసార్ట్‌పై కూడా కూడా దాడులు చేయించారు. కానీ ఒక్క బిజెపి నాయకుడిపైన కూడా యిలాటి దాడులు జరగలేదు. ఎడియూరప్పపై పెట్టిన కేసులను కర్ణాటక హైకోర్టు కొట్టివేసింది. దానిపై రాష్ట్రప్రభుత్వం వేసిన అప్పీళ్లు సుప్రీం కోర్టులో పెండింగులో ఉన్నాయి. ఆ అప్పీళ్లు నెగ్గితే ఎడియూరప్ప 20 కేసులు ఎదుర్కోవలసి వస్తుంది. ఏది ఏమైనా లింగాయతులు అధిక సంఖ్యలో ఉన్న షికారీపూర్ నుంచి ఎడియూరప్ప గెలుపు ఖాయం అంటున్నారు.

లింగాయతు ఓట్ల గురించే ఎడియూరప్పను ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిజెపి చూపిస్తోంది తప్ప అంతిమంగా అతనికి జెల్ల కొడతారన్న వాదన వినబడుతోంది. అతనికి 75 ఏళ్లు. ఆ వయసు వాళ్లకు పదవి యివ్వటం లేదన్న కారణం చూపించి, తప్పించవచ్చు. సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితిలో జెడిఎస్ మద్దతు తీసుకునేటప్పుడు వాళ్లకు ఆమోదయోగ్యుణ్ని ముందుకు తీసుకుని రావాలి. కుమారస్వామికి, ఎడియూరప్పకు గతంలో పంచాయితీ ఉంది కాబట్టి అనంత కుమార్ హెగ్డేను బిజెపి తరఫున ముఖ్యమంత్రిగానో, ఉపముఖ్యమంత్రిగానో తీసుకురావచ్చు. అప్పుడు ఎడియూరప్పకు కేంద్రమంత్రి పదవి యిచ్చి ఊరుకోబెట్టవచ్చు. రేపు బిజెపికి ఎన్ని సీట్లు వస్తాయన్నదానిపై అంతా ఆధారపడి ఉంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

**2018 మే** **ఎమ్బీయస్: కోస్తా కర్ణాటక దృశ్యం**

కోస్తా కర్ణాటకలో 19 సీట్లున్నాయి. దీనిలో దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ, ఉడుపి జిల్లాలున్నాయి. విదేశాలతో వ్యాపారాలు చేయడం వలన, యిక్కడి ప్రజలు విదేశాల్లో స్థిరపడి డబ్బులు పంపడం చేత యివి భాగ్యవంతమైన జిల్లాలగానే లెక్క. ఇక్కడ సిద్ధరామయ్య సంక్షేమ పథకాల కంటె మతపరమైన అంశాలకే ప్రాధాన్యత ఎక్కువ. ముస్లిం, క్రైస్తవుల జనాభా ఎక్కువ కాబట్టి బిజెపి హిందూత్వ సంస్థల హడావుడి యిక్కడే బాగా కనబడుతుంది. దానివలన బిజెపి రాజకీయ లాభం పొందింది కూడా. దానికి యిది అత్యంత బలమైన ప్రాంతం. 2013లో బిజెపి ఓట్లు చీలడం చేత కాంగ్రెసు 14 సీట్లు గెలిచింది. హిందూ ఓట్ల పోలరైజేషన్ కోసం యీ ఎన్నికలలో బిజెపి యోగి ఆదిత్యనాథ్ చేత ప్రచారం చేయించింది కాబట్టి ఇప్పుడు అవి తగ్గవచ్చు. ఇక్కడ మూడింట రెండు వంతుల స్థానాలు బిజెపి ఖాతాలో పడతాయని అంచనా.

దక్షిణాదిన బిజెపికి అనుకూలమైన రాష్ట్రం కర్ణాటక ఒకటే. రామమందిరం అంశంలో అద్వాణీ రథయాత్రకు దక్షిణాది నుంచి స్పందన వచ్చినది కర్ణాటకలో మాత్రమే. అప్పణ్నుంచి బిజెపి శ్రమిస్తూనే ఉంది. 1994లో హుబ్లి-ధార్వాడ్ ప్రాంతంలో జరిగిన మతకల్లోలాలు దానికి కలిసి వచ్చాయి. బెంగుళూరులో కూడా బిజెపి బలపడింది. కాంగ్రెసుకు ప్రత్యామ్నాయంగా ఎదిగిన జనతా పార్టీ పాతికేళ్ల వ్యవధిలో చీలికలు, పేలికలై పోవడంతో కాంగ్రెసు వ్యతిరేకులకు బిజెపి పట్టుకొమ్మగా తయారైంది. 2004 నుంచి కర్ణాటకలో అది బలమైన శక్తి. అయితే బిజెపి ముఖ్యమంత్రులు తమ దుష్పరిపాలనతో పేరు చెడగొట్టారు. అయినా 2004లో 18, 2009లో 19, 2014లో 17 పార్లమెంటు స్థానాలు వచ్చాయి. దాన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు తర్జుమా చేస్తే 132 వస్తుంది. మోదీ ప్రాభవం 2014 తర్వాత యుపిలో, ఈశాన్య రాష్ట్రాలలో పెరిగినా చాలా చోట్ల తగ్గింది. నోట్ల రద్దు ప్రకటన సమయంలో 50 రోజులు ఓర్పు పట్టమన్నారు కానీ 500 రోజులైన కష్టాలు గట్టెక్కలేదు. అసంఘిత కార్మికరంగం కల్లోలంలో ఉంది. రైతులు కునారిల్లుతున్నారు. పెట్రోలు ధర యివాళ కూడా మళ్లీ పెరిగింది.

మోదీ తన ఉపన్యాసాలతో బిజెపి అనుకూల పరిస్థితిని సృష్టించారని పత్రికల్లో రాస్తున్నారు. పెరుగుతున్న ధరలకు, జీవనవ్యయానికి కేంద్రప్రభుత్వ విధానాలే కారణమని సామాన్యుడికి కూడా తెలుసు. జిఎస్‌టి సామాన్యులతో బాటు, వ్యాపారస్తుల నడ్డి కూడా విరిచింది. నోట్ల రద్దు, తదనంతర పరిణామాలు ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చాయి. రాజకీయంగా చూస్తే కాంగ్రెసు అవలక్షణాలన్నీ బిజెపి వంటబట్టించుకుని, యిప్పుడు ఆ గేమ్‌లో దాన్నే ఓడిస్తోంది. పేదలు, గ్రామీణ ప్రాంతాల వారు బిజెపికి దూరమయ్యారని, మధ్యతరగతి ప్రజలలో మోదీ పట్ల వ్యామోహం తగ్గిందని గుజరాత్ ఎన్నికలు చెప్పాయి. కర్ణాటకలో ఏం జరుగుతుందో మే 15న తెలుస్తుంది. దేశదుస్థితికి కేంద్రప్రభుత్వ విధానాలే కారణమని ప్రజలకు నచ్చ చెప్పగల సామర్థ్యం స్థానిక నాయకులకు ఉంది. మోదీ ఎంత అద్భుతమైన వక్త అయినా, స్థానిక భాషలో ప్రసంగించలేడు కదా. వీటి కారణంగా 2014 కంటె 5% నెగటివ్ స్వింగ్ వస్తే బిజెపి 91 దగ్గర ఆగిపోతుంది. కాంగ్రెసుకు 113, జెడిఎస్‌కు 20 వస్తాయి. బెంగుళూరు, మధ్య కర్ణాటకలలో మాత్రమే బిజెపి కాంగ్రెసు కంటె ఎక్కువ తెచ్చుకుంటుంది.

బిజెపికి యీసారి ఎదురైన యిబ్బంది ఏమిటంటే టిక్కెట్ల పంపిణీ తర్వాత పేచీలు. ఒకప్పుడు కమ్యూనిస్టులు, బిజెపి వారు సిద్ధాంతాల ప్రకారం నడిచేవారు అనుకునేవారు. ఇప్పుడు బిజెపి అవన్నీ గాలికి వదిలేసింది. నెగ్గగల సత్తా ఉన్న అభ్యర్థిగా భావించిన ఏ నాయకుణ్నైనా సరే ఏ పార్టీలో నుంచైనా సరే గుంజుకుంది. మే 15 తర్వాత ఆంధ్రలో మా తడాఖా చూపిస్తాం అంటున్నారు. అంటే అక్కడా యిదే చేయబోతా రనుకోవచ్చు. ఆ పార్టీలో చేరిపోతే ఐటీ దాడులు ఉండవు, కేసులుండవు, పాతకాలపు ఆరెస్సెస్ సిద్ధాంతపరమైన ఒత్తిళ్లూ ఉండవు. ఎప్పణ్నుంచో అలవాటు పడిన రాజకీయ సంస్కృతి (కాంగ్రెసు సంస్కృతిగా పేరుబడినా, యిప్పుడు

అన్ని పార్టీలలోనూ యిదే పద్ధతి నడుస్తోంది) వదులుకోనక్కరలేదు. అందువలన అందరూ బిజెపికి క్యూ కడుతున్నారు. అయితే పార్టీకి వస్తున్న చికాకు ఏమిటంటే గతం నుంచి పార్టీలో ఉన్నవాళ్లు నిరాశపడుతున్నారు, తిరగబడుతున్నారు. కొందరు పార్టీ విడిచి వెళుతున్నారు. కాంగ్రెసు, బిజెపి, జెడిఎస్‌ల నుండి ఎన్నో పార్టీ ఫిరాయింపులు జరిగాయి. అసమ్మతివాదులు ఓట్లను ఏ మేరకు చీలుస్తారో తెలియదు. బిజెపి తరఫున ఒకప్పుడు ముఖ్యమంత్రిగా చేసిన సదానంద గౌడ ప్రస్తుతం నిర్లిప్తంగా ఉన్నట్లు వార్త.

కాంగ్రెసు కర్ణాటకలో ఒక వెలుగు వెలిగిన పార్టీ. ఇప్పటికీ హీనపక్షం 35% ఓట్లు తెచ్చుకుంటుంది. 2014 పార్లమెంటు ఎన్నికలలో మోదీ హవా బలంగా వీచే రోజుల్లో కూడా బిజెపికి 43% వస్తే కాంగ్రెసుకు 42% వచ్చాయి. కులాల సమీకరణాలు కూడా కాంగ్రెసు జాగ్రత్తగా బాలన్స్ చేసుకుంటూ వస్తుంది. మైనారిటీలు కాంగ్రెసు పాలనలో సురక్షితంగా ఫీలవుతారు. అందువలన సిద్ధరామయ్య అహిందా (అల్పసంఖ్యాక వర్గాలు, వెనుకబడిన తరగతులు, దళితులు) ఫార్ములాను నమ్ముకున్నాడు. ఎస్సీలు (18%), ఎస్టీలు (7%) కలిసి 25% మంది ఉన్నారు. వీళ్లు, ముఖ్యంగా వీళ్లలో ఆర్థికంగా బాగుపడినవారు కాంగ్రెసుకు అనుకూలంగా ఉన్నారు. ఎస్సీలలో మాదిగలను మచ్చిక చేసుకోవడానికి బిజెపి ప్రయత్నిస్తోంది. ఒక అధ్యయనం ప్రకారం 2013 ఎన్నికలలో ఒబిసిల ప్రాబల్యం ఉన్న 32 సీట్లలో కాంగ్రెసు 27, బిజెపి 3, జెడిఎస్ 2 గెలిచాయి.

దీన్ని తిప్పికొట్టడానికి బిజెపి కాంగ్రెసు ఏలుబడిలో హిందూమతం ప్రమాదంలో పడిందనే నినాదం ఎత్తుకుంది. సిద్ధరామయ్యను ముస్లిం అభిమానిగా, హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించబూనింది. సిద్ధరామయ్య తను హిందువునే కానీ, సెక్యులరిస్టు హిందువునని చెప్పుకుని బిజెపిని నిలవరించడానికి చూస్తున్నాడు. అతను ఎత్తుకు పై యెత్తులు వేయడంలో సిద్ధహస్తుడు. బిజెపి జాతీయతావాదాన్ని రెచ్చగొడితే యితను ఉపజాతీయతావాదాన్ని రెచ్చగొట్టాడు. కన్నడ భాష గురించి అక్కడ ముందు నుంచి చాలా ఎవేర్‌నెస్ ఉంది. అందుకని యీసారి ఏకంగా కన్నడ జండా అనేశాడు. గుజరాత్ ఆత్మగౌరవం గురించి మోదీ గుజరాత్ ఎన్నికలలో మాట్లాడాడు. అదే కాపీ కొట్టి సిద్ధరామయ్య కన్నడతనం గురించి మాట్లాడుతున్నాడు. 15 వ ఆర్థిక సంఘం సిఫార్సులు దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నాయనే సంగతి కూడా బాగా చర్చకు వచ్చింది. బిజెపి నాయకులనేకమంది దక్షిణాది వారిని చులకనగా చూసే వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. బిజెపిపై ఉత్తరాది ముద్ర పడిందంటే అది ఎన్నికలలో దెబ్బే. తాము కేంద్రానికి యిచ్చే దానిలో అతి తక్కువే తిరిగి వస్తోందని, ఉత్తరాది రాష్ట్రాలకు దోచిపెడుతోందని అంకెలతో సహా చెప్పాడు. బిజెపి మతాల వారీగా ప్రజల్ని విడగొడితే, అతను కులాల వారీగా విడగొట్టాడు. అతను హిందువే కాదన్నట్లు అమిత్ షా ప్రచారం చేయబోతే, అసలు నువ్వు జైనుడివి కదా, హిందువునైన నా మీద ఆ మాటలేమిటి? అని అడిగాడు. రాహుల్ సరేసరి, 'నేను గుడికి వెళ్లినప్పుడల్లా వాళ్లకు కడుపులో తిప్పుతోంది' అన్నాడు. అమిత్ షా తిరుపతికి వస్తే జైనుడివి, నీకు యిక్కడేం పని అని ఎవరూ అడగలేదు కదా. మనం చర్చికి వెళ్లినా ఎవ్వరూ అడగరు కదా. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

**2018 మే** **ఎమ్బీయస్: దక్షిణ కర్ణాటక దృశ్యం**

తుమకూరు, చిక్కబళ్లాపూరు, కోలారు, హాసన్, మైసూరు, రామనగరం, కొడగు, చామరాజనగర్, బెంగుళూరు రూరల్ ప్రాంతాలు దీని కింద వస్తాయి. 57 స్థానాలున్నాయి. తమిళం మాట్లాడేవారు ఎక్కువగా ఉన్నారు. ఒక్కళిగలు జనాభాలో 8% ఉంటారు. 70 నియోజకవర్గాల్లో, ముఖ్యంగా యీ ప్రాంతంలో బలంగా ఉన్నారు. దేవెగౌడ వారికి నాయకుడిగా ఎదిగాడు. ఒక్కళిగలు అతనికే ఓటేస్తున్నారు. జెడిఎస్ ప్రధానబలమంతా యిక్కడే. ఇక్కడ బిజెపికి పెద్దగా బలం లేదు. అందువలన ఒక్కళిగ మఠాలను ఆశ్రయిస్తోంది. జెడిఎస్ 25 సీట్ల దాకా గెలుస్తుందని అంచనా. 2013లో ఇక్కడ కాంగ్రెసు 27, జెడిఎస్ 25, బిజెపి 4 గెలిచాయి. జెడిఎస్ సీట్లు నాలుగైదు తగ్గి, అవి బిజెపి, కాంగ్రెసు సగంసగం పంచుకోవచ్చని అంచనా.

జెడిఎస్ అంటే ఫక్తు రాజకీయవాది ఐన దేవెగౌడ, అతని కుటుంబమే. హాసన్‌లో పుట్టి జనతా పార్టీ నాయకుడిగా ఎదిగిన దేవెగౌడ ఆ పార్టీలో ఉండగా ముఖ్యమంత్రి పదవికి రామకృష్ణ హెగ్డేతో పోటీపడ్డారు. హెగ్డే తను దిగిపోతూ ఎస్ఆర్ బొమ్మయ్ ముఖ్యమంత్రిని చేశారు. దాంతో అలిగిన దేవెగౌడ జనతా పార్టీ నుంచి విడిపోయి సమాజవాదీ జనతా పార్టీ అని పెట్టాడు. తర్వాతి ఎన్నికలలో రెండు వర్గాలూ ఓడిపోయాయి. 1993లో యిద్దరూ ఒక్కటై జనతా దళ్ పేరుతో పోటీ చేసి గెలిచాయి. హెగ్డే మళ్లీ ముఖ్యమంత్రి అవుదామనుకుంటే అడ్డుకొట్టి దేవెగౌడ అయ్యాడు. లోకసభ ఎన్నికల్లో గెలిచి ప్రధాని కూడా అయ్యాడు. హెగ్డేను జనతాదళ్ నుంచి బహిష్కరించి కసి తీర్చుకున్నాడు. ప్రధాని అయినా కర్ణాటకపై పట్టు పోకూడదని, ముఖ్యమంత్రిగా ఉన్న జె ఎచ్ పటేల్‌ను కంట్రోలు చేయబోయాడు. దాంతో పార్టీ రెండుగా విడిపోయింది. జనతాదళ్ (సెక్యులర్)కు దేవెగౌడ అధ్యక్షుడు. సిద్ధరామయ్య అతనికి అండగా నిలిచాడు. మరో వర్గమైన జనతా దళ్ (యునైటెడ్) కనుమరుగైంది.

జెడిఎస్‌కు 1999 ఎన్నికలలో 10 స్థానాలే వచ్చాయి కానీ 2004లో 59 వచ్చాయి. దాంతో కాంగ్రెసుతో చేతులు కలిపి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పరచినపుడు సిఎంగా కాంగ్రెసు నాయకుడు ధరం సింగ్, డిప్యూటీ సిఎంగా జెడిఎస్ తరఫున సిద్ధరామయ్య పని చేశారు. జెడిఎస్ కాంగ్రెసుతో తెగతెంపులు చేసుకుని, బిజెపితో జట్టు కట్టినపుడు, 2005లో ముఖ్యమంత్రిగా మొదట జెడిఎస్ వంతు అన్నపుడు తనకే ఆ ఛాన్సు ఉంటుందనుకున్నాడ సిద్ధరామయ్య. కానీ దేవెగౌడ తన కొడుకు కుమారస్వామికి ఆ పదవి కట్టబెట్టడంతో సిద్ధరామయ్య తిరగబడ్డాడు. దాంతో దేవెగౌడ యితన్ని పార్టీలోంచి తీసేశాడు. ఇక అప్పణ్నుంచి ఆ పార్టీ దేవెగౌడ కుటుంబానికే పరిమితమైంది. దేవెగౌడ, మూడో కొడుకు కుమారస్వామి, రెండో కొడుకు రేవణ్ణలతో బాటు అనేకమంది రాజకీయాల్లో ఉన్నారు. జెడిఎస్‌నుంచి తక్కిన కులాల నాయకులందరూ వెళ్లిపోయారు. ఒక్కళిగ పార్టీగానే మిగిలింది. 2008లో 28, 2013లో 40 స్థానాలు

గెలిచింది. ఈసారి కింగ్‌మేకర్ స్థానానికి పోటీ పడుతోంది. ఒక అధ్యయనం ప్రకారం 2013 ఎన్నికలలో ఒక్కళిగల ప్రాబల్యం ఉన్న 53 సీట్లలో కాంగ్రెసు 18, బిజెపి 11, జెడిఎస్ 20 గెలిచాయి. ఇతరులకు 4 వచ్చాయి. ఒక్కళిగల్లో తెగలున్నాయి. మండ్యా, మైసూరులలో ఎక్కువగా ఉన్న గంగాట్కర్ ఒక్కళిగలు జెడిఎస్‌కు ఓటేస్తారు. చిక్‌మగళూరు, శివమొగ్గలలో ఉన్న మలనాడు ఒక్కళిగలు బిజెపికి మద్దతిస్తారు. కోలారు, చిక్‌బళ్లాపూర్, బెంగుళూరులో ఉన్న మారాసు ఒక్కళిగలు కాంగ్రెసుకు ఓటేస్తారు.

ఎవరితో కావాలంటే వాళ్లతో చేతులు కలపగల సమర్థుడు దేవెగౌడ. సిద్ధాంతపరంగా కొడుకుతో అప్పుడప్పుడు విభేదం ఉన్నట్లు నటిస్తాడు కానీ ఇద్దరూ ఒక్కటే. తమ ప్రాబల్యాన్ని ఉత్తర కర్ణాటకకు కూడా విస్తరించాలని ఆ బాధ్యతను కుమారస్వామికి అప్పగించాడు కానీ అతను అనారోగ్యపీడితుడై బెంగుళూరులోనే ఉంటున్నాడు. సిద్ధరామయ్యను ఓడించడమే దేవెగౌడ కుటుంబం జీవితలక్ష్యం. బిజెపితో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని బిజెపి గెలిచే స్థానాల్లో బలహీనమైన జెడిఎస్ అభ్యర్థులను నిలిపిందని, జెడిఎస్ గెలిచే స్థానాల్లో బిజెపి బలహీనమైన అభ్యర్థులను నిలిపిందని పరిశీలకులు అంటున్నారు. ఎన్నికలు జరగగానే హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని సూచనలు రాగానే కుమారస్వామి సింగపూరు వెళ్లి కూర్చున్నాడు. అక్కడ బిజెపితో మంతనాలు జరుపుతున్నాడని అనుమానం. కనీసం 30 సీట్లు వస్తాయని, అవి చూపించి బేరాలాడవచ్చని అతని ఊహ. తక్కువ సీట్లున్నా తనకే ముఖ్యమంత్రి పదవి కావాలని అతను మడతపేచీ పెట్టవచ్చు. కాంగ్రెసు, బిజెపిలలో ఎవరు దానికి సమ్మతిస్తే వారితో కలుస్తాడు. ఈ ఏడాదిలో జరగబోయే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాలలో గెలవాలంటే కర్ణాటకలో అధికారం దక్కాలనే లెక్కతో కాంగ్రెసు సిద్ధరామయ్యను, బిజెపి ఎడియూరప్పను బలి పెడితే పెట్టవచ్చు. ఎడియూరప్ప స్థానంలో అనంతకుమార్ పేరు అప్పుడే వినబడుతోంది. ఇప్పటిదాకా ముఖ్యమంత్రి నేనే అని చెపుతూ వచ్చిన సిద్ధరామయ్య యివాళ 'నేను తప్పుకుని దళిత నాయకుణ్ని ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధం' అని ప్రకటించాడు. 'అతన్ని మెజారిటీ ఎమ్మెల్యేలు ఆమోదించాలనుకోండి..' అంటూ మెలిక పెట్టినా!

హంగ్ ఎసెంబ్లీ ఏర్పడితేనే యివన్నీ అవసరమౌతాయి. ఏర్పడుతుందని ఎగ్జిట్ పోల్స్ చెపుతున్నాయి. కానీ ఎగ్జిట్ పోల్స్ తప్పిన సందర్భాలు కూడా చాలా ఉన్నాయి. టుడేస్ చాణక్య అంచనాలు కరక్టవుతాయనే ప్రథ వుంది కానీ గుజరాత్ విషయంలో అది బిజెపికి 135 సీట్లు వస్తాయంది. తీరా చూస్తే 100 కూడా రాలేదు. పంజాబ్‌లో కూడా కాంగ్రెస్, ఆప్ సమానస్థాయిలో ఉంటాయంది. కానీ ఆప్ ఘోరంగా ఓడింది. యుపిలో బిజెపి అద్భుత విజయం సాధిస్తుందని, ఎస్పీ, బియస్పీ పూర్తిగా దెబ్బ తింటాయని ఎవరూ చెప్పలేకపోయారు. రేపు కర్ణాటకలో కూడా స్పష్టమైన తీర్పు వస్తే యీ పొత్తుల గొడవ, యీ రాజీలు ఉండవు. ఎందుకంటే భాగస్వామిగా జెడిఎస్ రికార్డు బాగా లేదు. కాంగ్రెసు, బిజెపి యిద్దరితో పొత్తు పెట్టుకుంది, యిద్దరితోనూ పేచీ పెట్టుకుని ప్రభుత్వాలను కూలదోసింది. అదే పునరావృతమైతే కర్ణాటకలో రాజకీయ అనిశ్చితి, ప్రజలకు అవస్థలు తప్పవు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

**2018 మే** **ఎమ్బీయస్: బెంగుళూరు దృశ్యం**

గ్రేటర్ బెంగుళూరులో 32 స్థానాలున్నాయి. 2013లో కాంగ్రెసుకు 13, బిజెపికి 12 వచ్చాయి. బిజెపి నగరాల్లో పుంజుకుంటోంది. 2013లో 30% ఓట్లు తెచ్చుకున్న బిజెపి 2014లో మోదీ యిమేజి కారణంగా 46.6% ఓట్లు, 75% సీట్లు తెచ్చుకుంది. ఇప్పుడు 5% నెగటివ్ స్వింగ్ వస్తే దాని సీట్ల సంఖ్య 19కి తగ్గుతుంది. తాగునీటి కొరత, ట్రాఫిక్, వాతావరణ కాలుష్యం వంటి అనేక సమస్యలతో బెంగుళూరు జీవితం అధ్వాన్నంగా తయారైంది కాబట్టి కాంగ్రెసు నష్టపోయి, బిజెపి లాభపడవచ్చు కాబట్టి సగానికి పైగా సీట్లు బిజెపివే అంటున్నారు. నీటికొరత తీర్చడానికి 192 చెరువులు పునరుద్ధరిస్తారని కాంగ్రెసు హామీ యిస్తోంది. నగరంలో చెరువులు, నదుల్ని పునరుద్ధరించడానికి రూ.2500 కోట్లతో నిధి ఏర్పాటు చేస్తానని బిజెపి అంటోంది.

బెంగుళూరు కాస్మోపాలిటన్ నగరం. కన్నడం మాట్లాడేవారు 42% మాత్రమే, తమిళులు 18%, తెలుగువారు 15%, ఉర్దూ మాట్లాడేవారు 13%, హిందీ మాట్లాడేవారు 3.4%, మలయాళం మాట్లాడేవారు 3%.. యిలా ఉన్నారు. వీరిలో ఓటు హక్కు ఉన్న వారెందరో చూడాలి. నగరవాసులు అధికారంలో ఉన్నవారికి వ్యతిరేకంగా ఉంటూంటారు. కానీ ఓటింగు దగ్గరకు వచ్చేసరికి బద్ధకిస్తారు. అందువలన మురికివాడల్లో ఉన్నవారికి ఓటరు గుర్తింపు కార్డులు యిప్పించి లబ్ధి పొందుదామని ప్రభుత్వం చూస్తోంది. ఐదేళ్లలో 17.5 లక్షల మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఈసారి రాష్ట్రమంతా కలిపి 2% ఓటింగు పెరిగినా బెంగుళూరులో తగ్గింది. 50% దాటలేదు. కావేరీ జలాల విషయంలో బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం తమిళనాడు పట్ల వివక్షత చూపిస్తోందని అందరూ అనుకుంటున్నారు. తమిళులైతే మరీనూ. తమిళులకు స్వరాష్ట్రాభిమానం ఎక్కువ కాబట్టి బిజెపిని వ్యతిరేకిస్తారా అనేది పరిశీలించాలి. బెంగుళూరు కాకుండా తక్కిన ప్రాంతాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాలున్నాయి కాబట్టి అక్కడ కాంగ్రెసు, బిజెపి సమానస్థాయిలో సీట్లు తెచ్చుకోవచ్చు. బెంగుళూరులో ఎవరు విజయం సాధిస్తే వారే ముందువరుసలో ఉంటారనవచ్చు. ప్రభుత్వ వ్యతిరేకత విపరీతంగా ఉన్న బెంగుళూరులో ఓటింగు శాతం తగ్గడం బిజెపికి నష్టం చేయవచ్చు.

కర్ణాటకలో కాంగ్రెసు విజయం చేజిక్కించుకున్నా, విజయానికి దగ్గరగా వచ్చినా ఆ క్రెడిట్ సిద్ధరామయ్యకే పోతుంది. ముఖ్యమంత్రిగా ఎవరు కావాలి అని సర్వేలో అడిగితే ప్రజలు సిద్ధరామయ్యకు 30%, ఎడియూరప్పకు 25%, కుమారస్వామికి 20% ఓట్లేశారట. సిద్ధరామయ్యకు ఉన్న అడ్వాంటేజి ఏమిటంటే అతనికి ప్రత్యామ్నాయాలైన ఎడియూరప్ప, కుమారస్వామి యిద్దరూ యింతకు ముందు ముఖ్యమంత్రులుగా చేసి విఫలమైనవారే. అవినీతి ఆరోపణలు మూటగట్టుకున్నవారే. కుమారస్వామిపై 7 కేసులు పెండింగులో ఉన్నాయి. వాటిలో 4 అక్రమ మైనింగు, 3 డీనోటిఫికేషన్‌కు సంబంధించినవి. సిద్ధరామయ్యపై అవినీతి ఆరోపణలు రాకపోలేదు. అర్కావతి లేఔట్‌లో 900 ఎకరాల భూమిని డీనోటిఫై చేయడంలో అవినీతి జరిగిందని ఆరోపణలు వస్తే న్యాయవిచారణ జరిపించాడు.

సిద్ధరామయ్యది తప్పు లేదని తేల్చారు. ఒక వ్యాపారస్తుడి నుండి రూ.80 లక్షల వాచి తీసుకుంటే ప్రతిపక్షాలు అది లంచం అన్నాయి, యితను బహుమతి అన్నాడు. వివాదం చెలరేగేసరికి, నాకక్కరలేదంటూ అసెంబ్లీ స్పీకరుకు అందచేశాడు. కేసు నమోదు కాలేదు. కాంగ్రెసు ఎమ్మెల్సీ గోవిందరాజు యింటిపై ఇన్‌కమ్‌టాక్స్ దాడి జరిగినప్పుడు డైరీ దొరికింది. దానిలో స్టీలు ఫ్లవర్ కట్టడానికి గాను కిక్‌బ్యాక్‌గా కాంగ్రెసు పార్టీకి రూ.65 కోట్లు లంచం యిచ్చినట్లుగా ఒక ఎంట్రీ ఉందట. ఎవరికిచ్చాడో ఏమో వివరాలు బయటకు రాలేదు. ఆ ఫ్లయిఓవరు ఆపేసినట్లున్నారు. ఏది ఏమైనా సిద్ధరామయ్య కాబినెట్‌లో తీవ్రమైన అవినీతి ఆరోపణలున్నవారు మంత్రులుగా ఉన్నారు.

సిద్ధరామయ్య కురుబ కులానికి చెందినవాడు. జనాభాలో వీరి శాతం 7.1%. రాష్ట్రంలో అన్ని జిల్లాలలోనూ కొద్దికొద్దిగా ఉన్నారు. 120 నియోజకవర్గాల్లో ఫలితాలను ప్రభావితం చేయగలరు. సిద్ధరామయ్య కారణంగా కాంగ్రెసుకు ఓట్లేయవచ్చని అంచనా. అతను సోషలిస్టు నాయకుడిగా ఎదిగాడు. దేవెగౌడకు ముఖ్య అనుచరుడు. కాంగ్రెసులో చేరాక తన రాజకీయ చాతుర్యమంతా ఉపయోగించి, బాగా ఎదిగాడు. ఈ ఎన్నికలలో కాంగ్రెసు గెలిచినా సిద్ధరామయ్య ఓడిపోవచ్చేమో అని కూడా అంటున్నారు. అతను బాదామి, చాముండేశ్వరి నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నాడు. మైసూరు జిల్లాలోని చాముండేశ్వరి నుంచి సిద్ధరామయ్య ఐదుసార్లు గెలిచాడు, రెండుసార్లు ఓడిపోయాడు. అక్కడి ఓటర్లలో 60% ఒక్కళిగలే. ఒక్కళిగ పార్టీగా పేరు బడిన జెడిఎస్ ద్వారా గెలిచిన సిద్ధరామయ్య దేవెగౌడతో విభేదించి బయటకు వచ్చి కాంగ్రెసులో చేరాక 2006లో పోటీ చేస్తే 257 ఓట్ల తేడాతో మాత్రమే గెలిచాడు. దానికి కారణం గతంలో అక్కడ కురుబల ఓట్లు కూడా చాలా వుండేవి. 2004లో నియోజకవర్గాల విభజనలో వాళ్లందరూ పొరుగున ఉన్న వరుణ నియోజకవర్గానికి మారిపోయారు. అందువలన 2013లో సిద్ధరామయ్య వరుణ నుండి పోటీ చేసి గెలిచాడు. ఆ సురక్షితమైన స్థానాన్ని యిప్పుడు తన కొడుకు యతీంద్రకు ధారాదత్తం చేసి, తను రిస్కు తీసుకుని, 12 ఏళ్లగా పోటీ చేయని చాముండేశ్వరి నుండి నిలబడుతున్నాడు. తమ నుండి విడిపోయిన సిద్ధరామయ్యకు బుద్ధి చెప్పాలని జెడిఎస్ చాలా పట్టుదలతో ఉంది. పైగా అసదుద్దీన్ ఒవైసీ వచ్చి జెడిఎస్‌కు ఓటేయండని అక్కడ ఉన్న ముస్లిము ఓటర్లకు పిలుపు నిచ్చాడు. ఇక్కడ గెలుపు సందిగ్ధమే కాబట్టి, కాంగ్రెసు ఉత్తర కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లాలోని బాదామి నుంచి కూడా పోటీ చేయడానికి అనుమతిచ్చింది.

బాదామిలో సిద్ధరామయ్య ప్రత్యర్థి బిజెపి ఉపముఖ్యమంత్రి అభ్యర్థి శ్రీరాములు. అతను యిక్కడే కాకుండా చిత్రదుర్గ జిల్లాలోని మొలకలమూరులో కూడా పోటీ చేస్తున్నాడు. సిద్ధరామయ్య కురుబ, దళిత, ముస్లిము ఓట్లను నమ్ముకుంటే శ్రీరాములు లింగాయత్, వాల్మీకి (అతనిది అదే కులం) ఓట్లను నమ్ముకున్నాడు. శ్రీరాములకు గాలి సోదరుల మద్దతుంది. డబ్బుకీ లోటు లేదు. అందువలన అక్కడా గెలుపు సందిగ్ధమే అంటున్నారు. అతనికీ అనుమానం వచ్చిందేమో నేను ముఖ్యమంత్రి నౌతానని పట్టుబట్టను అంటున్నాడు. రేపు ఫలితాలు వచ్చాక అనేక విషయాల్లో స్పష్టత వస్తుంది. ఫలితాలపై సెఫాలజిస్టులు, జర్నలిస్టులు చర్చిస్తున్నపుడు అవగాహన చేసుకోవడానికి యీ వ్యాసావళిలోని సమాచారం ఉపయోగపడుతుందని నమ్ముతున్నాను. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

**2018 మే 19 టాబ్లాయిడ్‌కై మెమరీ నెమరేస్తే.. శీర్షికకై** **ఎమ్బీయస్: పండితులు సినిమాలకు నప్పరా?**

సినిమా రచన అనేది విలక్షణమైనది. పాండిత్యం ఉన్నంత మాత్రాన, సృజన సాహిత్యంలో నిష్ణాతులైనంత మాత్రాన సినిమాల్లో రాణిస్తారని లేదు. సినిమా రచయితలకూ పాండిత్యం ఉంటుంది. కానీ వాళ్లు తమ పాండిత్యాన్ని, సృజనాత్మకతను సామాన్యుడికి అందించే కళలో నైపుణ్యం సాధిస్తారు. విశ్వనాథ సత్యనారాయణ గారి వంటి మహనుభావులకు కూడా యీ విద్య అబ్బలేదు. ఆ వైనం ఏమిటో సినీరచయిత డి.వి.నరసరాజు గారు తన ఆత్మకథ "ఒక అదృష్టవంతుని ఆత్మకథ"లో రాశారు. జంధ్యాల గౌరీనాథ శాస్త్రి అని గొప్ప నటుడు ఉండేవాడు. చాలా ధనికుడు. వాళ్ల మావగారు గుంటూరులో పెద్ద లాయరు. కె వి రెడ్డిగారు వాహినీ పిక్చర్స్ కోసం తొలిసారిగా డైరక్టు చేసిన "భక్త పోతన" (1942) సినిమాలో ఈ గౌరీనాథ శాస్త్రి శ్రీనాథుడి వేషం వేసి అదరగొట్టేశాడు. సినిమా సూపర్‌హిట్ అయింది. కెవి రెడ్డి డైరక్షన్‌పై అప్పట్లో వాహినీవారికి నమ్మకం లేదు. బిఎన్ రెడ్డి గారిని దర్శకత్వ పర్యవేక్షణకు పెట్టాడు. అయితే గౌరీనాథ శాస్త్రి కెవి రెడ్డికి మంచి మద్దతు యిచ్చాడు. ఆయనే కనక 'ఈ కుర్రాడికి ఏం తెలుసు? బిఎన్ గారినే పెట్టండి' అని ఉంటే కెవికి డైరక్షన్ ఛాన్స్ పోయి వుండేది. ఆ కృతజ్ఞత కెవికి ఉంది. కొన్నాళ్లు పోయాక 1952లో కెవి, డివి నరసరాజు గారిని సినిమారంగానికి పరిచయం చేస్తూ ఆయన చేత వాహినీ వారికే "పెద్దమనుషులు" (1954) రాయించుకున్నారు. దానిలో తేనెపూసిన కత్తి లాటి మునిసిపల్ ఛైర్మన్ పాత్రను సృష్టించారు. దాన్ని మొదట ఎస్‌వి రంగారావుగారికి యిద్దామనుకున్నారు కానీ చివరకి గౌరీనాథ శాస్త్రికి యివ్వాలని కెవి నిశ్చయించారు.

ఎందుకంటే కెవికి ఆప్తుడైన గౌరీనాథ శాస్త్రి మావగారు వచ్చి "మా అల్లుడు "గీతాంజలి"(1948) "ఆకాశరాజు" (1951) అని సినిమాలు తీసి ఆస్తి అంతా పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. మీరు సాయం చేయండి" అని అడిగారు. పైగా కెవికి "భక్త పోతన" నాటి కృతజ్ఞత ఉంది. అందుకని యీయనకు వేషం యిచ్చాడు. ఆ పాత్రకు గౌరీనాథ శాస్త్రి జీవం పోశాడని ఆ సినిమా చూసిన ప్రతీవాళ్లూ అనాల్సిందే. అయితే "పెద్దమనుషులు" సినిమా మొదలై రెండు మూడు సెట్లు షూటింగు అయ్యాక యిబ్బంది పెట్టడం మొదలుపెట్టాడు. ఆయనకు తన ఫ్లాప్ సినిమా 'ఆకాశరాజు"కి ఏవైనా రిపేర్లు చేసి మళ్లీ విడుదల చేయించాలని కోరిక పుట్టింది. డబ్బు కోసం విజయా డిస్ట్రిబ్యూటర్ల వద్దకు వెళితే "ఆ చేసే మార్పులేవో కెవి రెడ్డిగారు చేసి, మళ్లీ షూట్ చేస్తానంటేనే డబ్బు పెడతాం" అన్నారు. ఈయన వెళ్లి కెవిని మార్పులు చేయమని అడిగాడు. కెవి అప్పటికే "పెద్దమనుషులు"కు ఎదురైన నిర్మాణపరమైన చిక్కులతో

సతమతమవుతున్నారు. "నా వల్ల కాదండి" అన్నారు. దాంతో గౌరీనాథ శాస్త్రి బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. డైలాగులు సరిగ్గా చెప్పకపోవడం, అదేమంటే మనసు బాగా లేదండి అనడం సాగించాడు. మంచి చేయబోతే చెడు ఎదురైందని గ్రహించినా, ఏమీ చేయలేక కెవి "ఈ షెడ్యూల్ అయిన తర్వాత మీ పిక్చరు మీద పని చేద్దాం" అని మాట యివ్వవలసి వచ్చింది.

ఇక అప్పణ్నుంచి పగలు "పెద్దమనుషులు" షూటింగు, రాత్రి భోజనానంతరం కెవి యింట్లో ""ఆకాశరాజు" సినిమా మార్పులు, చేర్పుల చర్చ. గౌరీనాథ శాస్త్రికి విశ్వనాథ సత్యనారాయణగారు మంచి స్నేహితుడు. ఆయన రాసిన నవల ఆధారంగానే "ఆకాశరాజు" తీశారు. ఆయన్నూ చర్చలకు పిలిచాడు. కెవి గారు తనకు సన్నిహితుడైన నటుడు ముదిగొండ లింగమూర్తిగారిని కూర్చోబెట్టారు. ఒక రోజు ఓ కొత్త సీను అనుకున్నారు. హీరో హీరోయిన్ల మధ్య ఒక శృంగార ఘట్టం. మర్నాడు రాసుకొస్తాను అన్నారు విశ్వనాథ. "మాధవీ! నేను చచ్చిన వెనుక, నా ఆత్మ నీ చుట్టూనే తిరుగుచుండును' అంటాడు హీరో. 'శృంగారం రాయమంటే వాక్యం చావుతో మొదలుపెడతాడేమిటి యీయన' అని అనుకున్న కెవికి ఎలా చెప్పాలో తెలియలేదు. గొప్ప రచయితే కానీ సినిమాలకు పనికి రాడు అనుకున్నారు. ఆ విషయమే మర్నాడు నరసరాజుగారితో చెప్పారు. అలా మరికొన్ని రాత్రులు చర్చలతోనే గడిచాయి. చివరకి విశ్వనాథ వారే పరిస్థితి గ్రహించి 'నా వల్ల కాదయ్యా! మీ ఏడుపు ఏదో మీరే ఏడవండి' అని లేచిపోయారు. ఆ ""ఆకాశరాజు" సినిమా మార్పుల కథ అంతటితో ముగిసింది. (గమనిక – డివి నరసరాజు గారు తన పుస్తకంలో 'ఆకాశరాజు"కి బదులు దానికి మూడేళ్లకు ముందే విడుదలైన "గీతాంజలి" అని రాశారు. 'ఆకాశరాజు" 1951లో రిలీజైంది కాబట్టి దానికి మార్పులు చేసి 1952లో మళ్లీ రిలీజు చేయాలనుకోవడం సహజం. పైగా అది విశ్వనాథగారి నవలే కాబట్టి ఆయన్ని పిలిచి ఉంటారు) – **ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

**2018 మే టాబ్లాయిడ్ కవర్ స్టోరీ** **ఎమ్బీయస్: ఎవరూ సిగ్గు పడరా?**

కర్ణాటక ప్రహసనంలో విదూషక పాత్రకు ప్రతి పార్టీ పోటీపడుతోంది. తమ చేష్టలను ఓటర్లను గమనిస్తున్నారని తెలిసినా పట్టించుకోకుండా, సిగ్గూ శరం అనే వాటిని దగ్గరకు రానీయకుండా రాజకీయం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా సిద్ధాంతాలు వల్లిస్తున్నారు. అక్కడ వస్తోంది చికాకు. తాము ఏం చేసినా ప్రజాస్వామ్యమని, ఎదుటివాళ్లు ఏం చేసినా అప్రజాస్వామ్యమని వారు దబాయించడం చూస్తూంటే 'మన తెలివితేటల మీద వీళ్లకు ఎంత లోకువ!' అని నివ్వెరపోవాల్సి వస్తోంది. హీరోకు ధీరోదాత్తత ఉంటుంది, విలన్‌కు రోషం ఉంటుంది, కానీ జోకర్‌కు అవేమీ ఉండవు. తను చేసే పనే గొప్పదనుకుంటాడు. మననీ అనుకోమంటాడు.

కాంగ్రెసు పార్టీ స్వాతంత్ర్యానికి ముందు నుంచి అధికారం అనుభవిస్తూ వచ్చింది. ప్రతి తరంలోను మంచి నాయకులు, చెడు నాయకులు ఉంటూ వచ్చారు. క్రమేపీ విలువలున్న వారి సంఖ్య తగ్గిపోతూ వచ్చింది. పార్టీ రకరకాలుగా భ్రష్టు పట్టింది. కొందరు పార్టీని విడిచి వెళ్లిపోయారు. చిత్రమైన విషయమేమిటంటే బయటకు వచ్చినవారూ తమ పార్టీల్లో కాంగ్రెసు సంస్కృతినే ప్రవేశపెట్టారు. ఆ విషయం ప్రజలు ఊహించలేకపోయారు. స్వాతంత్ర్యం వచ్చాక 20 ఏళ్ల పాటు నిరాఘంటంగా కాంగ్రెసు ఏలిన తర్వాత దానికి ప్రత్యామ్నాయంగా తోచిన పార్టీలను ఆదరించారు. కానీ వాళ్లూ యిదే రకం అని తేలడంతో త్వరలోనే నిరాకరించారు. కాంగ్రెసు నాయకత్వంలో మార్పులు వచ్చి, తమకు మేలు చేస్తారు అనుకున్నపుడల్లా మళ్లీ కాంగ్రెసుకు అవకాశం యిస్తూ పోయారు. ఇది కాంగ్రెసుకు అహంకారం పెంచింది. తాము ఏం చేసినా చెల్లుతుందనే పొగరుతో యిష్టారాజ్యంగా పాలించింది. ప్రజాభీష్టాన్ని తుంగలోకి తొక్కి, ఎవరేమనుకుంటే నాకేం అన్న రీతిలో ప్రవర్తించింది. ప్రస్తుతం అధోగతిలో ఉంది.

ఈ కథంతా చూసైనా ప్రతిపక్షాలు నేర్చుకోవాలి. ఇప్పటికీ దేశంలో సరాసరిన 25% ఓటర్ల మద్దతు ఉన్న కాంగ్రెసుకే యీ అవస్థ తప్పలేదంటే మనమెంత జాగ్రత్తగా ఉండాలి అనే అవగాహన పెంచుకోవాలి. అబ్బే, వాళ్లూ అదే పోకడలు పోతున్నారు. కాంగ్రెసు 65 ఏళ్లల్లో చేసి చూపించిన దాని కంటె మేం ఐదేళ్లలో ఎక్కువ చేసి చూపిస్తాం అంటూ బిజెపి నినాదమిస్తే ఏమిటో అనుకున్నాం. విలువలను కాలరాయడంలో, వ్యవస్థలను భ్రష్టు పట్టించడంలో కాంగ్రెసు కంటె నాలుగాకులు ఎక్కువ చదివానని బిజెపి చూపించుకుంటోంది. బిజెపిని గుడ్డిగా సమర్థించేవాళ్లకు తప్ప తక్కినవాళ్లకు తాజాగా కర్ణాటక వ్యవహారం బిజెపి బరితెగింపుకి ఒక నిదర్శనంగా కనబడుతోంది. ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వ ఏజన్సీలన్నిటినీ శుభ్రంగా దుర్వినియోగం చేసింది. ఇన్‌కమ్‌టాక్స్ దాడుల విషయంలో, కేసులు తిరగతోడడంలో బిజెపివారికి, తక్కినవారికి వివక్షత చూపింది. గాలి సోదరుల విషయంలో అయితే మరీనూ. గాలి సోదరులు, ఎడియూరప్ప 2013లో బిజెపి ఓటుబ్యాంకుకి గండి కొట్టారు. 2008లో బిజెపి ప్రభుత్వం నిలబడడానికి కారణం వారి డబ్బుతో జరిగిన ఫిరాయింపులే. 2018లోనూ ఆ అవసరం పడుతుందని తెలుసు కాబట్టి రెండేళ్ల క్రితం నుంచే గాలి సోదరులను రక్షించే పని మీదే ఉంది.

రూ.35 వేల కోట్ల విలువైన మైనింగ్ కుంభకోణంలో కేసులు మూసివేసేందుకు సిబిఐ రెండేళ్ల క్రితమే ఉద్యమించింది. గోవా రేవుల ద్వారా అక్రమ యినుప ఖనిజాన్ని ఎగుమతి చేశారని అనడానికి ఎలాంటి ప్రాథమిక సాక్ష్యాధారాలు లభించలేదని కర్ణాటక పరిశ్రమల, వాణిజ్య (మైనింగు) శాఖకు 2016 డిసెంబరులో లేఖ రాసింది. 12.57 కోట్ల మెట్రిక్ టన్నుల మేరకు అక్రమ ఎగుమతులు జరిగాయని లోకాయుక్త సాక్ష్యాధారాలతో సహా అభియోగాలు మోపాక సిబిఐ యిలా అనడం విడ్డూరం కాదా! కర్ణాటక నుంచి వచ్చిన ఖనిజాన్ని గోవాలోని యినుప ఖనిజంతో కలిపి గోవా పోర్టు నుంచి చాలామంది ఎగుమతి చేశారట. ఎవరెంత చేశారో తెలియటం లేదని, ఎగుమతిదారులనే అడిగితే డాక్యుమెంట్లు యివ్వటం లేదని, చట్టప్రకారం ఎగుమతిదారు తన వద్ద డాక్యుమెంట్లు ఉంచుకోనవసరం లేదు కాబట్టి వాళ్లపై చర్యలు తీసుకోలేమని, అందువలన దర్యాప్తు ఆపేస్తున్నామని 2017 జూన్‌లో సిబిఐ గోవా

విభాగం అధిపతి మరో లేఖ రాశాడు. ఎగుమతి, దిగుమతుల విషయంలో ఎవరేం పంపించారో లెక్క లేదంటే నమ్మగలమా? ఇదంతా గాలి సోదరులను, యితర అక్రమ మైనింగు దారులను కాపాడడానికి కాదా? వీళ్లే కాదు, ఎడియూరప్పకు సంబంధించి అక్రమ మైనింగులపై ఉన్న రెండు కేసులను కూడా సిబిఐ కోర్టు తోసిపుచ్చింది. మరి బళ్లారి, పొరుగు జిల్లాలలోని యితర పార్టీ ఎమ్మెల్యేలను లాక్కు రావడంలో గాలి సోదరులు శ్రమిస్తున్నారంటే, వూరికే శ్రమిస్తున్నారా?

ఎన్నో గిమ్మిక్కులు చేసి, బిజెపి 104 సీట్లు తెచ్చుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు అది చాలదు. 8 సీట్లు తక్కువ పడ్డాయి. 2014 పార్లమెంటు ఎన్నికలో బిజెపి 41.6% ఓట్లతో 19 స్థానాలలో (132 అసెంబ్లీ సెగ్మెంట్లలో) గెలిచింది. 2018 వచ్చేసరికి అది 36.2% ఓట్లు, 104 సీట్లు (2టిలో ఎన్నిక జరగలేదు) అయ్యాయి. ప్రజలు తమ పక్షాన ఉన్నారు కానీ చాలినంత బలం యివ్వలేదు అని బిజెపి అని ఊరుకోలేదు. పరస్పర ప్రత్యర్థులైన కాంగ్రెసు, జెడిఎస్ కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తే అది అంత:కలహాలతో ఆర్నెల్లలోనే పడిపోతుందని, పెద్ద పార్టీగా ఎన్నికయినా అధికారం కోసం అడ్డదారులు తొక్కలేదన్న సానుభూతి 2019 ఎన్నికలలో ఉపకరిస్తుందని అనుకోలేదు. ఎలాగైనా అధికారంలోకి రావాలి అంతే, అదొక్కటే ఆలోచన. ఇప్పుడు మెజారిటీ నిరూపించుకోవడానికి ఒకటే మార్గం – ఫిరాయింపులు ప్రోత్సహించడం, ప్రలోభాలతో, బెదిరింపులతో ఎదుటి పార్టీలను చీల్చి లోపాయికారీ మద్దతు తీసుకోవడం, వచ్చినవారి హిరణ్యాక్ష వరాలు తీర్చడానికి అవినీతికి పాల్పడడం, కొత్తవారికి, పాతవారికి జరిగే నిరంతర కలహాలను తీరుస్తూ పాలన నిర్లక్ష్యం చేయడం. బలమైన ప్రతిపక్షంగా ఉండి పేరు తెచ్చుకోవడం కంటె, 2019లో అధికసంఖ్యలో పార్లమెంటు సీట్లు తెచ్చుకోవడం కంటె యీ మార్గాన్నే బిజెపి ఎంచుకుంది.

ఒకసారి ఎంచుకున్న తర్వాత అన్ని సంప్రదాయాలను పక్కన పెట్టింది. ఎవరికీ స్పష్టమైన మెజారిటీ రాకపోతే గవర్నరు ఎక్కువ సీట్లు తెచ్చుకున్న పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం యివ్వాలి. ఎప్పుడు? స్వతంత్రులు, చిన్న పార్టీలు ఉండి, అవి యీ పార్టీకి మద్దతు యిస్తాయనే నమ్మకాన్ని ఆ పార్టీ తనకి కలిగించినప్పుడు! ఇక్కడ స్వతంత్రులు యిద్దరే. చిన్న పార్టీలు లేనే లేవు. జెడిఎస్ తను కాంగ్రెసు పక్షమని రాతపూర్వకంగా రాసి యిచ్చింది. ఇక మెజారిటీ ఎక్కణ్నుంచి వస్తుంది? ఫిరాయింపుల ద్వారానే వస్తుంది. అది హర్షణీయం కాదు కాబట్టి రెండవ ప్రత్యామ్నాయమైన ఫలితాల అనంతరం ఏర్పడిన కూటమికి అవకాశం యివ్వాలి. దాని బలమూ అరకొరగా ఉంటే ఆలోచించవచ్చు. కానీ ఆ కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉంది. ప్రభుత్వ ఏర్పాటుకు అది ముందుకు వచ్చింది. ఈ లాజిక్‌ను గోవాలో, మణిపూర్‌లో బిజెపి వినిపించింది. కాంగ్రెసు అతి పెద్ద పార్టీగా అవతరించినా అక్కడి గవర్నర్ల చేత దానికి అవకాశం లేకుండా చేసింది. కర్ణాటకకు వచ్చేసరికి రూల్సు మార్చేసింది. గవర్నరును కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా చేయడం కాంగ్రెసు హయాంలోనే మొదలైంది. తర్వాత వచ్చిన పార్టీలన్నీ అదే ధోరణిలో వెళ్లాయి. నీతులు, విలువలు వల్లించిన బిజెపి అధికారంలోకి వస్తూనే గవర్నర్లను మార్చేయడంతో ఓహో, యిదీ ఆ తానులో ముక్కే అనిపించుకుంది.

కర్ణాటకలో మోదీ ఒకప్పటి సహచరుడు అక్కరకు వచ్చాడు. సరే, బిజెపికి ఎలాగూ ఛాన్సిస్తాడని తెలుసు, కానీ చేసేదేదో కాస్త సుతారంగా, పెద్దమనిషి తరహాగా చేయవచ్చు కదా. అతి మోటుగా చేశాడు. మే 17 న సుముహూర్తంలో ప్రమాణస్వీకారం చేస్తానని ఎడియూరప్ప గతంలోనే ప్రకటించాడు కాబట్టి అతని మాట నిలబెట్టడానికి జస్ట్ 12 గంటలకు ముందు గవర్నరు ఆహ్వానించడం, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాగారు అర్ధరాత్రి కూర్చుని సరేనంటూ తెల్లారేసరికల్లా తీర్పు వెలువరించడం! అతి ముఖ్యమైన కేసులు ఎన్నో పెండింగులో ఉంటే జడ్జిలు నెలల తరబడి వేసవి సెలవులు తీసుకుంటారు. ఇప్పుడు వచ్చిన ఎమర్జన్సీ ఏమిటి? రాష్ట్రంలో ఏదో ఒక ప్రభుత్వం అంటూ ఉందిగా. సిబ్బంది జీతభత్యాలు ఆగిపోలేదుగా. బల నిరూపణకు ఎడియూరప్ప వారం అడిగితే రెండు వారాలు తీస్కో అన్నాడు గవర్నరు. సాధారణంగా వారం, పదిరోజులు యిస్తారు. గోవాలో అయితే నాలుగు రోజులే యిచ్చారు. ఇక్కడ ఏకంగా పదిహేను రోజులు, అదీ ఎడియూరప్ప తన బలం ఎంతో అంకె చెప్పకపోయినా! మామూలుగా కేంద్రానికి వంత పాడుతూ వచ్చే సుప్రీం కోర్టు దీని దగ్గరకి వచ్చేసరికి మొహమాట పడింది. 19 సాయంత్రాని కల్లా బలం నిరూపించుకోమంది. ఎడియూరప్ప చేయించిన ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యే నియామకాన్ని ఒప్పుకోలేదు. సీక్రెట్ బ్యాలెట్‌కు ఒప్పుకోలేదు. దీపక్ మిశ్రా బెంచ్‌పై లేడు కాబట్టే తీర్పు యిలా వచ్చింది. నో ప్రాబ్లెమ్ అంటున్నాడు ఎడియూరప్ప. 120 మంది ఉన్నారు నా దగ్గర అన్నాడు. అంటే 16 మంది డిఫెక్టర్లను మోపు చేశానని చెప్పుకోవడమన్నమాట! అధికారం చేపడుతూనే ఎడ్వకేట్ జనరల్‌ను మార్చాడు. పోలీసు వ్యవస్థను చేతిలోకి తీసుకున్నాడు. ఉన్నత స్థానాల్లో ఎడాపెడా బదిలీలు చేశాడు – తన వాళ్లు జారిపోకుండా చూసుకోవడానికి, ఎదురు ఎమ్మెల్యేలను బెదిరించడానికి, ప్రతిపక్ష శిబిరాలను భగ్నం చేయడానికి! ఎమ్మెల్యేలకు పోలీసు రక్షణ తొలగించాడు. కాంగ్రెసు శిబిరం నడుస్తున్న రిసార్టుకు సెక్యూరిటీ తీసేశాడు. స్థానిక ఎస్పీని మార్చేశాడు. ఇక ఆ ఎమ్మెల్యేలను ఎవరైనా ఎత్తుకు పోవచ్చునన్నమాట. సుప్రీం కోర్టు కీలక నిర్ణయాలు తీసుకోవద్దంది. మరి యివన్నీ కీలకమైనవి కావా? పదవిలోకి వచ్చిన గంటల్లోనే యిన్ని మార్పులు చేయాలా?

ఎందుకీ మొరటుతనం అంటే 'మేం తలచుకుంటే ఏమైనా నిస్సిగ్గుగా, అన్ని పద్ధతులు తోసిరాజని చేయగలం. మాకు అడ్డు లేదు, అదుపు చేసేవారు లేరు. మాతో వైరం పెట్టుకున్నారో, మేం చెప్పినట్లు వినలేదో, మీ పని ఆఖరు' అని ప్రత్యర్థులకు చాటిచెప్పడం! ఫిరాయిద్దామా వద్దా అని ఊగిసలాడే ఎమ్మెల్యేలకు తమ తడాఖా చూపి, అదలగొట్టడం! కాంగ్రెసు ఎమ్మెల్యేలు విమానాల్లో కొచ్చిన్‌కు వెళదామనుకుంటే ఎయిర్‌పోర్టు అథారిటీ అనుమతి యివ్వలేదు. పోనుపోను అందర్నీ తన చేతిలోకి లాక్కుంటారు. ఇప్పటికే కొందరు కాంగ్రెసు ఎమ్మెల్యేలను కంచె దూకించారు. జెడిఎస్‌లో రేవణ్ణను దువ్వుతున్నారు. కాంగ్రెసులోని శివకుమార్‌ను కూడా లైన్లో పెడతారు. బాహాటంగా పార్టీ మారనక్కరలేదు, ఓటింగు సమయంలో మాకు ఓట్లేయండి చాలు అంటారు. క్రాస్ ఓటింగు చేశారు కాబట్టి వాళ్లని అనర్హులుగా ప్రకటించండి అని ఆ పార్టీల వాళ్లు ఉత్తరాలిస్తే స్పీకరు గారు వాటిని అటక మీద పడేస్తాడు. రికార్డు ప్రకారం వాళ్లు

ప్రతిపక్షం, ఆచరణలో అధికారపక్షం. మంత్రులు కూడా అయిపోతారు. కోర్టుకి వెళితే స్పీకరుదే సర్వాధికారం అంటారు. ఈ నాటకం తెలుగు వెర్షన్ ఎప్పుడో చూసేశాం. కన్నడ రీమేక్ చూడబోతాం.

ప్రస్తుతం బిజెపి ఏం చేసినా చెల్లుతోంది. చెల్లుతోంది కదాని అది అది చెలరేగుతోంది. ఇదీ కొన్నాళ్ల ముచ్చటే. ఆ తర్వాత కష్టకాలం దాపురిస్తుంది. అప్పుడు అన్నీ ఎదురు తిరుగుతాయి. 1977 జనతా ప్రభుత్వం నాటి నుంచి చక్రం తిప్పిన బిజెపి (అప్పటి జనసంఘ్) తర్వాతి కాలంలో 2 సీట్లకు పడిపోలేదా? అప్పుడు కూడా వాళ్లకు యిదే ఆర్గనైజేషన్, ఆరెస్సెస్ మద్దతు, బూత్ మేనేజ్‌మెంట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండేవి. అయినా అథ:పాతాళంలో పడ్డారు, మళ్లీ లేచారు. రేపు ఎలా ఉంటుందో అనే భయం వున్నపుడు యింత బరితెగించకూడదు. కానీ తెగిస్తున్నారు. కాంగ్రెసు చేసిందని వీళ్లు, మాకంటె ఎక్కువ చేసిందని వాళ్లు, ఇంతకింత చేస్తామని మళ్లీ వీళ్లు.. యిలా పోటీలు పడి పాతాళానికి వేగంగా జారిపోతున్నారు. బిజెపి వాళ్లు కాంగ్రెసువాళ్లకు జవాబుదారీ కాదు, కానీ ప్రజలకు జవాబుదారీ. బిజెపిని ప్రశ్నించే నైతికపరమైన హక్కు కాంగ్రెసుకి లేదు, ప్రజలకు ఉంది. 'వారి కంటె మెరుగనుకున్నాం. మిమ్మల్ని తెచ్చుకున్నాం. మీరూ ఇంతేనా? ఇదేమిటంటే అడిగితే కాంగ్రెసు వాళ్లు చేయలేదా అంటారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ వద్ద కూడా యిలా వాదిస్తే ఊరుకుంటాడా? వాడి సంగతి తర్వాత చూస్తాను, ముందు నీ సంగతి తేలుస్తానంటాడు. మీరు నకలు కాంగ్రెసుగా మారడంతో ఆగకుండా పైగా నీతిప్రబోధాలు ఒకటి!' అనేసిన రోజున బిజెపి పతనం వేగవంతం అవుతుంది.

ఇక కాంగ్రెసు గురించి – వాళ్లు ప్రజాస్వామ్యం గురించి, సంప్రదాయాల గురించి మాట్లాడుతూంటే వినడానికి రోత పుడుతుంది. గవర్నరు వ్యవస్థను ఆడుకోవడంలో కానీ, రాష్ట్రపతి పాలన విధించడంలో కానీ వాళ్లు పాల్పడినన్ని ఉల్లంఘనలు వేరెవరూ పాల్పడలేరు. అవన్నీ ప్రస్తావిస్తే ఒక ఉద్గ్రంథం తయారవుతుంది. 1980లో ఇందిరా కాంగ్రెసు నెగ్గగానే భజనలాల్ హరియాణాలో తన కాబినెట్ మొత్తంతో సహా ఆ పార్టీలోకి ఫిరాయించేశాడు. అలాటి సిగ్గుమాలిన పనులు ప్రోత్సహించిన కాంగ్రెసు యిప్పుడు బిజెపిని ఏ మొహం పెట్టుకుని ఫిరాయింపుల గురించి నిలదీస్తుంది? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తీర్మానాన్ని లెక్కలోకి తీసుకోకుండా, శ్రీకృష్ణ కమిషన్‌ను పక్కన పడేసి, తలుపులు మూసేసి, కెమెరాలు కట్టేసి, గూండాగిరీతో బిల్లు పాస్ చేసి తెలుగు ప్రజలను విడగొట్టిన తీరు చూశాక కాంగ్రెసుకు ప్రజాస్వామ్యమంటే గౌరవముందంటే ఎవరు నమ్ముతారు? ఇక పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యమా? ఇప్పటికి కూడా ఎమ్మెల్యేలందరూ కలిసి ఒక తీర్మానం చేస్తారు – ముఖ్యమంత్రి ఎవరవుతారనేది అధిష్టానం నిర్ణయానికి వదిలేశాము అని. సీల్డు కవరులో పేరు వస్తుంది. బిజెపి పాలనతో అసంతృప్తిగా ఉన్న ఓటర్లకు ప్రత్యామ్నాయం చూపించలేని అసమర్థ నాయకత్వం సోనియాది. స్థానిక నాయకత్వం బలంగా ఉన్నా, రాహుల్ అధినేతగా ఉండగా ఆ పార్టీకి పుట్టగతులుండవనేది తాజాగా కర్ణాటకలోని రాజకీయ నిర్ణయాలతో తేటతెల్లమైంది.

తమ కంటె బిజెపికి 26 సీట్లు ఎక్కువ వచ్చాయని గ్రహించాక, అత్యధిక సీట్లు వచ్చిన పార్టీని గవర్నరు తొలుతగా పిలవాలని గోవా, మణిపూర్‌లలో వాదించిన కాంగ్రెసు యిక్కడ బిజెపికి అవకాశం యిచ్చి హుందాగా తప్పుకోవలసినది. అధికారం కోసం వెంపర్లాడలేదన్న సానుభూతి కలిగి, 2019లో పనికి వచ్చేది. బిజెపి, జెడిఎస్‌లు ఎన్నికలకు ముందు లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని తమను ఓడించాలనుకుంటున్నాయని కాంగ్రెసు ఆరోపించింది. ఫలితాలలో కూడా అది స్పష్టమైంది కూడా. మరి తమను ఓడించడానికి కుట్ర పన్నిన అలాటి జెడిఎస్ ముందు కాంగ్రెసు సాగిలబడడం దేనికి? మేం బయటినుంచే మద్దతు యిస్తాం, మాకే పోస్టులు అక్కరలేదు అని ప్రాధేయపడడం దేనికి? అంతకు ముందుదాకా మోదీని కర్ణాటకలో నిలవరించగల మొనగాడిగా నిలబెట్టిన సిద్ధరామయ్యను హఠాత్తుగా కిందపడేయడం దేనికి? మీరు కూడా ప్రభుత్వంలో చేరాలి అని దేవెగౌడ షరతు విధించేసరికి సిద్ధరామయ్యను బలి యిచ్చేసి పరమేశ్వరను ఉపముఖ్యమంత్రిగా ముందుకు తోశారు. అంతకంటె సిద్ధరామయ్యను సమర్థుడైన ప్రతిపక్ష నాయకుడిగా నిలబెట్టి, 2019లో లబ్ధి పొందవచ్చు. నిజానికి కాంగ్రెసుకు బిజెపి కంటె 1.8% ఎక్కువగా 38.0% ఓట్లు వచ్చాయంటే దానికి సిద్ధరామయ్య పాలనే కారణం. ముఖ్యమంత్రిగా తక్కిన యిద్దరు అభ్యర్థుల కంటె సిద్ధరామయ్యకు ఆమోదం ఉందని సర్వేలలో కూడా తేలింది. అలాటతన్ని పక్కన పడేసి, ముఖ్యమంత్రిగా అతి తక్కువ ఆమోదం (సిద్ధరామయ్య పాప్యులారిటీలో సగం), ఓట్లు, సీట్ల పరంగా సగం కంటె తక్కువ తెచ్చుకున్న కుమారస్వామిని ముఖ్యమంత్రిని చేస్తామంటూ బయలుదేరితో కర్ణాటక ఓటరు హర్షిస్తాడా? అతనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుని ఉంటే వాళ్ల పార్టీకే ఓట్లేసేవారుగా! అది కుటుంబపార్టీ, ఒక్కళిగలకు మాత్రమే పరిమితమైన పార్టీ అని నిన్నటిదాకా ప్రచారం చేసి, యివాళ అనారోగ్యపీడితుడైన కుమారస్వామే ముఖ్యమంత్రి అనడం ఎంత ఎబ్బెట్టుగా ఉంది!

అయినా జెడిఎస్ బలంగా ఉన్న పాత మైసూరు ప్రాంత కాంగ్రెసు ఎమ్మెల్యేలు దీన్ని ఆమోదిస్తారా? తమను ఓడించి గెలిచిన ఆ ఎమ్మెల్యేలను జెడిఎస్ వాళ్లను నమిలి మింగేయదా? వాళ్ల మాట చెల్లనిస్తుందా? మమతా బెనర్జీ చెప్పినట్లు, కాంగ్రెసు ఎన్నికలకు ముందే జెడిఎస్‌తో పొత్తు పెట్టుకుని ఉంటే కథ యింకోలా ఉండేది. ఇప్పుడు తోకలాటి పార్టీకి కుచ్చుగా ఉంటానంటే పరువు ఏమైంది? ఈ నిర్ణయం నచ్చని ఎమ్మెల్యేలు పార్టీకి దూరమైతే..? పార్టీని చీలిస్తే..? దీని ప్రభావం యితర రాష్ట్రాలపై పడదా? ఒక ప్రాంతీయపార్టీకి యింత యిదిగా ఒంగి సలాంలు చేస్తోందంటే అది బిజెపి వ్యతిరేక కూటమికి కేంద్రబిందువు ఎలా అవుతుంది? పోనీ వ్రతం చెడినా ఫలం దక్కుతుందా? ఆ గ్యారంటీ కూడా లేదు. కుమారస్వామి నమ్మదగ్గ భాగస్వామి ఎంత మాత్రం కాదు. గతంలో జెల్లకాయ కొట్టాడు. ఇవేమీ ఆలోచించకుండా 'పిపిపి' ట్యాగ్ తప్పించుకోవడానికి చేసిన తొందరపాటు చేష్ట యిది. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆందోళన, గోవా, మణిపూర్‌లలో కాంగ్రెసు నాయకులు హఠాత్తుగా నిద్ర మేల్కొని గవర్నరు తలుపు తట్టడం, యివన్నీ హాస్యాస్పదంగా లేవూ! ఇంత దివాళాకోరు ప్రణాళికలతో కాంగ్రెసు 2019 నాటికి ప్రత్యామ్నాయంగా కాదు కదా, ప్రతిపక్షకేంద్రంగా కూడా ఎదగడం కల్ల.

ఇక జెడిఎస్. ఐదేళ్లూ నిద్రపోయి ఎన్నికల సమయంలో మాత్రమే నిద్ర లేచే పార్టీ. ఏ సిద్ధాంతమూ లేదు. మాట నిలకడ లేదు. వాళ్లూ సిద్ధాంతాల గురించి మాట్లాడితే ఎలా? దేశంలోని ప్రాంతీయ పార్టీలన్నీ కూడబలుక్కుని అతన్ని ముఖ్యమంత్రి చేయాలట. విడ్డూరంగా లేదూ? వాళ్ల వ్యవహారాల్లో నువ్వు యిప్పటిదాకా ఏమైనా సాయం చేశావా? కనీసం మాటసాయం...? అవి కాంగ్రెసు, బిజెపిలకు సమానదూరం పాటిస్తానంటూ ఉంటే నువ్వు కాంగ్రెసుతో కలిసి ఊరేగుతూ వాళ్ల సాయం కోరడమేమిటి? కర్ణాటకలో బిజెపి ప్రజాస్వామికంగా వ్యవహరించలేదని టిడిపి, టిఆర్ఎస్ అన్నా నవ్వు వస్తుంది. ఫిరాయింపుదారుల విషయంలో, ప్రతిపక్ష సభ్యుల విషయంలో, మీడియా స్వేచ్ఛ విషయంలో వీళ్లు ఏ ప్రజాస్వామ్యం పాటిస్తున్నారు? స్పీకరు వ్యవస్థను యిష్టానికి వాడుకోవడం లేదా? గవర్నరు వ్యవస్థ తమ చేతిలో ఉంటే దాన్నీ ఎడాపెడా వాడేసి ఉండేవారు. నిజానికి యిప్పుడు టీవీ చర్చల్లో గవర్నరు, స్పీకరు వ్యవస్థల దుర్వినియోగం గురించి అన్ని పార్టీల వాళ్లూ ప్రసంగించేస్తూ ఉంటే వినడానికి దుస్సహంగా ఉంది. వీళ్లందరూ ఏదో ఒక సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్నవారే! వ్యవస్థలో లోపాల్ని సరిదిద్దడానికి వీళ్లెవరూ ఎందుకు సమకట్టలేదు? అధికారంలో వుండగా దుర్వినియోగం చేయడం, ప్రతిపక్షంలో ఉండగా గావుకేకలు పెట్టడం! రేపు వీళ్లు గద్దె నెక్కినా పరిస్థితి చక్కదిద్దరు, తమ అవసరానికి వాడుకుంటారు. అందుకే అనుమానం వస్తుంది – వీళ్లెవరికీ సిగ్గు అనే మాటకు వర్ణక్రమం తెలియదా? అని! – **ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

**2018 మే టాబ్లాయిడ్ కవర్ స్టోరీ** **ఎమ్బీయస్: దాచబోయినా ప్రమాదమే...**

ట్రంప్ స్వయంగా ధనవంతుడు కాబట్టి ఎన్నికల నిధులకై కంపెనీ విరాళాలపై ఆధారపడడని, వారికి అనుకూలంగా నియమాలు వంచడని ఆశించడం జరిగింది. కానీ అతనూ అలాటివాడే అని, తన లాయరు ద్వారా నిధులు సేకరిస్తూ అవినీతికి పాల్పడుతున్నాడనీ అనుమానం వచ్చింది. ఈ విషయం బయటపడడం కూడా నాటకీయంగానే జరిగింది. ట్రంప్ 2006లో 27 ఏళ్ల స్టార్మీ డేనియల్స్ అనే పోర్న్ స్టార్ (అసలు పేరు స్టిఫెనీ క్లిఫోర్డ్)పై మోజు పడ్డాడు. తగిన రుసుము చెల్లించి మోజు తీర్చుకున్నాడు కూడా. ట్రంప్ అధ్యక్షపదవికి పోటీ చేసినపుడు ఆ విషయాన్ని బయటపెడతానని స్టార్మీ బ్లాక్‌మెయిల్ చేసింది. అప్పటికే ట్రంప్‌పై కొందరు ఆరోపణలు చేశారు. ఈమె కూడా చేరితే కష్టమనుకుని 2016 అక్టోబరులో ట్రంప్ తన లాయరు మైకేల్ కోహెన్ ద్వారా 1,30,000 డాలర్లు డబ్బు పంపించి ఆ విషయాన్ని బయట పెట్టకూడదని (నాన్–డిస్‌క్లోజర్) అగ్రిమెంటు రాయించుకున్నాడు. నిజాన్ని కప్పిపెట్టేశాం, యిక నిర్భయంగా ఉండవచ్చు అనుకున్నాడు. కానీ స్టార్మీ 15 నెలల తర్వాత తమ వ్యవహారాన్ని పత్రికలకు లీక్ చేసింది.

2018 జనవరిలో వాల్‌స్ట్రీట్ జర్నల్ దీనిపై కథనం వేసింది. ట్రంప్ తన లాయరు కోహెన్‌కు సంబంధించిన ఎస్సెన్షియల్ కన్సల్టంట్స్ ఎల్ఎల్‌సి ద్వారా స్టార్మీకి డబ్బు చెల్లించాడని బయటపెట్టింది. దానిపై కోహెన్ స్టార్మీకి తన జేబులోంచి చెల్లించానని, ట్రంప్ సంస్థల నుంచి కాని, ట్రంప్ ప్రచారానికి అతని అభిమానులు యిచ్చిన విరాళాల నుంచి దాన్ని తీసుకోలేదని ప్రకటించాడు. స్టార్మీ వ్యవహారం గురించి తనకేమీ తెలియదని ట్రంప్ బుకాయించాడు. అయితే మార్చి 25న స్టార్మీ ఒక టీవీ ఇంటర్వ్యూలో తను 2006లో ట్రంప్‌తో శయనించానని, ఆ విషయం బయటపెడితే జాగ్రత్త అని తర్వాతి రోజుల్లో బెదిరించారని, ఒప్పందంపై సంతకం పెట్టేలా ఒత్తిడి చేశారని చెప్పింది. అంతకు 19 రోజుల ముందు మార్చి 6న ట్రంప్‌పై కేసు పడేసింది – అగ్రిమెంటుపై ట్రంప్ సంతకం పెట్టలేదు కాబట్టి ఒప్పందం చెల్లదని, కానీ అతని లాయరు కోహెన్ తనను నోరు విప్పవద్దని బెదిరిస్తున్నాడనీ! పరిస్థితి యిక్కడిదాకా వచ్చాక యిక తప్పక ట్రంప్ 2018 ఏప్రిల్‌లో తను చెప్పడం బట్టే కోహెన్ స్టార్మీకి డబ్బిచ్చాడని ఒప్పుకోవలసి వచ్చింది.

ఈ స్టార్మీ ధర్మమాని కోహెన్ తాలూకు ఎస్సెన్షియల్ కన్సల్టంట్స్ లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. ఎఫ్‌బిఐ వారు ఏప్రిల్ 9 న అతని ఆఫీసుపై దాడి చేసి, రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నారు. స్టార్మీకి ప్రస్తుతం లాయరుగా పనిచేస్తున్న మైకేల్ ఎవెనాట్టీ మే8న ఒక ట్వీట్ చేసి అందర్నీ ఉలిక్కిపడేలా చేశాడు. 2016 అక్టోబరు నుంచి 2018 జనవరి వరకు కోహెన్ కంపెనీలోకి వచ్చిన, వెళ్లిన 44 లక్షల డాలర్ల విలువైన లావాదేవీల జాబితా తన దగ్గర ఉందని. ట్రంప్ నిర్ణయాల వలన ప్రభావితమయ్యే కంపెనీల నుంచి ఆ ఖాతాలోకి డబ్బులు వచ్చాయని ప్రకటించాడు. ఉదాహరణకు కొన్నిటి గురించి – ఎటి అండ్ టి సంస్థ టైమ్ వార్నర్ సంస్థతో కలుద్దామని జస్టిస్ డిపార్టుమెంటు ముందు ఒక ప్రతిపాదన పెట్టింది. తనకు అనుకూలంగా నిర్ణయం వచ్చేందుకు దఫదఫాలుగా 2 లక్షల డాలర్లు ఎస్సెన్షియల్ ఖాతాలో వేసింది. దాన్ని బయటపెడుతూ ఎవెనాట్టీ ట్వీట్ రాగానే 'అవును, డబ్బులు పంపాం నిజమే. ఎందుకంటే కొత్త ఎడ్మినిస్ట్రేషన్‌ను అర్థం చేసుకోవడానికి మాకు సమాచారం అందివ్వడానికి మేం వాళ్లను కన్సల్టెంట్లగా పెట్టుకున్నాం.' అని చెప్పుకుంది. అమెరికన్ ఎయిర్‌ఫోర్స్‌కు ట్రైనర్ జెట్స్ సప్లయి చేయడానికి అమెరికన్ డిఫెన్స్ కాంట్రాక్టర్ లాక్‌హీడ్ మార్టిన్‌తో బాటు కొరియా ఎయిర్‌స్పేస్ అనే కొరియన్ కంపెనీ పోటీ పడుతోంది. ఈ మల్టీ బిలియన్ డాలర్ల బేరం తమకు అనుకూలంగా ఉండేటందుకు 2017 నవంబరులో 1.5 లక్షల డాలర్లు ఎస్సెన్షియల్ ఖాతాలో వేసింది. ట్వీట్ బయటకు వచ్చాక వాళ్లూ యీ సంగతి ఒప్పుకున్నారు.

నోవార్టిస్ అనే స్విస్ ఫార్మా కంపెనీ తన ఉత్పాదనలను అమెరికాలో అమ్ముకోవడానికి అమెరికన్ డాక్టర్లకు లంచాలిచ్చింది. దానిపై అమెరికన్ ప్రభుత్వం నోవార్టిస్‌పై కేసు పెట్టింది. ఆ విచారణ సందర్భంగా అమెరికన్ కోర్టు దానికి సంబంధించిన రికార్డులన్నీ తమకు యిమ్మనమని కంపెనీని 2017 మార్చిలో అడిగింది. ఇటువంటిది జరుగుతుందని ముందే పసిగట్టిన నోవార్టిస్ సిఇఓ జో జిమెనెజ్ ట్రంప్‌ను 2017 జనవరిలో కలిశాడు. ఆ పై నెల నుంచి నెలనెలా లక్ష డాలర్ల చొప్పున ఏడాది పాటు ఎస్సెన్షియల్ ఖాతాలో

వేసింది. అదేమంటే 'అమెరికన్ హెల్త్‌కేర్ పాలసీ వ్యవహారాలపై మాకు సేవలందిస్తున్నందుకు...' అని చెప్పింది. అలా ఏడాది పాటు పంపింది. ఈ ట్వీట్ తర్వాత 'మేం చెల్లించిన మాట నిజమే కానీ మేం కోరిన సర్వీసులను కోహెన్, ఆ కంపెనీ అందివ్వలేకపోయాయి.' అని చెప్పిందా కంపెనీ. సేవలందించే సత్తా ఎస్సెన్షియల్ కంపెనీకి ఉందా అన్నదే పెద్ద సందేహం. ఎందుకంటే లక్షలాది డాలర్లు వచ్చివెళుతున్నాయి కానీ దానికి ఒక వెబ్‌సైట్ లేదు, ఓ బోర్డు ఆఫ్ డైరక్టర్స్ లేదు, ఉద్యోగులు లేరు.

పెద్దపెద్ద కార్పోరేట్ కంపెనీలు వాషింగ్టన్‌లో ఉండే కన్సల్టెన్సీ కంపెనీల సేవలు ఉపయోగించుకుని ప్రభుత్వ నిర్ణయాలను తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూడడం అమెరికాలో సహజం. దానిలో చట్టవిరుద్ధమైనదేదీ లేదు. ఫార్చ్యూన్ 500 కంపెనీలు కోట్లాది డాలర్ల వీటికై ఖర్చు పెడతాయి. ట్రంప్‌కి తెలియకుండా కోహెన్ డబ్బు తీసుకుంటున్నాడా? లేక ట్రంప్ డబ్బు తీసుకోవడానికి కోహెన్ పేర ఒక షెల్ కంపెనీ పెట్టాడా? అన్నది విచారణలో బయటపడాలి. ఈ వ్యవహారంలో రష్యా కోణం కూడా బయటకు వచ్చింది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు సన్నిహితుడైన విక్టర్ వెక్సెల్‌బర్గ్ అనే అల్యూమినియం వ్యాపారి ఉన్నాడు. అతనికి సంబంధించిన రెనోవా గ్రూపు, న్యూయార్క్‌లో ఉన్న కొలంబస్ నోవా అనే యిన్వెస్ట్‌మెంటు ద్వారా పెట్టుబడులు పెడుతూ ఉంటుంది. కొలంబస్ నోవా నుంచి ఎస్సెన్షియల్స్‌కు 5 లక్షల డాలర్లు నిధులు వచ్చాయి. 2016 నాటి తమ దేశపు ఎన్నికలలో రష్యా తరఫున జోక్యం చేసుకున్నారని విక్టర్, అతని రెనోవా గ్రూపులపై అమెరికన్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. వాటిని ఎత్తివేయించుకోవడానికే యీ లంచమా? అని యీ వ్యవహారాలపై విచారణ జరిపిన రాబర్ట్ మ్యూలెర్ అడిగాడు. ఎవెనాట్టీ చేసిన ట్వీట్‌కు కొలంబస్ నోవా స్పందిస్తూ తాము పంపిన డబ్బుకు, విక్టర్‌కు సంబంధం లేదు అని ప్రకటించింది. నమ్ముదామా? **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**
**(ఫోటో కోహెన్, స్టార్మీ, మధ్యలో ట్రంప్)**

## 2018 మే 26 టాబ్లాయిడ్ మెమరీ నెమరేస్తే... శీర్షికకై ఎమ్బీయస్: కాపీ కొట్టి నిరపరాధి అంటే ఎలా..?

విదేశీ సినిమాలనుంచి కథాంశాలను ఎత్తుకుని రావడం మన భారతీయులకు ఎప్పణ్నుంచో అలవాటు. మొదట్లో అవతలివాళ్లకు తెలిసేది కాదు. ఇప్పుడు ఇంటర్నెట్ సౌకర్యం వచ్చాక సులభంగా తెలిసిపోతోంది. అందుకే "అజ్ఞాతవాసి" సినిమా 'నా 2008 నాటి సినిమా 'ద హెయిర్ అపారెంట్ – లార్గో వించ్' సినిమాపై ఆధారపడినది' అని ఫ్రెంచ్ డైరక్టరు జెరోమ్ సాల్ ఆరోపించగలిగాడు. సినిమా రిలీజుకు అది అవరోధంగా మారడంతో నిర్మాత, దర్శకుడు రాజీ చేసుకోవడానికి నానా తంటాలూ పడవలసి వచ్చింది. అలాగే మనం ఆకాశానికి ఎత్తేసిన అమిత్ మాసూర్కర్ "న్యూటన్" సినిమాను విదేశాలకు పంపినప్పుడు దానికీ 2001 నాటి ఇరానీ సినిమా "సీక్రెట్ బ్యాలట్"కు పోలిక ఉందనే విషయం బయటకు వచ్చేసింది. ఆ సినిమా దర్శకుడు బాబక్ పయామీ 'అబ్బే పోలిక అంతగా లేదు' అని సర్టిఫికెట్టు యిచ్చినా "న్యూటన్"పై మచ్చయితే పడింది. ఈ కాపీ విషయంలో తీవ్రంగా గొడవ జరిగి సినిమా నిర్మాతలు పూర్తిగా మునిగిన ఉదంతం "బేగునాహ్" (1957) నాటిది.

"నాక్ ఆన్ ద ఉడ్" అని 1954 నాటి సినిమా ఉంది. దానిలో నటుడు, గాయకుడు, డాన్సర్ డేనీ కేయ్ కథానాయకుడు. సరదాగా ఉంటూనే సస్పెన్స్, క్రైమ్ కూడా కలిపారు. ఒక వెంట్రిలాక్విస్టు (చేతిలో బొమ్మ పెట్టుకుని దాని చేత మాట్లాడించే మిమిక్రీ కళాకారుడు) ఓ అమ్మాయిని ప్రేమించి, పెళ్లాడబోయేటంతలో ఆ బొమ్మ అతనిపై అసూయతో పెళ్లి చెడగొట్టేస్తుంది. ఇతనికి మతిచెడి, చికిత్స కోసం మహిళా సైకియాట్రిస్టు వద్దకు వెళితే, ఆమె సమస్యను నయం చేస్తుంది. ఇద్దరి మధ్య ప్రేమ చిగురిస్తుంది. ఈ మధ్యలో హీరో గూఢచారుల వ్యవహారంలో చిక్కుకుని, పోలీసుల నుంచి తప్పించుకుని పారిపోతూ మారు పేర్లు పెట్టుకుని డాన్సులు అవీ చేస్తాడు. ఇలా సాగే కథలో డేనీ విపరీతంగా పేరు తెచ్చుకున్నాడు. సినిమా సూపర్ హిట్ అయింది.

నటగాయకుడు కిశోర్ కుమార్ కెరియర్ తొలిదశలో చాలా ఊగిసలాటకు లోనయ్యాడు. అన్న అశోక్ కుమార్ నటన వైపు ప్రోత్సహించినా అతనికి మాత్రం తను గాయకుడిగానే రాణిస్తానని ఉండేది. అన్న మాట కొట్టేయలేక కొన్ని సీరియస్ వేషాలు వేశాడు. ఆ సినిమాలు ఆడలేదు. ఇంతలో కిశోర్ డేనీ కేయ్ సినిమాలు చూశాడు. అతనిలా డాన్సు చేస్తూ యోడిలింగ్ చేస్తూ, పాటలు పాడుతూ వేసే సరదా వేషాలు తనకు నప్పుతాయనిపించింది. అతన్ని అనుకరిస్తూ "ముకద్దర్" (1950) లో ఓ వేషంలో కనబడ్డాడు. "బాప్ రే బాప్" (1955)లో హీరోగా అవకాశం వచ్చినపుడు డేనీనే పూర్తిగా అనుకరించి మొదటి హిట్ కొట్టాడు. కాబట్టి "నాక్ ఆన్ ద ఉడ్" చూసి దాన్ని హిందీలో తీస్తే తను వేస్తానన్నాడు. విదేశీ కథలను భారతీయ సినిమాలుగా తర్జుమా చేయడంలో ఘనుడైన ఐఎస్ జోహార్ (నటుడు, దర్శకుడు కూడా) కథ రాయగా, నరేంద్ర సూరి దర్శకత్వంలో షకీలా హీరోయిన్‌గా "బేగునాహ్" (నిరపరాధి అని అర్థం) పేర సినిమా నిర్మించడానికి అనూప్‌చంద్ షా, మహీపత్‌రాయ్ షా ముందుకు వచ్చారు. శంకర్–జైకిషన్ సంగీతం, జైకిషన్ ఓ దృశ్యంలో కనబడి ముకేశ్ గొంతుతో "ఏయ్ ప్యాసే దిల్ బేజుబాన్" అనే ఓ పాట పాడతాడు కూడా. 1957 మార్చిలో విడుదలైతే వీళ్ల కర్మం కొద్దీ ఇంగ్లీషు సినిమా హీరో డేనీ అప్పుడు బొంబాయి వచ్చి ఉన్నాడు. వెంటనే తన సినిమా నిర్మాతలైన పారమౌంట్ పిక్చర్స్ వారికి తెలియపరిచాడు. భారత ప్రభుత్వం ఆ ఏడాదే చేసిన కాపీరైట్ చట్టప్రకారమే వాళ్లు కేసు పడేశారు.

అంతే, కోర్టు సినిమాను ఆపేయాలని ఇంజంక్షన్ యిచ్చింది. పదిరోజుల ప్రదర్శన తర్వాత అన్ని సినిమా హాళ్లలోను ప్రదర్శన నిలిపివేశారు. కేసు నడిచింది. హిందీ సినిమా ప్రింటు నెగటివ్‌లతో సహా తగలబెట్టాలని జడ్జి తీర్పు యిచ్చాడు. తగలబెట్టారు కూడా. ఆ కారణంగా ఆ సినిమా ప్రింట్లు యిప్పుడు ఎక్కడా దొరకవు. పాటలు మాత్రం మిగిలాయి. ఈ దురదృష్టానికి కొనసాగింపు కూడా ఉంది. కొన్ని ప్రింట్లు హైదరాబాదు సర్క్యూట్‌లో ఎక్కడెక్కడో మిగిలిపోయి, రెండేళ్ల దాకా చలామణీలో ఉండిపోయాయి. ఆ విషయం కోర్టు దృష్టికి రావడంతో వాళ్లు జరిమానాలు కూడా విధించారు. దానితో నిర్మాతలు దిబ్బయిపోయారు. నిరపరాధి పేరుతో సినిమా

తీసినా కాపీ చేసిన అపరాధానికి పెద్ద మూల్యమే చెల్లించారు. **- ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

**2018 మే 26 టాబ్లాయిడ్ ఎమ్బీయస్: పోస్టర్ డిజైనర్‌గా బిల్ గోల్డ్ ప్రతిభ**

అనేక హాలీవుడ్ సినిమాలకు అద్భుతమైన పోస్టర్లు రూపొందించిన బిల్ (విలియమ్) గోల్డ్ యీ వారంలో తన 97 యేట అమెరికాలోని కొనెక్టికట్‌లో మరణించాడు. హాలీవుడ్ సినిమాలు ప్రపంచమంతా ప్రదర్శించబడడానికి దోహద పడిన అంశాల్లో వాటి పోస్టరు డిజైన్ కూడా ఒకటి. బిల్ గోల్డ్ గొప్పతనం ఎక్కడుందంటే అతని కెరియర్ 1942 నుంచి 2011 వరకు సాగింది. అంటే 70 ఏళ్లన్నమాట. అంటే పేపర్ బోర్డు మీద బొమ్మలు గీసిన కాలం నుంచి కంప్యూటర్‌లో గీసే వరకూ అన్నమాట. వార్నర్ బ్రదర్స్ వారు, క్లింట్ ఈస్ట్‌వుడ్ అతని చేత అడిగిఅడిగి మరీ వేయించుకున్నారు. ఈస్ట్‌వుడ్ అయితే మరీనూ..! తను నటించిన, డైరక్టు చేసిన, నిర్మించిన సినిమాలన్నిటికీ అతని చేతే వేయించుకున్నాడు. బిల్ డిజైన్లు అనేక ఎవార్డులు పొందాయి. పరిపూర్ణ జీవితం గడిపి అంత్యకాలంలో అల్జీమర్స్ వ్యాధితో బాధపడి సెలవు తీసుకున్నాడు.

అతను 1921 జనవరిలో న్యూయార్క్‌లో పుట్టాడు. హైస్కూలు చదువు పూర్తయ్యాక స్కాలర్‌షిప్ గెలుచుకుని ఆ వూళ్లోనే ప్రాట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇలస్ట్రేషన్, డిజైన్‌లో చదివాడు. 1941లో వార్నర్ బ్రదర్స్‌లో అడ్వర్టయిజింగ్ డిపార్టుమెంటులో చేరాడు. "యాంకీ డూడుల్ డాండీ" (1942) అనే మ్యూజికల్‌కి తొలిసారిగా పోస్టరు గీశాడు. అదే ఏడాది అతను గీసిన "కాసబ్లాంకా" పోస్టర్లు అతనికి బాగా గుర్తింపు తెచ్చాయి. అంతలో యుద్ధం వచ్చింది. సైన్యంలో చేరాడు. సైనికులకు ట్రైనింగ్ యివ్వడానికి తయారు చేసిన సినిమాల నిర్మాణంలో పాలుపంచుకున్నాడు. 1946లో సైన్యం నుంచి బయటకు వచ్చాక మళ్లీ వార్నర్ బ్రదర్స్‌లో చేరాడు. 1947 నాటికి పోస్టర్ డిజైన్ విభాగానికి అధిపతి అయ్యాడు. 1959 వచ్చేసరికి అతని అన్నగారు చార్లీతో 'బిల్ గోల్డ్ ఛార్లెస్' అనే అడ్వర్టయిజింగ్ కంపెనీ పెట్టి సినిమా ట్రయిలర్స్ (యిప్పటి భాషలో ప్రమోలు) తయారుచేయడం మొదలుపెట్టాడు. ఛార్లెస్ లాస్ ఏంజిలిస్ బ్రాంచ్ చూసుకుంటే బిల్ న్యూయార్క్ బ్రాంచ్ నిర్వహించేవాడు. చార్లీ 1987లో వ్యాపారం మానేసి రిటైరయ్యాడు. 2005లో తన 75 వ ఏట మరణించాడు. 1997లో బిల్ తన వ్యాపారాన్ని న్యూయార్కు నుంచి కొనెక్టికట్‌కు మార్చాడు. 2003లో బిల్ రిటైరయ్యాడు. అతని 90 వ యేట 2011లో అతని పోస్టర్లతో ఒక పుస్తకం వెలువడింది. అదే సంవత్సరం క్లింట్ ఈస్ట్‌వుడ్ జె.ఎడ్గార్‌కు పోస్టర్లు వేయమని కోరితే వేసిపెట్టాడు.

బిల్ గోల్డ్ నైపుణ్యం గురించి ఎన్ని పేరాలు రాసినా ఒక అవగాహన ఏర్పడదు. అందుకని అతను గీసిన వందలాది పోస్టర్లలోంచి కొన్ని పోస్టర్లు యిక్కడ యిస్తున్నాను. వాటిలో వైవిధ్యం గమనించడానికి సినిమాల గురించి సంక్షిప్త పరిచయం యిస్తున్నాను. ఇన్‌గ్రిడ్ బెర్గ్‌మన్, హంఫ్రీ బోగర్ట్ నటించిన "కాసబ్లాంకా" (1942) యుద్ధనేపథ్యంలోని రొమాంటిక్ డ్రామా. మొరాకోలో నైట్‌క్లబ్ నడిపే హీరో తన మాజీ ప్రేయసిని, ఆమె భర్తను నాజీలను కాపాడి సరిహద్దులు దాటిస్తాడు. అందుకే పోస్టరులో నైట్‌క్లబ్ వాతావరణం చూపాడు. మార్లిన్ మన్రో, లారెన్స్ ఆలివర్ నటించిన "ద ప్రిన్స్ అండ్ ద షో గర్ల్" (1957) రొమాంటిక్ కామెడీ. ఆడ్రీ హెప్‌బర్న్, రెక్స్ హారిసన్ నటించిన "మై ఫెయిర్ లేడీ" (1964) మ్యూజికల్. ఎలిజిబెత్ టేలర్, రిచర్డ్ బర్టన్ నటించిన "హూ ఈజ్ ఎఫ్రైడ్ ఆఫ్ వర్జీనియా ఉల్ఫ్?" (1966) బ్లాక్ కామెడీ డ్రామా. బార్బరా స్ట్రీసాండ్ నటించిన "ఫన్నీ గర్ల్" (1968) ఒక హాస్యకళాకారిణి జీవిత చరిత్ర. క్లింట్ ఈస్ట్‌వుడ్ నటించిన "డర్టీ హారీ" (1971) యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్. స్టాన్లీ కుబ్రిక్ దర్శకత్వం వహించిన "ఎ క్లాక్‌వర్క్ ఆరంజ్" (1971) సమాజంలో ని నేరపూరిత వాతావరణాన్ని చూపే సినిమా. బార్బరా స్ట్రీసాండ్, ర్యాన్ ఓ నీల్ నటించిన "వాట్సప్ డాక్?" (1972) స్క్రూబాల్ కామెడీ. "డెలివరెన్స్" (1972) థ్రిల్లర్. "ఎక్సారిసిస్ట్" (1973) హారర్ సినిమా. సిడ్నీ ల్యూమెట్ దర్శకత్వం వహించిన "డెత్ ట్రాప్" (1982) థ్రిల్లర్. "ప్లాటూన్" (1986) వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా తీసిన సినిమా. క్లింట్ ఈస్ట్‌వుడ్ దర్శకత్వం వహించిన "మిస్టిక్ రివర్" (2003) మిస్టరీ డ్రామా.**- ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

**2018 మే 26 టాబ్లాయిడ్‌కై ఎమ్బీయస్: వెలుగు చూపవా, వెంకటేశ్వరా!**

తిరుమల వ్యవహారాల గురించి పది రోజులుగా రభస జరుగుతోంది. ఆరోపణలు, ప్రత్యారోపణలు జరుగుతున్నాయి. వీటిలో వాస్తవమేమిటో యిప్పటిదాకా బయటకు రాలేదు, యిప్పట్లోనే కాదు, ఎప్పటికీ బయటకు వస్తుందన్న నమ్మకమూ నాకు లేదు. టిటిడిలో అక్రమాలు, అవినీతి గురించి ఎప్పుడూ ఏదో ఒకటి రాస్తూనే ఉంటారు. విచారణ చేపట్టామంటారు, చివరకు ఎవర్ని దోషులుగా తేల్చారో, ఎంత రాబట్టారో మళ్లీ ఆ వార్తలేవీ బయటకు రావు. ప్రతీసారీ ఆరోపణ బయటకు రాగానే భక్తుల మనోభావాలు దెబ్బ తీశారు అంటారు, వారి నమ్మకాన్ని సడలించేందుకు జరిగిన కుట్ర అంటారు, హిందూమతాన్ని అప్రతిష్ఠపాలు చేస్తున్నారంటారు. ఇన్నేళ్లగా చూస్తున్నాను – స్వామి వారిపై భక్తుల నమ్మకం మాత్రం చెదరటం లేదు. రోజురోజుకి పెరుగుతూనే ఉంది. హుండీ కలక్షన్ చూసుకున్నా, యీ ఆరోపణలు వచ్చిన సమయంలో కూడా రోజుకి మూడు, మూడున్నర కోట్ల ఆదాయం వస్తోంది. అంటే అర్థమేమిటన్నమాట, 'మీరెలాగైనా కొట్టుకు చావండి, ఏదైనా అన్యాయం చేస్తే మీ పాపాన మీరే పోతారు, మా మొక్కులు తీరుతున్నాయి, మా దేవుణ్ని మేం వదిలిపెట్టం' అని భక్తులు చాటి చెప్తున్నారు. ఆ భక్తుల పేరు చెప్పి రాజకీయనాయకులు పబ్బం గడుపుకుందామని చూస్తున్నారు.

రమణ దీక్షితులు వైసిపి ఏజంటని, బిజెపి ఏజంటని టిడిపి ఆరోపించింది. అర్చకుల్లోనే ఆయనకి వ్యతిరేకబృందం తయారు

చేయాలని 32 మంది అర్చకులను రెగ్యులరైజ్ చేసి వారిని చీల్చింది. వారు కొత్తగా ప్రమోషన్ వచ్చినవాళ్లతో కలిసి ప్రెస్‌మీట్‌లు పెట్టి దీక్షితులు 12 నామాలు ధరించలేదని ఆరోపించారు. ఆయనపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గురువారం నాడు ఆయన ఆరోపణలకు నిరసనగా అంటూ ఆలయంలోనే నల్ల బ్యాడ్జిలు ధరించి అర్చక విధుల్లో పనిచేశారు. ఆయనకు నిరసన తెలపాలంటే ఆయన యింటి దగ్గర బ్యాడ్జిలతో ప్రదర్శన నిర్వహించాలి. గుళ్లో చేయడమేమిటి? గుడి నడిపిస్తున్నది ఈఓ ఆధ్వర్యంలోని టిటిడి. అంటే గుడిని దీక్షితులకు వ్యతిరేక శిబిరంగా మార్చే క్రమంలో ఔచిత్యం సైతం మర్చిపోయారన్నమాట. ఇది సరి కాదంటూ జెఇఓ ఒక సర్క్యులర్ జారీ చేసి ఊరుకున్నారు తప్ప నిరసనకారులను సంజాయిషీ అడగలేదు. వీళ్లిలా ఉంటే మరో పక్క స్వామి వారి ఆభరణాలు బాబు యింట్లో ఉన్నాయని విజయసాయి రెడ్డి ఆరోపించారు. సీరియస్‌గా కనబడే ఆ అడిటరుగారిలో యింత హాస్యస్ఫోరత ఉందని నా కెన్నడూ తెలియదు. ఆయన చెప్పిన 12 గంటల్లోపున బాబు యింటికి వెళ్లి చూడాలట. లేకపోతే ఆయన బాధ్యుడు కాడట, రాజీనామా చేయడట! బాబు యీయన కేమైనా మాట యిచ్చారా, పన్నెండు గంటల వరకు మా యింట్లోంచి కదల్చను అని? ముఖ్యమంత్రి అయినంత మాత్రాన తిరుమల వజ్రాలు యింటికి తెప్పించుకోవచ్చా? అంత బలహీనంగా ఉన్నాయా అక్కడి ఏర్పాట్లు?

విజయసాయిది సందట్లో సడేమియా వ్యవహారంలా కనబడినా, వివాదానికి కేంద్రబిందువుగా ఉన్నది దీక్షితులు రిటైర్‌మెంట్! దాన్ని టిటిడి, దాని వెనుక ఉన్న టిడిపి ప్రభుత్వం హేండిల్ చేస్తున్న విధానం! ఒక వ్యక్తి రిటైర్‌మెంట్‌పై యింత గోలా? అదీ అర్థాంతరంగా ఏమీ తీసేయలేదు, 65 ఏళ్లు నిండిన తర్వాతే తీసేశారు. ఎలా, ఎందుకు తీశారు అన్నది పక్కన పెట్టండి, ఉద్యోగిని రిటైర్ చేయకూడదా? తక్కినవారికి అవకాశం యివ్వకూడదా? ఎల్లకాలమూ ఒక్కళ్లే ఉండాలా? ఆయన్ను పంపించివేసినంత మాత్రాన దేవుడికి సేవలు ఆగిపోతాయా? ఆయన కాకపోతే మరొకరు సేవిస్తారు. ఆయన స్థానంలో వచ్చిన వారికి మంత్రాలు రావనో, రికార్డు బాగా లేదనో అంటే అది వేరే విషయం. వాళ్ల వంశస్తుడికే యిస్తున్నారు. ఇంకేమిటి బాధ? రమణ దీక్షితులు ఒక్కరితో తిరుమల నడవలేదు. ఇన్నాళ్లూ ఎన్నో అక్రమాలు జరిగిపోయాయని ఆయన యిప్పుడు ఏకరవు పెడుతున్నాడు. స్వామి వారిని రాత్రి 12.05 కే లేపేసి సుప్రభాత సేవ చేయమంటున్నారట. విఐపీల కోసం స్వామి వేర సేవల్లో కోత విధిస్తున్నారట, అర్థాంతరంగా ఆపేస్తున్నారట, నైవేద్యాలను తగ్గిస్తున్నారట, అప్పుడే ఎందుకు చెప్పలేదు అని అవతలివాళ్లు అంటున్నా, చెప్పలేక పోవడానికి సర్వీసు నియమనిబంధనలు అడ్డు వచ్చి ఉండవచ్చు. చెప్పినా చెప్పలేకపోయినా, తను ప్రధాన అర్చక పదవిలో ఉండి కూడా వాటిని ఆపలేకపోయానని ఆయన ఒప్పుకున్నట్లే కదా! తన కళ్ల ముందే దేవుడికి నైవేద్యం లేకుండా పోయినా ఏమీ చేయలేకపోయాడు కదా! మరి ఆ ఉద్యోగం పట్టుకుని వేళ్లాడడం దేనికి? తానుండి ఉద్ధరించ లేకపోయినప్పుడు తప్పుకుంటే మేలు కదా! ఆ అన్యాయాలన్నీ సవరిస్తేనే నేను ఆ పదవిలో కొనసాగుతాను అనే షరతు పెట్టటం లేదాయన. నా ఉద్యోగం తీసేయకండి అని మాత్రమే పట్టుబడుతున్నాడు, కోర్టుకి వెళుతున్నాడు. 65 ఏళ్ల దాకా ఉద్యోగం చేయనిచ్చాక కూడా యింత పంతమేమిటి? రమణ దీక్షితులపై చాలా వివాదాలు వచ్చాయి. అన్నదానం విరాళం సొంత ఖాతాకు మళ్లించారని, సాక్ష్యాలతో పట్టుకుని మందలించి వదిలేశారని, బయటకు చెప్తే ఆలయ ప్రతిష్ఠ దెబ్బ తింటుందని బయట పెట్టలేదని టిటిడి మాజీ చీఫ్ విజిలెన్స్ అధికారి రమణ కుమార్ ఐఏఎస్ చెపుతున్నారు. ఇవే కాదు, ముకేశ్ అంబానీ గెస్ట్ హౌస్‌కి వెళ్లి తీర్థం యిచ్చారని... యిలా చాలా ఉన్నాయి.

ఆయన వాదన సంతృప్తికరంగా లేనట్లే ఆయన ఉద్యోగం తీసేసిన యాజమాన్యం వాదనా సరిగ్గా లేదు. అసలీ 65 ఏళ్లు ఎక్కణ్నుంచి వచ్చింది? ప్రభుత్వోద్యోగుల పదవీ విరమణ వయసు వర్తింపచేస్తే 60 కావాలి. 60కి పై బడినవాళ్లందరినీ తప్పించేసి ఉండాల్సింది. అలా చేస్తే వారికి కావలసినవారికి ఉద్యోగం రాదేమో! రిటైర్‌మెంటు వయసు పెంచడం, తుంచడం అంతా ఏకపక్షంగా చేయవచ్చా? ఉద్యోగంలో చేర్చుకునేటప్పుడు నియమనిబంధనలు ఎలా ఉన్నాయి? అన్నిటికంటె ప్రధానమైన ప్రశ్న అర్చకులకు రిటైర్‌మెంటు ఉంటుందా? వయసు చేతనో, అనారోగ్యం చేతనో పళ్లు రాలిపోయి, మంత్రాలు సరిగ్గా పలకలేకపోతే? మతిమరుపు చేత మంత్రాలు ఎగరగొట్టేస్తే...? అర్చకత్వంలో ఉండే విపరీతమైన శారీరక శ్రమ తట్టుకోలేక పోతే..? 65 రాలేదు కదాని అలాగే అట్టేపెడతారా? ఇవన్నీ వ్యక్తి శారీరక దారుఢ్యం, మానసిక సంతులతపై ఆధారపడి ఉంటాయి. స్వామివారి సమక్షంలోనే అన్యాయాలు జరుగుతున్నాయి, నేను వాటిని ఆపలేకపోతున్నాను అనే క్షోభతో ఉన్న పూజారి ఏకాగ్రతతో అర్చించగలడా? వీటన్నిటినీ వయసులో ముడిపెట్టి చూడగలరా?

రమణ దీక్షితులు అలాటివాడు, యిలాటివాడు అని యిప్పుడు ఆరోపణలు చేస్తున్నవారు అధికారంలో ఉన్నవారే. మరి అలాటివాణ్ని యిన్నాళ్లూ పదవిలో ఎందుకు ఉంచారు? ఆయన మద్రాసు వెళ్లి చంద్రబాబుపై ఆరోపణలు చేసేవరకు ఎందుకు ఊరుకున్నారు? తర్వాతైనా ఆయన ఆరోపణలకు సమాధానం చెప్పకుండా 65 ఏళ్లు అనే సాంకేతిక కారణం చెప్పి తీసేశారెందుకు? అలా తీసేయడం వలన ఆయనతో బాటు మరో ముగ్గురి ఉద్యోగాలూ పోయాయి. ఏదైనా సంస్థలో ఉద్యోగి ప్రవర్తన బాగా లేనప్పుడు అతన్ని లిఖితపూర్వకంగా సంజాయిషీ అడుగుతారు తప్ప టీవీల కెక్కి ఆరోపణలు చేయరు. ఈయనకు నోటీసు యివ్వాలని నిశ్చయించారు. ఇచ్చి సమాధానం వచ్చాక చర్య తీసుకోవాల్సింది. ఈ లోపునే 2012 నాటి రూలును గుర్తు చేసుకుని ఉద్యోగం పీకేయడం దేనికి? ఆరేళ్లగా వాడనిది యీనాడు అక్కరకు వచ్చిందా? అప్పణ్నుంచే అమలు చేసి ఉంటే యీపాటికి చాలా మంది కొత్తవాళ్లకు అవకాశాలు వచ్చేవి కదా. ఇప్పుడు కూడా కావాలంటే దీక్షితులను ముందు సస్పెండ్ చేసి, విచారణ తర్వాత డిస్మిస్ చేసి ఉండాల్సింది. గుడికి గోశాలలున్నా అన్నీ హెరిటేజి నుంచే తెప్పిస్తున్నారని ఆయన ఆరోపించినప్పుడు, అబద్ధపు ఆరోపణ ఎందుకు చేశావ్? అని షోకాజ్ నోటీసు యివ్వాల్సింది. హెరిటేజి సంస్థ పరువునష్టం దావా వేయాల్సింది. ఇవేమీ చేయకుండా బ్రాహ్మణ కార్పోరేషన్ ఛైర్మన్ ఆనందసూర్యను ఊసిగొల్పారు. అసలిక్కడ బ్రాహ్మణ సమస్య ఎందుకు వచ్చింది? తిరుమల దేవుడు బ్రాహ్మణమతానికి సంబంధించినవాడు కాదు. యావన్మంది హిందువులకు సంబంధించినవాడు. అక్కడ ఏదైనా అక్రమం జరిగితే హిందువులందరికీ

సంజాయిషీ చెప్పవలసిన బాధ్యత పాలకులది. దీక్షితులు బ్రాహ్మడు కాబట్టి బ్రాహ్మడి చేతే తిట్టించాలనే వ్యూహమా? అదే అయితే హాస్యాస్పదంగా ఉంది. వెంటనే అతనికి జవాబుగా కొన్ని బ్రాహ్మణ సంఘాలు దీక్షితులు పక్షాన నిలబడ్డాయి. ఇది మరీ ఫన్నీగా ఉంది. దీక్షితులు స్థానంలో నియమించబడినవారు కూడా బ్రాహ్మలే కదా. ఆయన ఉద్యోగం తీసేస్తే బ్రాహ్మణులకు అన్యాయం జరిగిపోయినట్లు బిల్డప్ దేనికి?

ఆనందసూర్య రాజకీయాల్లోకి వెళ్లిపోయారు. కరుణాకర రెడ్డి టిటిడి చైర్మన్‌గా ఉన్నపుడు దీక్షితులు ఆయన్ని ఆశీర్వదించారట. కరుణాకర రెడ్డి ఎంత దుర్మార్గుడో చెప్పి, ఆయన్ను ఆశీర్వదించిన యీయనను దుమ్ము దులిపేశాడు. పురోహితుడు ఎవరడిగినా ఆశీర్వదిస్తాడు తప్ప కారెక్టరు సర్టిఫికెట్టు పట్టుకురమ్మన మనడు. రేపు ఆనందసూర్య చైర్మన్ అయినా అర్చకులంతా బారులు తీర్చి వాళ్ల యింటికి వస్తారు. టిటిడిలో అక్రమాలు జరిగినట్లు దీక్షితులు ఆధారాలు చూపాలని అడిగిన ఆనందసూర్య కరుణాకర రెడ్డి అక్రమాలకు కూడా ఆధారాలు చూపాలి. అధికార పార్టీతో ఉన్నారు కాబట్టి కరుణాకర రెడ్డిపై కేసులు పెట్టించాలి. అప్పుడే ఆయన చిత్తశుద్ధి తెలుస్తుంది. లేకపోతే వైసిపి నాయకుణ్ని దీన్లోకి యీడ్చే తాపత్రయమే కనబడుతుంది. టిటిడిపై ఎప్పుడూ ఏదో ఒక నింద వస్తూనే ఉంటుంది. కానీ రమణ దీక్షితులు సాధారణ వ్యక్తి కాదు, ప్రధాన అర్చకుడు. ఆటువంటి ఉన్నత స్థానంలోని వ్యక్తి ఆరోపణలు చేస్తే సీరియస్‌గా తీసుకోవాలి. విచారణ జరిపించాలి, ఆరోపణలు తప్పని తేలితే ఆయనపై చర్య తీసుకోవాలి. ఉద్యోగం ఎటూ పోతోందని తెలిసే యీ ఆరోపణలు చేశావా అని అడగాలి. రమణ దీక్షితుల్ని అర్జంటుగా యింటికి పంపేసిన టిటిడి, రిటైర్డ్ అధికారి ఐన డాలర్ శేషాద్రి కస్టడీలో రూ.50 వేల కోట్ల విలువైన ఆభరణాలు ఎందుకు ఉంచిందో కూడా చెప్పాలి. ఈ అంకె దీక్షితులు గారిది. అది నిజమైనా, అతిశయోక్తి ఐనా డాలర్ శేషాద్రి ఏదో ఒక హోదాలో పని చేస్తూన్నట్లే కనబడుతూంది. ప్రభుత్వాలు మారినా ఆయన ప్రభ మాత్రం తగ్గటం లేదు. ఏమిటా రహస్యం? ఆయన చేతిలో ఏ గుట్టుమట్లున్నాయి?

రమణ దీక్షితులు చేసే ఆరోపణల్లో ముఖ్యమైనవి రెండు. మొదటిది డిసెంబరులో 25 రోజుల పాటు వంటసాల (పోటు)లో తవ్వకాలు జరిగాయి, అవి బహుశా నేలమాళిగల కోసం కావచ్చు అని. తవ్వకాలు జరగలేదు అంటారు ఈఓ చిన్నచిన్న మరమ్మత్తులు జరిగాయి అంటారు. 25 రోజుల పాటు చేసేవి చిన్నచిన్నవా? భారీవా? వాటి అవసరం ఎందుకు పడింది? ఎవరి అనుమతితో చేశారనేది యిప్పటికీ తేలలేదు. ప్రధాన అర్చకులు నేను ఈఓకు ఫిర్యాదు చేశాను అంటారు. ఆయనేమో దీక్షితులు చెప్పగానే జెఈఓను, చీఫ్ ఇంజనీరును పంపించి పరిశీలన చేయించాను అంటారు. అంటే ఈ నలుగురికి ముందస్తు సమాచారం లేదన్నమాట. వారిని సంప్రదించకుండా స్వామివారి వంటశాలను మూసే అధికారం యింకెవరికి ఉంటుంది? మరమ్మత్తులనేవి ఎలాటివి, ఎన్నాళు చేశారు అనేది రికార్డుల్లో ఉంటుంది కదా. అవి తీసి చూపిస్తే పోతుంది. పోటు మూసేయడం వలన వేరే చోట వండించి తెచ్చారు, అది సవ్యమైన పద్ధతి కాదు, దానివలన స్వామి పస్తు ఉన్నారు అంటారు రమణ దీక్షితులు. అలా 2001, 2007లో కూడా జరిగాయి, దాని వలన మహాపచారం ఏమీ జరగలేదు అంటారు ఈఓ. పోటులో మరమ్మత్తులు జరుపుతూనే ఓ పక్క వంట వండడానికి వీలుపడలేదా? అందర్నీ ఖాళీ చేయించి, మొత్తమంతా కుళ్లబొడిచేయాలా? ఏ మాత్రం దెబ్బ తినని గ్రానైట్ రాళ్లను తీసి మళ్లీ వాటినే పెట్టాలా? (రమణ దీక్షితులు మాటల్లో) అన్న సందేహం వస్తుంది. ఆగమ సలహాదారు సుందరవరదన్ సలహాతోనే మరమ్మత్తులు చేశాం అంటున్నారు ఈఓ యిప్పుడు. ఆగమ సలహామండలి అనుమతులతోనే మరమ్మత్తులు చేయించామని సుందర వరదన్ అన్నారు. అంటే ఈఓ, జెఇఓ, చీఫ్ ఇంజనీర్‌కు కూడా చెప్పకుండానే యీ మండలి చేపట్టిందా? నేను ఆ మండలిలో సభ్యుణ్ని నాకు చెప్పలేదేం అంటున్నారు దీక్షితులు. పాయింటే కదా!?

రెండో విషయం 1945లో మైసూరు మహారాజా బహుమతిగా యిచ్చిన పింక్ డైమండ్ యిక్కడ మాయమై జెనీవాలో వేలం వేయబడింది అంటారు దీక్షితులు. అది డైమండ్ కాదు, కెంపు, ఉత్సవమూర్తికి వేస్తే భక్తులు విసిరిన నాణాల వలన పగిలి ముక్కలైంది అంటూ వాటి ఫోటో చూపిస్తున్నారు ఈఓ. '2009లో జస్టిస్ జగన్నాథరావు కమిటీ పరిశీలించి యిది నిజమేనని తేల్చింది. ప్రభుత్వం జీఓ యిచ్చింది, 2010లో ఐవైఆర్ కృష్ణారావు ప్రభుత్వానికి నివేదిక యిచ్చారు కూడా' అంటున్నారాయన. గులాబీ రంగు డైమండ్ గురించి నేను ఎన్నో ఏళ్లగా అడుగుతున్నానని దీక్షితులు అంటారు. డైమండ్ యిచ్చారో, రూబీ యిచ్చారో మైసూరు సంస్థానం రికార్డుల్లో యిప్పటి మైసూరు మహారాజా వారి వద్ద ఉంటుందట. వారిని అడిగితే వారే చెప్పేస్తారు. ఈ 'వజ్రం' పగిలిపోవడంపై రమణ దీక్షితులు తనకు చెపితే తను నివేదిక యిచ్చానని, అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు సిబిఐ విచారణ కోరారని టిటిడి మాజీ సెక్యూరిటీ చీఫ్ చెపుతున్నారు. అప్పుడు తాను అడిగిన సిబిఐ ఎంక్వయిరీని యిప్పుడు బాబు తనే సిఫార్సు చేయవచ్చు. 'స్వామి వారిని కొత్త ఆభరణాలతోనే అలంకరిస్తున్నారు, ప్రాచీన ఆభరణాలు ఏమయ్యాయి?' అని మరో ప్రశ్న వేశారు దీక్షితులు. ప్రధాన అర్చకుడు ఆయనే కదా, ఆయన చూడవద్దా అంటారు టిడిపి వారు. 1987 వరకు అర్చకుల అధీనంలోనే నగలు ఉండేవి. తర్వాత టిటిడికి అప్పగించారు. ఎవరి బాధ్యతలు వారికి ఉంటాయి, వాటిలో మునిగి తేలుతూంటారు. అంత పెద్ద ఆర్గనైజేషన్‌లో అన్నీ అందరికీ తెలియాలని లేదు. ఇది ఎడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన విషయం కాబట్టి ఈఓ ఆఫీసు వారే జవాబు చెప్పాలి.

ఈ వ్యవహారంలో ఈఓ మాట్లాడుతున్నది తక్కువా, టిడిపి వాళ్లు మాట్లాడుతున్నది ఎక్కువా అయిపోయింది. గతంలో అమరావతి కొత్త బిల్డింగు చూరు కారినా వైసిపి హస్తం అనేవారు. ఇప్పుడు బిజెపిని కలుపుతున్నారు. ఆట్టే మాట్లాడితే బిజెపిమీదే పెద్ద బండ వేస్తున్నారు. రమణ దీక్షితులు యింట్లో వైయస్ ఫోటో ఉందని, దాన్ని బట్టే ఆయన ఎలాటివాడో తెలిసిందని (స్వామివారు ఆయన చేతనే యిన్నాళ్లూ సేవ చేయించుకున్నారని మనం గ్రహించాలి) అమిత్ షాతో ఫోటో దిగాడని, ఢిల్లీకి వెళ్లి బిజెపితో కలిసి కుట్ర పన్నాడనీ.. ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా బాబు యిలాటివి మాట్లాడారు. అమిత్ షా వచ్చినపుడు పోటుకి తీసుకెళ్లి తవ్వకాలు చూపించానని, అందుకే తనపై టిడిపి పగబట్టిందని దీక్షితులు అంటారు. అంతేకాదు, టిటిడి నిధులను టిడిపి ప్రభుత్వం దారి

మళ్లిస్తోందని అంటూ ఉదాహరణలు యిచ్చారు – తిరుపతిలో సైన్సు కాంగ్రెసు వచ్చినపుడు తిరుపతి సుందరీకరణకు, ఒంటిమిట్ట దేవాలయ ఉద్ధరణకు రూ.100 కోట్లు. తిరుపతిలో కాంక్రీటు రోడ్డు కోసం రూ.10 కోట్లు.. యిలా! రోడ్లు వేయడానికి పన్నులు చెల్లిస్తోంది ప్రజ. హిందూ దేవుడి నిధులే కావలసి వచ్చాయా? దానిపై టిడిపి వారి స్పందన యింకా రాలేదు. దీక్షితులు వెనక ఏ పార్టీ ఉన్నది అనేది టిడిపికి అవసరమేమో కానీ భక్తులకు అనవసరం. ఆయన చేసిన ఆరోపణల్లో నిజమెంత అనేది తెలిస్తే చాలు. అది చెప్పకుండా రమణ దీక్షితులుపై, ఐవైఆర్‌పై ఆంధ్ర ప్రభుత్వం క్రిమినల్ కేసులు పెట్టబోతామంటూ టిడిపి ఒక లీక్ యిచ్చి కూర్చుంది. కెంపు–వజ్రం విషయంలో రమణ దీక్షితులు వాదన నమ్మబుద్ధిగా లేదు కానీ, పోటు తవ్వకాల విషయంలో ఏదో మరుగు పరుస్తున్నారనే తోస్తోంది. అందువలన లీకుకు మించి ప్రభుత్వం అడుగు ముందు వేయకపోయినా ఆశ్చర్యపడవద్దు.

అసలు కేంద్రం దేవస్థానాన్ని స్వాధీనం చేసుకోవడానికి కుట్ర పన్ని పురావస్తు విభాగం ద్వారా లేఖలు పంపిందని చంద్రబాబే ఆరోపించారు. పురావస్తు శాఖ ఉత్తరం పూర్వాపరాల గురించి ఐవైఆర్ ఒక వ్యాసం ద్వారా తెలియపరిచారు. అది గమనించకుండా దానిపై యింత రాద్ధాంతం చేయడం విడ్డూరం. ఇప్పుడీ మాజీ సెక్యూరిటీ చీఫ్ రమణ కుమార్ తనకు తెలిసున్నది చెప్పి, అంతటితో ఆగకుండా రమణ దీక్షితులు వ్యవహారం బిజెపి రాజకీయాలకు అనుగుణంగా పావులు కదుపుతున్నట్లు ఉంది అని చేర్చారు. నిజాలు తెలిస్తే చెప్పాలి, ఊహల జోలికి పోవడం ప్రారంభిస్తే యీయన వెనక్కాల టిడిపి ఉంది కాబట్టే యిలా మాట్లాడాడని వేరొకరు ఊహిస్తారు. దేవాలయంలో అవకతవకలకు అంతిమంగా బాధ్యులు ఎవరు? ప్రధాన అర్చకుడు కాదు, డాలర్ శేషాద్రి కాదు, మరొకరు కాదు. టిటిడి బోర్డు ! దాన్ని నియమిస్తున్న రాష్ట్రప్రభుత్వం. ఆ బోర్డు ఎంత లక్షణంగా పనిచేస్తోంది అన్నదే ప్రధానాంశం. ఏడాదిగా వాళ్ల సమావేశం కాలేదట. అందుకే అనేక అంశాలన్నీ మేట వేసి, మే 16 నాటి సమావేశంలో ఎజెండాలో 200 అంశాలు పెట్టారట. వాటిలో 50 అంశాల పైనే చర్చ జరిగిందట. తక్కిన జూన్5 న మరో మీటింగులో తేలుద్దాం అన్నారట. ఇదేమైనా పద్ధతిగా ఉందా? తిరుమల యింత వివాదాల్లో చిక్కుకున్నప్పుడైనా వెంటవెంటనే సమావేశమై దిద్దుబాటు చర్యలు తీసుకోవద్దా? దానికి బదులుగా గుడి గురించి మాట్లాడే పని రాజకీయనాయకులకు అప్పగిస్తారా? మీడియా కూడా సొంతంగా పరిశోధనకు పూనుకోవటం లేదు. ఇరువైపుల వారినీ కూర్చోబెట్టి ఆరోపణలు చేయించి, చేతులు దులుపుకుంటోంది. ఫలానా కమిటీ నివేదిక యిదిగో, దీనిలో యీ పేజీలో యిలా వుంది అని చూపటం లేదు. దానిపై వారు యిలా అన్నారు, అలా అన్నారు అని రిపోర్టింగు మాత్రమే చేస్తోంది. అందువలన మనందరినీ అజ్ఞానాంధకారం ఆవరించింది. వెలుగు చూపి వాస్తవాలు చెప్పగలిగినవాడు వెంకటేశ్వరుడు మాత్రమే. ఎవరి ద్వారా వెలుగులు పంచుతాడో వేచి చూద్దాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

## 2018 మే ఎమ్బీయస్: కర్ణాటక ఫలితాల విశ్లేషణ – 1/2

కర్ణాటకలో కొత్త ప్రభుత్వం కొలువు తీరింది. ఇది ఎంతకాలం నడుస్తుందో ఎవరూ చెప్పలేరు. 2019 దాకానైనా యీడుద్దామని కాంగ్రెసు–జెడిఎస్‌లు, ఆ లోపునే పడగొట్టి తాము తప్ప వేరెవరూ అక్కడ పాలించలేరని నిరూపిద్దామని బిజెపి అనుకుంటున్నాయి. ఎవరు తమ లక్ష్యం సాధిస్తారో ఊహించాలంటే ఎన్నికల ఫలితాలను విశ్లేషించి చూడాలి. ఏ వర్గాలు, ఏ ప్రాంతాలు ఎవరికి అనుకూలంగా తెలుసుకోవాలి. అప్పుడే వాటిని తమవైపు తిప్పుకోవడానికి పాలకపక్షం ఏం చేస్తోందో, ప్రతిపక్షం ఆందోళనలు ఎక్కడ సఫలమవుతున్నాయో అర్థమవుతాయి. అంతేకాదు, యీనాటి ఎన్నికల పోకడ కూడా అర్థమవుతుంది. సిద్ధరామయ్యపై పెద్దగా అవినీతి ఆరోపణలు లేవు, బోల్డన్ని సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేశాడు. అటు ఎడియూరప్ప మీద, అతని కుటుంబసభ్యులపై 50కు పైగా కేసులున్నాయి. వాటిలో భూమి కబ్జా, బంధుప్రీతి, మైనింగ్ స్కామ్, లంచగొండితనం వగైరా ఆరోపణలున్నాయి. కొన్ని కొట్టేసినా, మరి కొన్ని కోర్టు పరిధిలో పెండింగులో ఉన్నాయి. 2008లో ఆపరేషన్ కమల్ పేర అవతలి పార్టీ ఎమ్మెల్యేలను ఫిరాయింప చేసిన గాలి సోదరులు చెలరేగి ఉన్నారు. అయినా బిజెపికే సీట్లు వచ్చాయి. దీని అర్థమేమిటి? సంక్షేమ పథకాల వలన ప్రయోజనం లేదా? గెలవాలంటే కులాల సమీకరణే నమ్ముకోవాలా? సర్వజన సంక్షేమం గురించి ఆలోచించడం మానేసి కులకూటములతో ప్రయోగాలు చేస్తే లాభిస్తుందా? బెడిసి కొడుతుందా? ఇలాటి అనేక విషయాలను అర్థం చేసుకోవడానికే యీ కూలంకష విశ్లేషణ. ఒక గమనిక – ఓట్లశాతం, సీట్ల సంఖ్య నిర్ధారణగా చెప్పగలం కానీ కులాల వారీ ఓటింగు సరళి, కొన్ని అధ్యయనాల ఆధారంగా చెప్పినదే. వాటిని పూర్తిగా నమ్మడానికి లేదు.

**బిజెపి అధిరోహణ** – ముందుగా చెప్పుకోవలసినది బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో విఫలమైనా ఎన్నికల పరంగా చాలా మెట్లెక్కింది. సరిగ్గా చెప్పాలంటే 2008 నాటి మ్యాజిక్‌ను దాదాపు రిపీట్ చేసింది. అప్పట్లో 110 తెచ్చుకుంటే యిప్పుడు 104 తెచ్చుకుంది. 2500 ఓట్ల కంటె తక్కువ తేడాతో 8 సీట్లు పోగొట్టుకుంది కానీ లేకపోతే సరాసరి గద్దె ఎక్కేసేది. 2008లో ఎడియూరప్ప మీద సానుభూతితో వేస్తే 110 వచ్చింది, యిప్పుడు మోదీ వచ్చి 21 ర్యాలీలు నిర్వహించి ప్రచారం చేస్తే 104 వచ్చాయి. కాంగ్రెసుకు అప్పుడు 80 వస్తే యిప్పుడు 78 వచ్చాయి. ఎడియూరప్పకు ద్రోహం చేసిన జెడిఎస్‌కు అప్పుడు 28, యిప్పుడు 37. ఇక 2013తో పోలిస్తే బిజెపి అనేక వర్గాల్లో దూసుకుపోయింది. లింగాయతులు (వీళ్లలో 61% మంది ఓట్లు సంపాదించింది) ఎస్సీలు (5% నుంచి 40%కు పెరిగింది) గిరిజనులు (44% మంది వేశారు), ఒబిసిలు (7% నుండి 52%కి పెరిగింది), ఒక్కళిగలు (11%) అలా అనేకమంది దాని వెంట నిలిచారు. ఒక్క సీటు యివ్వకపోయినా ముస్లిముల్లో 5% మంది ఓట్లేశారు. బిజెపి యిటీవల పట్టణప్రాంతాల్లోనే ఎక్కువ సీట్లు తెచ్చుకుంటోంది. గ్రామాల్లో వెనకబడుతోంది. కానీ కర్ణాటకలో మాత్రం 2013లో గ్రామీణ ఓట్లలో 27% వస్తే యీసారి 36% వచ్చాయి. పట్టణాలలో గతంలో 39% వస్తే యీసారి 42% వచ్చాయి.

బిజెపి యింత బాగా చేసినా 2014 ఫలితాలతో పోలిస్తే మాత్రం నిరాశ కలుగుతుంది. అప్పుడు 43% ఓట్ల శాతం 132 శాసనసభ సీట్లలో ఆధిక్యం ఉంది. ఇప్పుడు 7% ఓట్లు, 29 సీట్లు తగ్గాయి. అప్పుడు జాతీయ స్థాయి అభ్యర్థి మోదీ, యిప్పుడు రాష్ట్రస్థాయి అభ్యర్థి ఎడియూరప్ప. అవినీతి యిమేజిలోనే యిద్దరికీ తేడా ఉంది. కొన్ని రాష్ట్రాలలో మోదీ 2014 మ్యాజిక్ రిపీటైంది. కొన్ని చోట్ల కాలేదు. కాని వాటిల్లో యిదొకటి. ప్రాంతాల వారీ చూస్తే 2014తో పోల్చి చూస్తే బిజెపి ఓట్ల శాతం బొంబాయి-కర్ణాటకలో 7%, హైదరాబాదు కర్ణాటకలో 7.8%, మధ్య కర్ణాటకలో 3.6%, కోస్తా కర్ణాటకలో ఏకంగా 9.3%, దక్షిణ కర్ణాటకలో 7.4%లో బెంగుళూరులో మరీ 10.5% తగ్గింది. గాలి జనార్దన్ రెడ్డి ప్రభావం ఎలా ఉందా అని చూడబోతే అతని మనుషులు మొత్తం 10 మంది పోటీ చేస్తే వారిలో 5గురు గెలిచారు. పరిశీలకుల ప్రకారం ఏప్రిల్ 30 వరకు కాంగ్రెసుకు బిజెపిపై 5% పాయింట్ల లీడ్ ఉందట. కానీ మోదీ వచ్చి 21 సభలు నిర్వహించేసరికి అది 1.5%కి పడిపోయిందట. నిజానికి మోదీ ఉపన్యాసాల్లో రాహుల్ గాంధీపై జోకులు, సిద్ధరామయ్యపై నిందలు తప్ప కొత్త పాయింట్లు లేవు, కొత్త ఆలోచనలూ లేవు. 6 లక్షల మంది వాలంటీర్ల సహాయంతో బూత్ మేనేజ్‌మెంటులో బిజెపి కనబరచిన చాకచక్యం వలన అనేక చోట్ల బిజెపి విజయం సాధించగలిగింది. కాంగ్రెసు ఓడిపోయింది. స్థానిక ఎమ్మెల్యేల అసమర్థత వలన కూడా కొన్ని చోట్ల ఓటమి సంభవించింది. 'సిద్ధరామయ్య మా గురించి ఎంతోకొంత చేశాడు, కానీ మా ఎమ్మెల్యే ఏం చేశాడు చెప్పండి' అన్నారు కొన్ని చోట్ల ఓటర్లు.

**కాంగ్రెసు జయం, అపజయం –** 44 సీట్లు పోగొట్టుకున్న కాంగ్రెసునూ బొత్తిగా తీసిపారేయడానికి లేకుండా ఉంది. గతంలో 36.8% తెచ్చుకున్న కాంగ్రెసు యీసారి 38% తెచ్చుకుంది. ఇది బిజెపి కన్నా 1.8% ఓట్లశాతం ఎక్కువే కానీ బిజెపి కంటె 26 సీట్లు తక్కువ (104-78) తెచ్చుకుంది. 2008లో కూడా యిలాగే జరిగింది. అప్పుడూ కాంగ్రెసుకు బిజెపి కంటె 1.3% ఓట్లు ఎక్కువ తెచ్చుకున్నా, 30 సీట్లు తక్కువ తెచ్చుకుంది. దీని అర్థం కాంగ్రెసు, బిజెపిలాగానే అన్ని ప్రాంతాల్లోను పలచగా పరుచుకున్నా దానికి సరైన వ్యూహం లేదు. తక్కువ తేడాతో అనేక చోట్ల ఓడిపోయింది. బిజెపి మంచి ప్రణాళికతో కొన్ని ప్రాంతాల్లో బలంగా చొచ్చుకుపోయి ఎక్కువ సీట్లు తెచ్చుకుంటోంది. కాంగ్రెసు గ్రామాల్లో యీసారి 38.2% తెచ్చుకుంది. ఇది 2013 కంటె 0.4% తక్కువ. పట్టణాల్లో గతంలో కంటె 1.7% ఎక్కువగా 40% తెచ్చుకుంది. కన్నడ పోరాట యోధుడిగా అవతారమెత్తినా ప్రయోజనం పొందలేక, సిద్ధరామయ్య రెండు చోట్ల పోటీ చేసి చాముండేశ్వరిలో ఘోరంగా ఓడిపోయాడు, మరో చోట చచ్చిచెడి 1700 ఓట్లతో నెగ్గాడు. అతని సహచరుల్లో 11 మంది ఓడిపోయారు. రైతులకు రూ.50 వేల వరకు ఋణాలు రద్దు చేసినా, అతని హయాంలో 350 మంది రైతులు ఆత్మహత్య చేసుకోవడం మైనస్‌గా మారింది. నలుగురు కాంగ్రెసు అభ్యర్థులు వెయ్యిలోపు మెజారిటీతో బయటపడ్డారు. (బిజెపి విషయంలో ఒక్కరే)

బిజెపి సీట్ల సంఖ్య 2013తో పోలిస్తే బొంబాయి-కర్ణాటకలో 213%, హైదరాబాదు కర్ణాటకలో 181%, మధ్య కర్ణాటకలో 483%, కోస్తా కర్ణాటకలో 366%, దక్షిణ కర్ణాటకలో 233%లో పెరగ్గా బెంగుళూరులో 91% మాత్రమే వచ్చాయి. ఇక కాంగ్రెసు సీట్ల సంఖ్యను 2013తో పోలిస్తే బొంబాయి-కర్ణాటకలో 56%, హైదరాబాదు కర్ణాటకలో 75%, మధ్య కర్ణాటకలో 50%, కోస్తా కర్ణాటకలో 17%, దక్షిణ కర్ణాటకలో 83%లో తగ్గగా బెంగుళూరులో 107%కు పెరిగాయి. మరి ఓట్ల శాతం ఎందుకు ఎక్కువ వచ్చింది అంటే దక్షిణ కర్ణాటకలో బిజెపికి 19.5% ఓట్లు రాగా, కాంగ్రెసుకు 33.8% వచ్చాయి. బెంగుళూరులో 3.9%, కోస్తా కర్ణాటకలో 0.4%, హైదరాబాదు కర్ణాటకలో 3.3%, ఎక్కువ వచ్చాయి. బిజెపికి మధ్య కర్ణాటకలో 3.4%, ముంబయి కర్ణాటకలో 3% ఎక్కువ వచ్చాయి. ఓట్లను సీట్లగా తర్జుమా చేసుకునే విద్య పట్టుబడక కాంగ్రెసు కోస్తా కర్ణాటకలో 0.4% ఎక్కువ ఓట్లు తెచ్చుకున్నా 9 సీట్లు తక్కువ తెచ్చుకుంది!

అధికారం చేజిక్కించుకున్న జెడిఎస్ 2013 కంటె 1.9% (20.2%-18.3%) ఓట్లు, మూడు సీట్లు తక్కువగా తెచ్చుకుంది. అది పాత మైసూరు (దక్షిణ కర్ణాటక)లో మాత్రమే తన బలం చూపుకోగలిగింది. హైదరాబాదు కర్ణాటకలో గతంలో 5 వస్తే యీ సారి 4 వచ్చాయి. ఒక్కళిగల్లో 63%, లింగాయతుల్లో 9%, ముస్లిముల్లో 11%, ఒబిసిల్లో 14%, గిరిజనుల్లో 16%, ఎస్సీల్లో 18% ఓట్లేశారు. ముస్లిములు కాంగ్రెసుకు ఓట్లేయడంతో కొన్ని చోట్ల ఓడిపోయింది. జెడిఎస్‌కు గ్రామాల్లో గతంలో కంటె 3.4% తక్కువగా 17.8% వచ్చాయి, పట్టణాల్లో గతంలో కంటె 5.6% తక్కువగా 13.1% వచ్చాయి. 121 స్థానాల్లో డిపాజిట్టు దక్కలేదు. 16 జిల్లాల్లో ఖాతా తెరవలేదు. కాంగ్రెసు జెడిఎస్ యిద్దరూ కలిసి పోటీ చేసి వుంటే, వారి మధ్య ఓట్ల బదిలీ సవ్యంగా జరిగివుంటే వారికి 150, బిజెపికి 70 వచ్చి ఉండేవి.

**కాంగ్రెసు డైలమా –** కర్ణాటక ఫలితాలను లోతుగా చూస్తే ఒక విషయం అర్థమవుతుంది. కాంగ్రెసు పార్టీకి తన రాష్ట్రనాయకులతో ఏం చేయాలో తెలియటం లేదు. గతంలో ముఖ్యమంత్రిని ఎవర్ని పెట్టినా, అసమ్మతి వర్గాన్ని కూడా దువ్వుతూ ఉండేది. దాంతో రాష్ట్రస్థాయిలో ఎవరూ బలంగా ఉండేవారు కారు. అటుతిరిగి, యిటుతిరిగి అధిష్టానం మీదే ఆధారపడేవారు. వాళ్లు చిత్తం వచ్చినట్లు ముఖ్యమంత్రుల్ని మార్చిపారేసేవారు. పదవి పోయిన వాళ్లు కొత్తగా వచ్చినవారిపై పగ బట్టేవారు. దాంతో ఎన్నికలు వచ్చినపుడు అంతఃకలహాలతో పార్టీ దెబ్బ తినేది. సోనియా వచ్చిన తర్వాత పద్ధతి మార్చింది. రాష్ట్రంలో ముఖ్యమంత్రుల్ని బలహీనపరచకుండా నడవనిచ్చింది. కానీ ఆ క్రమంలో వాళ్లు సరిగ్గా పాలించకపోయినా, అసమ్మతి వర్గం మొరపెట్టుకుంటున్నా వినకపోవడం జరగసాగింది. అదీ అనర్థాలు తెచ్చింది. రెండేళ్ల క్రితం అసాం ఎన్నికలలో ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్‌కి సర్వాధికారాలు యిచ్చారు. అతను చెప్పినవాళ్లకే టిక్కెట్లు యిచ్చారు. అతను ప్రాంతీయ పార్టీలతో పొత్తుకి ఒప్పుకోలేదు. అతని డిప్యూటీ అయిన హిమంత బిశ్వ శర్మతో రాజీ పడమంటే పడలేదు. చివరకు శర్మ బిజెపిలోకి వెళ్లిపోయి, రెండు ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని అసాంలో కాంగ్రెసు ప్రభుత్వాన్ని ఓడించాడు. అసాంలో కాంగ్రెసు పార్టీకి ఓట్లు ఎక్కువ వచ్చాయి. కానీ సీట్లు తగినన్ని రాలేదు. ఆ కథే కర్ణాటకలో

పునరావృతమైంది.

కర్ణాటకలో సిద్ధరామయ్య 2013లో పార్టీకి విజయం చేకూర్చాడు కాబట్టి అతనికే సకలాధికారాలు అప్పచెప్పారు. అంతా అతని యిష్టప్రకారమే జరిగింది. అతను ముఖ్యమంత్రి కాగానే ఉపముఖ్యమంత్రిగా ఎవరైనా ఎస్సీ నాయకుణ్ని పెడితే మంచిదనే సూచన వచ్చింది. కానీ అలా అయితే పోటీ అధికారకేంద్రం ఏర్పడి చికాకులు వస్తాయని అనుకుని, ఎవరికీ యివ్వలేదు. సిద్ధరామయ్యకూ అదే కావాలి. కానీ యిదంతా తక్కిన కాంగ్రెసు నాయకులకు రుచించలేదు. హరిజనుడైన మల్లికార్జున ఖర్గే, ఒక్కళిగయైన డికె శివకుమార్, కెపిసిసి అధ్యక్షుడు హరిజనుడు ఐన జి. పరమేశ్వర (ఇప్పుడు ఉపముఖ్యమంత్రిని చేశారు), లింగాయత్ లీడరైన ఎస్.శివశంకరప్ప – వీళ్లందరూ సిద్ధరామయ్యకు సహకరించలేదు. బిజెపి కంటె ఏడు లక్షల ఓట్లు ఎక్కువ తెచ్చిపెట్టినా, సీట్లు రాకపోవడంతో సిద్ధరామయ్యపై వీళ్లు కత్తులు నూరుతున్నారు. 2017 గుజరాత్ రాజ్యసభ ఎన్నికలలో కాంగ్రెసు ఎమ్మెల్యేలతో శిబిరం నిర్వహించిన శివకుమార్ తనకు ప్రాధాన్యత యిస్తారనుకున్నాడు కానీ అది దక్కకపోవడంతో సిద్ధరామయ్యే దానికి కారణమని మంటగా ఉన్నాడు. అతని అతివిశ్వాసమే మా కొంప ముంచింది అన్నాడు. ఫలితాల తర్వాత మళ్లీ శిబిర నిర్వహణ అతనికే యిచ్చారు, కానీ ఉపముఖ్యమంత్రి పదవి యివ్వలేదు. ఏదో ఒక పదవి యివ్వకపోతే ఏదైనా చేస్తాడేమోనన్న బెదురు కాంగ్రెసుకు ఉంది.

**కర్ణాటక కులసమీకరణాలు –** తొలి నుంచీ కర్ణాటక ఎన్నికలలో కులసమీకరణాలు చాలా ప్రాధాన్యత వహించాయి. మొదటినుంచీ లింగాయతులు, తర్వాతి రోజుల్లో ఒక్కళిగలు జనాభాలో తమ శాతాన్ని ఎక్కువగా చెప్పుకుంటూ అధికారం చలాయించారు. తమ నిష్పత్తి కంటె ఎక్కువగా సీట్లు పొందారు. వీళ్లు నిజలింగప్ప సారథ్యంలోని పాత కాంగ్రెసును, తర్వాత జనతాపార్టీని అంటిపెట్టుకుని ఉండటంతో వీళ్ల ప్రాబల్యం తగ్గించడానికి ఇందిరా గాంధీ నేతృత్వంలో దేవరాజ్ అర్స్ (1972–80) బిసిలను, దళితులను, మైనారిటీలను చేరదీసి అధికారంలోకి వచ్చాడు. సిద్ధరామయ్య యీనాడు చెప్తున్న అహిందా ఫార్ములా అతనిదే. ఆ తర్వాత కర్ణాటకను ఫుల్ టెర్మ్ పాలించినది సిద్ధరామయ్య మాత్రమే. అరసు అనంతరం కర్ణాటకలో చాలా మార్పులు వచ్చాయి. ఇందిరా కాంగ్రెసుకు చెందిన గుండూరావు (1980–83) పాలన అవినీతిమయమై 1983 ఎన్నికలలో జనతా పార్టీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది. లింగాయతులు, ఒక్కళిగలు అధికారం కోసం పోటీ పడితే చివరకు రాజీ అభ్యర్థిగా బ్రాహ్మణుడైన రామకృష్ణ హెగ్డేను ముఖ్యమంత్రి చేశారు. రాజీ అభ్యర్థిగా ఎంపికైనా హెగ్డే లింగాయతులను ఎక్కువగా చేరదీశాడు. ఇది ఒక్కళిగుడైన దేవెగౌడకు రుచించలేదు. 1984 లోకసభ ఎన్నికలలో ఇందిర హత్య తదనంతరం జనతాపార్టీకి 28 స్థానాల్లో 4 రావడంతో హెగ్డే రాజీనామా చేసి, 1985లో మళ్లీ ఎన్నికలకు వెళ్లాడు.

నెగ్గి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యి 1988లో ట్యాపింగ్ వివాదాల్లో రాజీనామా చేశాడు. తన స్థానంలో లింగాయతుడైన ఎస్ఆర్ బొమ్మయ్‌ను కూర్చోబెట్టాడు. అతని ప్రభుత్వాన్ని రాజీవ్ ప్రభుత్వం డిస్మిస్ చేసింది. 1989 ఎన్నికల్లో కాంగ్రెసు నెగ్గి లింగాయతు ఐన వీరేంద్ర పాటిల్ ముఖ్యమంత్రి అయ్యాడు. అతను లిక్కర్ లాబీని నియంత్రించడంతో దానికి మద్దతుగా ఉన్న సాటి కాంగ్రెసు నాయకులు కక్ష పెంచుకున్నారు. రాష్ట్రంలో మతకల్లోలాలు సృష్టించారు. వాటిని అదుపు చేయలేకపోయావంటూ రాజీవ్ వీరేంద్ర పాటిల్‌ను తొలగించడంతో కోపం వచ్చిన లింగాయతులు కాంగ్రెసుకు దూరమయ్యారు. 1994 ఎన్నికల తర్వాత జనతా దళ్ తరపున దేవెగౌడ ముస్లిములు, ఒబిసిలు, ఒక్కళిగలు, దళితులతో ఒక కూటమి ఏర్పరచి నెగ్గి ముఖ్యమంత్రి అయ్యాడు. 1996లో ప్రధానమంత్రి కూడా అయ్యాడు. అయ్యాక పార్టీలో తన ప్రత్యర్థియైన హెగ్డేను జనతా దళ్ అధ్యక్షుడైన లాలూ యాదవ్ చేత తీయించేశాడు. హెగ్డే విడిగా వచ్చేసి లోకశక్తి అనే పార్టీ పెట్టుకున్నాడు. 1998 ఎన్నికలలో బిజెపితో చేతులు కలిపి కర్ణాటకలో మెజారిటీ సీట్లు సంపాదించుకున్నాడు. హెగ్డేకు మద్దతు యిస్తూ వచ్చిన లింగాయతులు హెగ్డేతో బాటు బిజెపికి మద్దతుదారులుగా మారారు. ఒక్కళిగలు జనతా దళ్, దరిమిలా జెడిఎస్ మద్దతుదారులుగా మారారు. హెగ్డే 1998 నాటి వాజపేయి కాబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశాడు. 1999లో జనతా దళ్‌లో చీలిక వచ్చాక కర్ణాటక ముఖ్యమంత్రిగా తన అనుచరుడు జెఎచ్ పాటిల్‌ను కూర్చోబెట్టాడు. లోకశక్తిని జెడి (యునైటెడ్)లో కలిపివేసి బిజెపితో పొత్తు పెట్టుకున్నాడు. కానీ 1999 ఎన్నికలలో పటేల్ ప్రభుత్వానికి వ్యతిరేకత పెరిగి కాంగ్రెసు అధికారంలోకి వచ్చింది. హెగ్డే క్రమేపీ రాజకీయాలకు దూరమై, 2004లో పోయాడు. కానీ అతని కారణంగా లింగాయతులు, బ్రాహ్మణులు బిజెపి సమర్థకులుగా మారి అలాగే నిలిచిపోయారు. ఎడియూరప్ప పాలించే రోజుల్లో లింగాయతులు, బ్రాహ్మణులకు తోడుగా కోస్తా కర్ణాటకలోని బిల్లవులనే బిసిలను, బంట్‌లను చేరదీయడంతో బాటు మధ్య, తూర్పు కర్ణాటకలోని గిరిజనులను కూడా అక్కున చేర్చుకున్నాడు. ఒక్కళిగలు దేవెగౌడను తప్ప వేరెవరినీ తమ నాయకుడిగా ఆమోదించకుండా జెడిఎస్‌నే ఆదరిస్తున్నారు.

**అగ్రకులాలను అదుపు చేయబోయిన సిద్ధరామయ్య –** సిద్ధరామయ్య అధికారంలోకి వస్తూనే యీ వ్యవహారమంతా గమనించి లింగాయతులను, ఒక్కళిగలను నియంత్రించి యితర కులాలకు ప్రాధాన్యత యిచ్చి తను వాళ్ల నాయకుడిగా ఎదగాలని పథకం వేశాడు. ముందుగా జనాభాలో లింగాయతులు, ఒక్కళిగలు వాళ్లు చెప్పుకునేటంత మంది ఉన్నారా లేదా అనే లెక్కలు తేల్చాలనుకున్నాడు. ఎందుకంటే వాళ్లు తాము 17% దాకా ఉన్నామని చెప్పుకుంటూ, తమ సంఖ్యాబలాన్ని చూపించి దబాయించి పదవులు తీసుకుంటున్నారు. దాని సంగతేమిటో చూద్దామని 'సోషల్ అండ్ ఎడ్యుకేషనల్ సర్వే' అనే పేర యింటింటికి తిరిగి వివరాలు రాబట్టాడు. తక్కినవాటి మాట ఎలా వున్నా కులం, ఉపకులంతో సహా రికార్డు చేశారు. కెసియార్ దీన్ని చూసే స్ఫూర్తి పొంది, సర్వే చేయించారు లాగుంది. అప్పుడు సర్వేయర్లు కులం గురించి కూడా అడిగారు. కెసియార్ ఆ వివరాలు బయట పెట్టనట్లే, సిద్ధరామయ్య కూడా బయటపెట్టలేదు. ఎందుకంటే లింగాయతులు 10%, (కొంతమంది 13% అంటున్నారు) ఒక్కళిగలు 8% మంది మాత్రమే ఉన్నారని, వాళ్ల కంటె దళితులు (19%), ముస్లిములు (16%) ఎక్కువమంది ఉన్నారని తేలింది. నివేదికను బయటపెడితే యిది కొత్త డిమాండ్లకు దారి

తీస్తుందని భయపడి కాంగ్రెసు ప్రభుత్వం దాన్ని అటక మీద పడేసింది కానీ అంకెలు లీక్ అయ్యాయి. ఇది లింగాయతులను, ఒక్కళిగలను మండించింది. కన్నడ రాజకీయాల్లో యిన్నాళ్లూ చక్రం తిప్పిన తమ చేతుల్లోంచి రాజకీయాధికారం జారిపోతుందని భయం వేసింది. సిద్ధరామయ్యకు బుద్ధి చెప్పాలని నిశ్చయించుకున్నారు. ఎందుకంటే సిద్ధరామయ్యకు ఆ అంకెలు చూశాక అరసు నాటి అహిందా సమీకరణాన్ని నమ్ముకుని ఒబిసిలను చేరదీస్తే మంచిదని తోచింది. అయితే ఒబిసిలలో కూడా అతను పక్షపాతం చూపించాడు. తన కురుబ (గొల్ల) కులానికి పెద్ద పీట వేశాడు. అతని హయాంలో కీలకమైన పోస్టులన్నీ కురుబలకే దక్కాయని యితరులు అభిప్రాయ పడ్డారు. అందువలన యీ ఎన్నికలలో ఒబిసిల్లో చీలిక వచ్చింది. వారిలో 24% (బిజెపికి వేసిన దాంట్లో సగం కంటె తక్కువ) మంది మాత్రమే కాంగ్రెసుకు వేశారు. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

**2018 మే** **ఎమ్బీయస్: కర్ణాటక ఫలితాల విశ్లేషణ – 2/2**

**వర్గీకరణ సమస్య దెబ్బ తీసింది –** షెడ్యూల్డ్ కులాల దగ్గరకు వచ్చేసరికి యింకో చిక్కు వచ్చిపడింది. కర్ణాటక ఎస్సీలలో 100 ఉపకులాలున్నాయి. వారిలో ముఖ్యమైనవి ఎడమ (హొలేయ), కుడి (మాదిగ) వర్గాలు. మన దగ్గర మాలల్లాగానే అక్కడ హొలేయలు రిజర్వేషన్ ఫలితాలు బాగా అనుభవించారు. కాంగ్రెసు హరిజన నాయకులైన మల్లికార్జున ఖర్గే, జి పరమేశ్వర, మహదేవప్ప – వీళ్లందరూ హొలేయలే. మాదిగలకు తమకు రావలసిన వాటా దక్కలేదని, ఉపకులాల మధ్య వర్గీకరణ చేయాలని ఆందోళన చేయడంతో 2005లో జస్టిస్ సదాశివ కమిషన్ వేశారు. 2012లో నివేదిక యిచ్చిన కమిషన్ వర్గీకరణ చేయమని సిఫార్సు చేసింది. 2013లో కాంగ్రెసు అధికారంలోకి వచ్చింది. అది అమలు చేస్తే హొలేయలకు కోపం వస్తుందని, దేశంలో తక్కిన చోట్ల కూడా యిలాటి డిమాండ్లు తలెత్తుతాయని భయపడి కాంగ్రెసు పార్టీ దాన్ని అమలు చేయలేదు. సిద్ధరామయ్య ఎస్సీ, ఎస్టీలకై పెట్టిన నిధులను వారివారి ఉపకులాల నిష్పత్తి ప్రకారం పంపిణీ చేసినా, లింగాయతులను మైనారిటీలుగా గుర్తించడంలో చూపిన చొరవ వర్గీకరణలో చూపించలేదని మాదిగలకు కోపం వచ్చింది. దాంతో కాంగ్రెసుకు ఎదురు తిరిగారు. ఎస్సీల్లో 37% మంది మాత్రమే వాళ్లకు ఓట్లేశారు. ఎస్టీల దగ్గరకు వస్తే చాలా రాష్ట్రాలలో ఆరెస్సెస్ గిరిజన ప్రాంతాల్లో రకరకాల సంస్థల పేర్లతో వారికి సేవలందిస్తూ వారి అభిమానాన్ని చూరగొంటోంది. కర్ణాటకలోనూ అదే జరిగివుంటుంది. అందుకే కాబోలు ఎస్టీల్లో 29% మంది మాత్రమే కాంగ్రెసుకు ఓటేశారు. ఎస్సీ, ఎస్టీ ఓట్లు రెండు కలిపి చూస్తే బిజెపి కంటె కాంగ్రెసుకు 9% తక్కువ వచ్చాయి. రిజర్వ్‌డ్ సీట్లలో కాంగ్రెసు ఓట్ల శాతం ఎక్కువే వచ్చింది, కానీ బిజెపి 16 రిజర్వ్‌డ్ సీట్లు గెలుచుకోగా, కాంగ్రెసు 12 మాత్రమే గెలుచుకోగలిగింది.

**బుద్ధి చెప్పిన లింగాయతులు –** ఇక ఆర్థికంగా బలమైనవారు, రాజకీయంగా పలుకుబడి గలవారు ఐన లింగాయతులైతే సిద్ధరామయ్యకు బుద్ధి చెప్పడానికి నిశ్చయించుకున్నారు. మామూలుగానే బిజెపి పక్షపాతులు, పైగా బిజెపి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎడియూరప్ప లింగాయతుడు. ఎడియూరప్ప బిజెపి నుంచి విడిపోయి కెజెపి (కర్ణాటక జనతా పక్ష) పెట్టినపుడు 34 నియోజకవర్గాలలో అతని పార్టీకి ద్వితీయ స్థానం వచ్చింది. దానికి కారణం లింగాయతు ఓట్లే. అది గ్రహించిన మోదీ తనకు పార్టీలో ప్రాధాన్యత రాగానే ఎడియూరప్పను పార్టీలోకి తీసుకున్నారు. 2016లో రాష్ట్ర అధ్యక్షుణ్ని చేశారు. ఈ ఎన్నికలలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపారు. బిజెపి యిలా తమను ఆదరిస్తూ ఉండగా, యిటు తమ ప్రాబల్యం తగ్గించడానికి సిద్ధరామయ్య ఒబిసిలను ఎగదోయడమే కాకుండా, తమ నుంచి వీరశైవులను విడదీసి, తమ బలాన్ని క్షీణింపచేయడానికే మైనారిటీ స్టేటస్ ప్రకటించాడని నమ్మారు. వారు కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఓటేయడమే కాకుండా, తమ సంస్థల్లో పనిచేసే యితర కులస్తుల ఓటింగు సరళిని కూడా ప్రభావితం చేశారు. పేద లింగాయతులకు మైనారిటీ స్టేటస్ వలన కలిగే లాభమేమిటో అర్థం కాలేదు. తాము, వీరశైవులు ఎందుకు భిన్నమో వారికి తెలియలేదు. అందువలన వారు కాంగ్రెసు పట్ల అభిమానమేమీ పెంచుకోలేదు. ఏతావతా లింగాయతుల్లో 20% మందే కాంగ్రెసుకు ఓటేశారు. (2013లో 48% మంది వేశారు). లింగాయతులు ఎక్కువగా ఉన్న బొంబాయి కర్ణాటక, మధ్య కర్ణాటకలలో మొత్తం 104 సీట్లుంటే కాంగ్రెసుకు 31 వస్తే బిజెపికి రెట్టింపు కంటె ఎక్కువగా 63 వచ్చాయి.

**ఆగ్రహించిన ఒక్కళిగలు –** ఒక్కళిగలు కూడా సిద్ధరామయ్య అంటే మండిపడ్డారు. తాము ఆరాధించే 86 ఏళ్ల దేవెగౌడను సిద్ధరామయ్య మాటిమాటికీ తీసిపారేయడంతో, హేళన చేయడంతో వారికి కోపం వచ్చింది. మోదీ అంతటివాడే దేవెగౌడను మన్నిస్తూండగా అతడికి నమ్మినబంటుగా వుండి, రాజకీయాల్లో పైకి వచ్చిన సిద్ధరామయ్య దేవెగౌడను యింత చులకన చేస్తాడా అని ఆగ్రహించారు. వారిని మరింత రెచ్చగొట్టడానికి దేవెగౌడ పేపర్లలో మొదటిపేజీల్లో యాడ్స్ యిచ్చాడు. ప్రభుత్వాఫీసుల్లో సిద్ధరామయ్య తన ఫోటోలు తీయించేశాడని, మాజీ ముఖ్యమంత్రికి, మాజీ ప్రధానికి దక్కుతున్న గౌరవం యిదనీ వాటిల్లో వాపోయాడు. అందువలన వారిలో 19% మాత్రమే కాంగ్రెసుకు ఓటేశారు. ఒక్కళిగలు దేవెగౌడను, జెడిఎస్‌ను మాత్రమే తమ పార్టీగా ఫీలయ్యారు. బిజెపికి రాష్ట్రమంతా యింత హవా ఉన్నా అది లింగాయతులకు మాత్రమే మేలు చేసే పార్టీ అనే అభిప్రాయంతో కాబోలు 11% మంది మాత్రమే ఓటేశారు. జెడిఎస్ నుంచి కాంగ్రెసుకు పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఒక్కళిగ నాయకులకు వారి కులం మద్దతు లభించలేదు. ముగ్గురూ ఓడిపోయారు. పాతమైసూరు ప్రాంతంలో జెడిఎస్‌కు 41% ఓట్లు, సీట్లలో 50% వచ్చాయి. హాసన్, మండ్యా, రామనగరం, బెంగుళూరు (రూరల్), మైసూరు, చామరాజనగర్ జిల్లాలలో గతంలో 16 వస్తే యీసారి 24 వచ్చాయి. కాంగ్రెసుకు గతంలో 19 వస్తే యీసారి 8 వచ్చాయి. సిద్ధరామయ్య పోటీ చేసిన చాముండేశ్వరిలో 2.20 లక్షల మంది ఓటర్లుంటే ఒక్కళిగలు 1.30 లక్షలున్నారు. వాళ్లు తమ కసి తీర్చుకున్నారు. జెడిఎస్‌లో ఉండగా అక్కణ్నుంచే 5 సార్లు నెగ్గిన సిద్ధరామయ్యపై ఒకప్పటి అతని అనుచరుడు జిటి దేవెగౌడ జెడిఎస్ తరఫున పోటీ చేస్తే అతనికి 1.21 లక్షల ఓట్లు వచ్చాయి. 36 వేల తేడాతో సిద్ధరామయ్య ఓడిపోయాడు.

సిద్ధరామయ్య సొంత కులమైన కురుబల్లో 60% మంది కాంగ్రెసుకు వేయగా, 27% మంది బిజెపికి వేశారు. సిద్ధరామయ్య పరిపాలనలో మతకలహాలు జరగకుండా శాంతి నెలకొన్నందుకో, సిద్ధరామయ్య నిర్వహించిన అన్నభాగ్య, శాదీ భాగ్య వంటి పథకాల వలన లబ్ధి పొందడం చేతనో, బిజెపి అంటే భయమో కానీ ముస్లిములు మాత్రం 78% మంది కాంగ్రెసుకు ఓటేశారు

**ప్రాంతాల వారీ ఓటింగు సరళి** – ఇప్పుడు ప్రాంతాల వారీగా చూస్తే బిజెపి విస్తృతి, కాంగ్రెసు దెబ్బ తిన్న పరిస్థితి బాగా అర్థమౌతుంది. ఈ ప్రాంతాల విషయంలో కాస్త అస్పష్టత ఉందని గతంలోనే రాశాను. కొన్ని జిల్లాలను కొందరు విశ్లేషకులు ఒక ప్రాంతంలో గణిస్తే, యితరులు పక్కనున్న ప్రాంతంలో కలుపుతున్నారు. అనేకం పరిశీలించాక నేను ఫైనల్‌గా హిందూ పత్రిక వారి వర్గీకరణను తీసుకుంటున్నాను.

1) 56 సీట్లున్న బొంబాయి-కర్ణాటకలో కాంగ్రెసు చావుదెబ్బ తింది. 2013లో 34 సీట్లు గెలిచిన ఆ పార్టీ యీసారి 19 తెచ్చుకుంది. బిజెపి 16 నుంచి 34 కి పెరిగింది. 2014 లెక్క ప్రకారమైతే 44 రావలసి ఉంది. జెడిఎస్‌కు 1 నుంచి 2కి పెరిగాయి. ఇతరులకు 1 వచ్చింది. ఉత్తర బొంబాయి-కర్ణాటక ప్రాంతంలో కాంగ్రెసు బిజెపి నుంచి కొన్ని స్థానాలను గుంజుకోగలిగింది. 2) మన ఆంధ్ర నాయకులు తమ ప్రచారం ప్రభావం పని చేసిందని చెప్పుకుంటున్న ప్రాంతం హైదరాబాదు- కర్ణాటకలో 32 సీట్లుంటే, బిజెపి బలం 7 నుంచి 13కి ఎదిగింది, కాంగ్రెసు 20 నుంచి 15కి తగ్గింది. కర్ణాటకలో 85 లక్షల మంది తెలుగువారు ఉన్నారని, వారిలో 25 లక్షల మంది మాత్రమే ఓటర్లగా నమోదయ్యారని ఓ పత్రిక రాసింది. ఎంతవరకు నిజమో తెలియదు. తెలుగు ఓటర్లు అధికంగా ఉండే 32 స్థానాల్లో బిజెపి 8 మాత్రమే గెలిచిందని టిడిపి చెప్పుకుంటోంది. హైదరాబాదు కర్ణాటక మొత్తంగా చూస్తే గతంలో 6 వస్తే యీసారి 20 వచ్చాయని రామ్ మాధవ్ చెప్తున్నారు. ఎవరి వాదనకు అనుకూలంగా వారు నియోజకవర్గాలకు వేర్వేరు లేబుళ్లు అంటించేస్తున్నారులాగుంది. మొత్తం మీద చూస్తే హైదరాబాదు కర్ణాటకలో బిజెపి సీట్లు 181% పెరిగాయి, కాంగ్రెసుకు సీట్లు 75% తగ్గాయి.

3) 16 సీట్ల కోస్తా కర్ణాటకలో బిజెపి 11 సీట్లతో తుడిచిపెట్టేసింది. గతంలో 3 ఉండేవి. కాంగ్రెసు బలం 12 నుంచి 2కి పడిపోయింది. జెడిఎస్ బలం 1 నుంచి 3కి పెరిగింది. ఇక్కడ హిందూత్వ ప్రచారం ముమ్మరంగా సాగింది. టిప్పు జయంతి నిర్వహణకై సిద్ధరామయ్య దసరా ఉత్సవాల బజెట్‌లో కోత పెట్టాడని, ప్రపంచ కన్నడ సమ్మేళనాలకు డబ్బు లేదన్నాడని ప్రచారం చేశారు. ఆరెస్సెస్, బిజెపిలకు చెందిన 23 మంది కాంగ్రెసు పరిపాలనలో చంపబడ్డారని ఉడుపి నుంచి బిజెపి ఎంపీగా ఉన్న శోభా కరంద్లాజే గత ఏడాది జులైలో రాజనాథ్ సింగ్‌కు ఒక లేఖ రాసింది. ఆమె యిచ్చిన పేర్లను పరిశీలించిన జర్నలిస్టులు వారిలో ఒకరు బతికే ఉన్నారనీ, తక్కినవారిలో వ్యక్తిగత కారణాలతో చంపబడినవారు, సహజమరణం పొందినవారు తప్ప రాజకీయ కారణాలతో కాదని తేల్చారు. నిజానిజాలపై విచారణ జరిపినవారు లేరు కానీ బిజెపి నాయకులు ఆ ఆరోపణను తమ ప్రచారానికి శుభ్రంగా వాడుకున్నారు. మోదీ కూడా అమాయకులైన హిందూ కార్యకర్తల హత్యలను ఆపడంలో కాంగ్రెసు ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ ప్రాంతంలో ఆర్థిక సిద్ధాంతాలు పూర్తిగా మరుగున పడ్డాయి. మతాల వారీగా ప్రజల్లో చీలిక వచ్చేసింది. హిందూత్వ శక్తులు బలపడుతూ ఉంటే కాంగ్రెసు ప్రభుత్వం గుడ్లప్పగించి చూస్తూ ఉందని, యిక్కడి హిందువుల్లో బిల్లవులకు, బంటులకు పదవులు యిచ్చి వారిని తమవైపు తిప్పుకుని హిందూత్వ శక్తులకు అడ్డుకట్ట వేయలేదని సెక్యులరిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ఇక్కడ బిజెపి 50% కంటె ఎక్కువ ఓట్లు తెచ్చుకుంది.

4) 48 సీట్ల మధ్య కర్ణాటకలో బిజెపి బలం 6 నుంచి 29కి పెరిగింది. దాదాపు 5 రెట్లు. కాంగ్రెసు బలం సగానికి సగం 24 నుంచి 12కి పడిపోయింది. జెడిఎస్ బలం కూడా దాదాపు సగానికి అంటే 13 నుంచి 7కి పడిపోయింది. 4) 40 స్థానాల దక్షిణ కర్ణాటకలో కాంగ్రెసు బలం 18 నుంచి 13కి పడింది. బిజెపి బలం 3 నుంచి 7కి పెరిగింది. జెడిఎస్ బలం 15 నుంచి 16కి పెరిగింది. ఇతరులకు 2 వచ్చాయి. అంటే మైసూరు, చామరాజనగర్‌లలో తప్పిస్తే తక్కిన చోట్ల జెడిఎస్‌కు ప్రత్యర్థిగా కాంగ్రెసు స్థానంలోకి బిజెపి వచ్చింది. 5) బెంగుళూరులో (ఈ 32 సీట్లుంటే 30 వాటిల్లో ఓటింగు జరిగింది. బిజెపి అప్పుడు 11 యిప్పుడు 10 తెచ్చుకుంది. కాంగ్రెసు గతంలో 14, యిప్పుడు 15 గెలుచుకుంది. జెడిఎస్ 6 నుంచి 5కి తగ్గింది.

**లింగాయతులు ఊరుకుంటారా?** – ఇప్పుడీ అంకెలన్నీ చూశాక కర్ణాటక ప్రభుత్వం భవిష్యత్తు ఎలా ఉంటుందో లీలగా ఊహించవచ్చు. ఒక్కళిగలకు ముఖ్యమంత్రి పదవి దక్కింది. ఎస్సీలలో హొలియలకు ఉపముఖ్యమంత్రి పదవి దక్కింది. తమ నాయకుడైన ఎడియూరప్పకు అధికారం నోటి దాకా వచ్చి కింద పడిపోయినందుకు, అతని స్థానంలో తమ ప్రత్యర్థులైన ఒక్కళిగలు వచ్చినందుకు లింగాయతులు మండిపడుతూ ఉండివుంటారు. బిజెపి అధికారంలోకి వచ్చి ఉంటే కోస్తా కర్ణాటక ప్రశాంతంగా ఉండేదేమో కానీ, యిప్పుడు అక్కడ హిందూత్వ శక్తులు విజృంభించవచ్చు. సిద్ధరామయ్యకు సమీప భవిష్యత్తులో ఏ పదవీ దక్కకపోయినా ఆశ్చర్యం లేదు. పాలన విషయంలో ఫర్వాలేదనిపించుకున్నా కుల సమీకరణాలతో ఆటలాడి ముప్పు తెచ్చుకున్నాడు. రాజకీయంగా బలవంతులైన అగ్రకులాలు తమ తడాఖా చూపించాయి. రానున్న రోజుల్లో కర్ణాటకలో బిసిలను నమ్ముకుని గోదాలోకి దిగడానికి ఎవరూ సాహసించరు. (సమాప్తం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2018)**

**2018 జూన్ 2 టాబ్లాయిడ్‌కై** **ఎమ్బీయస్: ఉప-ఫలితాలు ప్రమాద ఘంటికలా?**

ఉపయెన్నికల ఫలితాలు రాగానే తెలుగు మీడియా చాలా తీవ్రంగా రియాక్టవుతోంది. కమలం వికలమై పోయిందని, 2019లో బిజెపి మళ్లీ అధికారంలోకి రావడం ప్రశ్నార్థకమే అనీ.. యిలా చాలా ఊహాగానాలు సాగుతున్నాయి. నిజంగా అంత ఉందా?

లేకపోతే యిది ఉత్తుత్తి అడావుడా? ఫలితాలు కాస్త లోతుగా చూస్తే అర్థం కావచ్చు. ఈ మధ్యే అమిత్ షా అన్నాడు – ఉపయెన్నికలలో ఓటమి గురించే మాట్లాడుతున్నారు, అసెంబ్లీ ఎన్నికలలో గెలుపు గురించి మాట్లాడడం లేదు అని. ఉపయెన్నికలు బిజెపికి కలిసి రావటం లేదు. 2014 నుంచి 27 లోకసభ ఉపయెన్నికలు జరిగితే బిజెపి గెలిచింది ఐదిటిలోనే. వాటిలో 13 సిట్టింగ్ సీట్లు. అంటే 8 పోగొట్టుకుంది అన్నమాట. కానీ రాష్ట్రాల ఎన్నికల వరకు వచ్చేసరికి ఒక రాష్ట్రం తర్వాత మరొకటి గెలుస్తూ వస్తోంది. మరి బిజెపికి ఆదరణ ఉన్నట్టా? పోయినట్టా? తగ్గినట్టా? పెరిగినట్టా? ఉపయెన్నికలు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో జరుగుతాయి. వాటిని సాధారణ ఎన్నికలకు ప్రొజెక్టు చేసి చూడడం ఒక్కోప్పుడు పొరబాటవుతుంది. అలా అని ఉపయెన్నికలకు ఏ ప్రాధాన్యతా లేదా? అంటే ఉంటుంది. అవి ప్రజలకు యిచ్చే సంకేతాలు. అందువలన వాటిని విస్మరించడానికీ లేదు.

ఒక వరుసలో వెళితే వీటిని అర్థం చేసుకోవడం సులభం. ముందుగా ఉపయెన్నికలతో కంటె జరిగిన బెంగుళూరు రాజరాజేశ్వరి నగర్ అసెంబ్లీ నియోజకవర్గం సాధారణ ఎన్నిక గురించి. గతంలో అది కాంగ్రెసుదే. ఈ సారీ కాంగ్రెస్సే 41 వేల మెజారిటీతో గెలిచింది. బిజెపి దాదాపు గెలుపు గడపదాకా వచ్చిందన్న విషయం ఓటర్లను ప్రభావితం చేయలేదు.

అసెంబ్లీ స్థానాల ఉపయెన్నికల గురించి మొదలుపెడదాం. వీటిలో పెద్దగా వివరణ అక్కర్లేనివి కొన్ని ఉన్నాయి.

1) మహారాష్ట్రలోని పలూస్–కోడేగావ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పోటీ లేకుండా తన స్థానాన్ని నిలుపుకుంది. 2) ఝార్ఖండ్‌లోని సిల్లి, గోమియా నియోజకవర్గాల్లో రెండు చోట్లా జెఎంఎం తన స్థానాలను 13 వేల మెజారిటీతో నిలుపుకుంది. బిజెపి మూడో స్థానానికి దిగజారింది. 3) మేఘాలయలోని అంపటి నియోజకవర్గంలో కాంగ్రెస్ 3 వేల మెజారిటీతో తన స్థానాన్ని నిలుపుకుంది. 4) బెంగాల్ మహేశ్‌తల నియోజకవర్గంలో తృణమూల్ 62 వేల మెజారిటీతో తన స్థానాన్ని నిలుపుకుంది. బిజెపి రెండో స్థానానికి ఎగబాకి, లెఫ్ట్ ఫ్రంట్‌ను మూడో స్థానానికి నెట్టేసింది. 5) కేరళ చెంగనూర్ నియోజకవర్గంలో సిపిఎం కాంగ్రెసును ఓడించి 21 వేల మెజారిటీతో తన స్థానాన్ని నిలుపుకుంది. మూడో స్థానంలో నిలిచిన బిజెపి 35 వేల ఓట్లు సంపాదించగలిగింది. 6) ఉత్తరాఖండ్ తరాలీ నియోజకవర్గంలో కాంగ్రెసుతో ముఖాముఖీ పోటీలో బిజెపి కేవలం 2 వేల మెజారిటీతో తన స్థానాన్ని నిలుపుకుంది. అది కూడా మరణించిన ఎమ్మెల్యే భార్యను నిలబెడితే! 7) ఇక విజేత మారిన పంజాబ్ షాకోట్ నియోజకవర్గం అకాలీదళ్‌కు 20 ఏళ్లుగా కంచుకోట. పైగా యీసారి ఆప్‌తో చేతులు కలిపింది. అయినా కాంగ్రెసు 39 వేల మెజారిటీతో గెలిచింది.

వీటన్నిటిలోను బిజెపికి పెద్దగా సంకేతాలు లేవు. కానీ బిహార్, యుపి, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఫలితాలే కాస్త కలవరపెడతాయి. ఎందుకంటే 2014 పార్లమెంటు ఎన్నికలలో యుపిలో బిజెపి, మిత్రపక్షాలు 73, మహారాష్ట్రలో 41 (బిజెపికి 23, శివసేనకు 18), బిహార్‌లో 31 వచ్చాయి. అధికారంలోకి రావడానికి యీ రాష్ట్రాలు ప్రధానంగా దోహదం చేశాయి. ఇప్పుడు మారిన పరిస్థితులు ఆ అంకెలను మారుస్తాయా అని ఎదురు చూస్తున్నవారు ఈ ఉపయెన్నికల ఫలితాలపై దృష్టి సారించారు. బిహార్‌లో 2014లో నీతీశ్, లాలూ, కాంగ్రెసు కలిసి వున్నా బిజెపి, లాలూ పశ్వాన్‌తో కలిసి ఘనవిజయం సాధించింది. తర్వాతి రోజుల్లో నీతీశ్ లాలూ కూటమితో తెగతెంపులు చేసుకుని బిజెపితో చేతులు కలిపాడు. ఆ తర్వాత వచ్చిన ఉపయెన్నికల ఫలితాలు నీతీశ్, బిజెపిలకు వ్యతిరేకంగా, లాలూకు అనుకూలంగా వచ్చాయి. ఇలాటి పరిస్థితుల్లో ఈశాన్య బిహార్‌లో సరిహద్దుల్లో ఉన్న జోకిహాట్ అనే ఒక అసెంబ్లీ స్థానానికి ఉపయెన్నిక వచ్చింది. రాష్ట్ర జనాభాలో 17% మంది ఉన్న ముస్లిములు ఆ నియోజకవర్గంలో అధికసంఖ్యలో ఉన్నారు. మొహమ్మద్ తస్లీముద్దీన్ అనే లాలూ అనుయాయి ఆ ప్రాంతాల్లో పేరున్న నాయకుడు. అతని కొడుకు సర్ఫరాజ్ ఆలమ్ కూడా. ఇద్దరూ ఏ పార్టీ తరఫునుంచి పోటీ చేసినా 9 సార్లుగా నెగ్గుతూ వచ్చారు. తాజాగా తస్లీముద్దీన్ ఆరాడియా పార్లమెంటు నియోజకవర్గం నుంచి తండ్రి, జోకిహాట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కొడుకు జెడియు టిక్కెట్‌పై గెలిచారు. 2017 సెప్టెంబరులో తండ్రి చనిపోవడంతో, కొడుకు బిజెపితో చేతులు కలిపాడంటూ నీతీశ్ పార్టీ జెడియును విడిచి లాలూ పార్టీ ఆర్జేడీలో చేరి అక్కణ్నుంచి పోటీ చేశాడు, బిజెపి అభ్యర్థిని ఓడించి నెగ్గాడు. అతని రాజీనామా వలన ఖాళీ అయిన జోకిహాట్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆర్జేడీ అతని తమ్ముడు షానవాజ్ ఆలమ్‌ను నిలబెట్టింది. అతనిపై పోటీకి జెడియు విగ్రహాల చోరీ నుంచి గ్యాంగ్ రేప్ వరకు అనేక కేసులున్న ముర్షీద్ ఆలమ్ అనే మాజీ గ్రామాధికారిని నిలబెట్టింది.

ఈ సీటు ఎలాగైనా గెలవాలని నీతీశ్ తను ప్రచారం చేయడమే కాక కాబినెట్‌లో సగం మంది మంత్రులను కూడా తిప్పాడు. 'నేను ముస్లిం‌ల కోసం ఎంతో చేశాను. మీ సంక్షేమం కోసం రూ.800 కోట్లు విడిగా పెట్టాను. మతకలహాలు జరగకుండా చూశాను' అని నీతీశ్ ఒక సభలో చెప్పుకుంటూ ఉంటే ఒక శ్రోత నిలబడి 'అలా అయితే యిటీవలి రామనవమి ఊరేగింపుల సందర్భంగా 10 జిల్లాల్లో మతపరంగా ఘర్షణ వాతావరణం ఎందుకు ఏర్పడింది?' అని అడిగాడు. హిందూ ఓటర్లందరినీ ఐక్యం చేయడానికి బిజెపి యిటువంటి ఊరేగింపులు కత్తులు, కఠార్లతో నిర్వహిస్తూ ఉంటుంది. దానివలన ఘర్షణ వాతావరణం ఏర్పడుతుంది. బెంగాల్‌లోనూ యిదే తంతు. నీతీశ్ వెళ్లిన మర్నాడు లాలూ కొడుకు తేజస్వి యాదవ్ వచ్చి మీటింగు పెడితే మూడు రెట్లు ఎక్కువమంది జనం వచ్చారు. తేజస్వి చురుకైన నాయకుడిగా ఎదుగుతున్నాడు. వాళ్ల నాన్న 'ఐటీ గీటీ జాన్తానై' అని తీసిపారేసినా, యితను మాత్రం ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తూ ప్రజల్లోకి దూసుకుపోతున్నాడు. తండ్రి జైల్లో ఉన్నా పార్టీని విజయపథంలో నడిపిస్తున్నాడు. నీతీశ్, బిజెపిలను విడిచి వచ్చిన జితన్‌రాం మాంఝీ పార్టీతో పొత్తు పెట్టుకున్నాడు. అగ్రవర్ణస్తులు – ఎంబిసిలు ఒక పక్క యాదవులు–ముస్లిములు మరో పక్క మోహరించారు. చివరకు లాలూ అభ్యర్థే 41 వేల మెజారిటీతో నెగ్గాడు. నిజానికి అది ముస్లిము డామినేటెడ్ నియోజకవర్గం. అందువలన బిజెపికి కానీ బిజెపితో అంటకాగుతున్న నీతీశ్‌కు కానీ విజయం సిద్ధిస్తుందనుకోవడం అత్యాశ. ఇదే పరిస్థితి రాజ్యమంతా ఉందనుకోవడం అపోహ. కానీ యీ పరాజయం జెడియును కృంగదీసింది. బిజెపితో కలవడం వలననే ఓడిపోయాం అని జెడియు ప్రకటించింది. నిజానికి గాలికోడి లాటి నీతీశ్ యీ మధ్య బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడడం

మొదలుపెట్టాడు. నోట్ల రద్దు శభాష్ అని గతంలో మెచ్చుకున్నవాడే యిప్పుడు అది లోపభూయిష్టం అంటున్నాడు. ఓ పక్క ఆంధ్రకు ప్రత్యేక హోదా యిచ్చేందుకు సాంకేతికంగా కుదరదని కేంద్రం చెపుతున్నా 'మా బిహార్‌కు మాత్రం యివ్వండి' అంటూ బిజెపిని యిరుకున పెడుతున్నాడు. ఈ ఫలితం తర్వాత నీతీశ్ ఎత్తుగడలను జాగ్రత్తగా గమనించాలి.

ఇక మహారాష్ట్ర – ఇక్కడ పార్లమెంటు స్థానాలు రెండూ బిజెపివే. ఒకటి పోగొట్టుకుంది. మరొకటి 30 వేల మెజారిటీతో నిలబెట్టుకుంది. పాల్ఘర్‌లోని బిజెపి ఎంపీ చింతామణి వంగా చనిపోయాడు. అతని కొడుకు శ్రీనివాస్ వంగాను బిజెపి నిలబెడదామనుకుంటూండగానే శివసేన అతన్ని తన పార్టీలోకి లాగేసుకుంది. ఎందుకంటే ఆ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఒకే ఒక్క శివసేన అభ్యర్థి ఉన్నాడు. మరో నియోజకవర్గమైన భండారా–గోండియాలో 2014లో బిజెపి అభ్యర్థిగా లక్షన్నర మెజారిటీతో నెగ్గిన నానా పటోలే రైతు సమస్యల విషయంలో మోదీని ఘాటుగా విమర్శించి, పార్టీకి, తన స్థానానికి రిజైన్ చేసి కాంగ్రెసులో చేరాడు. దాంతో ఉపయెన్నిక అనివార్యమైంది. రెండు చోట్లా సంకట పరిస్థితే. పైగా ఒకప్పటి మిత్రపక్షం శివసేన యిప్పుడు శత్రుపక్షమైంది. అందువలన పాల్ఘర్‌లో కాంగ్రెసు నాయకుడైన రాజేంద్ర గవిట్‌ను బిజెపి తన పార్టీలోకి లాక్కుని తన అభ్యర్థిగా నిలబెట్టింది. (ఈనాటి బిజెపిలో ఆరెస్సెస్ సిద్ధాంతాలతో ముఖపరిచయం ఉన్నవారు బహుతక్కువమంది ఉన్నారంటే దానికి కారణం యిలాటి ఫిరాయింపులే). రంగంలో కాంగ్రెసు, బహుజన వికాస్ అఘాడీ పార్టీలు కూడా ఉన్నాయి కాబట్టి ప్రతిపక్ష ఓట్లు చీలిపోతాయని లెక్క వేసింది. నిజానికి అదే జరిగింది. బిజెపికి 2.72 లక్షల ఓట్లు (2014లో 5.33 వచ్చాయి) రెండో స్థానంలోని శివసేనకు 2.42 లక్షలు, బహుజన వికాస్ అఘాడీకి 2.22 లక్షల, కాంగ్రెసుకు 48 వేల ఓట్లు వచ్చాయి. మొత్తం మీద 30 వేల తేడాతో బిజెపి గట్టెక్కేసింది. ఇక రెండో స్థానమైన భండారా–గోండియా ముఖ్యమంత్రి సొంత ప్రాంతమైన విదర్భలో ఉంది. అక్కడ ఎన్సీపీ అభ్యర్థికి కాంగ్రెసు మద్దతు ఉంది. దాంతో అది 49 వేల మెజారిటీతో బిజెపి అభ్యర్థిని ఓడించింది.

ఇక యుపికి వస్తే – ఇక్కడ ప్రతిపక్షాలు ఏకం కావడంతో బిజెపి ఒక అసెంబ్లీ స్థానాన్ని, ఒక పార్లమెంటు స్థానాన్ని పోగొట్టుకుంది. యోగి ఆదిత్యనాథ్ కోస్తా కర్ణాటకలో ఓట్లు తెచ్చిపెట్టగలిగాడు కానీ సొంత రాష్ట్రంలో అతనికి పలుకుబడి లేదు. మైనారిటీలకు అతనిపై కోపం ఎలాగూ ఉంది. ఇటీవల దళితులు కూడా చేరారు. ఏప్రిల్ 1న లఖనవ్‌లో బిజెపి దళిత ఎంపీ సావిత్రీబాయి పూలే యోగి ప్రభుత్వాన్ని తిట్టిపోసింది. ప్రభుత్వ సంస్థలను ప్రయివేటు పరం చేయడం ద్వారా దళిత రిజర్వేషన్లకు స్వస్తి పలుకుతున్నాడని ఆరోపించింది. మరో ముగ్గురు బిజెపి దళిత ఎంపీలు కూడా వేర్వేరు కారణాలతో దళితులకు అన్యాయం చేస్తున్నాడంటూ యోగి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. అతని సొంత పార్లమెంటు నియోజకవర్గం, అతని ఉపముఖ్యమంత్రి పార్లమెంటు నియోజకవర్గం రెండిటిలోనూ ఉపయెన్నికలలో ఓడిపోవడం అవమానం తెచ్చిపెట్టింది. ఇప్పుడు కొత్తగా యివి చేరాయి. బిజెపిని ఎదిరించాలంటే తమ విభేదాలను పక్కన పెట్టాలని నిశ్చయించుకున్న ప్రతిపక్షాలు తమ తడాఖాను చూపించాయి. ఈ సర్దుబాట్లకు యువనాయకులు – ఎస్పీలో అఖిలేశ్ యాదవ్, ఆర్ఎల్‌డిలో అజిత్ సింగ్ కొడుకు జయంత్ చౌధురి చొరవ తీసుకున్నారు. వారికి మాయావతి మద్దతు పలికింది. కైరానా నియోజకవర్గం ఒకప్పుడు బిఎల్‌డికి కంచుకోట అయిన పశ్చిమ యుపిలో ఉంది. కానీ 2014లో బిజెపి తరఫున గుజ్జర్ కులస్తుడైన హుకుంసింగ్ 2 లక్షల పై చిలుకు మెజారిటీతో నెగ్గాడు. అతను చనిపోవడంతో యీసారి అతని కుమార్తెను అభ్యర్థిగా పెట్టారు. ఎస్పీ–బియస్పీ గతంలోనే చేతులు కలిపాయి. ఈసారి ఆర్ఎల్‌డిని, కాంగ్రెసుని కూడా కలుపుకున్నాయి. అక్కడ జాట్లు, ముస్లిములు బహుళ సంఖ్యలో ఉన్నారు. మొత్తం జనాభా 16 లక్షలైతే ముస్లింలు 5.50 లక్షలు, జాట్లు 1.50 లక్షలు. వారిద్దరి మధ్య 2013లో ముజఫర్‌నగర్‌లో కలహాలు జరగడంతో ఎడమొగం, పెడమొగంగా ఉన్నారు. అల్లర్లను సరిగ్గా కంట్రోలు చేయలేకపోయిందని యిద్దరూ ఎస్పీపై గుర్రుగా ఉన్నారు.

అందువలన ప్రతిపక్షాలు ఒక ప్రణాళిక రచించాయి. అఖిలేశ్ బియస్పీ నుంచి తన పార్టీలోకి వచ్చిన తబస్సుమ్‌ను ఆర్ఎల్‌డిలో చేరి, దాని అభ్యర్థిగా పోటీ చేయమన్నాడు. తను కానీ, తన పార్టీలో ముస్లిం నాయకుడు ఆజంఖాన్ కానీ ప్రచారానికి వెళ్లలేదు. తబస్సుమ్ జాట్లు ఉన్న ప్రాంతంలో ప్రచారం చేయలేదు. అజిత్ సింగ్, అతని కొడుకు ముస్లిం ప్రాంతాలకు వెళ్లి ప్రచారం చేయలేదు. అభ్యర్థి పేరు, ఫోటో లేకుండా కేవలం ఆర్ఎల్‌డి ఎన్నికల చిహ్నమైన బోరింగు పంపు గుర్తునే వాల్‌పోస్టర్లలో వాడారు. జాట్లకు, దళితులకు కూడా గొడవలుండడం చేత దళితులున్న ప్రాంతాల్లో బియస్పీ కార్యకర్తలు అభ్యర్థి పేరునే ఎక్కువ ప్రచారంలోకి తెచ్చారు. అక్కడ దళితులు 2.5 లక్షలు, గుజ్జర్లు 1.4 లక్షలు, అగ్రవర్ణాలు 3.5 లక్షలు, యితర ఒబిసిలు 1.6 లక్షలు ఉన్నారు. యుపిలో ఎస్పీ, బియస్పీ ఓట్ల బ్యాంకులను చెదరగొట్టడానికి యోగి ప్రభుత్వం బిసి, ఎస్సీ కులాల్లో వర్గీకరణ తెచ్చి చీలుద్దామని పథకాలు రచిస్తోంది. ఇది జాట్లు, జాతవులకు ఆగ్రహం తెప్పించింది. మొత్తం మీద అందరూ కలిసి బిజెపి అభ్యర్థిని ఓడించారు. తబస్సుమ్‌కు 45 వేల మెజారిటీ వచ్చింది. దీనికి రైతుల ఆగ్రహం తోడయ్యింది. చెరుకు పండించే రైతులకు సర్కారు రూ.13,000 కోట్లు బకాయి పడింది. దాని మాట ఎత్తకుండా ఆలీగఢ్ ముస్లిం యూనివర్శిటీలో జిన్నా ఫోటో గురించే బిజెపి ఎక్కువ చర్చిస్తోంది. మతపరంగా ఓట్లను సమీకరించడానికి యోగి ఆదిత్యనాథ్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి, ముజఫర్ నగర్ అల్లర్ల గురించి పదేపదే ప్రస్తావించాడు. ఆ అల్లర్లలో జాట్లపై పెట్టిన కేసులు మాత్రం ఎత్తివేస్తానని హామీ యిచ్చాడు. రైతులు టీవీల్లో చెప్పారు – 'జిన్నా గోల మాకేల? గన్నా (చెరుకు) సంగతి తేల్చండి' అని. మతం ఎక్కువదూరం తీసుకెళ్లదని బిజెపి యిప్పటికైనా గుర్తించాలి. 2014లో ఓటింగు శాతం 74 కాగా, యీ సారి 54 మాత్రమే. అంటే బిజెపి ఓటర్లు ఉత్సాహంగా ముందుకు రాలేదని అర్థమవుతోంది.

ఇక అసెంబ్లీ నియోజకవర్గమైన నూర్పూర్‌కు వస్తే బియస్పీ సహాయంతో ఎస్పీ బిజెపి నుండి ఆ స్థానాన్ని లాక్కుంది. 44 వేల మెజారిటీ వచ్చింది. చివరగా నాగాలాండ్‌లో ఎన్పీఎఫ్ స్థానాన్ని బిజెపి మిత్రపక్షమైన ఎన్డీపిపి 1.73 లక్షల మెజారిటీతో గెలిచింది. సిఎం సొంత స్థానమది. కేంద్రంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీనే అక్కడ గెలిపిస్తూ ఉంటారు.

ఈ ఫలితాలను బట్టి చూస్తే ప్రతిపక్షాలు ఏకమైతే బిజెపికి ఓటమి తప్పదు అనేది తెలుస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన 20 ఏళ్ల వరకు కాంగ్రెసు కేంద్రంలోను, చాలామటుకు రాష్ట్రాలలోను అధికారంలో ఉండేది. దాన్ని ఓడించడానికి విడివిడిగా ప్రయత్నించి చివరకు నానాగోత్రాల ప్రతిపక్షాలు ఏకమై కొన్ని చోట్ల ఓడించాయి. అయితే మళ్లీ వాళ్లల్లో వాళ్లు కొట్టుకుని పడిపోయారన్నది వేరే విషయం. అలాటి ఐక్యత మళ్లీ యిప్పుడు, బిజెపికి వ్యతిరేకతంగా సాధించడం సాధ్యమా? అనేదే ప్రశ్న. ఒకటి, రెండు నియోజకవర్గాల్లో పొత్తు అంటే ఫర్వాలేదు కానీ రాష్ట్రమంతా పొత్తులంటే ఎవరు ఎన్ని సీట్లు డిమాండు చేస్తారో తెలియదు. యుపి అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెసు తన తాహతు కంటె ఎక్కువగా ఎస్పీ నుండి తీసుకుని తను దెబ్బ తిని, ఎస్పీని దెబ్బ తీసింది. ఇప్పుడు మాయావతి కూడా తగినన్ని సీట్లు యివ్వకపోతే ఊరుకోనంటోంది. ఎందుకంటే యిప్పటివరకు చరిత్ర ఏం చెపుతోందంటే మాయావతి చెపితే దళితులు యితర పార్టీలకు ఓట్లేస్తున్నారు కానీ ఎస్పీ, బిఎల్‌డి వంటి పార్టీలు తమ ఓట్లను బియస్పీ అభ్యర్థికి బదలాయించ లేకపోతున్నారు. నాయకులు చెప్పినా పార్టీ అభిమానులు దళితులకు ఓట్లు వేయడానికి యిచ్చగించటం లేదు. అందువలన తనే ఎక్కువ సీట్లు తీసుకుందామని మాయావతి ప్లాను.

ఇక కాంగ్రెసు ముఖ్యమైన ఫ్యాక్టర్. అది కూడా ఒక ప్రాంతీయ పార్టీగా మారిపోయింది. కానీ ఇంకా జాతీయ పార్టీయే అనుకుంటోంది. కాంగ్రెసు వేదికపైకి అందరూ వస్తే తను ప్రధాని కావడం సాధ్యమే అన్నాడు రాహుల్. కాంగ్రెసు వేదికపైకి అందరూ ఎందుకు రావాలి? కూటమిలో ఒకరిగా కాంగ్రెసు ఉండలేదా? మోదీకి ప్రత్యర్థిగా రాహుల్‌ను ముందుకు పెట్టుకుని వెళితే ప్రతిపక్ష కూటమికి ఎవరైనా ఓట్లేస్తారా? తాజా సర్వే ప్రకారం ప్రజాకర్షణ శక్తి విషయంలో 2017 మేలో మోదీ 44%, రాహుల్ 16% ఉంటే 2018 మేలో మోదీ 37%, రాహుల్ 24% ఉంది. అంటే యిద్దరి మధ్య 13% తేడా ఉంది. రాహుల్ అది ఎప్పటికి పూడ్చేను? అహంభావంతో భాగస్వాములను చిన్నచూపు చూడడం చేతనే కాంగ్రెసు యీ స్థితికి చేరింది. ఇప్పుడు కూడా కర్ణాటకలో ఉమ్మడి ప్రభుత్వం బేరసారాలు పూర్తి కాలేదు చూడండి. ఇలాటి పరిస్థితుల్లో ఒక్కో రాష్ట్రంలో ఒక్కొక్కరితో సర్దుబాట్లు చేసుకుంటూ రావడం కాంగ్రెసు తరమా? ప్రాంతీయ పార్టీల్లో కూడా ఒక్కోరిది ఒక్కో ఎజెండా. అందరూ కలిసి ఉమ్మడి ప్రణాళిక రచించుకోగలరా? దేశమంతా తెలిసిన మొహం వారిలో ఉందా? మోదీలో లోపాలున్నాయని ఒప్పుకుంటూనే అతనికి ప్రత్యామ్నాయం లేదు కాబట్టి అతనికే ఓటేస్తున్నామని నిట్టూర్చేవారెందరో ఉన్నారు.

ఇదే బిజెపికి ఎడ్వాంటేజిగా మారింది. ఉపయెన్నికల మాట ఎలా ఉన్నా 2019లో మోదీ హవాతో గెలిచేస్తామని బిజెపి నాయకులు చెప్పుకుంటున్నారు. 2014కి, 2019కి చాలా తేడా ఉంది. 2014 ఎన్నికలకు ముందుగానే కాంగ్రెసు ఓటమిని ఒప్పుకుని మెకానికల్‌గా ముందుకు వెళ్లింది అన్నారు సల్మాన్. అది నిజమే, బిజెపి చేస్తున్న ఆరోపణలకు ఎలా బదులు చెప్పాలో తెలియలేదు వాళ్లకి. పైగా మోడర్న్ టెక్నాలజీని మోదీ అద్భుతంగా వాడుకున్నారు. మోదీ వచ్చి అద్భుతాలు చేస్తాడని అప్పట్లో అనేకమంది తటస్థులు కూడా నమ్మి ఓటేశారు. మోదీ పెర్‌ఫామెన్స్‌పై భిన్నాభిప్రాయాలు ఉన్నా ఆ ఎక్స్‌పెక్టేషన్స్‌ను అందుకోలేదన్న విషయంలో ఏకాభిప్రాయమే. అందువలన మోదీ హవా 2014 స్థాయిలో గట్టిగా వీచదనేది నిశ్చయం. ఇక 2014 ఎన్నికలకై ప్రచారం చేయడానికి మోదీ అప్పుడు వినియోగించినంత సమయం యిప్పుడు వినియోగించలేరు. అప్పుడు గుజరాత్ పాలన వేరేవారికి అప్పగించి తిరిగాడు. ఇప్పుడు ప్రధానిగా ఉండగా అంత కుదురుతుందా? మోదీ వస్తే తప్ప ఓటింగు సరళి బిజెపికి అనుకూలంగా మారని పరిస్థితి వచ్చి పడింది. ఇతర బిజెపి నాయకులు మోదీ భుజాలదాకా కూడా ఎదగటం లేదు, రేదర్ ఎదగనీయటం లేదు.

అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి గెలుస్తూ ఉన్నమాట వాస్తవం. దానికై యితర ప్రాంతాల నుంచి లక్షలాది వాలంటీర్లను తెచ్చి పనిచేయిస్తున్నారు. అమిత్ షా పూర్తి ఏకాగ్రతతో నెలల తరబడి పనిచేస్తున్నారు. దేశమంతా ఒకేసారి పార్లమెంటు ఎన్నికలు జరిగినపుడు అంతమంది వాలంటీర్లు ఎక్కణ్నుంచి వస్తారు? సమయం ఎంత కేటాయిస్తారు? ఈ సమస్య బిజెపి వారికీ తెలుసు. అందుకని నెగ్గడానికి అన్ని రకాల మార్గాలూ ప్రయోగిస్తున్నారు. ఎన్నికలంటే ఈసి (ఎలక్షన్ కమిషనర్)కు కాదు పని, ఈడి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్)కే ఎక్కువ పని అని సోషల్ మీడియాలో జోక్! ప్రతిపక్ష పార్టీల వారిపై ఈడి, సిబిఐ, ఐటీ వినియోగించడానికి ఏ మాత్రం వెనకాడటం లేదు. క్యాంపు రాజకీయాలు నిర్వహించి, కర్ణాటకలో బిజెపికి అధికారం దక్కకుండా చేసిన డికె శివకుమార ఆప్తుల యిళ్లపై తాజాగా ఐటీ దాడులు జరిగాయి. బెదిరించి, ఊరించి యితర పార్టీ నాయకులను తమ పార్టీలో చేర్చుకుంటూ పోవడం కూడా ప్రమాదకరమని బిజెపి ఎప్పటికి గుర్తిస్తుందో!

అయితే ఏది ఏమైనా 2019లోపున ప్రతిపక్షం కోలుకుని మోదీని ఓడించగలదని అనుకోవడం సరి కాదు. మే 2018లో జరిపిన లోకనీతి-ఏబిజి-సిఎస్‌డిఎస్ సర్వే ప్రకారం ఎన్డీయేకు 274 (37% ఓట్లు), అంటే దక్షిణాదిన మొత్తం 132 సీట్లలో 18-22, ఉత్తరాదిన మొత్తం 151 సీట్లలో 90 వస్తాయి. యుపిఏకు 164 (31%), అంటే దక్షిణాదిన మొత్తం 132 సీట్లలో 67-75, ఉత్తరాదిన మొత్తం 151 సీట్లలో 25 వస్తాయి. ఇతరులకు 105 (32%), దక్షిణాదిన మొత్తం 132 సీట్లలో 38-44, ఉత్తరాదిన మొత్తం 151 సీట్లలో 36 వస్తాయి. 2017 మేకు 2018 మేకు మధ్య సమాజంలోని భిన్నవర్గాల మధ్య వచ్చిన మార్పుని కూడా సర్వే చెప్పింది. ఎన్‌డిఏకు మద్దతు ఉన్నత తరగతిలో 2017 మేలో 50% ఉంటే 2018 మేకి అది 48% అయింది. అలాగే.. మధ్యతరగతి 46%-39%, దిగువ మధ్యతరగతి 46%-36%, పేదలు 37%-34%, వ్యాపారులు 50%-40%, రైతులు 49%-37%. యుపిఏ మద్దతు ఉన్నత తరగతి 24%- 28%, మధ్యతరగతి 29%-34%, దిగువ మధ్యతరగతి 24%-31%, పేదలు 30%-30%, వ్యాపారులు 25%-32%, రైతులు 27%-31% అయింది. ఇక ఇతరుల విషయంలో మార్పు ఉన్నత తరగతి 26%- 24%, మధ్యతరగతి 25%-27%, దిగువ మధ్యతరగతి 30%-33%, పేదలు 33%-36%, వ్యాపారులు 25%-28%, రైతులు 24%-32% అయింది. యుపిఏకు అనేక వర్గాల్లో మద్దతు పెరుగుతోంది కానీ ఎలా చూసినా ఎన్‌డిఏ కంటె అన్ని వర్గాల్లో

వెనకబడే ఉంది.

ఈ ఉపయెన్నికల ఫలితాలు బిజెపి పట్ల ప్రజాగ్రహాన్ని ప్రతిబింబిస్తున్నాయి. దాన్ని 2019 పోటికి ఎన్‌క్యాష్ చేసుకునే తెలివితేటలు ప్రతిపక్షాలకు లేకపోవచ్చు. కానీ లోపాలను సరిదిద్దుకునే అవకాశం బిజెపికి ఉంది. చూదాం, ఏం చేస్తారో! – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)

**2018 జూన్** **ఎమ్బీయస్: త్రిపుర నాయకత్వంలో మనస్పర్ధలు - 1/3**

త్రిపుర ముఖ్యమంత్రి విప్లవ్ దేవ్ వార్తల్లోకి ఎక్కుతున్నాడు – అవేమీ అతని ప్రతిష్ఠ పెంచేవి కావు. తలతిక్క వ్యాఖ్యలు చేయడం అతని అలవాటుగా మారింది. అతనికి ప్రస్తుతం త్రిపురకు బిజెపి ఇన్‌ఛార్జ్ అయిన సునీల్ దేవ్‌ధర్‌తో అస్సలు పడటం లేదు. మూణ్నెల్లలోనే వాళ్లకి అంత చెడిందా అని అందరూ ఆశ్చర్యపడేలా తయారైంది వ్యవహారం. సునీల్‌కు విప్లవ్ వ్యవహార శైలి నచ్చటం లేదు. సాధారణ ప్రజల్లో అతను పేరు తెచ్చుకోవాలని, పార్టీ కార్యకర్తల ఆశలని అతను పట్టించుకోవాలనీ ఆశిస్తున్నాడు. కానీ విప్లవ్ తనను తాను చాలా పెద్ద రాజకీయవేత్తగా అనుకుంటున్నాడు. విప్లవ్ మొదటినుంచి తనను తాను పెద్ద నాయకుడిగా ఫీలయ్యాడు. ముఖ్యమంత్రి కావడానికి ముందే తనకు సెంట్రల్ సెక్యూరిటీ ఫోర్స్ రక్షణ కల్పించాలని కోరాడు. సునీల్ గిరిజన ప్రాంతాల్లో తిరిగే రోజుల్లో కూడా ఎప్పుడు అలాటి కోరిక కోరలేదు. గద్దె కెక్కాక ఎవర్నీ పట్టించుకోవటం లేదు. సునీల్ తనకు పోటీగా ఎదుగుతాడన్న భయంతో విప్లవ్ ఎన్నికల పోస్టర్లలోంచి, బ్యానర్ల లోంచి సునీల్ ఫోటో తీసివేయమని అడిగాడట. అది జరగలేదు కానీ సునీల్ మాత్రం ఎన్నికలయ్యాక 'దేవ్ పార్టీకి పరిమితమై త్రిపుర రాజకుటుంబానికి చెందిన, గిరిజనులకు ఆత్మీయుడైన జిష్ణు దేవ్ బర్మన్‌కు ముఖ్యమంత్రి పదవి అప్పగిస్తే మంచిది' అన్నాడు. విప్లవ్ ఒప్పుకోలేదు. చివరకు బర్మన్‌కు ఉపముఖ్యమంత్రి పదవి యిచ్చి రాజీ కుదిర్చారు. కానీ ఉపముఖ్యమంత్రికి ఎక్కువ అధికారాలు యిస్తే తనకు పోటీగా ఎదుగుతాడన్న భయం విప్లవ్‌కుంది. అందువలన అతనికి ఫైనాన్సు, విద్యుత్ మంత్రిత్వ శాఖలు యిచ్చి సరిపెట్టాడు. తనకు యిష్టం లేకపోయినా తృణమూల్ నుంచి తీసుకు రాబడిన సుదీప్ బర్మన్‌కు ఆరోగ్యశాఖ యిచ్చాడు. హెూం, పిడబ్ల్యుడి వంటి కీలకమైన శాఖలన్నీ తన వద్దే పెట్టుకున్నాడు. ఇవన్నీ సరే, తనేమి అవాకులు, చెవాకులు మాట్లాడినా ఎవరూ దాన్ని విమర్శించకూడదనే అభిప్రాయంలో ఉన్నాడు.

**సంజయుడి స్కైప్** – పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను కంప్యూటరైజేషన్ చేస్తున్న ప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ మహాభారత కాలంలోనే ఇంటర్నెట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఉన్నాయన్నాడు. సంకుచిత బుద్ధి ఉన్నవాళ్లు మాత్రమే దాన్ని ఒప్పుకోరన్నాడు. అందరూ వెక్కిరించారు. ఆరెస్సెస్ భావజాలమున్న త్రిపుర గవర్నరు తథాగత రాయ్ విప్లవ్‌ను వెనకేసుకుని వచ్చి ఇంటర్నెట్, శాటిలైట్ లేకపోతే సంజయుడు కురుక్షేత్రంలో జరిగేది ధృతరాష్ట్రుడికి ఎలా చెప్పగలిగాడు? అని ప్రశ్నించాడు. పూర్వకాలంలో కొందరు ఋషులకు దివ్యదృష్టి, క్షణాల్లో అనుకున్నచోటకి మనోవేగంతో వెళ్లగలిగే దివ్యశక్తి ఉండేదని పురాణాల్లో రాశారు. కానీ యీ రోజు ఏ దివ్యశక్తి లేకపోయినా అతి సామాన్యుడు కూడా యింటర్నెట్ వాడగలుగుతున్నాడు. దానికీ దీనికీ పోలికేమిటి? అప్పట్లో ఇంటర్నెట్టే ఉండేమాటైతే ధృతరాష్ట్రుడు సంజయుణ్నే ఎందుకు నియమించుకోవాలి? ఏ పనివాడినైనా 'నెట్‌లో ఏమొస్తోందో చూసి చెప్పరా' అనవచ్చుగా! 47 ఏళ్ల ఒక యువముఖ్యమంత్రి ఒక టెక్నాలజీ సమావేశంలో యిలా మాట్లాడితే నవ్వులపాలు కాడా?

**ఠాగూర్‌నూ వదలలేదు** – తర్వాత యింకో సందర్భంలో రచ్చబండ దగ్గర ఊసులాడే పద్ధతిలో 'మల్టీనేషనల్ మార్కెటింగ్ మాఫియా తమ సౌందర్య ఉత్పాదనల మార్కెట్ యిండియాలో పెంచుకోవడానికి మనవాళ్లకు వరుసగా మిస్ వ(ర)ల్డ్, మిస్ యూనివర్స్ బిరుదులు యిచ్చేశారు. లేకపోతే 1997లో దయానా హేడెన్ లాటి మామూలు అమ్మాయికి ఆ బిరుదు రావడమేమిటి? 1994లో ఐశ్వర్య రైకి యిచ్చారంటే అర్థముంది, ఆమె భారతీయ వనితాసౌందర్యానికి ప్రతీక. ఇండియన్ బ్యూటీ అంటే లక్ష్మీ సరస్వతుల్లా ఉండాలి. కానీ హేడెన్ లాటిది ఆ బిరుదుకు తగదు. ఒక పథకంలో భాగంగా ఆమెకు వచ్చింది. మన ఇండియన్ మార్కెట్ శాచ్యురేట్ అయిపోయాక యిక యివ్వడం మానేశారు. అందుకే మళ్లీ ఏ ఎవార్డూ రాలేదు' అన్నాడు. కితం ఏడాదే మానుషి చిల్లర్‌కు వచ్చిందన్న సంగతి అతనికి ఎవరూ చెప్పలేదు పాపం. ఈ వ్యాఖ్యతో దయానా మండిపడింది. నాకు తెల్లతోలు లేకపోయినా నేనేమీ చింతించటం లేదు అని. బిజెపి ఉత్తరాది నాయకులు దక్షిణాది వాళ్లను కించపరచడం రివాజు అయిపోయిందని అందరూ గుర్తు చేసుకున్నారు. దయానా విషయంలో ఆమె దక్షిణాదిది, క్రైస్తవురాలు, ఆంగ్లో-ఇండియన్. బిజెపిలో ఉంటూ ఆమె అందానికి వంకలు పెట్టడంలో ఉన్న ప్రమాదం అర్థమైనట్లుంది. క్షమాపణ చెప్పుకున్నాడు. రవీంద్ర నాథ్ ఠాగూరు తనకు వచ్చిన నోబెల్ బహుమతిని తిరిగి యిచ్చేశాడని మరోసారి వాక్రుచ్చాడు. ఇంగ్లీషు వాళ్లపై కోపంతో ఆయన తిరిగి యిచ్చినది వాళ్లిచ్చిన 'సర్' బిరుదాన్ని, స్వీడన్ వాళ్లిచ్చిన నోబెల్‌ను కాదు.

**గౌడ్లు కాసుకోండి** – మరోసారి మాట్లాడుతూ తన జాగ్రఫీ పరిజ్ఞానాన్ని ప్రదర్శించాడు. గోమతి నది పక్కన ఉన్న ఛాబిమురా గుహలోని శిల్పాలను పర్యాటకకేంద్రంగా చేసి 'ఆఫ్రికా'లోని అమెజాన్ నదీ బేసిన్ స్థాయికి తీసుకెళతానన్నాడు! ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఉపన్యాసాలు రాయించుకునేటప్పుడు సరైన వ్యక్తిని పెట్టుకోవాలి. వాళ్లేం రాసినా యితను సొంత తెలివితేటలు ఉపయోగిస్తాడు లాగుంది. ఈ మధ్య సివిల్ ఇంజనియర్ల కాన్ఫరెన్సులో మాట్లాడుతూ 'సివిల్ సర్వీసెస్‌ల్లోకి వెళ్లడానికి మెకానికల్ ఇంజనియర్ల కంటె సివిల్ యింజనియర్లకు అవకాశాలు ఎక్కువ ఉన్నాయి' అని మెచ్చుకున్నాడు. త్రిపురలో కమ్యూనిస్టు ప్రభుత్వం కుప్పకూలడంలో యువత ముఖ్యభూమిక నిర్వహించారు. దేశంలోనే అత్యధికంగా త్రిపురలో 19.7% నిరుద్యోగ సమస్య ఉంది. తమకు ఉద్యోగాలు కల్పించడంలో కమ్యూనిస్టు పార్టీ ఛాందసంగా వ్యవహరిస్తోందని, కేంద్రంతో పేచీ పెట్టుకుని పారిశ్రామికవేత్తలెవరూ యిటు రాకుండా

చేస్తోందని, అందుకే తాము బెంగుళూరు, హైదరాబాదు వంటి దూరప్రదేశాలకు ఉద్యోగాలకు వెళ్లవలసి వస్తోందని వారి ఆవేదన. వాళ్ల నాడి గ్రహించిన బిజెపి తాము అధికారంలోకి వస్తే ఐటీ దిగ్గజాలను రప్పించి, ఐటీ పార్కులు పెట్టించి ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానాలు కురిపించి వాళ్లను ఆకట్టుకుంది. అలాటి తరుణంలో యీ ముఖ్యమంత్రి త్రిపుర వెటర్నరీ కౌన్సిల్ సమావేశంలో నిరుద్యోగ యువకులను ఉద్దేశించి 'మీరు ఉద్యోగాల గురించి వెతుక్కోవడం కంటె ఆవుల్ని పెంచండి. ప్రతీ యింట్లో ఒక ఆవు ఉండాలి. పాలు యిప్పుడు లీటరు రూ.50 అమ్ముతోంది. పట్టభద్రుడు పదేళ్లపాటు ఉద్యోగం కోసి వెతికి వేసారే కంటే పాలు అమ్ముకుంటే ఆ పదేళ్లలో రూ.10 లక్షలు వెనకేసుకోగలుగుతాడు. లేదా కిళ్లీ కొట్లు, పాన్ దబ్బాలు పెట్టకోండి. అతి త్వరలో మీ బ్యాంకు బాలన్స్ రూ.5 లక్షలవుతుంది' అని సలహా యిచ్చాడు. ఇది వాళ్లను ఎంత మండిస్తుందో ఊహించండి.

**హత్తెరీ, లైక్ కొడతావా?** – సోషల్ మీడియా అతి చురుగ్గా ఉన్న యీ రోజుల్లో యిలాటివి వదిలిపెడతారా? ఏకిఏకి వదిలిపెడుతున్నారు. అలాటి వ్యాఖ్యలను సునీల్ దేవ్‌ధర్ తన ఫేస్‌బుక్‌లో పోస్టు చేసి లైక్‌లు కొట్టాడని, అతని అనుచరులే తన గురించి ఫేక్ న్యూస్ షేర్ చేస్తున్నారనీ విప్లవ్ అధిష్టానానికి ఫిర్యాదు చేశాడు – '...తోటికోడలు నవ్విందని..' అనే సామెత గుర్తుకు తెస్తూ! 'నేనీ మధ్య నా ఫేస్‌బుక్ ఎక్కవుంట్ చూడటమే లేదు.' అంటాడు సునీల్. 2016లో విప్లవ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా సిఫార్సు చేసినది సునీలే. ఎన్నికలయ్యాక 'బిజెపి నియమాల ప్రకారం ముఖ్యమంత్రి అధ్యక్ష పదవి నిర్వహించడానికి వీలు లేదు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా ఉన్న విప్లవ్ ముఖ్యమంత్రి అయ్యాడు కాబట్టి అతని స్థానంలో వేరేవారిని అధ్యక్షుణ్ని వేయండి' అన్నాడు సునీల్ అధిష్టానంతో. అయితే విప్లవ్ 'నేను చెప్పినవాణ్ని నియమిస్తేనే పదవి వదులుతా' అంటున్నాడు. సునీల్ యిప్పటికే తనకు వ్యతిరేక కూటమి నడుపుతున్నాడనీ, రాష్ట్ర అధ్యక్షుడు అతని మనిషైతే యిక పార్టీ తన చెప్పుచేతల్లో ఉండదనీ విప్లవ్ భయం. అధిష్టానం ఏమీ చేయకుండా కూర్చుంది. 'నేను చెప్పినట్లు సాగటం లేదు కాబట్టి నన్ను యిన్‌చార్జిగా తప్పించేయండి' అని సునీల్ వెళ్లి అమిత్ షాని కోరాడు. కర్ణాటక ఎన్నికల తర్వాత చూద్దాం అని అమిత్ వాయిదా వేశాడు. వీళ్లిద్దరి మధ్య తగాదా తీర్చమని మొత్తం ఈశాన్య రాష్ట్రాలకు ఇన్‌చార్జిగా ఉన్న రామ్ మాధవ్‌ను అడుగుదామంటే అతను కర్ణాటక ఎన్నికలలో హైదరాబాదు-కర్ణాటక ప్రాంతానికి పరిశీలకుడిగా బిజీగా ఉన్నాడు. పైగా కశ్మీరు, ఆంధ్ర కూడా అతన్నే చూడమంటున్నారు.

**మూర్తి చిన్నది, కీర్తి పెద్దది** – బిజెపి అధిష్టానానికి యిదంతా యిబ్బందికరంగా ఉంది. ఎందుకంటే త్రిపురలో వాళ్లు సాధించినది అపూర్వ విజయం, చరిత్రలో నిలిచిపోయే గెలుపు, ముఖాముఖీ పోరాటంలో కమ్యూనిస్టులను మట్టి కరిపించిన విజయం. రైటాఫ్ చేసేసుకున్న ప్రాంతాల్లో సైతం అంకితభావంతో, అకుంఠిత దీక్షతో ఒక బృందం పనిచేస్తే చరిత్రను ఎలా తిరగరాయవచ్చో, అసాధ్యాన్ని ఎలా సుసాధ్యం చేయవచ్చో అన్ని రాజకీయ పార్టీలకు సిలబస్‌గా ఉండదగిన ప్రయోగం. అక్కడి విజయానికి బిజెపి మూడేళ్లగా వ్యూహాలు రచించింది. 8 జిల్లాల చిన్న రాష్ట్రం. జనాభా 38 లక్షలు (హైదరాబాదులో సగం కంటె తక్కువన్నమాట), ఓటర్లు 23 లక్షలు. హైదరాబాదు మునిసిపల్ కార్పోరేషన్ కంటె చిన్న వ్యవహారం. అయినా 20 ఏళ్లగా కమ్యూనిస్టులు పాలిస్తున్న కుటీరం కాబట్టి, వాళ్లకు ఆ కుటీరం కూడా లేకుండా చేయాలనే పట్టుదలతో విపరీతంగా శ్రమించి, మూడేళ్లలో 52 మంది కేంద్రమంత్రులు సందర్శించి, ఎట్టకేలకు బిజెపి ప్రభుత్వాన్ని అక్కడ కూర్చోబెట్టారు. దిగిపోయిన సిపిఎం ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌కు పెద్దమనిషిగా, వివాదరహితుడిగా అందరూ గౌరవమిస్తారు. అతని స్థానంలో వచ్చిన వ్యక్తి అంత హుందాగా లేకపోయినా, కాస్తయినా తెలివిగా, మర్యాదగా వ్యవహరిస్తే బాగుంటుందని ఆశించడంలో తప్పు లేదు. ఇతను అధికారంలోకి వస్తూనే రాష్ట్రంలో లెనిన్ విగ్రహాలు బద్దలయ్యాయి. వీధులకు పెట్టిన కమ్యూనిస్టు నాయకుల పేర్లు మార్చేస్తామన్నారు. దీనికి యితర రాష్ట్రాల్లో ప్రతిస్పందన వచ్చింది. ముఖ్యమంత్రి సంయమనంతో వ్యవహరించి యిటువంటివి అదుపు చేయకపోతే ఎలా? పైగా బొత్తిగా వచ్చిన రెండు నెలల్లోనే హేళనకు గురయ్యేలా ప్రవర్తిస్తే ఎలా అని అధిష్టానం బాధ. ముఖ్యంగా సునీల్‌తో సరిగ్గా వ్యవహరించకపోతే ఎలా అని వ్యథ.

సునీల్ దేవ్‌ధర్ గురించి, అతని త్రిపురావిజయం పూర్తిగా చెప్పకపోతే బిజెపి అధిష్టానం ఆవేదన అర్థం కాదు. అతను పుణెలో 1965లో పుట్టాడు. 20 ఏళ్ల వయసులో ఆరెస్సెస్ ప్రచారక్‌గా చేరాడు. 'మై హోమ్ ఇండియా' అనే పేర ఒక సామాజిక సంస్థ నిర్వహిస్తూ దేశాంతరాలు పట్టిపోయిన పిల్లలకు ఆశ్రయం కల్పిస్తాడు. 1990ల్లో 8 ఏళ్ల పాటు మేఘాలయలో పని చేశాడు. 2005లో బిజెపిలో చేరాడు. 2011లో నితిన్ గడ్కరీ బిజెపి అధ్యక్షుడిగా ఉన్నపుడు ఈశాన్య రాష్ట్రాల బిజెపి ఇన్‌చార్జిగా ఉన్నాడు. 2013లో గుజరాత్‌లో దాహోద్ జిల్లాలో పార్టీ వీక్‌గా ఉంటే అమిత్ అతన్ని అక్కడ వినియోగించుకున్నాడు. 2014లో మోదీ వారణాశి నుంచి పోటీ చేసినపుడు ప్రచార బాధ్యత అప్పగించాడు. త్రిపురలోనూ పార్టీని గెలిపించు' అని అమిత్, మోదీ సునీల్‌కు ఆ పని అప్పచెప్పారు.

**త్రిపుర నేపథ్యం** – అప్పుడతను త్రిపుర వ్యవహారాలను పూర్తిగా అధ్యయనం చేశాడు. అది అతి చిన్న రాష్ట్రం. 10 వేల చ.కి.మీ. వైశాల్యం. ఉత్తరాన బంగ్లాదేశ్ ఉంది. శతాబ్దాలపాటు అది త్రిపురీ వంశీకుల పాలనలో ఉండేది. బ్రిటిషు పాలనలో అది ఒక సంస్థానం. 1949లో భారత యూనియన్‌లో చేరింది. ఈలోగా 1947లో దేశవిభజన సమయంలో దానికి ఉత్తరాన ఉన్న తూర్పు బెంగాల్ నుంచి బెంగాలీ హిందూ శరణార్థులు వచ్చిపడ్డారు. క్రమేపీ వారి జనాభా 69% అయింది. వారి కారణంగా త్రిపుర అధికార భాష బెంగాలీ అయింది. వారి కారణంగా ఎప్పణ్నుంచో అక్కడే నివాసముంటున్న త్రిపురవాసుల జనాభా 31% అయింది. వారి భాష వేరే. దాంతో యిద్దరి మధ్య ఘర్షణ వచ్చింది. వాటిని నివారించడానికి గిరిజన కౌన్సిల్ ఏర్పరచి దానికి స్వయం ప్రతిపత్తి కలిగించారు. త్రిపురకు ఎటు చూసినా పర్వతాలే. సగం ప్రాంతం అరణ్యాలే. దానిలో వెదురు, పేము పొదలుంటాయి. దేశంతో కలపడానికి ఒకే ఒక్క నేషనల్ హైవే 8 ఉంది. వ్యవసాయం వర్షాధారం. పరిశ్రమలు రావడానికి అవకాశాలు లేవు. ఆహార ధాన్యాల కొరత ఉంది. ప్రజలు ఆర్థికంగా బలవంతులు కారు. వ్యాపారాలకు అవకాశాలు తక్కువ. ప్రయివేటు ఉద్యోగాలు కూడా తక్కువే. అందుకే జనాల్లో చాలామంది బీదవారే. కేంద్రంలో ఉన్న ఏ ప్రభుత్వమూ త్రిపురకు అనుకూలంగా లేకపోవడం చేత నిధులు పెద్దగా రాలేదు. పర్వతాల

కారణంగా కమ్యూనికేషన్స్, యిన్‌ఫ్రాస్ట్రక్చర్ యిబ్బందికరం. **(సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

**2018 జూన్** **ఎమ్బీయస్: త్రిపుర నాయకత్వంలో మనస్పర్థలు - 2/3**

రాజకీయంగా చూస్తే మొదటి నుంచి 1977 వరకు త్రిపురలో కాంగ్రెసు గెలుస్తూ వచ్చేది. గిరిజనుల్లో ప్రాబల్యం సంపాదించి, తర్వాత బెంగాలీలలో కూడా పలుకుబడి సంపాదించిన సిపిఎం నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ పుంజుకుంటూ వచ్చింది. ఎమర్జన్సీ అనంతరం దేశమంతా కాంగ్రెసు ఓడిపోయిన తరుణంలో, జనతా పార్టీ నెగ్గి కొన్ని నెలలు పాలించింది. 1978లో సిపిఎం 60 సీట్లలో 56 నెగ్గి, అధికారంలోకి వచ్చింది. సిపిఎం ముఖ్యమంత్రి నృపేన్ చక్రవర్తి పదేళ్ల పాటు చక్కగానే పాలించాడు. 1983లో సిపిఎంకు 37 వచ్చాయి. ప్రత్యేక రాష్ట్రం కోరే గిరిజనుల పార్టీ ఐన త్రిపుర ఉపజాతి యువ సమితి కాంగ్రెసుతో కలిసి 27 గెలిచింది. 1988లో వచ్చేసరికి ఆ రెండూ కలిసి 31 స్థానాలు గెలిచి సిపిఎంను ఓడించాయి. 1993 వచ్చేలోగా ముగ్గురు ముఖ్యమంత్రులు మారారు. ఎన్నికలలో వాళ్ల బలం 19కి పడిపోయింది. సిపిఎం 41 స్థానాల్లో గెలిచి మళ్లీ అధికారంలోకి వచ్చింది. దశరథ్ దేబ్ ముఖ్యమంత్రి అయ్యాడు. 1998లో మళ్లీ గెలిచింది. 49 ఏళ్ల మాణిక్ సర్కార్ ముఖ్యమంత్రిగా వచ్చి 20 ఏళ్లగా పాలిస్తున్నాడు. నిరాడంబర జీవితంతో, సమర్థపాలనతో అతను అందర్నీ ఆకట్టుకుని తన పార్టీకి 45–48% ఓటింగు తెచ్చుకుంటున్నాడు. కానీ దానితో పాటు కమ్యూనిస్టు వ్యతిరేక ఓటు ఎప్పుడూ 34–37% ఉంటూ వచ్చింది. అది కాంగ్రెసుకు వెళ్లినా సీట్ల విషయంలో వెనకబడేది. 1998, 2003, 2008, 2013లలో సిపిఎంకు 38, 38, 46, 49 రాగా, కాంగ్రెసుకు 13,13,10,10 వచ్చాయి. సిపిఎం మిత్రపక్షమైన సిపిఐకు 1.5% ఓట్లతో 1 సీటు ఎప్పుడూ వచ్చేది.

**మాణిక్ పాలన** – ఇక మాణిక్ ఇమేజే అతనికి బలం. ఆర్భాటాలు లేవు, అవినీతి లేదు. టైలరు కొడుకు. భార్య కేంద్రప్రభుత్వోద్యోగినిగా చేసి రిటైరయింది. సొంత యిల్లు లేదు. సొంత కారు లేదు. రిక్షాలో తిరుగుతూ ఉంటాడు. జీతమంతా పార్టీకి యిచ్చేసి, నెలకు రూ.10 వేలు వాళ్ల దగ్గర్నుంచి అలవెన్సుగా తీసుకుంటాడు. అందరికీ అందుబాటులో ఉంటాడు. ముఖ్యంగా అతను రాష్ట్రానికి శాంతిని తెచ్చాడు. బంగ్లాదేశ్ కేంద్రంగా తీవ్రవాదులు హింసకు పాల్పడి, త్రిపురలో అల్లకల్లోలం సృష్టించేవారు. 1997లో అతి క్రూరమైన 1958 నాటి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (స్పెషల్ పవర్స్) చట్టం అమల్లోకి తెచ్చారు. నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర, ఆల్ త్రిపుర టైగర్ ఫోర్స్ అనే వేర్పాటు వాద సంస్థలు ఇండియా నుంచి విడిపోవాలనే డిమాండ్‌తో పోరాటాలు చేసేవి. 1956 తర్వాత వచ్చిపడిన బెంగాలీలందరినీ తరిమివేయాలని, వారి భూములు లాక్కుని స్థానిక గిరిజనులకు పంచేయాలనీ వారి డిమాండ్. మారణాయుధాల వాడకంలో వాళ్లు బంగ్లాదేశ్‌లో తర్ఫీదు పొందేవారు. బంగ్లాదేశ్‌తో 856 కి.మీ.ల సరిహద్దు ఉంది. దాని పొడుగునా గస్తీ కాయడం అసాధ్యం. ఈ తీవ్రవాదం కారణంగా, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ చట్టం కారణంగా గిరిజనులు అవస్థలు పడేవారు. 1992–2008 మధ్య 3500 మంది పౌరులు మరణించారు. తీవ్రవాదులను అణచివేసి గిరిజనులు నమ్మకాన్ని చూరగొన్నాడు మాణిక్. (2015 మేలో యీ చట్టాన్ని తీయించివేశాడు).

**అందరికీ విద్య, వైద్యం** –శాంతిభద్రతలు నెలకొల్పాక మాణిక్ విద్యపై దృష్టి పెట్టాడు. ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 2001లో 73% ఉంటే 2011 నాటికి 87%కి పెరిగింది. ఈనాడు త్రిపురలో అక్షరాస్యత 97%. మారుమూల గ్రామాలకు కూడా రోడ్లు వేయించి, వైద్య సదుపాయాలు అందేట్లు చూశాడు. పదేళ్ల క్రితం వరకు క్రూరమృగాలు సంచరించే అరణ్యాల్లో సైతం మోటారు వాహనాలు వెళ్లే రోడ్లు వేయించాడు. కుగ్రామాల్లో కూడా తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యాలు ఏర్పరచాడు. ప్రతి గ్రామానికి బడి ఉంటేట్లు చూశాడు. పాఠశాలల నాణ్యత పెంచాడు. 1100 గ్రామ పంచాయితీలుంటే ప్రతీ దాంట్లో కనీసం ఒక హెల్త్ సబ్‌సెంటర్ ఉండేట్లు చూశాడు. 12 సబ్‌డివిజనల్ ఆసుపత్రులు, ఆరు జిల్లా స్థాయి ఆసుపత్రులు, ఆరు రాష్ట్రస్థాయి ఆసుపత్రులు యీరోజు త్రిపురలో ఉన్నాయి. ఆహారభద్రతకు పెద్దపీట వేశాడు. ఎన్‌రేగా పథకం పక్కాగా అమలైన రాష్ట్రాలలో త్రిపుర అగ్రస్థానంలో ఉంది. గత ఐదారేళ్లలో ఎన్‌రేగా పథకం కింద ఏడాదిలో పని కల్పించిన రోజులు జాతీయ స్థాయిలో సగటున 40–50 ఉంటే, త్రిపురలో 80 ఉంది. 2015–16లో అది 94కి చేరింది. (ఇప్పుడు కేంద్రం దాని నిధుల్లో కోత పెట్టింది కాబట్టి యీ అంకె తగ్గుతుంది.) 2004–11 మధ్య బిపిఎల్ (దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నవారు) పేదల సంఖ్య 62% తగ్గింది. 2005–06లో శిశుమరణాలు వెయ్యికి 51 ఉంటే 2015 నాటికి అది 20 అయింది. రాష్ట్ర జిడిపిలో 18% విద్య, వైద్యం, సంక్షేమ పథకాలపై ఖర్చు పెట్టాడు.

**ఉద్యోగులు ఉసూరుమన్నారు**– గత నాలుగేళ్లలో జాతీయస్థాయిలో నెట్ డొమెస్టిక్ ప్రోడక్ట్ ఏడాదికి 5% చొప్పున పెరిగితే త్రిపురలో స్టేట్ డొమెస్టిక్ ప్రోడక్ట్ ఏటా 9–10% చొప్పున పెరిగింది. 1998లో సోషల్ పెన్షన్ 63,500 మందికి అందితే 2017 నాటికి అది 4.32 లక్షలకు చేరింది. ఇరిగేషన్ సౌకర్యాలు తక్కువే ఐనా ఋణబాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు ఒక్కడూ లేడు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం తక్కువే అయినా వచ్చినదాన్ని యిలాటి మౌలిక సదుపాయాలకు ఖర్చు పెట్టాడు. దీనికోసం ప్రభుత్వోద్యోగులకు జీతాలు పెద్దగా పెంచలేదు. అది వాళ్లకు కోపకారణమైంది. (దేశమంతా ఏడో వేతన సంఘం సిఫార్సుల ప్రకారం జీతాలు యిస్తూండగా త్రిపుర ప్రభుత్వోద్యోగులకు మాత్రం నాలుగో వేతన సంఘం సిఫార్సులే అమల్లో ఉన్నాయి, అది కూడా 2017 జూన్ నుంచి మాత్రమే. ఇది ఉద్యోగులకు అస్సలు నచ్చలేదు. ఏడో కమిషన్ అమలు చేసి ప్రభుత్వోద్యోగి జీతం 20వేల నుంచి 35 వేలకు పెంచుతామని బిజెపి మానిఫెస్టోలో హామీ యివ్వడంతో రెండున్నర లక్షల ఉద్యోగులు బిజెపికి పూర్తిగా సహకరించారు. పోలింగు సమయంలో ప్రభుత్వోద్యోగులు అనుకూలంగా ఉంటే 1–2% మొగ్గు ఉన్నట్లే! తాజాకలం ఏమిటంటే – అధికారంలోకి వచ్చాక, హామీని వెంటనే అమలు చేయకుండా జీతం ఎంత పెంచాలో తేల్చండంటూ విప్లవ్ ఓ కమిటీ వేసి, వ్యవహారాన్ని సాగదీస్తున్నాడు)

**నిరుద్యోగుల్లో నిస్పృహ**–ఉద్యోగుల బాధ యిలా ఉంటే, ఉద్యోగార్థుల వేదన మరోలా ఉంది. విద్యార్జన పెరగడంతో నిరుద్యోగులు

పెరిగారు. ఆ నిష్పత్తిలో ఉద్యోగాలు కల్పించడానికి రాష్ట్రంలో తగినన్ని అవకాశాలు లేవు. నిజానికి గత 20 ఏళ్లలో 92 వేల ప్రభుత్వోద్యోగాలు కల్పించడం జరిగింది. అవి చాలక ఉద్యోగార్థులు దూరప్రాంతాలకు వెళ్లవలసి వస్తోంది. దాంతో వాళ్లు కమ్యూనిస్టు పాలనపై కోపం పెంచుకున్నారు. వాళ్లు పెరిగి విషయాలు అర్థం చేసుకునే వయసుకి వచ్చేసరికి తీవ్రవాద ఛాయలు ఏమీ లేవు. అందువలన గతంలో మాణిక్ శాంతిస్థాపనకు ఏం చేశాడో వాళ్లకు తెలియదు, తెలిసినా పట్టించుకోలేదు. గతతరాల్లో వాళ్లు సమాజంలో అన్ని వర్గాల వారి సంక్షేమం గురించి ఆలోచించేవారు. ఈ తరం తనకు వ్యక్తిగతంగా ఏం లాభం అనే ఆలోచిస్తుంది. నాకు ఉద్యోగం రాలేదు, ఏదో పల్లెటూళ్లో ఆసుపత్రి పెడితే నాకేమిటి? అనే యువత అనుకుంటోంది. నిజానికి రాష్ట్రంలో 5వేల స్మాల్ స్కేల్ యిండస్ట్రీస్ ఉన్నాయి. వాటి ద్వారా 67 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. చిన్న వ్యాపారస్తుల కోసం స్వావలంబన్ స్కీము ద్వారా 16 వేల మందికి సాయం అందించారు. కానీ యివేమీ యువతకు ఆనలేదు. వాళ్లకు కావలసినది ఆధునిక సౌకర్యాలు, విదేశాల్లో ఉద్యోగాలు, కళ్లు మిరిమిట్లు కొల్పించే జీతాలు. దేశంలో మోదీ అవన్నీ తెస్తానంటూంటే యీ చాదస్తపు, సాధారణ జీవితపు, కమ్యూనిస్టు ప్రభుత్వం మోకాలొడ్డుతోంది అని భావిస్తున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కులసమీకరణాలతో బిహార్ నెగ్గుతూ వచ్చాడు. ఆధునికత అంటే వెక్కిరించేవాడు. 2005లో నీతీశ్ 'బిహార్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తాను, మీకు ఉద్యోగాలు వచ్చేట్లు చేస్తాను' అని వికాస్ పురుష్ యిమేజితో లాలూతో తలపడ్డాడు. బిహారీలు నీతీశ్ వెంట నడిచారు. అలాటిదే యిక్కడా చేయాలి అని అనుకున్నాడు సునీల్. ఎందుకంటే 18-33 వయసులో ఉన్నవాళ్లు ఓటర్లలో 40% ఉన్నారు.

**ప్రతిపక్షాలు** – సిపిఎంకు ప్రధాన ప్రత్యర్థిగా నిలవాల్సిన కాంగ్రెసు నీరసించింది. అధిష్టానం దృష్టిలో అక్కణ్నుంచి వచ్చేవి రెండు పార్లమెంటు స్థానాలు మాత్రమే. అసెంబ్లీ ఎలాగూ చేజిక్కదు. ఇంకెందుకు అని త్రిపుర యూనిట్‌ను పట్టించుకోవడం మానేసింది. దాంతో 6గురు కాంగ్రెసు ఎమ్మెల్యేలు 2016లో తృణమూల్ కాంగ్రెసులో చేరారు. ఇక తన పార్టీ వరకు వస్తే 1998లో 6% ఓట్లు వచ్చినా తర్వాతి ఎన్నికలలో 1.5% లోపే వచ్చాయి. ఎప్పుడూ ఒక్క సీటు కూడా రాలేదు. 2013లో పోటీ చేసిన 50 స్థానాల్లోనూ డిపాజిట్లు దక్కలేదు. 1.87% ఓట్లు వచ్చాయి. పార్టీ కార్యకర్తలంతా వరుస పరాజయాలతో కుదేలై ఉన్నారు. సిపిఎం విజయపరంపరకు అడ్డు లేకుండా ఉంది. 2014 పార్లమెంటు ఎన్నికల్లో 64% ఓట్లతో రెండు స్థానాలూ గెలిచింది. అన్ని అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ముందంజలో ఉంది. 2015 పంచాయితీ ఎన్నికలలో గ్రామ పంచాయితీల్లో 75% గెలిచింది. బెంగాల్‌లో సిపిఎం పారిశ్రామికీకరణ చేసి ఉద్యోగాలు సృష్టిద్దామని ఉబలాటపడి, అధికారం పోగొట్టుకుంది. మళ్లీ కోలుకోవటం లేదు. కానీ యిక్కడ అలాటి ప్రమాదమేమీ కనబడటం లేదు.

**సునీల్ దీక్ష** – పరిస్థితులు ఆకళింపు చేసుకున్న సునీల్ మార్పు రావాలంటే నేను యిక్కడే ఉండాలి, రకరకాల వ్యూహాలు రచించాలి అనుకున్నాడు. 2014 నవంబరు నుంచి సునీల్ అక్కడే నెలలో 15 రోజులు గడపసాగాడు. 2015 జులై నుంచి పూర్తిగా అక్కడే మకాం పెట్టుకున్నాడు. అతనికి అప్పటికే బెంగాలీ వచ్చు. త్రిపుర జనాభాలో 31% మంది ఉన్న గిరిజనుల భాష ఐన కోక్‌బొరాక్‌ను కూడా నేర్చుకున్నాడు. వాళ్ల ఆహారపు అలవాట్లు అలవర్చుకున్నాడు. వారిని తన పార్టీలో చేర్పించి ముఖ్యమైన బాధ్యతలు అప్పగించాడు. ఈ ప్రయత్నాలతో స్థానిక ఎన్నికలలో బిజెపి ఓటు 14.7% అయింది. 2014 నాటి 1.54%తో పోలిస్తే యిది దాదాపు పది రెట్లు! సునీల్‌తో టీమ్‌లో మరో యిద్దరు ప్రముఖులున్నారు. ఈశాన్య రాష్ట్రాలన్నిటికీ యిన్‌చార్జిగా వున్న తెలుగువాడు రామ్ మాధవ్ ఒకడు. ఆరెస్సెస్ కార్యకర్తగా వుండి 2014లో బిజెపిలోకి వచ్చాడు. కశ్మీర్‌తో సహా అనేక కీలకమైన రాష్ట్రాలలో అసాధ్యమనుకున్నవి సుసాధ్యం చేశాడు. ఇక రెండో వ్యక్తి అసాంలో కాంగ్రెసుకు వ్యూహకర్తగా ఉన్న హిమంత విశ్వశర్మ 2015లో ఆ పార్టీ వదిలి బిజెపిలో చేరాడు. అసాం, మణిపూర్, అరుణాచల్‌లలో బిజెపి ప్రభుత్వాలు ఏర్పరడడంలో ప్రధాన పాత్ర అతనిదే.

రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా సరైన కాండిడేట్ ఎవరా అని వెతికితే విప్లవ్ దేవ్ పేరును ఆరెస్సెస్ జాయింట్ జనరల్ సెక్రటరీ కృష్ణ గోపాల్ సూచించాడు. విప్లవ్ దేవ్ 1971లో త్రిపురలోని గోమతి జిల్లాలో పుట్టాడు. తలిదండ్రులు బంగ్లాదేశ్ (అప్పటి తూర్పు బెంగాల్)నుంచి వలస వచ్చారు. ఆరెస్సెస్ అభిమానులు. విప్లవ్ స్కూలు, కాలేజీ చదువు త్రిపురలోనే. తర్వాత 20 ఏళ్ల వయసులో ఆరెస్సెస్‌లో చేరడానికి ఢిల్లీ వెళ్లాడు. కృష్ణగోపాల్‌కు శిష్యుడయ్యాడు. బిజెపి జనరల్ సెక్రటరీ గోవిందాచార్య వద్ద పనిచేశాడు. వాజపేయి ప్రభుత్వం ఏర్పడ్డాక కేంద్రమంత్రి రీటా వర్మ సిబ్బందిలో చేరాడు. తర్వాత సాత్నా (మధ్యప్రదేశ్) బిజెపి ఎంపీ గణేశ్ సింగ్‌కు అసిస్టెంటుగా కూడా పనిచేశాడు. త్రిపుర ట్రైబల్ ఏరియాస్ ఆటోనమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ ఎన్నికలలో బిజెపి తరఫున కాన్వాస్ చేయడానికి 2015లో బిజెపి జన సంపర్క్ ప్రముఖ్‌గా వచ్చాడు. అతన్ని 2016లో త్రిపురకు తీసుకుని వచ్చి అధ్యక్షుణ్ని చేశారు.

**నాయకుల దిగుమతి** – రాజకీయ వ్యూహాలకు వస్తే యిప్పటికిప్పుడు పార్టీని నిర్మించడమంటే కష్టం. అందువలన కాంగ్రెసు నుంచి, తృణమూల్ నుంచి ఎడాపెడా నాయకులను దిగుమతి చేసుకున్నాడు. కాంగ్రెసు నుంచే వచ్చిన హిమంత, తృణమూల్ నుంచి బిజెపిలోకి దూకిన ముకుల్ రాయ్ దానికి బాగా పనికి వచ్చారు. మాజీ కాంగ్రెసు ముఖ్యమంత్రి సమీర్ రంజన్ బర్మన్ కొడుకు, కాంగ్రెసు ద్వారా 2013లో గెలిచి 2016లో తృణమూల్‌లో చేరిన సుదీప్ రాయ్ బర్మన్ పేరుని హిమంత సూచిస్తే సునీల్, రామ్ మాధవ్ వద్దన్నారు. పోటీగా ఎదుగుతాడన్న భయంతో విప్లవ్ ససేమిరా కుదరదన్నాడు. రాష్ట్రపతి ఎన్నికలో రామనాథ్ కోవింద్‌కు త్రిపుర తృణమూల్ సభ్యుల మద్దతు కావలసి వచ్చింది. అప్పుడు హిమంత అమిత్ షాతో బేరాలాడాడు. 2017 జులైలో సుదీప్, మరో ఐదుగురు ఎమ్మెల్యేలు కోవింద్‌కు ఓటేశారు. ఆగస్టులో వాళ్లని బిజెపి పార్టీలో చేర్చుకుంది. (వీళ్లందరూ 2018 ఎన్నికలలో పెద్ద మార్జిన్లతో నెగ్గారు) మొత్తం మీద 8 మంది తృణమూల్ వాళ్లు బిజెపిలో చేరారు. సుబల్ భౌమిక్ అనే కాంగ్రెసు నాయకుడు ఉన్నాడు. 2013 ఎన్నికలలో ఓడిపోయి, విడిగా వచ్చి 'త్రిపుర ప్రగతిశీల్ గ్రామీణ్ కాంగ్రెస్' అనే పేర ఓ పార్టీ పెట్టుకున్నాడు. సునీల్ కోరికపై దాన్ని బిజెపిలో విలీనం చేశాడు. సిపిఎంతో కొట్లాటల్లో అతను ముందువరుసలో నిలుస్తూ వచ్చాడు. ఫిరాయించి వచ్చినవారికి

సునీల్ పార్టీలో పెద్ద బాధ్యతలే యిచ్చాడు.

అన్నిటి కంటె ముఖ్యమైనది సిపిఎంకు గిరిజనుల్లో ఉన్న పట్టు. గిరిజన ఓట్లు వాళ్ల ప్రాంతం (టిటిఎడిసి – త్రిపుర ట్రైబల్ అటానమస్ ఏరియాస్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) లో ఉన్న 20 రిజర్వ్‌డ్ సీట్లలోనే కాదు, యింకో 16 సీట్లలో కూడా ప్రభావం చూపుతాయి. ఈశాన్య రాష్ట్రాలన్నిటిలో ఏదో రకమైన శాంతిభద్రతల సమస్య ఉంది. ఏ సమస్యా లేని రాష్ట్రంగా త్రిపురను మార్చిన ఘనత మాణిక్‌దే. దానివలన గిరిజనుల్లో కూడా సిపిఎం బలపడింది. అక్కడ 20 అసెంబ్లీ స్థానాలుంటే వాటిలో కనీసం 18 గెలుస్తూ వస్తోంది. 2008, 2013లో 19 గెలిచింది. కౌన్సిల్ ఎన్నికలలో కూడా సిపిఎం గిరిజన విభాగమైన గణముక్తి పరిషద్ 15 ఏళ్లగా గెలుస్తూ వస్తోంది. దానిలో 28 సీట్లుంటే 2005, 2010, 2015 ఎన్నికలలో అన్ని సీట్లూ అదే గెలిచింది. ఈ గిరుల్లో ఎలా పాగా వేయాలనేది సునీల్ ముందున్న మరో పెద్ద సమస్య. **(సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

## 2018 జూన్ ఎమ్బీయస్: త్రిపుర నాయకత్వంలో మనస్పర్ధలు – 3/3

**ప్రమాదకరమైన ఆట –** సిపిఎంను ఎలాగైనా బలహీన పరచాలని అందువలన విచ్ఛిన్నకారులతో చేతులు కలిపే దుస్సాహసం చేశారు. గిరిజనుల కోసం 'త్విపలాండ్' పేర ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ చేస్తున్న ఇండిజెనస్ ఫ్రంట్ పీపుల్స్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)తో పొత్తు కుదుర్చుకున్నారు. అది కుదరడంలో ఒక నాటకీయ పరిణామం జరిగింది. 1996 నుంచి ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తున్న గిరిజనోద్యమం రకరకాల పేర్లు మార్చుకుని 2001లో ఇండిజెనస్ ఫ్రంట్ పీపుల్స్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)గా పేరు పెట్టుకుంది. 2003, 2008 ఎన్నికల్లో ఓడిపోవడంతో 2009లో చీలిపోయింది. దానికి 2016లో బిజెపి జీవం పోసి సఖ్యంగా ఉండసాగింది. అయితే బిజెపితో ఎన్నికల పొత్తు పెట్టుకోవడానికి ఐపిఎఫ్‌టీ వెనకాడుతోంది. అలాటి సమయంలో ఆ పార్టీలో సీనియర్ నాయకుడి కొడుక్కి గుండెజబ్బు వచ్చింది. ఆపరేషన్ చేయించాలంటే డబ్బు కావాలి. అసాం నుంచి పార్టీ పని మీద త్రిపుర వచ్చిన హిమంతకు ఆ విషయం తెలియవచ్చింది. వెంటనే అతనితో వ్యక్తిగత పరిచయం లేకపోయినా గువాహటిలోని డా. దేవీ షెట్టి అనే కార్డియాలజిస్టుతో ఎపాయింట్‌మెంట్ ఫిక్స్ చేసి యీ కుర్రవాడికి అక్కడ ఆపరేషన్ తన ఖర్చు మీద జరిపే ఏర్పాటు చేశాడు. అంతే ఆ నాయకుడు ఫిదా అయిపోయాడు. రెండు పార్టీల మధ్య పొత్తు కుదర్చడంలో కీలకమైన పాత్ర వహించాడు. హిమంత ఐపిఎఫ్‌టి చీఫ్ ఎన్‌సి దేవ్‌వర్మను ఢిల్లీ తీసుకుని వచ్చి మోదీతో, రాజనాథ్ సింగ్‌తో మాట్లాడించాడు. అదే పార్టీలోని రాజేశ్వర్ దేవ్‌వర్మ వర్గాన్ని బిజెపిలో కలిసేందుకు ఒప్పించాడు.

వాళ్లతో పొత్తు పెట్టుకుంటే సాధారణంగా 70% జనాభా ఉన్న బెంగాలీలకు కోపం వచ్చి దూరమవుతారు. కానీ 'అత్తతో అమ్మి, కోడలితో కొనడం' వంటి అసాధ్యమైన పనిని సునీల్, అతని టీము సాధించారు. 'వైరుధ్యాలను మేనేజ్ చేయడమే రాజకీయం. అసాంలో బోడోలు వేరే రాష్ట్రాన్ని అడుగుతున్నారు. కానీ వాళ్లతో పొత్తు పెట్టుకున్నాం, రెండేళ్లగా వాళ్లని ఆపి ఉంచాం.' అన్నాడు హిమంత. అలాటి రాజకీయం మన తెలుగు రాష్ట్రాలలో కాంగ్రెసు, టిడిపి మనకు రుచి చూపించాయి. వేర్పాటువాదులైన తెరాసతో పొత్తు పెట్టుకుంటూనే ఆంధ్ర ప్రాంతంలో ఓట్లు సంపాదించాయి. వాళ్లను ఒప్పిస్తామని యిక్కడా, వీళ్లను ఏమారుస్తామని అక్కడా చెప్పుకొచ్చారు. అదే పని బిజెపి అక్కడ చేసింది. ఐపిఎఫ్‌టీతో పొత్తు పెట్టుకుంటూనే రాష్ట్రవిభజనను వ్యతిరేకిస్తున్న బెంగాలీలతో తాము ప్రత్యేక గిరిజన రాష్ట్రానికి మద్దతు యివ్వటం లేదని చెప్పుకుంది. బెంగాలీలు అది నమ్మారు. 2017 డిసెంబరు 15 న ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ అగర్తలాలో బహిరంగ సమావేశం పెడితే 35 వేల మంది హాజరయ్యారు. అంటే ఒక నియోజకవర్గ ఓటర్లన్నమాట. (2018 ఎన్నికలలో ఐపిఎఫ్‌టి పోటీ చేసిన 9 స్థానాల్లో 8 గెలిచింది. సిపిఎం 2 స్థానాల్లో మాత్రమే గెలిచింది. గతంలో 19 స్థానాల్లో గెలిచింది. ఈసారి ఉపముఖ్యమంత్రి, గిరిజనుడు అయిన దేవ్‌బర్మన్ కూడా ఓడిపోయాడు). గిరిజనులకు త్రిపుర రాజవంశమంటే ఎనలేని గౌరవం. అందువలన ఆ కుటుంబానికి చెందిన 59 ఏళ్ల జిష్ణుదేవ్ బర్మన్‌ను బిజెపిలోకి ఆహ్వానించారు. త్రిపుర అభ్యర్థులందరిలోను ఆయనే మిక్కిలి ధనవంతుడు. గిరిజనుడు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్త ఐన రామ్‌పాద్ జమాటియాకు గిరిజనులను ఒప్పించే పని యిచ్చారు.

**అలుపెరుగని ప్రచారం –** సునీల్ రెండున్నరేళ్లలో మొత్తం నియోజకవర్గాలను మూడు సార్లు చుట్టి వచ్చాడు. 2009లో బిజెపి సభ్యుల సంఖ్య 10 వేలు. దేవధర్ 2015 నాటికి దాన్ని 1.75 లక్షలకు తీసుకువచ్చాడు. ఏడాది క్రితం 4 లక్షలైంది. అంటే ఓటర్లలో ఆరోవంతు బిజెపి సభ్యులే అన్నమాట. 2014లో ఆరెస్సెస్ శాఖలు 60 ఉంటే యిప్పుడవి 265కి పెరిగాయి. ఆ శాఖలు సామాజిక సేవ ద్వారా ఓటర్లను ఆకట్టుకున్నాయి. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యువ, మహిళ, ఎస్సీ, ఎస్టీ, ఓబిసి, మైనారిటీ, రైతు విభాగాలు ఏర్పరచి ఆందోళనలు చేపట్టారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చే ముస్లిములకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ప్రజల సెల్‌ఫోన్లు సేకరించి వాటికి వాట్సాప్‌లు, ఇన్‌స్టాగ్రాంలు, వీడియోలు, కార్టూన్లు, ఫేస్‌బుక్ పోస్టింగ్స్ అన్నీ పంపి వాళ్లను ఆకట్టుకున్నారు. యువతను బిజెపి వైపు ఆకర్షించే పని యువమోర్చాకు అధ్యక్షుడిగా ఉన్న టింకూ రాయ్‌కు అప్పచెప్పారు. అవతల సిపిఎం సాంప్రదాయ పద్ధతులనే నమ్ముకుంది. మాణిక్ సర్కార్ స్మార్ట్ ఫోన్ వాడే వారు కాదు. దీని ప్రభావం యువతపై బాగా పడింది. ఉద్యోగాలు కల్పిస్తామనడంతో తలిదండ్రులు సిపిఎంకు వేసినా పిల్లలు బిజెపికి వేశారు. ఆరెస్సెస్ నచ్చకపోయినా మోదీ నచ్చాడు వాళ్లకి. కనీసం 10% యిలా క్రాస్ ఓటింగు జరిగి ఉంటుందని బిజెపి నాయకుల అంచనా.

**బూత్ మేనేజ్‌మెంట్ –** ఒక్కో బూత్‌లో 17–18 పేజీల ఓటర్ల జాబితా ఉంటుంది. ఒక్కో పేజీకి ఒక్కో పన్నా (పేజీ) ప్రముఖ్‌ను నియమించారు. ఆ పేజీలో ఉన్న 60 మంది ఓటర్ల చేత ఓట్లేయించడం అతని బాధ్యత. మొత్తం 3214 బూతులుంటే 5 తప్ప

అన్నిటికి ఏజంట్లున్నారు. ప్రతి 5 బూత్‌లకు శక్తి కేంద్ర విస్తారక్ పేర యిన్‌చార్జి. మిస్డ్ కాల్ యిస్తే స్పందించి 2 లక్షల మంది కొత్త ఓటర్లను నమోదు చేయించింది. రైళ్లలో బిజెపి వాలంటీర్లు కరపత్రాలు పంచేవారు. నీటి సరఫరా, గ్యాస్ సప్లయి వంటి సమస్యల గురించి సమాచారం సేకరిస్తూ, దాన్ని తమ ప్రచారానికి ఉపయోగించుకున్నారు. ఎన్నికలకు ముందు అసాం నుంచి 400 మందిని రప్పించుకున్నారు. మొత్తం 5 వేల మంది బిజెపి, ఆరెస్సెస్ కార్యకర్తలు బయట నుంచి వచ్చారట. ఎన్నికలకు ముందు జరిగిన దాడుల్లో గాయపడిన కార్యకర్తల కోసం బిజెపి రూ. 15 లక్షలు ఖర్చు పెట్టింది. మోదీ దూత్ యోజనా అనే పేరు మీద బిజెపి కార్యకర్తలు మోదీ బొమ్మున్న టీషర్టులు వేసుకుని కేంద్రసంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించేవారు. బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆన్‌లైన్‌లో కూడా ఆమోదించి యిబ్బడిముబ్బడిగా సభ్యులను పెంచాడు. ఎన్నికలలో డబ్బు విస్తారంగా ప్రవహించింది. ఓటు అమ్ముకోవడం తెలియని త్రిపుర వాసులకు డబ్బు, లాప్‌టాప్‌లు, ఖరీదైన బట్టలు రుచి చూపించారు. 'రెండువేల రూపాయల నోటు కూడా చూడని త్రిపుర కుటుంబాలకు 20 వేల చొప్పున యిచ్చారని విన్నాను' అని ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ రాశారు.

**మాణిక్‌పై ప్రచారం –** మాణిక్ మీరనుకుంటున్నంత సింపుల్ మనిషేమీ కాదు, ఫాబ్ ఇండియా వాళ్లచేత తన కుర్తాలు డిజైన్ చేయించుకుంటాడు, అతని కళ్లజోడు చాలా ఖరీదైనది, తన వ్యవసాయక్షేత్రం ఆర్గానిక్ కూరలు పండించుకుంటాడు – వంటి చిల్లర ఆరోపణలు మొదలెట్టారు. ఇవి విని మాణిక్ నవ్వేశాడు. నా కళ్లజోడు ఖరీదు 1500 రూ.లు. ఇక నా బట్టలకు బిల్లులిమ్మంటే యిస్తాను. ఇవన్నీ పట్టించుకోవడం టైము వేస్టు అన్నాడు. అతని ప్రభుత్వంపై అవినీతి ముద్ర కొట్టడం అసాధ్యం. అందువలన రోజ్‌వ్యాలీ చిట్‌ఫండ్ స్కాములో అతని అనుచరులు యిరుక్కున్నారని ప్రచారం చేశారు. చిట్‌ఫండ్ అధినేత గౌతమ్ కుండు యిప్పుడు జైల్లో ఉన్నాడు. త్రిపురలోని కమ్యూనిస్టు పాలనలో వచ్చిన అవినీతి, రాజకీయ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, బంధుప్రీతి, కేంద్రంపై విషం చిమ్మడం వంటి ఆరోపణలతో ముంబయి జర్నలిస్టు దినేశ్ కానాజీచేత మరాఠీలో ఒక 92 పేజీల పుస్తకం రాయించి, దాన్ని బెంగాలీలోకి 'మాణిక్ రాజార్ దేశే' పేర అనువదింపచేసి ఎన్నికలకు నెల్లాళ్ల ముందు అగర్తలాలో ఆవిష్కరింప చేశారు. సుశీల్ బర్మన్ అనే అతని చేత "లాల్ సర్కార్" అనే పేర డాక్యుమెంటరీ కూడా తీయించారు. ఈ రెడీమేడ్ సరుకు పెట్టుకుని యిప్పుడు అధికారంలోకి వచ్చారు కాబట్టి బిజెపి వారు వారిపై కేసులు పెట్టి విచారణ సాగిస్తారో లేదో చూడాలి. వదిలేస్తే ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసినట్లే అనుకోవాలి.

త్రిపుర ప్రభుత్వం 2010, 2013లో ప్రభుత్వ స్కూళ్లలో 10,323 మంది టీచర్లగా నియమించింది. రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్, 2009 ప్రకారం వారికి సరైన అర్హతలు లేవు కాబట్టి వారి నియామకం చెల్లదంటూ 58 మంది పిటిషన్లు పెడితే, అవును చెల్లవు అంటూ హైకోర్టు 2014 మేలో తీర్పు యిచ్చింది. త్రిపుర ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవు పిటిషన్ వేసింది. 2017 మార్చిలో సుప్రీం కోర్టు హైకోర్టు తీర్పును సమర్థిస్తూ తీర్పు యిచ్చింది. అయితే 2017 డిసెంబరు వరకు ఉద్యోగాలు కొనసాగించడానికి అనుమతి యిచ్చింది. ఆ గడువు అయిపోతూ ఉండగా మరో ఆర్నెల్లు పొడిగించింది. ఇది మాణిక్ సర్కార్‌కు యిబ్బందికరంగా మారింది. బిజెపి వాళ్లకు దారి చూపుతానంది. ఏం చేస్తుందో చూడాలి.

**ఐటీకి అడ్డుపడ్డాడా? –** మాణిక్ బెంగాలీ దురభిమాని అని, గిరిజనులకు ఉద్యోగాలివ్వలేదని గిరిజన ప్రాంతాల్లో ప్రచారం చేశారు. బెంగాలీల్లో ఎవరికీ ఉద్యోగాలు యివ్వలేదని ప్రచారం చేశారు. 2015 ఆగస్టులో త్రిపుర రాజధాని అగర్తలాలో ఐటీ కాన్‌క్లేవ్ జరిగింది. త్రిపురలో చాలామంది పెట్టుబడులు పెడతామని అన్నారు. ముంబయి, చెన్నయ్ తర్వాత అగర్తలా దేశంలోని మూడో ఇంటర్నెట్ గేట్‌వే అన్నారు. త్రిపురలో ఐటీ పరిశ్రమ పెరిగితే అది బంగ్లాదేశ్ ఐటీ ఇండస్ట్రీకి బ్యాక్‌అప్‌గా పనికి వస్తుందని ఆ సదస్సు నిర్వహించిన నిర్వాహకులు అన్నారు. వారి ఆశాభావానికి మూలం ఏమిటంటే అంతకు ముందే బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్ అనే తీరపట్టణం నుంచి అగర్తలా వరకు యింటర్నెట్ కేబుల్ వేయడానికి, బంగ్లాదేశ్ నుంచి అదనంగా వున్న బాండ్‌విడ్త్ కొనడానికి యిరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సదస్సు తర్వాత కథ ముందుకు సాగలేదు. దానికి కారణం ఏమిటో యితమిత్థంగా తెలియదు. ఇన్నాళ్లూ త్రిపురకు నిధులు విదల్చని కేంద్రం యిప్పుడు బిజెపి ప్రభుత్వం వచ్చాక రూ.4 వేల కోట్లు ఖర్చు పెట్టి రోడ్లు, అవీ వేసి యిన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసి, టూరిజం పెంచడంతో బాటు టిసిఎస్ చేత అక్కడో యూనిట్ పెట్టించి ఐటీ పార్కు పెడదామని సన్నాహాలు చేస్తోంది. చివరకు త్రిపురలో తటస్థులు కూడా 'మాణిక్ మంచివాడే కానీ, ఒకసారి మార్చి చూద్దాం' అనుకోసాగారు. బిజెపి ఆ మూడ్‌ను బాగా పట్టుకుని 'చలో, పల్‌టాయ్' (మార్చిచూద్దాం పదండి) అనే నినాదం యిచ్చింది.

**ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలలేదు –** 25 ఏళ్లగా ఒకే పార్టీ పాలిస్తూన్నపుడు ప్రభుత్వ వ్యతిరేకత ఏర్పడడం సహజం. ఆ ఓటు బిజెపి, కాంగ్రెసు, తృణమూల్ మధ్య చీలిపోవాలి. కానీ చీలలేదు. తన పార్టీని చీల్చి 6గుర్ని లాక్కుపోయినందుకు కాంగ్రెసుకు తృణమూల్‌పై కోపం వుంది. అందువలన ఎన్నికలలో పొత్తు కుదుర్చుకుందామనే ప్రతిపాదన వచ్చినపుడు 'మీ నాయకులను బిజెపి ఎగరేసుకుని పోయింది. ఇక మీ బలమేముంది? 5 సీట్లు యిస్తా చాలు' అంది. ఇటు తృణమూల్ ఏకంగా 30 సీట్లు అడిగింది. పొత్తు కుదరలేదు. చివరకు కాంగ్రెసు ఒంటరిగా పోటీ చేసింది. తృణమూల్ ఐఎన్‌పిటి అనే గిరిజన వేర్పాటువాద పార్టీతో పొత్తు పెట్టుకుంది. 24 మందిని నిలబెట్టింది. సోదిలోకి లేకుండా పోయింది. కాంగ్రెస్ వైఫల్యం ఎంతలా వుందంటే 2013లో 36.5% ఓట్లు, 10 సీట్లు వస్తే యీసారి సగం బూతులలో మాత్రమే వాళ్లకు ఏజంట్లున్నారు. రాష్ట్రమంతా కలిపి కాంగ్రెసుకు వచ్చినది 41 వేలే. 1.8%. సీట్లు శూన్యం. అందుచేత ప్రభుత్వ, వామపక్ష వ్యతిరేక ఓటు మొత్తం బిజెపి కైవసం చేసుకుంది.

**ఫలితాలు –** బిజెపి ప్రచారాన్ని తిప్పికొట్టడానికి సిపిఎం కార్యకర్తలు పెద్దగా ప్రయత్నించలేదు. 20 ఏళ్లు వరుసగా అధికారంలో ఉండడంతో వారిలో నిర్లక్ష్యం, అహంకారం, రౌడీయిజం బాగా పెరిగాయి. తాము ఓడిపోవడం జరగదనే అతివిశ్వాసంతో ఉన్నారు. అంతిమంగా చూస్తే బిజెపికి 43% ఓట్లు వస్తే, సిపిఎంకు 42.7% (2013లో కంటె 6.3% తగ్గాయి) వచ్చాయి. బిజెపితో పొత్తు

పెట్టుకున్న ఐపిఎఫ్‌టికి 7.5% ఓట్లు వచ్చాయి. సీట్ల విషయానికి వచ్చేసరికి వాళ్లిద్దరికీ కలిపి 35 ప్లస్ 9, 44 వస్తే సిపిఎంకు 16 వచ్చాయి. 2013 అసెంబ్లీ ఎన్నికలలో సిపిఎం 55 స్థానాల్లో నిలబడి 49 స్థానాల్లో గెలిచింది. . బిజెపి గెలుపు మార్జిన్లు కూడా ఘనంగా ఉన్నాయి. బిజెపి కూటమికి గెలిచిన 44 స్థానాల్లో నాలుగోవంతు స్థానాల్లో మాత్రమే 2 వేల కంటె తక్కువ మార్జిన్ వచ్చింది, సిపిఎంకు 9 స్థానాల్లో మాత్రమే 2 వేల కంటె ఎక్కువ వచ్చింది. బిజెపి గెలుపు అసంభవం అనుకున్న మాణిక్ ఫలితాలు విని తేరుకోలేక పోయాడు. ఆయన సమీప ప్రత్యర్థి కంటె 16% మార్జిన్‌తో నెగ్గాడు.

**వర్తమానం** – ఇటువంటి అపూర్వవిజయం సాధించి పెట్టిన సునీల్ దేవ్‌ధర్ పట్ల విప్లవ్ దేవ్ కృతజ్ఞతాపూర్వకంగా ఉండాలి. కానీ ముఖ్యమంత్రిగా తను తగడని గతంలో అధిష్టానానికి చెప్పాడనే కోపంతో అతను సునీల్‌ను దూరంగా పెట్టాడు. ఎన్నికల అనంతరం పార్టీ సమావేశాలకు సునీల్‌ను, అతని అనుచరులను పార్టీ సమావేశాలకు పిలవడం మానేశాడు. ఒక సమావేశంలో యిరు వర్గాలకు మధ్య వాగ్వివాదం కూడా జరిగింది. రాష్ట్రంలో తను తప్ప వేరెవ్వారెవరికి ప్రాముఖ్యత ఉండకూడదని అతని ఆశ. సునీల్ యిటీవల అగర్తలా ఓ ఆటోమొబైల్ షోరూమ్ ప్రారంభోత్సవానికి వెళ్లడం అతనికి నచ్చలేదు. ఇద్దరి మధ్య విభేదాలు ఎంత ముదిరాయంటే రాజధానిలో ఏప్రిల్‌లో జరిగిన బిజెపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశానికి సునీల్ హాజరుకాలేదు. కార్మికుల సదస్సుకు కూడా వెళ్లలేదు. పాత్రికేయులు కారణం అడిగితే 'నేను రెండేళ్లపాటు యీ రాష్ట్రంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. దాంతో కొన్ని సంస్థాపరమైన పనులు బకాయి పడ్డాయి. వాటిని చూసుకోవాల్సి వస్తోంది.' అన్నాడు. అతనిప్పుడు నెలలో ఐదారురోజులు మాత్రం ఉంటున్నాడు.

విప్లవ్–సునీల్ గొడవల కారణంగా త్రిపురలో తాము సాధించిన అద్భుత విజయం యీనగాచి నక్కలపాలయినట్లు అవుతుందన్న భయం బిజెపికి ఉంది. సమర్థనిర్వహణ, మాణిక్ సర్కార్ కంటె మెరుగైన పాలన అందించకపోతే త్రిపుర ప్రజలు మళ్లీ సిపిఎం వైపు తిరిగిపోతారన్న భయం ఉంది. విప్లవ్ ఎంపికలో తాము పొరబడ్డామా అనే సందేహం కూడా బిజెపి అధిష్టానానికి కలుగుతోంది. విప్లవ్‌ను ఢిల్లీకి పిలిపించి మోదీ, అమిత్ మాట్లాడుతున్నారు. పార్టీ ప్రతిష్ఠ కాపాడడానికి సునీల్‌ను అక్కడ నుంచి తప్పించి 2019 పార్లమెంటు ఎన్నికల సందర్భంగా యింకో రాష్ట్రం చూడు అని పంపించి వేయవచ్చు. విప్లవ్‌ను సరైన మార్గంలో నడిపించడానికి కొత్త అధ్యక్షుడిగా అనుభవశాలిని వేయవచ్చు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

**2018 జూన్** **ఎమ్బీయస్: జెమినీ గణేశన్ కెరియర్**

"మహానటి" సినిమాకు ప్రజలు బాగా కనెక్ట్ అవడంతో మంచి కమ్మర్షియల్ సక్సెసయింది. దానిలో దొర్లిన తప్పులు కొందరు ఎత్తి చూపుతున్నారు. సావిత్రికి జెమినీ గణేశనే తాగుడు అలవాటు చేశాడనడానికి ఆధారం ఏమిటని ఆయన పెద్ద భార్య కూతురు డా. కమలా సెల్వరాజ్ అడిగారు. వెంకట్రామయ్య చౌదరే అలవాటు చేశారని రమాప్రభ అంటున్నారు. దాన్ని బయోపిక్ అనకుండా సావిత్రి జీవితంపై ఆధారపడిన సినిమా అని ఉంటే ("డర్టీ పిక్చర్" సిల్క్ స్మిత జీవితం ఆధారంగా తీశాం అని చెప్పుకున్నట్లు...) గొడవ వుండేది కాదు. చాలాభాగం వాస్తవాలు, కొన్ని అవాస్తవాలు కలపడంతో గొడవ వచ్చిపడింది. నాటకీయత కోసం, ముఖ్యపాత్ర (ప్రొటగానిస్టు)పై ప్రేక్షకుడికి సింపతీ పోకుండా ఉండడం కోసం కొన్ని పొయెటిక్ లిబర్టీస్ తీసుకోక తప్పదు. కానీ సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరి దీనిలో వాస్తవాలే చూపించారు అని సర్టిఫై చేయడంతో చిక్కు వచ్చింది. చిన్న చిన్న డిటెయిల్స్‌లో వచ్చిన తప్పుల గురించి నేనిక్కడ రాయటం లేదు. జెమిని గణేశన్‌తో బంధం గురించి సినిమాలో చూపిన తీరు గురించే నేను రాస్తున్నాను.

నిజానికి సావిత్రి జీవితాన్ని యథాతథంగా తీస్తే ప్రేక్షకుల్లో సహానుభూతి కలగడం కష్టం. కేవలం ఆమె బాల్యం, నటజీవితం గురించి మాత్రం తీస్తే డ్రామా ఉండదు. ఆమె తెరమీద జీవితంలో ఎంత డ్రామా ఉందో, తెరవెనుకా అంత ఉంది. తనెన్నో తప్పులు చేసిందని ఆమెయే స్వయంగా చెప్పుకునేది. అయినా ఆమె ఆంధ్రుల అభిమాన నటి కాబట్టి అవన్నీ చూపలేరు. చూపిస్తే జనాలకు నచ్చదు. అలా అని జెమినీతో గొడవ చూపకుండా మానలేరు. అతన్ని పూర్తిగా విలన్ చేయలేరు, అదే సమయంలో అతనిలో కొన్ని లోపాలు చూపాలి. ఆ లోపాల వలన మన హీరోయిన్ బాధపడి, దేవదాసు టైపులో తాగుడుకి బానిసై, ఆరోగ్యం చెడగొట్టుకుని మరణించిందని చూపదలచారు. జెమినీ పాత్ర వేసినతను కూడా హీరోయే కాబట్టి ఆ లోపాలకు కూడా జస్టిఫికేషన్ చూపించాలి. అందువలన అతను తన కంటె ప్రతిభావంతురాలైన భార్యను చూసి అసూయపడి, తనకు వేషాలు రాక, ఆత్మన్యూనతాభావంతో అలమటించి, దాన్ని పోగొట్టుకోవడానికి కాబోలు ఎవరో అమ్మాయితో శయనిస్తే, దాన్ని కళ్లారా చూసిన హీరోయిన్ తట్టుకోలేక తన జీవితాన్ని ఆత్మహత్యాసదృశమైన బాట పట్టించిందని, ఆ ఆవేదనలోనే పిల్లలను సరిగ్గా పట్టించుకోలేక పోయిందని చూపించారు. ఈ కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంది. దానిలో వాస్తవాల గోల వాళ్లకు అక్కరలేదు. అయ్యోపాపం, సావిత్రి అనుకున్నారు, చాలు, సినిమా ఆడేస్తోంది.

ఈ సినిమా హిట్ కావడంతో యీ కల్పనే కొన్నాళ్లకు నిజమై కూర్చుంటుంది. "మహానటి సావిత్రి – వెండితెర సామ్రాజ్ఞి" పేరుతో పల్లవి అనే ఆమె ఒక జీవితచరిత్ర రాశారు. దానిలో హాలీవుడ్ నటీమణి, సావిత్రి కంటె 17 ఏళ్లు పెద్దదైన సూసన్ హేవర్డ్ సావిత్రి సినిమాలు చూసి, ఆమెకు అభిమాని అయినట్లు, సావిత్రిని అభినందిస్తూ ఒక ఉత్తరం రాసినట్లు కల్పించారు. నిజానికి సూసన్ హేవర్డ్ సావిత్రి అభిమాన నటి. ఆమె సావిత్రి సినిమాలు చూసే అవకాశమే లేదు. చూసినా ఉత్తరం రాసిన దాఖలాలు లేవు. ఇది కల్పించిన రచయిత్రి, యిది కల్పన అని ఎక్కడా రాయలేదు. అసలా పుస్తకం పూర్తి వాస్తవాలతో కూడిన జీవితచరిత్రో, లేక చిక్కనైన కథనం కోసం కల్పన రంగరించిన రచనో ఎక్కడా తెలుపలేదు. కొన్నేళ్లు పోయిన తర్వాత దానిలో రాసినవన్నీ అక్షరసత్యాలని ప్రజలు

భ్రమించే ప్రమాదం ఉంది. అలాగే "మహానటి" సినిమా చూసిన భావితరాల వారు సావిత్రికి వచ్చిన పేరు చూసి జెమినీ అసూయపడ్డాడని నమ్మవచ్చు. భావితరాల మాట ఎలా వున్నా యీ తరంలోని వారు కూడా పూర్తి వివరాల జోలికి వెళ్లకపోతే అలా అనుకునే ప్రమాదం ఉంది. అందుకని ఆ వివరాలు సేకరించి యిస్తున్నాను.

జెమినీ గణేశన్ 1920లో పుట్టాడు. సావిత్రి కంటె 15 ఏళ్లు పెద్దవాడు. తండ్రి చిన్నప్పుడే పోతే మద్రాసులో మేనత్త ముత్తులక్ష్మీ రెడ్డి వద్ద చేరాడు. ఆవిడ డాక్టరీ చదివి దేవదాసీ వ్యవస్థను రూపుమాపడానికి సామాజిక ఉద్యమం నడిపేది. కొంతకాలం ఆవిడ వద్ద చదువుకుని, తర్వాత తల్లి వద్దకు పుదుక్కోటైకు వచ్చి, ఆ తర్వాత మద్రాసులో సైన్సు గ్రాజువేట్ అయ్యాడు. 1940లో పెళ్లయింది. డాక్టరీ చదివిస్తానన్న మావగారు పెళ్లయిన ఆర్నెల్లకే చనిపోవడంతో మద్రాసులో కెమిస్ట్రీ లెక్చరరు ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. 1947లో జెమినీ స్టూడియోలో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు. "మిస్ మాలిని" (1947)లో పుష్పవల్లి పక్కన హీరోగా పరిచయమయ్యాడు. అది ఆడలేదు. అక్కడ ఉండగానే సావిత్రి టాలెంటు గుర్తు పట్టి సిఫార్సు చేయడం జరిగింది. ద్విపాత్రాభినయం చేసిన "మనం పోల్ మాంగల్యం" (1953) తోనే స్టార్‌డమ్ వచ్చింది. దానిలో అతని పక్కన సావిత్రి హీరోయిన్. ఆ సినిమా షూటింగు సమయంలోనే 1952లో వాళ్లిద్దరూ రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. అప్పటికి సావిత్రికి 17 ఏళ్లయితే జెమినీకి 32. ఏమీ తెలియని పల్లెటూరి అమ్మాయిలా వున్న సావిత్రికి అతను హైఫై లైఫ్ పరిచయం చేశాడనీ, అనేక కొత్త విషయాలు నేర్పాడని, అభిరుచులు మప్పాడని సినిమాలో కూడా చూపారు. చిన్నతనంలోనే చనిపోయిన తండ్రి పట్ల అబ్సెషన్ ఉన్న సావిత్రి అతనిలో తన తండ్రిని చూసుకుందని సటిల్‌గా ఎస్టాబ్లిష్ చేశారు కూడా. పెళ్లయ్యాక యిద్దరి దశ తిరిగింది. కలిసి వేసిన సినిమాలూ, విడివిడిగా వేరే వాళ్లతో వేసిన సినిమాలూ కూడా హిట్టయ్యాయి. సావిత్రి ఎంత పెద్ద హీరోయిన్ అయిందో తెలుగువాళ్లందరికీ తెలుసు. సినిమాలో కూడా చూపించారు.

అయితే జెమినీ గణేశ్ ఏ పాటి హీరో, అతని మార్కెట్ ఎలా ఉండేది? ఎంతవరకు ఉంది? అనేది మన తెలుగువాళ్లల్లో చాలామందికి తెలియదు. అతను సావిత్రి డబ్బుపై పడి తిన్న పరాన్నభుక్కు అని కూడా కొందరు అనుకుంటారు. అందువలన అతని కెరియర్ గురించి కాస్త రాస్తాను. తమిళంలో శివాజీ, ఎమ్జీయార్ టాప్ స్టార్స్. వాళ్లతో పాటే యితర హీరోలు కూడా ఉండేవారు. మన దగ్గర జగ్గయ్య, కాంతారావు, హరనాథ్ ఉన్నట్లు! వీళ్లు స్వతంత్రంగా హీరోలుగా వేస్తూనే ఎయన్నార్, ఎన్టీయార్‌లతో బాటు పారలల్ హీరోగా వేసేవారు. అటువంటి పారలల్ హీరో పాత్రల్లో జెమినీ చక్కగా ఒదిగేవాడు. ఎమ్జీయార్‌తో ఒక్క సినిమాయే వేసినా, శివాజీతో చాలా వేశాడు. విడిగా హీరోగా అతనికి చాలా డిమాండ్ ఉండేది. విజయావారు తీసిన మిస్సమ్మ, గుణసుందరి, మాయాబజార్, అప్పుచేసి పప్పుకూడు, గుండమ్మ కథ తమిళ వెర్షన్లలో అతనే హీరో. ముక్తా శ్రీనివాసన్, శ్రీధర్ వంటి దర్శకనిర్మాతలు, బాలచందర్ వంటి దర్శకులు – అందరూ జెమినీని యిష్టపడేవారు. అతనికి దర్శకుడితో కాని, సహనటుడితో కాని ఎప్పుడూ పేచీలు రాలేదు. జానపద, చారిత్రాత్మక, పౌరాణిక, సాంఘిక సినిమాలన్నిటిలోను నటించాడు. ఎక్కువగా ప్రేమకథా చిత్రాలలో నటించడం వలన 'కాదల్ మన్నన్' (ప్రేమకు రాజు) అనే బిరుదు వచ్చింది. ఎప్పుడూ బిజీగానే ఉన్నాడు. వేషాల కోసం వెతుక్కోవలసిన పని ఎన్నడూ లేదు.

ఇక సినిమాల్లో చూపించిన పీరియడ్ గురించి ఫోకస్ చేసి చూస్తే సినిమాలో చూపించినదేమిటంటే – కొద్దికాలం పోయాక చూస్తే సావిత్రి బాగా డిమాండ్‌లో ఉంది, కానీ జెమినీకి మార్కెట్ పోయింది. అంతా సావిత్రి గురించే అడుగుతున్నారు, అతని గురించి అడిగేవారే లేరు. దాంతో అతని అహం దెబ్బ తింది. ఈ స్టోరీ లైన్ అమితాబ్, జయ నటించిన "అభిమాన్" సినిమా నుంచి తీసుకున్నారు. ఆ సినిమాలో అమితాబ్ పేరున్న గాయకుడు, పల్లెటూరిలో అజ్ఞాతంగా ఉంటూన్న ప్రతిభావంతురాలైన ఒక గాయనిని చూసి, ముచ్చటపడి పెళ్లి చేసుకున్నాడు. ఆమెను బలవంతపెట్టి స్టేజి ఎక్కించాడు. తీరా చూస్తే ఆమెకు అతని కంటె ఎక్కువ పేరు వచ్చింది. ఆమె మార్కెట్ ముందు యితనిది వెలతెల పోయింది. ఇతను అసూయపడ్డాడు, వాళ్ల కాపురం చెడిపోయింది. దాన్ని "మహానటి"లో ఎడాప్ట్ చేసుకున్నట్లుంది. అయితే వాస్తవాలు ఎలా ఉన్నాయంటే "సుమంగళి" (1965) నాటికే సావిత్రి తెరపై లావుగా కనబడింది. అప్పుడామెకు 30 ఏళ్లు. 1965 తర్వాత ఆమె సోలో హీరోయిన్‌గా వచ్చిన సినిమాలు "మనసే మందిరం" (1966), "నవరాత్రి" (1966) "ప్రాణమిత్రులు" (1967) మాత్రమే. "నిర్దోషి" (1967)లో అంజలితో, "కంచుకోట" (1967)లో దేవికతో, "తల్లిప్రేమ" (1967)లో కాంచనతో కలిసి వేయాల్సి వచ్చింది. "ఉమ్మడి కుటుంబం" (1967)లో ఆమె ఎన్టీయార్‌కు వదిన. "వరకట్నం" (1969), "కోడలు దిద్దిన కాపురం" (1970)లో కూడా వదినే. కళ్లతో, మొహంతో ఎంత అభినయం ప్రదర్శించినా సరిపోదని, సాటి తారామణులు శరీరాకృతి కాపాడుకుంటున్నారు కాబట్టి, యిక తనకు హీరోయిన్‌గా వేషాలు రావని గ్రహించడం బట్టే ఆమె "చిన్నారి పాపలు" (1968) సినిమాను స్వీయ దర్శకత్వంలో 1967 అక్టోబరులో ప్రారంభించింది. అంతకు ముందు "నవరాత్రి" తెలుగు వెర్షన్ ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారితో కలిసి నిర్మించింది. దీనిలో తక్కినవాళ్లందరూ తప్పుకోవడంతో మొత్తం నిర్మాణవ్యయం తనే భరించవలసి వచ్చింది.

ఈ టైములో జెమినీ కెరియర్ ఎలా ఉందో చూదాం. 1966లో అతను వేసిన సినిమాలు 7, 67లో 8, 68లో 5, 69లో 11, 70లో 9, 71లో 12, 72లో 10, 73లో 7, 74లో 5.. అలా 1980 వరకు అంటే అతనికి 60 ఏళ్లు వచ్చేవరకు అతని సినిమా రిలీజు కాని సంవత్సరం లేదు. ఈ సినిమాల్లో అతను వేసినవి గెస్టు రోల్సేమో అనే అనుమానం రావచ్చు. అందువలన వాటి హిందీ, తెలుగు వెర్షన్లు ఉన్న చోట తెలుగులో ఎవరు వేశారో రాస్తాను. "రాము"(తమిళ వెర్షన్ 1966) లో ఎన్టీయార్, "ఆస్తులు అంతస్తులు" (త.వె.1968)లో కృష్ణ, "కలక్టర్ జానకి" (త.వె.1969) లో జగ్గయ్య, "బొమ్మా బొరుసా" (తవె 1969)లో రామకృష్ణ, "మమతా" (తవె 1970)లో అశోక్ కుమార్, "స్త్రీగౌరవం" (తవె 1971)లో కృష్ణంరాజు, "సత్యకామ్" (తవె 1971)లో ధర్మేంద్ర, "బడిపంతులు"

(తవె 1973)లో ఎన్టీయార్, "ఓ మై నహీ(" (తవె 1974)లో నవీన్ నిశ్చల్, "నమక్ హరామ్" (తవె 1975)లో అమితాబ్ బచ్చన్, "కోరా కాగజ్" (తవె 1976)లో విజయ్ ఆనంద్ ...యిలా! ఈలోగా 1971లో అతనికి పద్మశ్రీ కూడా వచ్చింది. (శివాజీ గణేశన్‌కు 1966లో వచ్చింది. ఎమ్జీయార్‌కు యివ్వబోతే వద్దన్నాడని వినికిడి. చనిపోయాక భారతరత్న యిచ్చారు). పరిస్థితి యిలా వుండగా అతనికి డిప్రెషన్ వచ్చే అగత్యమేముంది?

ఇక ఆంధ్రలో గజారోహణ టైములో అతన్ని ఎవరూ పట్టించుకోనట్లు, అవమానం జరిగినట్లు సినిమాలో చూపించారు. గజారోహణం టైములో సావిత్రి హుషారుగా ఉంటే, జెమినీ బెదిరి, ఎందుకివన్నీ అన్నాడనీ కొందరు రాశారు. రేలంగి కూడా గజారోహణంటే యిబ్బంది పడ్డారని రాశారు. అంతమాత్రం చేత జెమినీని జనం పట్టించుకోలేదని చూపడం మెలోడ్రామాకు పరాకాష్ట. అప్పట్లో తెలుగు ప్రాంతాల్లో ఔట్‌డోర్ షూటింగు లుండేవి కావు, టీవీలు ఎలాగూ లేవు. సినిమా తారలు నిజజీవితంలో ఎలా ఉన్నారో చూడాలంటే శతదినోత్సవ సభల్లో మాత్రమే సాధ్యం. అందువలన జూనియర్ ఆర్టిస్టు వచ్చినా జనాలు ఎగబడేవారు. సావిత్రికి తెలుగునాట ఉన్న పాప్యులారిటీ జెమినీ గణేశ్‌కు లేదన్నది నూటికి నూరుపాళ్లు వాస్తవం. కానీ జెమినీ అనామకుడేమీ కాదు. డబ్బింగు సినిమాల ద్వారా తెలుగువారికి పరిచితుడు. 1962లో జరిగిన గజారోహణం నాటి సంగతిని లెక్కలోకి తీసుకుంటే "పతియే ప్రత్యక్షదైవం" (1955– కణవన్‌యే కణ్‌కండ దైవం, హీరోయిన్ అంజలి) "విజయకోట వీరుడు" (వంజికోట్టయ్ వాలిబన్ – 1958 వైజయంతిమాల, పద్మిని హీరోయిన్లు), "వీరపాండ్య కట్టబ్రహ్మన్న" (1959 – పద్మిని సరసన) "వీరసామ్రాజ్యం" (పార్థిబన్ కణవుకు తెలుగు వెర్షన్, హీరోయిన్ వైజయంతిమాల) "మా ఊరి అమ్మాయి" (1960 కళత్తూరు కణ్ణమ్మ, హీరోయిన్ సావిత్రి) "పాపపరిహారం" (పావమన్నిప్పు – సావిత్రి సరసన) (1961), "మురిపించే మువ్వలు" (కొంజుం సెలంగై, హీరోయిన్ సావిత్రి) (1962), వంటి విజయవంతమైన డబ్బింగు సినిమాల ద్వారా జెమినీ కూడా పాప్యులర్ హీరోనే. పైగా మన అభిమాన నటి సావిత్రి మొగుడు. అందువలన ప్రజలు అతని వెంటపడకుండా ఎలా ఉంటారు?

ఇక పేపర్లలో 'వేషాలు తగ్గిన 'సాంబారు గణేశన్' అని వచ్చిందన్నది హాస్యాస్పదం. అప్పట్లో పత్రికలు చాలా హుందాగా ఉండేవి. ఏ "హిందూనేశన్" "కాగడా" వంటి వివాదాస్పద పత్రికలు అతన్ని సాంబారు గణేశన్ అన్నాయేమో కానీ మామూలుగా అయితే అలా అనడానికే లేదు. వాస్తవానికి వేషాలు తగ్గినది సావిత్రికి. అందుకే ఖాళీగా ఉండలేక దర్శకత్వం మొదలుపెట్టింది. "మాతృదేవత" హిట్టయినా, యితరులు ఎవరూ దర్శకత్వానికి ఛాన్సివ్వకపోవడం చేత తన డబ్బుతోనే సినిమాలు తీసుకోవలసి వచ్చింది. మొదటి రెండూ తప్పిస్తే తక్కిన మూడూ రీమేక్‌లే. "చిరంజీవి" (1969) 'నీర్‌కుమిళి'కి రీమేక్. "వింతసంసారం" (1971) 'వియత్నాం వీడు'కు రీమేక్. "ప్రాప్తం" (1971) 'మూగమనసులు'కి తమిళ రీమేక్. వీటి ఒరిజినల్స్ బాగా ఆడాయి కానీ సావిత్రి తీసిన రీమేక్స్ ఫెయిలయ్యాయి. అందుకే ఆమె హితైషులందరూ సినీనిర్మాణం జోలికి, దర్శకత్వం జోలికి పోకుండా హాయిగా వచ్చిన వేషాలు వేసుకుంటూ ఉండమని సలహా యిచ్చారు. ఆమె వినలేదు. అదే ఆమె ఆర్థిక యిబ్బందులకు కారణమైంది.

ఇక జెమినీ యింకో అమ్మాయితో ఉన్నాడని తెలిశాకనే సావిత్రి అతనిపై కోపగించుకుని దూరమైందన్న కీలకమైన ఘట్టం గురించి.. అలమేలు ఎందరో సవతులను సహించారు. వెనక వచ్చిన కొమ్ములు వాడి అన్నట్లు సావిత్రి భర్త 'ఒన్ నైట్ స్టాండ్'ను కూడా సహించలేకపోయారు అన్నట్లు సినిమాలో చూపించారు. నిజానికి మధ్యతరగతి మోరల్స్‌తో తీర్పు యివ్వాలంటే సావిత్రి అలమేలు అనే గృహిణి భర్తను వలలో వేసుకుని, ఆమె కాపురంలో నిప్పులు పోసింది. అందుకే కొంతకాలానికి దానికి పరిహారం చెల్లించింది అని చెప్పాలి. సావిత్రి ఆ కోణంలో ఆలోచించి, సమాధాన పడిందా? భర్త స్త్రీలోలత్వం గురించి ఆమె ఎంత సెన్సిటివ్? కెరియర్ గురించి అందరికీ తెలుస్తుంది కానీ యిలాటి వ్యక్తిగత విషయాల గురించి బయటకు తెలియదు. అప్పటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కొంత ఊహాగానం చేయాల్సిందే. మొదటగా సావిత్రి పెళ్లి చేసుకునే నాటికే జెమినీ స్త్రీలోలత్వం ఆమెకు తెలుసు. 'అలమేలును పెళ్లి చేసుకున్నాను. పుష్పవల్లితో సంబంధం ఉంది' అని సినిమాలోనే చెప్పించారు. పెళ్లి సరే, యిలా చిన్న యిల్లు మేన్‌టేన్ చేయడాన్ని సావిత్రి ఎలా జీర్ణించుకోగలిగింది? అప్పటి సామాజిక పరిస్థితులు, సినీరంగ పరిస్థితులు అలాటివి అని మనం గుర్తు పెట్టుకోవాలి. మన మధ్యతరగతి మోరలిస్టిక్ కొలబద్దలతో వాళ్లను బేరీజు వేయకూడదు. జెమినీయే ఒక చిన్నింటి వారసుడు. అతని తాత బ్రాహ్మణుడు. ఆయనకు వేరే కుటుంబం ఉంది. దేవదాసి ఐన జెమినీ నాయనమ్మ తాతకు ఉంపుడుగత్తె. జెమినీ తండ్రి మళ్లీ దేవదాసీ కుటుంబానికి చెందిన అమ్మాయినే పెళ్లి చేసుకున్నాడు. అందువలన జెమినీకి తను చేసినదానిలో వింతేమీ కనబడి వుండదు.

పుష్పవల్లి విషయానికి వస్తే కూడా పశ్చిమగోదావరి జిల్లాలోని దేవదాసీ కుటుంబానికి చెందిన వ్యక్తి. సినిమారంగానికి వచ్చాక రంగాచారి అనే అతన్ని పెళ్లి చేసుకుని, అతని ద్వారా ఒక కొడుకు (బాబ్జీ అని బాలనటుడు) కన్నాక, విడిపోయింది. కానీ అధికారికంగా విడాకులు తీసుకోలేదు. (1956 తర్వాతే విడాకుల చట్టం వచ్చింది) పుష్పవల్లి సోదరికి వేదాంతం రాఘవయ్యగారితో సంబంధం ఉంది. వాళ్లకు పుట్టిన శుభ కూడా సినిమా నటి అయింది. జెమినీతో సంబంధం పెట్టుకున్నాక పుష్పవల్లికి రేఖ, రాధ పుట్టారు. ఆవిడకు పెద్దగా నటనావకాశాలు రాలేదు. తెలుగు, తమిళం మొత్తం కలిపి 20–25 సినిమాల్లో వేసింది. "చెంచులక్ష్మి" (1958)లో లీలావతి పాత్రలో ఆమెను చూడవచ్చు. 1955లో ఎమ్మెస్ ప్రకాశ్ అనే అవివాహితుడైన సంగీతదర్శకుడు "ఇంటిగుట్టు" (1958) సినిమా తీయడానికి యింకో ఆయనతో కలిసి ఫిల్మ్ కంపెనీ పెట్టి, పుష్పవల్లి టి నగర్ నివాసంలో ఒక వాటా అద్దెకు తీసుకున్నారు. అతనితో పుష్పవల్లికి దోస్తీ కుదిరింది. నాలుగేళ్ల పాటు సాగింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. అతను "మామకు తగ్గ అల్లుడు" సినిమా కూడా తీశాడు. రెండింటిలోనూ సావిత్రే హీరోయిన్. ప్రకాశ్‌తో బంధం ఏర్పడ్డాక జెమినీ పుష్పవల్లి ద్వారా తనకు పుట్టిన పిల్లల సంగతి పట్టించుకోలేదు. రేఖకు ఆ విషయంలో ఆగ్రహం ఉంది. అందుకే 2005లో జెమినీ పోతే అంత్యక్రియలకు

కూడా రాలేదు. ఆమె చెల్లి రాధ అమెరికాలో ఉంది.

'మా అక్క పెళ్లిలో సావిత్రి, పుష్పవల్లి, మా అమ్మ కంటె కంటె ఎక్కువగా పెద్దరికం వహించార'ని డా. కమల చెప్పారు. అంటే యిది రహస్య వ్యవహారమేమీ కాదన్నమాట. తెలుగు, తమిళ సినీరంగాలలో ఎందరో ప్రముఖులు, ఎమ్జీయార్, కరుణానిధి, నుంచి అనేకమంది వైవిరావు (లక్ష్మి తండ్రి), భీమ్‌సింగ్ వంటి దర్శకనిర్మాతలకు యిటువంటి వ్యవహారాలుండేవి. రెండిళ్ల వ్యవహారానికి ఘంటసాల కూడా మినహాయింపు కాదు. జెమినీ సహనటుడు, డిఎంకె నాయకుడు ఐన ఎస్ఎస్ రాజేంద్రన్ భార్య ఉండగానే సిఆర్ విజయకుమారి అనే హీరోయిన్‌తో సహజీవనం చేసి పిల్లల్ని కన్నాడు. ఇద్దరూ విడిపోయాక తామరసెల్వి అనే యింకో ఆవిణ్ని చేసుకున్నాడు. జెమినీ పెద్ద భార్య కూడా ఆనాటి గృహిణుల్లాగానే భర్త వ్యవహారాలను ఆపే శక్తి లేక మిన్నకుందని అనుకుని ఊరుకోకూడదు. సావిత్రీ ఊరుకుందని మనం గ్రహించాలి. సావిత్రితో పరిచయానికి ముందు పుష్పవల్లితో సంబంధం ఉందనే కాదు, 1952లో సావిత్రితో రహస్యవివాహం జరిగాక కూడా జెమినీ పుష్పవల్లితో సంబంధం కొనసాగించాడు. అందుకే 1954లో రేఖ పుట్టింది, తర్వాత రాధ పుట్టింది. ఇంతకంటె రుజువు ఏం కావాలి? సావిత్రి 1956లో జెమినీతో తన వివాహాన్ని బహిర్గతం చేసిందంటే పుష్పవల్లి ఎఫయిర్‌నూ ఆమోదించినట్లేగా!

నిజానికి సినీతారలకు వివాహేతర సంబంధాల విషయంలో వేరే రకమైన వేల్యూ సిస్టమ్ ఉంది. వీటి పట్ల మరీ అంత సెన్సిటివ్‌గా ఉండకుండా, ఒక పరిమితి వరకు సహించే గుణం ఉంది. శ్రీరెడ్డి గొడవల్లో కాస్టింగ్ కౌచ్ గురించి చర్చ వచ్చినపుడు సినీరంగ ప్రముఖులెందరో యివన్నీ ఎప్పణ్నుంచో ఉన్నవే కదా, యిప్పుడెందుకీ రచ్చ అన్నట్లు మాట్లాడారు. జెమినీ వంటి ఉమనైజర్ 1956 నుంచి 1967 వరకు (అప్పుడతని వయసు 36 సం. నుంచి 47 సం.) మడి కట్టుకుని ఉంటాడని మనం నమ్మగలమా? సావిత్రి నమ్మి ఉంటారా? హీరోగా టాప్‌లో ఉన్నాడు. సరదాగా, తెలివిగా మాట్లాడుతూంటాడు (షావుకారు జానకి యీ విషయం చెప్పారు) వద్దన్నా అమ్మాయిలు వచ్చి పడుతూంటారు. అందువలన యీ విషయాల్లో సావిత్రి చూసీచూడనట్లే ఉండి ఉంటారు. కనీసం 1967 వరకు జెమినీపై సావిత్రికి ఫిర్యాదులు లేవని అనుకోవడానికి తుర్లపాటి కుటుంబరావు యీ మధ్య రాసిన వ్యాసం పనికి వస్తుంది. 1967లో నెల్లూరులో సావిత్రి, జెమిని దంపతులకు సన్మానం చేస్తే తుర్లపాటి వెళ్లారు. ఆయన వద్దకు విజయవాడ నుంచి సావిత్రి పెదనాన్న వెంకట్రామయ్య చౌదరి వచ్చి 'సావిత్రిని వాడు మోసం చేస్తాడు. ఇప్పటికైనా విడాకులు తీసుకోమని మీరైనా చెప్పండి' అన్నారు. 'వాళ్లకు 1952లో పెళ్లయింది. 15 ఏళ్ల కాపురం అయి, యిద్దరు పిల్లలు పుట్టాక విడాకులు తీసుకోమని ఎలా చెప్తామండి?' అని తుర్లపాటి ఆయనకు చెప్పి, యీ సంగతి సావిత్రికి చెప్పారు. సావిత్రి సంతోషించి, 'బాగా చెప్పారు. మీరిలా హితవు చెప్పారని బావగారికి కూడా చెప్తానుండండి' అన్నారని తుర్లపాటి రాశారు. అంటే 1967 వరకు వాళ్ల కాపురం బాగానే ఉందని అనుకోవాలి. ఆ ఏడాది అక్టోబరులోనే "చిన్నారి పాపలు" సినీ దర్శకనిర్మాతగా సావిత్రి మారారు.

జెమిని స్త్రీలోలత్వం పట్ల సావిత్రి ఒక సాధారణ మధ్యతరగతి మహిళలా రియాక్టయిందని, వారి కాపురం విచ్ఛిన్నమవడానికి అదే ప్రధానకారణమని సినిమాలో నాటకీయత కోసం చూపవచ్చు తప్ప అది నిజమనుకోవాలని లేదు. అసలు కారణం – భర్త మాట లక్ష్యపెట్టకుండా సావిత్రి డబ్బుని చిత్తం వచ్చినట్లు ఖర్చు చేయడం అనుకోవాలి. సావిత్రి అద్భుతమైన నటి, మహాద్భుతమైన మంచి మనిషి. ఎవరేమడిగినా లేదనకుండా యిచ్చేసేది. ఇవన్నీ బయటవాళ్లకు బాగానే ఉంటాయి కానీ యింట్లో వాళ్లకు ఎలా ఉంటాయో ఊహించండి. మీరు ఒక పరిమితికి మించి సమాజసేవ చేస్తానన్నా, దానధర్మాలు చేస్తానన్నా. ఇన్‌కమ్‌టాక్స్ కట్టకుండా అవకతవకగా వ్యవహారాలు చేసినా మీ భార్య లేదా భర్త తప్పకుండా అడ్డుపడతారు. చేతకాకుండా వ్యాపారం చేస్తానంటే వద్దంటూ అవరోధాలు కల్పిస్తారు. దగాకోర్లను నమ్మి డబ్బు అప్పుచెప్పేస్తూ వుంటే మందలిస్తారు. కోప్పడతారు. జెమినీ చేసినదదే. సావిత్రి మరణానంతరం జెమినీపై నింద వస్తే అతను ప్రెస్‌మీట్ పెట్టి లెక్కలన్నీ చెప్పాడనీ చదివాను. అప్పుడే కుమార్తె చాముండేశ్వరి సావిత్రిపై కేసు వేసిందని కూడా చెప్పాడట. వేసినా ఆశ్చర్యం లేదు. ఎందుకంటే మైనర్ల ఆస్తిని మేజర్లు తగలేస్తూ ఉంటే ఆవిడ తన తరఫున, తన తమ్ముడి తరఫున తల్లిపై ఆంక్షలు విధించాలని కోర్టు వారిని కోరుతూ కేసు వేసి ఉండవచ్చు. జెమిని డబ్బు దగ్గర జాగ్రత్తపరుడు. అతను దర్శకత్వం జోలికి పోలేదు. సినిమా కూడా ఒక్కటే ఒక్కటి తీశాడు. "ఓ మై నహీ(" సినిమా కథని "నాన్ అవన్ ఇల్లయ్" పేర తీస్తే అతనికి ఫిల్మ్‌ఫేర్ ఎవార్డు వచ్చింది కానీ డబ్బులు రాలేదు. సినీనిర్మాణం ప్రత్యేకమైన కళ. సావిత్రి మహా మొండి మనిషని ఎవరి మాటా వినదని హితవు చెప్పడానికి జెమినీ వెళితే కుక్కల్ని ఉసిగొల్పిందని, జెమినీ గోడదూకి పారిపోవలసి వచ్చిందనీ జెమనీ పెద్దభార్య కూతురే కాదు, రమాప్రభా చెప్పారు. 'మా అమ్మ అణ్నానగర్‌లో అద్దె యింట్లో ఉండడానికి కారణం సొంత యిల్లు లేక కాదు, మా అందరి మీదా అలిగి..' అని చాముండేశ్వరే చెప్పారు.

ఇలాటి మొండితనం వలన భార్యాభర్తల మధ్య గొడవలు రావడంలో ఆశ్చర్యం లేదు. ఆమె యింటికి వస్తే కొట్లాటలు, తిట్లు తప్ప వేరేవీ లేనప్పుడు జెమిని రాకపోవడంలో ఆశ్చర్యం లేదు. వెళ్లడానికి అతనికి వేరే యిల్లు ఉంది. గర్ల్ ఫ్రెండ్సూ ఉండి ఉంటారు. అన్నిటిని మించి కెరియర్ ఉంది. అతను "రుద్రవీణ" (1988), "భామనే సత్యభామనే" (1998) వరకు చురుగ్గా నటిస్తూనే ఉన్నాడు. సావిత్రి కోమాలోకి వెళ్లాక తనపై విరుచుకు పడలేదు కాబట్టి, అతను యథేచ్ఛగా వచ్చి వెళుతూ వైద్యం చేయించాడు. ఆమె పోయిన తర్వాత పెద్ద భార్య యింటికి తీసుకెళ్లి అక్కడే అంత్యక్రియలు జరిపించాడు. కూతురు చాముండేశ్వరికి అప్పటికే పెళ్లయింది. కొడుకు సతీష్‌ను అక్కతో ఉంటావా? నాతో ఉంటావా? అంటే నీతో ఉంటానన్నాడు. అతన్ని చదివించి ఇంజనియర్‌ను చేశాడు. (అతనిప్పుడు అమెరికాలో ఉన్నాడు. తండ్రిని పన్నెత్తి మాటనడు) పెద్దభార్య నలుగురు కూతుళ్లలో ముగ్గుర్ని డాక్టర్లను చేశాడు. వాళ్లలో ఒకరు దక్షిణ భారతదేశంలోనే తొలిసారి టెస్ట్‌ట్యూబ్ బేబీ సృష్టించిన గైనకాలజిస్టు డా. కమల. నాలుగో కూతురు టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూపులో జర్నలిస్టు.

"మహానటి" హిస్టరీపై ఆధారపడిన ఒక కల్పితగాథగానే మిగిలి వుంటే యిన్ని వివరాలు తెలుసుకోవలసిన పని లేదు. కానీ దాన్ని ఒక కల్ట్ సినిమాగా, వినోదపు పన్నుకి అర్హమైన సినిమాగా ఆకాశానికి ఎత్తేస్తున్నారు. సావిత్రి ఆథరైజ్డ్ బయోగ్రఫీలా పరిగణించేస్తున్నారు. రేపోమాపో దాన్ని స్కూలు పిల్లల సిలబస్‌లో కూడా పెట్టమనే డిమాండ్ రావచ్చు. అందుకే వాస్తవాల గురించి యీ సుదీర్ఘ వివరణ.

(ఫోటో – పుష్పవల్లి, "పాశమలర్" (రక్తసంబంధం)లో శివాజీతో, "మిస్‌మేరీ"లో మీనాకుమారి, జమునలతో, "వంజికోట్టయ్ వాలిబన్"లో వైజయంతిమాలతో, "కొంజుం సెలంగై"లో నాదస్వర విద్వాంసుడిగా, "స్కూల్‌మాస్టర్"లో జానకితో – **ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

**2018 జూన్** **ఎమ్బీయస్: ఛత్తీస్‌గఢ్‌లో మరో కుమారస్వామి?**

ఈ ఏడాది చివర్లో ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లబోతోంది. రమణ్ సింగ్ 15 ఏళ్లగా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. 2000 లో మధ్యప్రదేశ్ నుండి విడిపోయి రాష్ట్రం ఏర్పడినపుడు కాంగ్రెసు ముఖ్యమంత్రి అజిత్ జోగి ముఖ్యమంత్రి అయ్యాడు. 2003లో ఎన్నికలు వచ్చినపుడు, బిజెపి 39.3% ఓట్లు, 50 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెసుకు దాని కంటె 2.6% తక్కువ ఓట్లు, 13 తక్కువ సీట్లు వచ్చాయి. 2008 వచ్చేసరికి ఓట్లలో తేడా 1.7%, సీట్లలో తేడా 12 (50-38) అయింది. 2013లో ఓట్లలో తేడా 0.8%, సీట్లలో తేడా 10 (49-39) అయింది. అంటే ఒక్క 1% తేడా వచ్చినా ఫలితాలు అటూయిటూ అవుతాయన్నమాట. ఇన్నాళ్లూ బిజెపి, కాంగ్రెసుల మధ్యనే ముఖాముఖీ పోటీ గానీ యీసారి 2016 జూన్‌లో కాంగ్రెసు నుండి బయటకు వచ్చేసి 'జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్' (జెసిసి) పేర సొంత పార్టీ పెట్టుకున్న అజిత్ జోగీ కూడా రంగంలో ఉన్నాడు. ఎవరి ఓట్లు, ఏ మేరకు చీల్చుతాడో తెలియదు. ఎవరు నెగ్గినా అతను కింగ్‌మేకర్ అవుతాడని, లేదా కర్ణాటక తరహా పరిస్థితి వస్తే కుమారస్వామిలా ఏకంగా కింగే అయిపోతాడని అనుకుంటున్నారు.

రమణ్ సింగ్ మునిసిపల్ కౌన్సిలర్‌గా తన రాజకీయజీవితం ప్రారంభించి, 1990లో మొదటిసారి ఎమ్మెల్యే అయ్యాడు. 1993లో ఓడిపోయాడు కానీ 1999లో రాజనంద్‌గావ్ నుంచి ఎంపీగా గెలిచి, మోతీలాల్ ఓహ్రా వంటి కాంగ్రెసు ప్రముఖుణ్ని ఓడించినందుకు గాను వాజపేయి కాబినెట్‌లో జూనియర్ మంత్రి పదవి సంపాదించుకున్నాడు. 2003లో ఛత్తీస్‌గఢ్‌కు ఎన్నికలు వచ్చినపుడు అజిత్ సింగ్ వంటి అనుభవజ్ఞుడితో తలపడడానికి అద్వానీ యితన్ని పంపించాడు. రాష్ట్రాన్ని గెలిచిచూపించడమే కాక, ప్రతి ఎన్నికలో నిలబెట్టుకుంటూ వస్తున్నాడు. అతను వివాదరహితుడు. అందర్నీ కలుపుకుని వెళ్లే నాయకుడు. పార్టీలో అసమ్మతి లేకుండా జాగ్రత్త పడుతున్నాడు. అతని పరిపాలనాకాలంలో ప్రభుత్వస్కూళ్లు 20 వేల నుంచి 60 వేలకు పెరిగాయి. మెడికల్ కాలేజీలు 2 నుంచి 10 అయ్యాయి. కాలేజీలు 116 నుంచి 214కు పెరిగాయి. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజనా కింద రోడ్లు 1072 కిమీ.ల నుంచి 22,750 కిమీలకు పెరిగాయి. ఆల్-వెదర్ రోడ్లు 7 వేల కిమీ.లు పెరిగాయి. విద్యుత్ ఉత్పాదన 4732 మెగావాట్స్ నుంచి 22,764 మె.వాకు పెరిగింది. 97% గ్రామాలకు విద్యుత్ అందింది. హార్టికల్చర్ పంటలు ఆరు రెట్లు పెరిగాయి. శిశుమరణాలు వెయ్యికి 70 నుంచి 41కి తగ్గాయి. ప్రసూతి మరణాలు లక్షకు 379 నుంచి 221కు తగ్గాయి. ప్రభుత్వాసుపత్రులు 4500 నుంచి 6 వేలయ్యాయి. అయినా చేయడానికి యింకా ఎంతో ఉంది.

మధ్యప్రదేశ్‌తో కలిసి ఉన్నపుడు తమ ప్రాంతంలో ఉత్పత్తి అవుతున్న మిగులు విద్యుత్తంతా మధ్యప్రదేశ్ వాడేస్తోందని, ఎక్కువ భాగం గిరిజనులు, హరిజనులు ఉన్న తమ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన చేసి ఛత్తీస్‌గఢ్ వేరే రాష్ట్రం కోరింది. రాష్ట్రం ఏర్పడి 17 ఏళ్లు అయినా ప్రజల ఆర్థికస్థితి బాగుపడలేదు. రంగరాజన్ ప్యానెల్ నివేదిక ప్రకారం రాష్ట్రజనాభాలో 48% మంది దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో ఆ అంకె 44% మాత్రమే. ఈ అంకెలు ప్రతిపక్షాలకు ఉపయోగపడతాయి. మావోయిస్టు సమస్య యింకా పరిష్కారం కాలేదు. రమణ్ సింగ్ అదృష్టమేమిటంటే కాంగ్రెసుకు బిజెపితో సమానమైన ఓటు బ్యాంకు ఉన్నా, ప్రముఖ నాయకుడు ఎవరూ లేరు. ఈ రోజుల్లో వ్యక్తిగతమైన యిమేజి చాలా ఓట్లు తెచ్చిపెడుతోంది. కాంగ్రెసు తరఫు ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరూ దరిదాపుల్లో కనబడటం లేదు. అయితే సత్నామీ షెడ్యూల్ కులానికి నాయకుడైన అజిత్ జోగి పార్టీ జెసిసి ఎన్ని ఓట్లు చీలుస్తుందో తెలియకుండా ఉంది. షెడ్యూల్ కులాలు (12%), షెడ్యూల్ తెగలు (32%) కలిపి జనాభాలో 44% ఉన్నారు. ఒబిసిలలో కొన్ని ఉపకులాలలో కూడా అజిత్‌కు బలముంది. షెడ్యూల్ తెగల రిజర్వ్‌డ్ సీట్లు 29 ఉంటే 2013లో బిజెపి 11 మాత్రమే గెలిచింది కానీ 10 షెడ్యూల్ కులాల రిజర్వ్‌డ్ సీట్లలో 9 గెలిచింది. ఎందుకంటే సత్నామీలు బిజెపికి ఓటేశారు. ఇప్పుడు అజిత్ దానికి గండి కొట్టేట్టున్నాడు. ఇంకో పక్క అగ్రవర్ణాల మాటా చెప్పడానికి లేకుండా ఉంది. అజిత్ కాంగ్రెసు నాయకుడిగా ఉండగా అతను ఎస్సీ, ఎస్టీలకే ప్రాధాన్యత యిస్తున్నాడన్న కారణంగా కాంగ్రెసుకు ఓటేయడం మానేసిన బ్రాహ్మణులు, ఠాకూర్లు, వైశ్యులు (జనాభాలో 7-10% ఉంటారు) అజిత్ నిష్క్రమణతో యీసారి కాంగ్రెసుకు ఓటేయవచ్చు. బియస్పీ పార్టీ అన్ని ఎన్నికలలోను 5% ఓట్లు గెలుస్తూ వస్తోంది. ఇప్పుడు జాతీయస్థాయిలో కాంగ్రెసు-బియస్పీల మధ్య సయోధ్య కుదిరి, యిక్కడా సీట్ల సర్దుబాటు జరిగితే అదీ ముప్పు తెస్తుంది. బలాబలాలు యించుమించు సమానంగా ఉన్నపుడు 1% ఓటు కూడా ఫలితాలను తారుమారు చేస్తుంది కాబట్టి ప్రతి వర్గాన్నీ కాపాడుకోవాలి.

ఈ పరిస్థితుల్లో బిజెపి హరిజనులపై ఆశ తగ్గించుకుని, గిరిజనులను ఆకట్టుకోవడానికి చూస్తోంది. గిరిజన భూముల అమ్మకాలను నిషేధించే చట్టాన్ని మార్చడానికి బిజెపి ప్రభుత్వం గతంలో ప్రయత్నించింది. ఇది గిరిజన వ్యతిరేక చర్య అని ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో ఆగింది. కానీ ఆ మచ్చ మిగిలింది. దాన్ని పోగొట్టుకోవాలంటే గిరిజన హితైషిగా చూపించుకోవాలి కాబట్టి 2017

అక్టోబరులో తెండు ఆకులు కోసేవారికి అంటూ రూ.275 కోట్లు బోనస్‌గా ప్రకటించింది. వాళ్ల జీతం బస్తాకు రూ.1800 నుంచి 2500 కు పెంచింది. దీనివలన 13 లక్షల కుటుంబాలకు లబ్ధి కలుగుతుంది. వరి బోనస్ గతంలో యిచ్చేవారు. 2014లో మోదీ సర్కార్ కేంద్రంలో ఏర్పడ్డాక దాన్ని ఆపేశారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి రమణ్ సింగ్ పునరుద్ధరింప చేశాడు. క్వింటాల్‌కు రూ.1550 రేటు కాగా అదనంగా రూ.300 యిస్తారు. దానివలన 16 లక్షల రైతులకు లాభం. 2013లో బిజెపి గెలవడానికి కారణం రాయపూర్, దుర్గ్, రాయగఢ్ వంటి నగర ప్రాంతాల వాసుల ఓట్లు. ఆ ఓట్లు చెదిరిపోకుండా మోదీ మ్యాజిక్ చేస్తాడని బిజెపి నమ్మకం. ఇక యువత మాటకు వస్తే, యీసారి 32 లక్షల మంది ఓటర్లు కొత్తగా చేరుతున్నారు. మొత్తం ఓటర్లలో వీళ్లు ఆరో వంతు కంటె ఎక్కువ. స్మార్ట్ ఫోన్లు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను చూపించి వీరిని బిజెపి ఆకట్టుకుంటోంది. బిజెపి బయటివాళ్లకు ఉద్యోగాలు యిస్తోంది కాబట్టే నిరుద్యోగం పెరుగుతోందని, తామైతే స్థానికులకే యిస్తామంటూ అజిత్ ప్రచారం చేస్తున్నాడు. తక్కినవి రెండూ జాతీయపార్టీలు, తనది ప్రాంతీయపార్టీ కాబట్టి ఛత్తీస్‌గఢ్ ఆత్మగౌరవం నినాదం ఎత్తుకున్నాడు.

ఇక ఎన్నికలలో ముఖ్యంగా చర్చకు వచ్చే నినాదం – అవినీతి నిర్మూలన. రమణ్ సింగ్‌పై యింకా ఏ కేసూ రాకపోయినా, అతని ప్రభుత్వం అవినీతిమయమని, లంచాలు యివ్వందే ఏ ఫైలూ కదలదనే అభిప్రాయం సర్వత్రా ఉంది. మూడేళ్లగా రమణ్ మీదా ఆరోపణలు వస్తున్నాయి. 2007లో అగస్టా వెస్ట్‌ల్యాండ్ అనే ఇటాలియన్ హెలికాప్టర్ కంపెనీ నుంచి ఆగస్టా 109 హెలికాప్టర్ కొనుగోలు చేసే విషయంలో అక్రమం జరిగిందని, దానిలో రమణ్ సింగ్ కుమారుడు అభిషేక్ లబ్ధి పొందాడని ప్రశాంత్ భూషణ్ ఆరోపించారు. పది సంస్థలు టెండర్లు వేసినా, అగస్టా కంటె తక్కువ ధర కోట్ చేసినా, రాష్ట్రప్రభుత్వం ఒకే టెండర్ ఉందేట్లా చూసి, ఆ డీలరుకు 30% కమిషన్ చెల్లించిందని అభియోగం. నల్లధనం దాచుకునేందుకు వెసులుబాటు కల్గించే (టాక్స్ హేవెన్) బ్రిటిష్ వర్జిన్ ఐలండ్స్‌లో అభిషేక్ డైరక్టరుగా రెండు కంపెనీలు యీ చెల్లింపులు జరిగిన ఆర్నెల్ల లోపున వెలిశాయట. 2016 నాటి పనామా లీక్స్‌లో అతని పేరు బయటపడింది. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ మరిన్ని వివరాలు వెలుగులోకి రావచ్చు.

దీనితో బాటు రూ.1.50 లక్షల కోట్ల పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌లో స్కాములో కూడా రమణ్ సింగ్ చాలా సమాధానాలే చెప్పవలసి ఉంటుంది. అది 2004 నుంచి చాలా సమర్థవంతంగా నిర్వహించబడుతున్న గొప్ప స్కీము అని, పేద ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడంలో విజయం సాధించామని 2008, 2013 ఎన్నికలలో బిజెపి గొప్పగా చెప్పుకుంటూ వచ్చింది. అయితే 2014లో అవినీతి నిరోధక సంస్థ (ఎసిబి) సివిల్ సప్లయిస్ కార్పోరేషన్ అధికారుల యిళ్లపై దాడులు నిర్వహించినపుడు దొరికిన క్యాష్, డాక్యుమెంట్ల ద్వారా అధికారులకు, రాజకీయనాయకులకు (ముఖ్యమంత్రి పేరు కూడా ఉందంటారు) డబ్బు ముట్టినట్లు ఆధారాలు దొరికాయి. కాంగ్రెసు రూ.36 వేల కోట్ల అవినీతి జరిగిందని, దాన్ని బిజెపి హెడ్‌క్వార్టర్స్‌కు, ఆరెస్సెస్ హెడ్‌క్వార్టర్స్‌కు పంపారని ఆరోపించింది. ఎసిబి 15 మంది అధికారులను అరెస్టు చేసి 2015లో హైకోర్టులో కేసు పెట్టింది. కేసు విచారణ రాష్ట్ర పోలీసుల చేతిలోనే ఉంది కాబట్టి దర్యాప్తు చాలా నెమ్మదిగా సాగుతోంది. కోర్టు విచారణలో ప్రభుత్వం పట్టుబడిన అధికారులను తప్పుపట్టక పోగా, కేసు వేసినవారినే నిందించింది. 2016 ఆగస్టులో ఒక అఫిడవిట్ వేస్తూ స్కాము జరిగిందని అనడం అబద్ధమని, ఆధారంలేని ఊహాగానాలతో ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేస్తున్నారని వాదించింది. పైగా జైల్లో ఉన్నవారు బెయిల్ గురించి అప్లయి చేసుకుంటున్నపుడు దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయటం లేదు. తాజాగా 2017 నవంబరులో మరొకడు బెయిలుపై బయటకు వచ్చాడు. ఇదే కాకుండా 2006లో జరిగిన ప్రియదర్శిని మహిళా నాగరిక్ సహకారీ బ్యాంక్ స్కాములో కూడా రమణ్ సింగ్ పేరు బయటకు వచ్చింది. కాంగ్రెసు విడుదల చేసిన సిడిలో కేసులో ప్రధాన నిందితుడు బ్యాంకు అధికారులు రమణ్ సింగ్‌కు, యిద్దరు సీనియర్ కాబినెట్ మంత్రులకు కోటి రూ.ల చొప్పున యిచ్చానని చెప్పాడు. తాజాగా బృజ్‌మోహన్ అగర్వాల్ అనే మంత్రి కుటుంబం మహాసముంద్ జిల్లాలో 4.12 హెక్టార్ల అటవీభూమిని అక్రమంగా కొనేసి, పక్కనున్న ప్రభుత్వభూమిని ఆక్రమించాడని ఆరోపణ వచ్చింది.

2014 తదనంతరం బయటపడిన స్కాముల కారణంగా రమణ్ సింగ్ పలుకుబడి ఏ మేరకు దెబ్బ తిందో తెలియదు. గట్టి ప్రయత్నం చేస్తే ఓడించవచ్చనే ఆశ కాంగ్రెసుకు ఉండడం సహజం. అయితే ప్రభుత్వవ్యతిరేక ఓటు అజిత్ పార్టీకి, తమకు మధ్య చీలిపోతే రమణ్ మళ్లీ గట్టెక్కేయవచ్చు. దాన్ని నివారించాలంటే అజిత్‌తో రాజీ పడాలి, పొత్తు కుదుర్చుకోవాలి. కర్ణాటక ఎన్నికల తర్వాత కాంగ్రెసు ఆలోచనాధోరణిలో మార్పు వస్తోందంటున్నారు. 2019 పార్లమెంటు ఎన్నికలలో ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని 370 సీట్లకు పరిమితమైతే మంచిదని భావిస్తోందట. 2014 ఎన్నికలలో 464 సీట్లలో పోటీ చేసి కేవలం 44 అంటే 10% కంటె తక్కువ సీట్లు గెలిచింది. ఇంత ఘోరపరాజయం యింతకు ముందెన్నడూ లేదు. పివి నరసింహారావు పాలన తదనంతరం జరిగిన 1996 ఎన్నికలలో 127 స్థానాల్లో, ఆ తర్వాత జరిగిన 1998 ఎన్నికలలో 153 స్థానాల్లో డిపాజిట్లు పోయాయి. 2014లో ఏకంగా 178 చోట్ల డిపాజిట్లు గల్లంతయ్యాయి. 2014లో బిజెపితో ముఖాముఖీ పోటీలు జరిగిన చోట్ల కాంగ్రెసు ద్వితీయస్థానంలో ఉన్న నియోజకవర్గాలు 220. వాటిలో మళ్లీ పోటీ చేస్తూ, మిత్రపక్షాలు, ప్రాంతీయపార్టీల సహకారంతో మరో 150లో పోటీ చేస్తే చాలని అనుకుంటోందిట. కాంగ్రెసు పరిశీలిస్తున్న ప్రాంతీయపార్టీలలో ఛత్తీస్‌గఢ్‌లో అజిత్ జోగి పార్టీ కూడా ఉందని వార్తలు. ఎన్నికలు దగ్గర పడేటప్పటికి స్పష్టత వస్తుంది. **(ఫోటో – రమణ్ సింగ్, అజిత్ జోగి)** **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

**2018 జూన్ టాబ్లాయిడ్‌కై** **ఎమ్బీయస్: నల్లవారి పట్ల వివక్షతపై వినూత్న నిరసన**

నేషనల్ ఫుట్‌బాల్ లీగ్ పోటీల పూర్తయ్యాక అమెరికా జాతీయగీతం ఆలపించబడింది. ఛాంపియన్స్‌గా ఎన్నికైన ఫిలడెల్ఫియా

ఈగిల్స్ టీములోని కొందరు సభ్యులు ఆ సమయంలో నిటారుగా నిలబడకుండా ఒక మోకాలు వంచి నేలపై కూర్చున్నారు. ఇటీవలి కాలంలో నిరాయుధులైన నల్లవారి పట్ల అమెరికన్ పోలీసుల అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దానికి నిరసన తెలపడానికి వారా మార్గం ఎంచుకున్నారు. నిజానికి 2016లోనే కాలిన్ కేపెర్నిక్ అనే అతను యిదే కారణానికి యిలాగే చేశాడు. తక్కిన టీముల్లో కూడా యిది వ్యాపించింది. దాంతో 2017 వచ్చేసరికి కోపెర్నిక్‌ను ఏ టీమూ తీసుకోలేదు. అప్పట్లో యిలాటి నిరసనలను ఖండించిన ట్రంప్ కోపెర్నిక్ వెలికి తనే కారణమని గొప్పలు చెప్పుకున్నాడు. ప్రస్తుతం ఫిలడెల్ఫియా ఈగిల్స్ చేసిన పనిని కూడా ఖండిస్తూ జాతీయగీతాలపనలో నిలబడకుండా మన దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులను అవమానించారన్నాడు. అంటూనే ఆ టీముకు, వెయ్యి మంది వారి అభిమానులకు జూన్ రెండోవారంలో వైట్‌హౌస్‌లో విందు యిస్తానని ఆఫర్ చేశాడు. అయితే టీము సభ్యుల్లో నల్లవారు ట్రంప్ ఆహ్వానాన్ని మన్నించడానికి నిరాకరించారు. ఫుల్ టీము రావటం లేదు కాబట్టి, విందు కాన్సిల్ అన్నాడు ట్రంప్. నల్లవారిపై అత్యాచారాలు చాలాకాలంగా సాగుతున్నా ట్రంప్‌పై యీ ఆటగాళ్లు కసి పెంచుకోవడానికి కారణం - కాన్ఫిడరేట్ నాయకుల స్మారక చిహ్నాల విషయంలో ట్రంప్ వైఖరి!

19వ శతాబ్దపు అమెరికాలో బానిసల వ్యాపారం జోరుగా సాగేది. కొందరు ఆఫ్రికాకు వెళ్లి బలిష్ఠులైన ఆఫ్రికన్ వారిని జంతువులను పట్టినట్లుగా పట్టి, అమెరికాకు తీసుకుని వచ్చి బానిసలుగా విక్రయించేవారు. వీరికి జీతం బత్తెం ఉండేది కాదు. వాళ్లకి ఓపిక ఉన్నంతకాలం యజమానులు పని చేయించుకుని, అమ్మేసేవారు. కాల్చి చంపేసినా దిక్కూ దివాణం లేదు. వాళ్లను గొడ్ల కంటె హీనంగా చూసేవారు. భార్య, భర్త, పిల్లల్ని విడగొట్టి వేలం వేసేసేవారు. కొద్దికాలం పోయాక యిది అమానుషం అని అమెరిన్లలో కొందరికి తోచింది. బానిసత్వం రద్దు చేయాలనే ఉద్యమం ప్రారంభించారు. అబ్రహాం లింకన్ దానికి నాయకుడిగా ఉండి ఉత్తరాది రాష్ట్రాల మద్దతు సంపాదించాడు. అయితే 11 దక్షిణాది రాష్ట్రాలలో పెద్దపెద్ద తోటలుండేవి. వాటిలో పని చేయడానికి బానిసలు కావాలి కాబట్టి వాళ్లు యీ రద్దును వ్యతిరేకించి, తమ రాష్ట్రాలన్నీ కలిపి కాన్ఫెడరేషన్ అని ఏర్పరచుకుని 1861లో దేశం నుంచి విడిపోయారు. వీరి సేనలకు, జాతీయ ప్రభుత్వ సేనలకు మధ్య నాలుగేళ్ల పాటు అంతర్యుద్ధం నడిచింది. చివరకు 1865లో కాన్ఫెడరేట్ సేనలు ఓడిపోయి, బానిసత్వం రద్దయింది. ఓడిపోయినా ఆ సైన్యంలో కొందరు వీరులున్నారు. వారి విగ్రహాలు, వారి పేరన కట్టిన పెద్దపెద్ద భవనాలు ఉన్నాయి. ఇది అమెరికా చరిత్రలో భాగం. 20 వ శతాబ్దపు తొలినాళ్లల్లో మళ్లీ శ్వేతజాత్యహంకారం తలెత్తింది. అప్పుడు వాళ్లు సడెన్‌గా యీ కాన్ఫెడరేట్ నాయకులను గుర్తు తెచ్చుకుని వాళ్ల విగ్రహాలు ఎడాపెడా పెట్టేశారు. తర్వాతి రోజుల్లో కూ క్లక్స్ క్లాన్ వంటి శ్వేతఅతివాద సంస్థలు యీ కాన్ఫెడరేట్ జండాలను, యీ విగ్రహాలను తమ ఉద్యమాలకు ప్రతీకలుగా వాడుకున్నారు.

ఒబామా వంటివాడు దేశాధ్యక్షుడు అయినా ఆఫ్రో-అమెరికన్లలకు సమస్యలు తగ్గలేదు. 2015 జూన్‌లో సౌత్ కరోలినాలో చర్చికి వెళుతున్న 9మంది ఆఫ్రో-అమెరికన్లను డైలాన్ రూఫ్ అనే అతను కాల్చి చంపేశాడు. ఆ కేసు విచారిస్తూండగా రూఫ్, కాన్ఫెడరేట్ జండా పక్కన నిలబడి తీయించుకున్న ఫోటో కనబడింది. దాంతో కాన్ఫెడరేట్ కాలానికి చెందిన చిహ్నాలన్నీ ధ్వంసం చేయాలనే డిమాండ్ బయలు దేరింది. అదే నెలలో సౌత్ కరోలినాకు గవర్నరుగా ఉన్న నిక్కీ హేలీ (భారతీయమూలాలున్న వనిత) స్టేట్ హౌస్ నుంచి కాన్ఫెడరేట్ జండాను తీసిపారేసింది. దేశం మొత్తం మీద 718 పబ్లిక్ మాన్యుమెంట్లు, విగ్రహాలు, 109 పబ్లిక్ స్కూళ్లు, వాళ్ల పేరు పెట్టిన 80 ఊళ్లు, మొత్తం 1503 చిహ్నాలున్నాయి. ఆనాటి సంఘటనలు గుర్తు చేస్తూ ఆరు రాష్ట్రాలలో 9 ప్రభుత్వసెలవులున్నాయి. 10 అమెరికన్ మిలటరీ బేస్‌లకు ఆ హీరోల పేర్లు పెట్టారు. ఇవన్నీ తొలగించడానికి 100 ప్రయత్నాలు జరిగాయి. 2015 నుంచి కాన్ఫెడరెన్సీ తాలూకు 60 చిహ్నాలు తొలగించడమో, పేర్లు మార్చడమో జరిగింది. ట్రంప్ అధ్యక్షుడయ్యాక తెల్లవారి దురంహకారానికి ఆజ్యం పోసినట్లయింది. నల్లవారి మీద దాడులు జరిగినప్పుడల్లా ఆ విగ్రహాలు పూర్తిగా తొలగించాలనే డిమాండ్లు వస్తూనే ఉన్నాయి. 2017 ఆగస్టులో వర్జీనియాలో జనరల్ రాబర్ట్ లీ విగ్రహాన్ని తీసేయడానికి ఆ రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినపుడు దాన్ని వ్యతిరేకిస్తూ శ్వేతజాతీయులు ఆందోళనకు దిగారు. ఇక అప్పణ్నుంచి ఆ విగ్రహాలు తీసేయాలా వద్దా అన్నదానిపై విపరీతంగా చర్చలు జరుగుతున్నాయి. కొన్ని రాష్ట్రాల వారు తీసేస్తున్నారు కానీ మరి కొన్ని దక్షిణాది రాష్ట్రాల వారు 'అవి మా ప్రాంతపు గౌరవానికి, పోరాటపటిమకు చిహ్నాలు, చరిత్రలో భాగం. ఈ రోజు మీకు నచ్చలేదని ఎలా తీసేస్తారు?' అంటున్నారు. ఒకప్పుడు దేశంలో బానిసత్వం ఉందనేదానికి, కొందరైనా దాన్ని సమర్థించారనే దానికి యివి చిహ్నాలు, వాటిని కొనసాగించడం అవమానకరం కదా అని జాతీయవాదుల వాదన.

ఈ వివాదంలో ట్రంప్ లాటివాడు తలదూర్చకుండా ఉంటాడా? 'ఆ విగ్రహాలు తీసేయకూడదు. అవి మన వారసత్వం. జార్జి వాషింగ్టన్ కూడా బానిసలకు యజమానిగా ఉండేవాడు. అందుకని ఆయన విగ్రహం తీసేస్తామా?' అని వాదించాడు. కానీ కొన్ని సంస్థలు అలా అనుకోలేదు. యేల్ యూనివర్శిటీ జాన్ కాల్‌హౌన్ అనే బానిసల వ్యాపారి యిచ్చిన విరాళాలతో కట్టిన కాలేజీకి అతని పేరు పెట్టింది. ఇప్పుడీ గొడవ రావడంతో 2017 ఫిబ్రవరిలో కాలేజీ పేరు మార్చేసింది. బ్రౌన్ యూనివర్శిటీకి విరాళమిచ్చిన బ్రౌన్ కుటుంబం కూడా బానిసల వ్యాపారంతోనే డబ్బు సంపాదించింది. ఆ పేరు కొనసాగించాలా వద్దా అన్న మీమాంసలో పడింది యూనివర్శిటీ. కాన్ఫెడరేట్ తరఫున పోరాడిన కుటుంబాలకు చెందిన యిప్పటి వారసులు ఒక బృందంగా ఏర్పడి, ఈనాటి కళ్లతో ఆ నాటి చరిత్రను బేరీజు వేయకూడదని, అలనాటి చిహ్నాలను తుడిచిపారేయకూడదని వాదిస్తున్నారు. విగ్రహాల తొలగింపును అడ్డుకుంటున్నారు. ఇటువంటి విషయాల్లో ఎవరి దృక్కోణం వారికి ఉండవచ్చు. కానీ ట్రంప్ విషయానికి వస్తే అతను శ్వేతజాత్యహంకారానికి ప్రతీకగా పేరుబడ్డాడు కాబట్టి అతను చేసిన వ్యాఖ్యకు అంత ప్రాముఖ్యత వచ్చి నల్లవారు అతనిపై మండిపడుతున్నారు. ఫిలడెల్ఫియా ఈగిల్స్ జట్టు ఆటగాళ్ల లాటి వాళ్లు నిర్భయంగా నిరసన తెలుపుతున్నారు కూడా. **– ఎమ్బీయస్**

**2018 జూన్** **ఎమ్బీయస్: వోహ్‌ను వదిలించుకోవడం ఎలా?**

భార్యాభర్తల మధ్య ఒక 'వోహ్' వస్తూంటారు అప్పుడప్పుడు. వాళ్లను వదిలించుకోవడానికి ఏజన్సీలను సంప్రదిస్తున్న చైనా మహిళలు ప్రస్తుతం పడుతున్న వ్యథాకథనం యిది. చైనా మగవాళ్లు అంత రసికులా? అని ఆశ్చర్యపడడానికి ముందు ప్రపంచవ్యాప్తంగా ఉండే ఒక జబ్బును మనం గమనించాలి. మగవాడికి అనుకోకుండా, అర్హత లేకుండా, అడ్డదోవల్లో డబ్బు కానీ, అధికారం కానీ వచ్చిపడితే తన 'మగతనం' చూపించుకోవాలనే తాపత్రయం పెరుగుతుంది. మగతనం అంటే అలాటివాళ్ల దృష్టిలో వైవాహికేతర సంబంధం పెట్టుకోవడం! నడమంత్రపు సిరి అబ్బినకొద్దీ యిలాటి వికారాలు ఎక్కువవుతాయి. చాలామందికి ఎలా వచ్చిన డబ్బు అలాగే పోతుంది. ఇప్పుడు చైనాలో ప్రభుత్వాధికారులు, రాజకీయనాయకులకు యిలాటి అవినీతి సొమ్ము కుప్పలుగా వచ్చిపడుతోంది. చైనాలో ఒకే పార్టీ అధికారంలో ఉండడం చేత పార్టీ అధిష్టానానికి చేరువగా ఉండేవాళ్లు అక్రమమార్గాల్లో విపరీతంగా సొమ్ము చేసుకుంటున్నారు. మీడియాకు స్వాతంత్ర్యం లేకపోవడం చేత యివి బయటకు రావటం లేదు. ఎప్పుడో ఒకప్పుడు అవినీతిపై కొరడా ఝుళిపించామంటారు, కొందరిని పట్టుకుని, ఆస్తులు జప్తు చేసుకుని జైల్లో వేస్తారు. దశాబ్దాలుగా వాళ్లు దోచుకుంటూ ఉంటే మీ నిఘా సంస్థ ఏమైంది? అని అడిగేవాడు లేడు. అడిగితే తల ఎగురుతుంది. పోనీ వీళ్లకి కఠినశిక్ష పడింది కదాని, తక్కినవాళ్లు మానుతున్నారా? మళ్లీ యింకో ఏడాదికి అవినీతిపై ఉక్కుపాదం అంటూ యింకొంతమందిని పట్టుకుని జైళ్లకు పంపిస్తారు. చూడబోతే మనకు తోచేదేమిటంటే, పార్టీ అనగా ప్రభుత్వ పెద్దలతో పేచీ వచ్చేవరకు అవినీతి యథేచ్ఛగా సాగుతుంది. ఎక్కడో తేడా రాగానే బలి వేస్తూంటారు.

సరే దీనివలన దేశానికి జరిగే నష్టం మాట అలా వుంచండి. ఈ అడ్డగోలు సంపాదన వలన వారి నైతికత కూడా చెడుతోంది. సంసారబంధాలు విచ్ఛిన్నమవుతున్నాయి. రెన్‌మిన్ యూనివర్శిటీ 2013లో చేసిన అధ్యయనం ప్రకారం అవినీతికి పాల్పడిన అధికారుల్లో 95% మందికి ఉంపుడుగత్తెలున్నారు. ఇలాటి వారి భార్యలు యీ పరిస్థితిని చక్కదిద్దడానికి పూనుకుంటున్నారు. భర్తకు నేరుగా చెప్తే వినడని, అతనికి తెలియకుండా ప్రియురాలిని దూరం చేసేందుకు మార్గాలు వెతుకుతున్నారు. విడగొట్టే వృత్తి చేపట్టిన నిపుణులకు హెచ్చు మొత్తాలలో ఫీజులు చెల్లించుకుంటున్నారు. చైనా అధికారుల్లో అవినీతి గురించి, వారి విలాసాల గురించి కొంతయినా చెప్పకపోతే యీ 'మిస్ట్రెస్ డిస్పెలింగ్' సర్వీసెస్ వారి చార్జీలు ఎందుకంత ఎక్కువగా ఉన్నాయో అర్థం కాదు. జిన్‌పింగ్ 2012 నుంచి అవినీతిపై పోరాటం చేస్తున్నాననే అంటున్నాడు. 2015 ఒక్క సంవత్సరంలోనే 2,80,000 మంది అధికారులను అవినీతి ఆరోపణలపై పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో కొందరు ఉన్నతాధికారుల ఆస్తులు, వారికి ఉన్న ఉంపుడుగత్తెల సంఖ్య చూసి జనం విస్తుపోయారు. ఉదాహరణకి కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడైన ఝౌ యాంగ్‌కాంగ్ తన బంధుమిత్రులకు, ఉంపుడుగత్తెల వ్యాపారాలకు ఆర్థికలాభం చేకూరేట్లు తన పదవిని ఉపయోగించాడు. పదవిని చూపించి అనేకమంది స్త్రీలను అనుభవించాడు. 400 మందితో సంబంధం ఉందని ఒక అంచనా. లియు ఝిజున్ అనే రైల్వే మంత్రి, పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు తన ఉంపుడుగత్తెకు, ఆమె తన కుటుంబసభ్యులతో సహా నిర్వహిస్తున్న పదిమంది కంపెనీలకు లాభం చేకూర్చాడు. అతని ఉంపుడుగత్తెల సంఖ్య 18 ట.

ఒక రాష్ట్రపు లాండ్ రిసోర్సెస్ బ్యూరోకు డిప్యూటీ హెడ్‌గా ఉన్న లూ యింగ్‌మింగ్ కు 47 మంది ఉంపుడుగత్తెలు, 63 అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. అతను పట్టిన లంచాల విలువ 450 మిలియన్ డాలర్లు. మరో ప్రాంతపు కనస్ట్రక్షన్ బ్యూరోకు అధినేతగా ఉన్న క్సూ కియావోకు 140 మంది ఉంపుడుగత్తెలున్నారు. వారిలో తల్లీ-కూతురూ కూడా ఉన్నారు! చిత్రం ఏమిటంటే మా జియాన్ అనే ఇంటెలిజెన్సు ఉన్నతాధికారి, అంతర్గత భద్రతాశాఖలో ఉపమంత్రి కూడా పట్టుబడ్డాడు. అతనికి ఆరు భవనాలున్నాయి. వాటిలో ఒక్కొక్కరు చొప్పున ఆరుగురు ఉంపుడుగత్తెలున్నారు, వారి ద్వారా యిద్దరు కొడుకులున్నారు. ఆ ఆరుగురిలో యిద్దరు అతని మంత్రిత్వశాఖలోనే పనిచేస్తున్నారు. చైనాలో పార్టీ సీనియర్లలో, ప్రభుత్వాధికారుల్లో వ్యభిచారం సర్వసాధారణం. అది చైనా చట్టం ప్రకారం నేరం కాదు. కానీ పార్టీ నియమాలకు మాత్రం విరుద్ధం. నేరతీవ్రత బట్టి శిక్ష ఉంటుంది. చిన్నదే అయితే వార్నింగు యిచ్చి వదిలేస్తారు. ఇంకా పెద్దదైతే పార్టీ పదవులనుంచి తొలగించి కొంతకాలం పరిశీలనలో పెడతారు. మరీ పెద్దదైతే పార్టీ పదవుల్లోంచి తీసేస్తారు. మిలటరీ అధికారుల భార్య/భర్తతో అక్రమసంబంధం పెట్టుకోవడం మరీ నేరం. మిలటరీ అధికారితోనే పెట్టుకుంటే ఆ నేరం పెద్దదో కాదో స్పష్టత లేదు.

ఈ వివరాలతో స్పష్టమయ్యేదేమిటంటే అధికారుల్లో, రాజకీయ నాయకుల్లో అవినీతి బాగా పెరిగింది, దాంతో అక్రమ సంబంధాలూ పెరిగాయి. అవినీతిపై జరుగుతున్న యుద్ధంలో చాలామంది అధికారులు పట్టుబడడంతో తక్కినవారికి భయం వేస్తోంది. కొన్ని సందర్భాల్లో వాళ్లు డబ్బు ఎక్కడ దాచారో మాజీ ఉంపుడుగత్తెలే సమాచారాన్ని యిచ్చారు. తనపై మోజు తీరిపోయి యింకోళ్లను చేపట్టాడన్న అసూయతో వాళ్లు పట్టించారు. ఇది తెలిసి కొందరు ఉంపుడుగత్తెల్ని తమంతట తామే వదుల్చుకుంటున్నారు. అయితే విజయం సాధించిన ఎంట్రప్రెనార్లలో, మధ్యతరహా వ్యాపారస్తుల్లో కూడా వైవాహికేతర సంబంధాల జాడ్యం అంటుకుంది. ఫర్నిచర్ కోసం, యితర వస్తువుల కోసం చైనాకు వెళ్లిన మనవాళ్లు గమనించే ఉంటారు – అక్కడ ఆడవాళ్లే ముఖ్యపాత్ర తీసుకుని బేరసారాలు సాగిస్తూన్నారు. మగవాళ్లకు పని తక్కువై రికామీగా కూర్చుంటున్నారు. ఖాళీ సమయం దొరకడంతో మనసు మళ్లుతోంది. ఇలా కాపురాల్లో చొరబడే వారిని 'లిటిల్ థర్డ్' అనే పేరుతో పిలుస్తున్నారు. భర్తకు వేరే స్త్రీతో సంబంధం ఏర్పడిందని తెలిసిన చైనా మహిళలు ఏం చేయాలా అని ఆలోచనల్లో పడుతున్నారు. అలా పడిన ఒక మహిళ కథ తెలుసుకుంటే తక్కినవాళ్ల కథలు ఊహించవచ్చు.

మిసెస్ వాంగ్ అనే షాంఘై గృహిణి భర్త ఫోన్‌లో మెసేజులు చూసి, తన దగ్గర పనిచేసే ఒకమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడని గ్రహించింది. కొన్ని రోజులు బాధపడి, భర్తతో పేచీ పడేకంటే వేరే మార్గం వెతికితే మంచిదని చైనా సెర్చ్ ఇంజన్ అయిన 'బైదూ'పై 'మిస్ట్రెస్ డిస్పెలర్' అని కొట్టింది. చైనా ఆర్థిక వ్యవస్థ పుంజుకున్న కొద్దీ యిలాటి కేసులు పెరగడంతో అనేక నగరాల్లో దశాబ్దాలుగా యిటువంటి సర్వీసులు అందించే కంపెనీలు ఉన్నాయని తెలుసుకుంది. వివరాలు తీసుకున్నాక వాళ్ల తాలూకు ఉద్యోగి ఆ మూడోమనిషి జీవితంలో ప్రవేశిస్తారు. ఆమె యింటి ఎదురుగా ఉన్న ఫ్లాట్ అద్దెకు తీసుకునో, ఆమె పని చేసే కంపెనీలో ఉద్యోగం సంపాదించో, ఆమె వెళ్లే జిమ్‌లో తను కూడా చేరో, ఎలాగోలా స్నేహం పెంచుకుంటారు. ఆ తర్వాత సూటిగా కాకుండా నెమ్మదిగా, సుతారంగా హితబోధ మొదలుపెడతారు. ఇలాటి వ్యవహారాల్లో వచ్చే తలనొప్పుల గురించి చెప్తూ పోతారు. సందర్భం కల్పించుకుని సదరు వ్యక్తికి అప్పులున్నాయనీ, పైకి చూపించేదంతా డాబనీ, తలిదండ్రులను చూసుకోవాల్సిన కుటుంబ బాధ్యతలున్నాయనీ, సంబంధం కొనసాగిస్తే నీకూ అవి తగులుకుంటాయనీ అడలగొడతారు. ఆమె బంధుమిత్రులలో యీమె గురించి ప్రచారం చేసి పరువు తీయడానికి చూస్తారు. కొన్ని సందర్భాల్లో వేరే ఊళ్లోనో, వేరే చోటో మెరుగైన ఉద్యోగం చూపిస్తారు. మరోప్పుడు యింకా అందగాడైన, ధనవంతుడైన ప్రియుణ్ని చూపిస్తారు. (అతను వివాహితుడైతే, అతని భార్య భవిష్యత్తులో తమ క్లయింటు కావచ్చు!) ఒక్కోప్పుడు కంపెనీ తరఫున అందమైన కుర్రాడు ఆమెను ప్రేమలో పడేసి, అవసరమైతే రతిలో పాల్గొని, క్లయింటు భర్త నుండి దూరంగా లాగేస్తాడు. అంతా దానంతట అదే జరిగినట్లు ఉంటుంది. భయపెట్టి, భ్రమపెట్టి చేసినట్లు ఉండదు. హింస జోలికి పోనే పోరు కాబట్టి కేసు ఉండదు.

మిసెస్ వాంగ్ 'వైకింగ్ ఇంటర్నేషనల్ మేరేజి హాస్పిటల్ ఎమోషన్ క్లినిక్ గ్రూపు' పేర 16 ఏళ్లగా నిర్వహించబడుతున్న యిలాటి కంపెనీకి వెళ్లింది. ఆ మూడో వ్యక్తికి వేరే ఊళ్లో ఉద్యోగం ఏర్పాటు చేసి మూణ్నెళ్లల్లో వాళ్లు పని ముగించారు. ఫీజు భారీగానే ఉండటంతో వాంగ్ తలిదండ్రులు కూతురికి డబ్బు సాయం చేశారు. తన వెనక్కాల ఏం జరిగిందో తెలియని భర్త వాంగ్ దగ్గరకు తిరిగి వచ్చాడు. సంసారం మామూలుగానే నడుస్తోంది. కంపెనీ చేస్తున్నది సులభమైన పని కాదు. మూడో వ్యక్తులందరూ ఒకేలా ఉండరు. ఒక్కొక్కరు ఒక్కోలా ఉంటారు. వాళ్ల అవసరాలేమిటో, ఆలోచనలేమిటో తెలుసుకోవడానికి రహస్యపరిశోధన చేయాలి. అనుకున్నది సాధించడానికి మార్గాలు వెతకాలి. దానికోసం ఒక టీము పనిచేస్తుంది. ఒక సైకో థెరపిస్టు, ఒక లాయరు ఉంటారు. డిటెక్టివులు సరేసరి. లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తి కుటుంబం, స్నేహితులు, చదువు, ఉద్యోగం, అలవాట్లు, అభిరుచులు, ఆశలు, దురాశలు.. అన్నీ స్టడీ చేస్తారు. ఏ తరహావాళ్లు సలహా చెపితే వాళ్లు వింటారో అంచనా వేసి, అలాటివాళ్లను నియోగిస్తారు.  వీటన్నిటితో బాటు భార్యకు కూడా కౌన్సిలింగ్ యిస్తారు. "భర్తను ఎంత ప్రేమిస్తే, ఎంత విధేయంగా ఉంటే అంతగా అంటిపెట్టుకుని ఉంటాడనేది గతకాలపు చైనా భార్యల నమ్మకం. దానిలో నుంచి బయటకు రా. భర్తతో సరిసమాన స్థాయిలోనే ఉండు. అంతేకాదు, మన చైనా సంప్రదాయంలో మనోభావాలను దాచుకోవడం అలవాటు. ఆధునిక యుగంలో అది పనికి రాదు. నీ యిష్టాయిష్టాలు బాహాటంగా చెప్పు. నీ భర్తను ప్రేమిస్తూ ఉంటే పైకి చెప్పు. చెప్పమని అతన్నీ ప్రోత్సహించు. వ్యాపారంలో కాని, ఉద్యోగంలో కాని అతను పై స్థాయికి వెళ్లినపుడు బయటంతా అతన్ని రాజులా చూస్తారు. ఇంటికి వచ్చేసరికి నువ్వు తీసిపారేసినట్లు మాట్లాడితే అహం దెబ్బ తిని తనను బుజ్జగించేవాళ్లవైపు మళ్లుతాడు. అందువలన అతని అహాన్ని దెబ్బ తీయకు." అని చెప్తారు. అంతేకాదు, అందం విషయంలో, ఆకర్షణ విషయంలో ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో తర్ఫీదు యిస్తారు.

వీటన్నిటికీ ఫీజు బాగానే అవుతుంది. సాధారణంగా 45–50 వేల డాలర్లు బేస్ ఫీగా తీసుకుంటారు. తర్వాత మూడో మనిషి స్థాయిని బట్టి, ఆమె పక్కనున్న అపార్టుమెంట్లో అద్దెకుండాలంటే ఎంతవుతుంది, ఆమెను యింప్రెస్ చేయాలంటే ఎంత ఖరీదైన కారులో తిరగాలి, ఎంత ఖరీదైన రెస్టారెంటుకి తీసుకెళ్లాలి అనే అంశాలపై ఆధారపడి ఫీజు పెరుగుతుంది. ఒక్కోప్పుడు లక్ష డాలర్లు కూడా దాటుతుంది. సగం అడ్వాన్సుగా తీసుకుంటారు. తక్కినది పని పూర్తయ్యాక తీసుకుంటారు. ఇంత చేసినా ఆ మూడో మనిషిని వదల్చలేకపోతే కంపెనీ సగం ఫీజు వదులుకుంటుంది. కానీ వాళ్ల సక్సెస్ రేట్ 90% ఉందని కంపెనీలు చెప్పుకుంటున్నాయి. ఒక్కో కేసు పరిష్కరించడానికి సరాసరిన మూణ్నెళ్లు పడుతుంది. 59 నగరాల్లో బ్రాంచీలున్న వైకింగ్ కంపెనీకి కితం ఏడాది 8 వేలమంది క్లయింట్లుంటే, యీ ఏడాది 10 వేల మంది ఉన్నారు. రీయూనియన్ అనే కంపెనీకి రోజుకి 175 కాల్స్ వస్తాయట. రెండేళ్ల క్రితం 96 వచ్చేవి. ఈ కంపెనీ సర్వీసులు చైనీయులు వుండే పొరుగుదేశాలకు కూడా విస్తరించాయి. క్రమేపీ వాళ్లకు అర్థమైందేమిటంటే యీ సమస్యలు చైనావాళ్లకే కాదు, తక్కిన జాతులకూ వున్నాయని. అందువలన మలేసియాలోనో, ఫిలిప్పీన్స్‌లోనో ఒక కాల్‌సెంటర్ పెట్టి, ఇంగ్లీషు మాట్లాడే సిబ్బందిని నియమించి, యూరోప్, ఉత్తర అమెరికా వాసులకు కూడా సేవలు అందిద్దామని చూస్తున్నారు.

వైకింగ్ కంపెనీ హేండిల్ చేసిన మరో కేసు గురించి. ఓసారి 50 ఏళ్ల మహిళ వచ్చి ఊక్సి అనే వూళ్లో తన భర్త ఫ్యాక్టరీ మేనేజర్ అని, లీ అనే వ్యాపారస్తురాలితో సంబంధం పెట్టుకున్నాడనీ, సంవత్సరాలుగా భరిస్తూనే ఉన్నాను కానీ యిప్పటికే ఆమెపై 30 వేల డాలర్లు తగలేశాడని, యిలా అయితే వృద్ధాప్యం గడవడం కష్టమని వాపోయి తన కేసు టేకప్ చేయమంది. కంపెనీ యీ కేసును తన 300 మంది ఉద్యోగుల్లో ఒకడైన యూ అనే అతనికి అప్పగించింది.  యూకి 42 ఏళ్లుంటాయి. అందంగా, పుష్టిగా ఉంటాడు యోగా నేర్పుతూంటానని చెప్పుకుంటాడు తప్ప యిలాటి కంపెనీకి పని చేస్తున్నానని ఎవరికీ చెప్పడు. లీ షాపుకి వెళ్లి చూశాడు. 40 ఏళ్లుంటాయి. వీర్యవృద్ధికి పనికి వచ్చే మూలికలు అమ్మే షాపు. 'మా స్నేహితుడికి సిగ్గెక్కువ, భార్యతో సెక్స్ అనుభవించ లేకపోతున్నాడు. మీ దగ్గర మందేదైనా ఉందా?' అంటూ అరగంటసేపు ముచ్చట్లాడి, మందు కొనుక్కుని వెళ్లాడు. ఇంకో వారం పోయాక మళ్లీ లీ షాపుకి వెళ్లాడు. 'మొన్న మాటల్లో యీ ఏరియాలో యీ మధ్యే ఫ్లాట్ కొన్నారని చెప్పారు కదా, నాకూ యిక్కడే కొనాలని ఉంది. ఎవరైనా ఏజంట్లని చూపిస్తారా?' అని అడిగాడు. సరేనని కొందరు ఏజంట్లను పరిచయం చేసి, కొన్ని యిళ్లు చూసి, అభిప్రాయం చెప్పడానికి తోడుగా వచ్చింది. ఆ సమయాల్లో యిద్దరూ కలిసి లంచ్ చేస్తూండేవారు, పిచ్చాపాటీ మాట్లాడుకునేవారు. మూడు నెలలు

పోయేసరికి డిన్నర్‌లు కూడా కలిసి చేశారు.

ఆ పై నెలలో ఓ రోజు 'వీకెండ్‌కు షాంఘై వెళుతున్నాను. మీరూ రాకూడదా?' అన్నాడు. మొదట్లో లీ అబ్బే వద్దు అంది కానీ తర్వాత మెత్తబడింది. నాతోబాటు యింకో లేడీ కూడా వస్తుంది, అలా అయితేనే వస్తా' అంది. 'నిక్షేపంలా..' అన్నాడు యూ. క్లయింటు డబ్బేగా, వాళ్లిద్దరినీ మంచి హోటల్లో పెట్టి, ఊరంతా తిప్పి చూపించి, అక్కడి స్పెషల్ డిషెస్ తినిపించి సంతోషపెట్టాడు. నదీవిహారం టైములో యూ ఆ యిద్దరు వనితలకు కలిపి ఫోటోలు తీశాడు, తర్వాత కెమెరా ఆ ఫ్రెండుకి యిచ్చి తనకు, లీకు కలిపి తీయమన్నాడు. తీసేటప్పుడు ఆమె భుజాలపై చేతులు వేశాడు. ఆమెను కూడా తన భుజం మీద చేయి వేయమన్నాడు. స్పోర్టివ్‌గా ఉండాలి కదాని ఆమె వేసింది. షాంఘై నుంచి తిరిగి రాగానే ఆ ఫోటోలను లీ ప్రియుడు, తన క్లయింటు భర్త ఐన ఫ్యాక్టరీ మేనేజరుకి పంపించాడు. మామూలుగానే ఒక చిత్రం వంద మాటల పెట్టు అంటారు, అసూయాగ్రస్తుడు, తన కంటె కుర్రవాడైన అబ్బాయి దొరికితే ప్రేయసి వాడివైపు మొగ్గు చూపుతుందేమోనని అనుక్షణం అనుమానించేవాడు ఉన్నపుడు అది వెయ్యి మాటల పెట్టు. లీ ఏం చెప్పబోయినా వినకుండా అతనామెతో సంబంధం తెంపుకున్నాడు.

వైకింగ్ కంపెనీ స్థాపించిన షూ అనే అతను షాంఘైలో లెక్చరరుగా పనిచేసేవాడు. కొన్ని పత్రికలలో వైవాహిక సమస్యలపై సలహాలిచ్చే కాలమ్ రాస్తూండేవాడు. ఒక్కోప్పుడు కొందరు ఫోన్ చేసి, తమ సమస్యలు చెప్పి సలహాలు అడిగేవారు, యితను చెప్పేవాడు. 1998లో ఒకావిడ ఫోన్ చేసి దగ్గర్లో ఉన్న పార్కుకి వస్తారా, మీతో కాస్త మాట్లాడాలి అంది. వెళ్లి చూస్తే ఆమె సుమారుగా 35 సం.లు ఉన్న ఒక వివాహిత. ఇద్దరు పిల్లల తల్లి. ఫిట్‌నెస్ యిన్‌స్ట్రక్టర్. తైపేలో ఉంటుంది. తైవాన్ వ్యాపారస్తుణ్ని చేసుకుంది. అతనికి షాంఘైలో వ్యాపారం ఉంది. వెళ్లి వస్తూ ఉంటాడు. అక్కడో ఫ్లాట్ కూడా ఉంది. ఓసారి యీమె షాంఘైలో ఫ్లాట్‌కి వెళ్లినపుడు అక్కడ ఆడవాళ్లు వాడే సౌందర్యసాధనాలు కనబడ్డాయి. భర్త ఎవరితోనో సంబంధం పెట్టుకున్నాడని అర్థమైంది. 'ఆత్మహత్య చేసుకుందామనుకుంటున్నాను' అందామె షూతో. షూ నచ్చచెప్పాడు – 'అంటే నీ భర్తను ఆ మూడోమనిషికి చేతులారా అప్పగిస్తావా? వాళ్లు నీ పిల్లల్ని బాగా చూస్తారన్న నమ్మకమేమిటి? నువ్వు నీ భర్తతో బాటు అతని బిజినెస్ ట్రిప్పుల మీద తరచుగా వెళుతూ ఉండు. పెళ్లిళ్లకు, పార్టీలకు అతనితోపాటు వెళుతూ అందరిలో కనబడుతూ ఉండు. అప్పుడు ఆమెకు అర్థమవుతుంది – నీ భర్త నిన్ను విడిచిపెట్టేట్లా లేడు అని. తనే విడిచి వెళ్లిపోతుంది. ఈలోగా నీ భర్తని విసిగించడం మానేసి అతన్ని ఎమోషనల్‌గా బాగా హేండిల్ చేయి.' అని. గంటన్నర సంభాషణ తర్వాత లేచి వెళ్లబోతూ ఆమె ఒక కవరు అతని చేతిలో పెట్టింది. దానిలో వెయ్యి యువాన్లున్నాయి. అప్పట్లో అది అతని నెలజీతం. డబ్బు తీసుకుందామా వద్దా అని కాస్సేపు తటపటాయించాడు కానీ అప్పుడతనికి అర్థమైంది – కాస్సేపు మాట్లాడి సరైన సలహా యిస్తే సమస్య పరిష్కారమౌతుంది. సలహాల వలన డబ్బు కూడా వస్తుంది' అని. ఇలాటి వాళ్లు యింకెందరున్నారో అనుకున్నాడు. 2001లో చైనా ప్రభుత్వం విడాకుల చట్టంలో సవరణలు తెచ్చి, విడాకులు తీసుకోవడాన్ని సులభం చేశాక, మింగ్ అనే తన స్టూడెంటుతో కలిసి కంపెనీ నెలకొల్పాడు. వాళ్లు తామందించే సేవల ద్వారా చైనాలో తరాలుగా నెలకొన్న సాంప్రదాయ వైవాహిక వ్యవస్థను కాపాడుతున్నామని నమ్ముతారు.

ఆధునిక దృక్పథం ఉన్నవారికి యిదంతా వింతగా తోస్తుంది. తనను కాదని భర్త యింకొకరితో ఊరేగుతున్నపుడు, అతన్ని ఎడంకాలితో తన్ని విడాకుల కోసం అప్లయి చేయకుండా ఆమెను ఎప్పుడు వదిలేస్తాడా, మళ్లీ తనను ఎప్పుడు అక్కున చేర్చుకుంటాడా అని ఎదురు చూడడం, దాని కోసం డబ్బు ఖర్చు పెట్టడం ఒక స్త్రీకి అవమానకరం కదా అనిపిస్తుంది. చైనా సమాజాన్ని, చట్టాన్ని, ఆర్థికసంబంధాలను తెలుసుకుంటే తప్ప యిది అర్థం కాదు. మన దేశంలో మనువు చెప్పినట్లే చైనాలో కన్‌ఫ్యూషియస్ 'ఒక స్త్రీ బాల్యంలో తండ్రి మాట, యవ్వనంలో భర్త మాట, వృద్ధాప్యంలో కొడుకు మాట వినాలి' అని చెప్పాడు. కుటుంబపు ఆస్తి కూతుళ్లకు యివ్వరక్కడ. (ఇప్పటికి కూడా కొడుకులు లేని తలిదండ్రులు తమ ఆస్తిని కూతురికి యిచ్చే బదులు, తమ యింటిపేరున్న తమ్ముడి కొడుక్కో, అన్న కొడుక్కో యిస్తారు) అన్నీ ఎరేంజ్‌డ్ మారేజిలే. మగవాళ్లు ఉంపుడుగత్తెల్ని పెట్టుకున్నా భార్యలు కిమ్మనే పరిస్థితి ఉండేది కాదు. వాళ్లకు చదువుసంధ్యలే అంతంతమాత్రం. 20 వ శతాబ్దపు తొలి దశకంలో స్త్రీలకు చదువు, స్వతంత్ర ఆర్థిక వనరులు ఉండాలనే ఆలోచన ప్రారంభమైంది. మావో మహిళల్లో చైతన్యం తెచ్చాడు. ఆకాశంలో సగం మీదే నన్నాడు. మగవాడితో సమానంగా వాళ్లు అన్ని రకాల పనులు చేయాలన్నాడు, చేయించాడు. విప్లవంలో, సైన్యంలో, పోలీసు వ్యవస్థలో భాగస్వాముల్ని చేశాడు. ఎరేంజ్‌డ్ మేరేజ్ చేసుకోవడం కంటె గొంతుకోసుకుని చావడం మంచిదన్నాడు. 1949లో విప్లవం సఫలమయ్యాక, 1950లో న్యూ మేరేజ్ లా అని చట్టం చేసి, ఎరేంజ్‌డ్ మారేజిలను, ఉంపుడుగత్తెలను ఉంచుకునే విధానాన్ని నిషేధించాడు. నచ్చని భర్తలకు విడాకులు యిచ్చే హక్కును ఆడవారికి యిచ్చాడు. వాళ్లు పని చేసే వర్క్ యూనిట్ అనుమతి ఉంటే చాలన్నాడు.

1976లో మావో మరణానంతరం డెంగ్ ఆర్థిక సంస్కరణలు తెచ్చాడు. 1981లో వివాహచట్టంలో మరిన్ని మార్పులు వచ్చాయి. విడాకుల మంజూరు సులభతరం చేశాడు. డబ్బు చలామణీ పెరగడంతో మావో కాలం నాటి ఆదర్శవిధానాలు మూలనపడి, పాతరోజుల్లా ఆడవాళ్ల స్థాయి మగవాళ్ల కంటె తగ్గింది. వేతనవ్యవస్థలో మగవాళ్లకే ఎక్కువ జీతాలివ్వసాగారు. ఆస్తులు మగవాళ్ల పేరే జమపడసాగాయి. కమ్యూనిజం పేరుతో నయా కాపిటలిజం చైనాలో బలపడిన కొద్దీ ఆస్తుల విషయంలో ఆడవాళ్లకు అన్యాయం జరిగి, పురుషాధిక్యత పెరిగింది. ఇళ్లు భర్తల పేరే రిజిస్టరవుతున్నాయి. 2010లో ఉమెన్స్ ఫెడరేషన్, నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ కలిసి నిర్వహించిన ఒక సర్వే ప్రకారం ఒంటరి చైనా మహిళల్లో 6.5% మంది మాత్రమే సొంత యిళ్లు కలిగివున్నారు. 2011లో సుప్రీం కోర్టు యిచ్చిన ఒక తీర్పు ప్రకారం విడాకులు జరిగినపుడు వివాహానికి పూర్వం ఆస్తి ఎవరి పేర ఉందో, వాళ్లకే మళ్లీ వెళ్లిపోతుంది. సాధారణంగా పెళ్లయ్యాక ఆడపిల్ల అత్తవారి యింటికి వస్తుంది కాబట్టి, ఆ ఆస్తి భర్త పేరే ఉంటోంది. ఈలోగా యిద్దరూ కలిసి దాన్ని ఎంత విస్తరింపచేసినా, విడిపోయినప్పుడు ఆమెకు భాగం దక్కటం లేదు. అందుచేత ఒక వివాహిత విడాకులు

కోరితే ఆమెకు ఉండడానికి యిల్లు లేకుండా పోతుంది. 'ఎంతో కష్టపడి కట్టుకున్న నా యింటిని ఎవత్తో మూడో మనిషికి అప్పగించి నేను బయటకు వెళ్లి రోడ్డు మీద ఉండాలా? అంతకంటె దాన్నే మా ఆయన జీవితం నుంచి వెళ్లగొడతా' అంటున్నారు బాధిత మహిళలు.

వేరేవారితో సంబంధం పెట్టుకున్నాక, భార్య విడాకులు అడగవచ్చనే అనుమానం తగలగానే మగవాళ్లు తమ ఆస్తులు దాస్తున్నారు, లేదా వేరే వాళ్ల పేర రిజిస్టర్ చేయిస్తున్నారు, తమ అప్పులను ఎక్కువ చేసి చూపిస్తున్నారు. కావాలని యింటి మీద ఎక్కువ వడ్డీ మీద ఋణాలు తీసుకున్నవాళ్లూ ఉన్నారు. భార్య ఆ యింటిని తీసుకుంటాననంటే ఆ అప్పూ, వడ్డీ కూడా కట్టాలి. వ్యాపారస్తుడైన భర్తకు అది సాధ్యమౌతుంది కానీ ఆమెకు కాదు. ఇంకో రకం కేసులున్నాయి. ఆస్తులు కొనడానికి అవివాహితులకు తక్కువ వడ్డీపై ఋణాలు లభిస్తాయి. 'అందువలన మనం ఉత్తుత్తినే విడాకులు తీసుకుందాం' అని భార్యను ఒప్పించి, విడాకులు మంజూరు కాగానే ఆస్తులు కొని, దానితో పాటే ఉంపుడుగత్తెను కూడా పెట్టుకున్న వాళ్లున్నారు. ఈ థీమ్‌పై "ఐ యామ్ నాట్ మదాం బొవరీ" అనే సినిమా వచ్చింది.

చైనా మగవాళ్లు తమ వైవాహిక సమస్యలను కౌన్సిలర్ల వద్ద చర్చించడానికి యిష్టపడటం లేదు. ఇంకొకరి సలహా వినడానికి సిద్ధపడటం లేదు. ఆర్థిక సంస్కరణల కారణంగా వచ్చిపడుతున్న నడమంత్రపు సిరి వారిలో పాతకాలపు పురుషాధిక్య భావజాలాన్ని ఎగదోస్తోంది. దారి తప్పి చరించే స్త్రీల కంటె పురుషుల సంఖ్య 13 రెట్లు ఎక్కువ వుంటోందని సర్వే చెపుతోంది. ఇది భరించలేక విడాకులు తీసుకున్న స్త్రీని చైనా సమాజం యింకా గౌరవంగా చూడడం లేదు. 'ఆమె సెకండ్‌హ్యాండ్ కారు లాటిది, అదే మగాడైతే రిపేరు చేయించి, రంగులు వేయించిన యింటిలాటి వాడు' అన్నారు కొందరు. ఆమెకు మళ్లీ వివాహం జరిగే అవకాశాలు కూడా తక్కువే. ఇన్ని అవరోధాలు ఉన్నా, గత దశాబ్దంలో విడాకులు రెట్టింపయ్యాయి. విడాకుల కేసుల్లో సగానికి సగం సందర్భాల్లో ఉంపుడుగత్తె ఉంటోంది. మీడియాలో "ఫైవ్-ఇయర్ ఇచ్" కథనాలు (పెళ్లయిన ఐదేళ్లకు పక్కచూపులు చూస్తారనే కాన్సెప్ట్. గతంలో ఏడేళ్లనేవారు) చాలా వస్తున్నాయి. అవినీతి, ఆడంబరం, వ్యభిచారం పెరిగినకొద్దీ కుటుంబవ్యవస్థకు ముప్పు వస్తోంది. ఆ ముప్పు నివారిస్తున్నామంటూ ముందుకు వచ్చే మిస్ట్రెస్ డిస్పెలర్ కంపెనీలకు గిరాకీ పెరుగుతోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

## 2018 జూన్ — ఎమ్బీయస్: రత్నగిరి ప్రాజెక్టుకు బిజెపి ఎస్, శివసేన నో

ఇటీవలి ఎదురుదెబ్బలతో బిజెపి అధిష్టానం దిగివచ్చి పార్టీ సీనియర్లతో, మిత్రపక్షాలతో సయోధ్య కోసం చూస్తోందని వార్తలు వచ్చాయి. అమిత్ షా ఉద్ధవ్ ఠాక్రే యింటికి వెళ్లి, ఫడ్‌నవీస్‌ను బయట కూర్చోబెట్టి మంతనాలు సాగించాడట. తక్కినవాటితో బాటు వాళ్లిద్దరి మధ్య రాజీకి రావలసిన అంశం ఒకటి – కేంద్రప్రభుత్వం మహారాష్ట్రలో చేపడుతున్న రత్నగిరి రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌పిసిఎల్) ప్రాజెక్టు! భారత్ పెట్రోలియం, హిందూస్తాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ ల కన్సార్టియం సౌదీ అరేబియా నేషనల్ ఆయిల్ కంపెనీ ఐన సౌదీ ఆరామ్‌కోతో 50-50 వాటాలతో కలిసి పెడుతున్న రూ.3 లక్షల కోట్ల ప్రాజెక్టు అది. ఏడాదికి 6 కోట్ల మెట్రిక్ టన్నుల ముడి చమురును అది ప్రాసెస్ చేస్తుంది. దానికి రత్నగిరి జిల్లాలో రాజాపూర్ తాలూకాలోని 12 గ్రామాలు ప్లస్ సింధుదుర్గ్ జిల్లాలోని రెండు గ్రామాల్లో కలిపి మొత్తం 15 వేల ఎకరాలు కావాలి. ప్రభుత్వభూమి 126 ఎకరాలు మాత్రం ఉంది. తక్కినది ప్రజల నుంచి సేకరించాలి. దీని కారణంగా 20 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు, 1.50 లక్షల పరోక్ష ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం చెపుతోంది. బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం దీనిపై చాలా ఆసక్తి కనబరుస్తోంది. కానీ ప్రతిపక్షాలు అభ్యంతరం తెలుపుతున్నాయి. బిజెపి భాగస్వామి ఐన శివసేన కూడా వారితో చేరింది. వివాదానికి కారణం – ఇలాటి ప్రాజెక్టుల్లో సహజంగా ఎదురయ్యే భూసేకరణ సమస్య, పునరావాస సమస్య, వాతావరణ కాలుష్య సమస్య.

భూసేకరణకు యుపిఏ హయాంలో వచ్చిన 2013 లాండ్ ఎక్విజిషన్ యాక్ట్ ఉపయోగించి ఉండాల్సింది. అదైతే ప్రభావితమయ్యే గ్రామాల్లోని ప్రజల్లో 70% మంది ప్రాజెక్టుకి అంగీకారం తెలపాలి. వాళ్లను అంగీకరింప చేయలేమన్న భయంతో మహారాష్ట్ర ప్రభుత్వం 1951 నాటి ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ యాక్ట్‌ని ఉపయోగించింది. ఆర్ఆర్‌పిసిఎల్ కంపెనీ ప్రతినిధి మాట్లాడుతూ "మాకు కావలసిన 15 వేల ఎకరాల్లో 80% బంజరు భూమి అని ప్రభుత్వం మాకు చెప్పింది. (చెప్పింది అంటున్నాడు తప్ప ఆ అంకె కరక్టే అని నిర్ధారించటం లేదు) ఆ ప్రకారం 3 వేల ఎకరాల్లో పంట నాశనమవుతుంది. నియమాల ప్రకారం మాకిచ్చిన 15 వేల ఎకరాల్లో 30% మేము గ్రీన్ బెల్ట్ మేన్‌టేన్ చేయాలి. మొత్తం 4500 ఎకరాల్లో మేం మామిడి, జీడిమామిడి తోటలు వేస్తాం." అంటున్నాడు. "ఇక్కడ 12 లక్షల మామిడి చెట్లు, 6 లక్షల జీడిమామిడి చెట్లు ఉన్నాయి. ఇవన్నీ నాశనమవుతాయి." అంటున్నారు ప్రతిపక్ష నాయకులు. "మొత్తం 14 గ్రామాలు కలిపి 3600 మంది ప్రభావితమౌతారు. మేం లాండ్ అక్విజిషన్‌కు నోటీసులు యిస్తే 14% మంది మాత్రమే తమ వ్యతిరేకత తెలిపారు. (అంగీకారం తెలిపినవారి సంఖ్య చెప్పలేదు. భూయజమానులకు నోటీసులు వెళ్లాయో లేదో తెలియదు). సేకరణను వ్యతిరేకిస్తూ గ్రామసభలు చేసిన తీర్మానాలన్నీ రాజకీయప్రేరితాలే." అని కంపెనీ ప్రతినిధి అన్నాడు. ఆందోళన చేస్తున్న ఒక గ్రామంలో ప్రజలు "మా గ్రామంలో గ్రామసభ సమావేశం ఏర్పరచినపుడు మమ్మల్ని భయపెట్టడానికి 900 మంది పోలీసులను పంపించారు. అయినా వ్యతిరేకిస్తూ తీర్మానం చేశాం. మార్చి 14 న ఫడ్‌నవీస్ వచ్చి ఇంత వ్యతిరేకత ఉన్నపుడు ముందుకు వెళ్లం అన్నాడు. అయితే దిల్లీకి పిలిచి అతన్ని ఒప్పించారు లాగుంది, ఏప్రిల్ 11న, ఆ కంపెనీలతో కలిసి మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్‌పై సంతకం పెట్టేశాడు." అని చెప్పారు.

"రిఫైనరీయే కాదు, ఇక్కడ 2500 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ పెట్టబోతున్నారు. దాన్నుంచి వచ్చే బూడదంతా సముద్రంలో

పోస్తారు. మత్స్యకారుల జీవనోపాధి పోతుంది.” అంటున్నాయి ప్రతిపక్షాలు. దానికి సమాధానంగా కంపెనీ ప్రతినిధి “ప్రాజెక్టుకి విద్యుత్ అవసరమే కానీ థర్మల్ ప్లాంటే పెడతామని లేదు. ఒకవేళ పెట్టినా ఎల్‌పిజి ప్లాంట్ పెట్టవచ్చు.” అంటున్నాడు తప్ప స్పష్టత యివ్వటం లేదు. “ప్రస్తుతం క్రూడ్ ఆయిల్ ప్రాసెస్‌లో గుజరాత్ వాటా 37%, మహారాష్ట్ర వాటా 8%. ఇది పూర్తయితే మహారాష్ట్ర వాటా 38% అవుతుంది, రాష్ట్ర జిడిపి 10-12% పెరుగుతుంది.” అంటున్నాడు. ఇటువంటి కబుర్లు చాలా వింటూ రావడం చేత ప్రజలు నమ్మటం లేదు. ముఖ్యంగా వారికి ఒక విషయంలో చాలా కోపం, అనుమానం ఉంది. 2017 మేలో యీ ప్రాజెక్టు ప్రకటించడానికి కొన్ని నెలల ముందు గుజరాత్ నుంచి కొందరు వచ్చి యింకెక్కడా భూమి దొరకనట్లు సరిగ్గా యీ 14 గ్రామాల్లోనే ఎకరా రూ.5 లక్షల చొప్పున భూములు కొనేశారు. ఇప్పుడు వాళ్లందరూ “ఎకరానికి రూ.కోటి యిచ్చేట్లయితే మా భూమి యిచ్చేయడానికి అభ్యంతరం లేదు” అని లేఖలు రాసి యిచ్చారు. వీళ్లందరూ గుజరాతీలే. ఇక్కడ ఎన్నడూ వ్యవసాయం చేసినవారు కారు. అంటే దీని అర్థం కేంద్రం నుంచి ముందస్తు సమాచారం సంపాదించిన గుజరాతీ పెట్టుబడిదారులు వాళ్ల వాళ్లకు చెప్పి భూములు కొనిపించారన్నమాట. అసలే ముంబయి ఆర్థికవ్యవస్థంతా గుజరాతీల చేతిలో ఉందని సగటు మహారాష్ట్రుడు కసిగా ఉంటాడు. ఇలాటి సంఘటనలు మరింత విద్వేషాన్ని రగిలిస్తాయి. పైగా స్థానికులు అభ్యంతరం తెలుపుతూ ఉంటే, వీళ్లు అభ్యంతరం లేదంటూ లేఖలివ్వడమేమిటి?

స్థానికుల మనోభావాలను శివసేన గుర్తు పట్టింది. రత్నగిరి, సింధుదుర్గ్ జిల్లాలు ఒకప్పుడు శివసేనకు కంచుకోటలు. సింధుదుర్గ్‌లో పార్టీ తరఫున పెద్ద నాయకుడైన నారాయణ రాణే పార్టీ విడిచిపెట్టడంతో అక్కడ పట్టు పోయింది. రత్నగిరిలో మాత్రం మిగిలింది. అది చేజారకుండా చూడాలంటే తామూ ప్రాజెక్టుకి వ్యతిరేకమని చూపించుకోవాలి. అందువలన ఏప్రిల్ 23న శివసేన తరఫున మహారాష్ట్ర ప్రభుత్వంలో పరిశ్రమల మంత్రిగా ఉన్న సుభాష్ దేశాయ్ యీ ప్రాజెక్టుకై భూసేకరణ కోసం తన శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాడు. ప్రభావిత గ్రామాల్లో ఒకటైన నానర్‌లో అతనా ప్రకటన చేసినపుడు అతని పక్కన ఉద్ధవ్ ఠాక్రే ఉన్నాడు. మర్నాడే ఫడణవీస్ ‘పరిశ్రమల మంత్రికి ఆ నోటిఫికేషన్ రద్దు చేసే అధికారం లేదు. ఒక హైలెవెల్ కమిటీ నివేదిక తయారుచేసి కాబినెట్‌కు సమర్పించాలి. అప్పుడు వాళ్లు దానిమీద నిర్ణయం తీసుకుంటారు’ అని ప్రకటించాడు. తన పార్టీ ఆదేశాలను అతను మన్నించక తప్పదు కదా. ఈ ప్రాజెక్టుని వ్యతిరేకించడంలో శివసేన, కాంగ్రెసు, ఎన్‌సిపి, ఎంఎన్ఎస్ ఏకమయ్యాయి. ప్రస్తుతం బిజెపిలో చేరిన నారాయణ రాణె కూడా తను ప్రాజెక్టుకి వ్యతిరేకమే అని ప్రకటించాడు.

అయినా ప్రభుత్వం వెనక్కు తగ్గటం లేదు. ప్రజలూ ఊరుకోవటం లేదు. కొంకణ్ రిఫైనరీ విరోధ్ సమితి అని పెట్టి మే 30 న 15 వేల మంది గ్రామస్తులతో నిరసన సభ ఏర్పాటు చేశారు. కొంకణ్ ప్రాంతం తమకు హాని కలిగించే ప్రాజెక్టులను అడ్డుకోవటంలో చురుగ్గా ఉంటుంది. ఇప్పుడు తూత్తుకుడిలో విధ్వంసం సృష్టించిన వేదాంత స్టెరిలైట్ రత్నగిరిలోనే 60 వేల టన్నుల కాపర్ స్మెల్టర్ ప్లాంటు పెడతామని 1992లో 500 ఎకరాలు అడిగింది. ప్రభుత్వం యిచ్చింది కూడా. కానీ స్థానికుల ఆందోళన కారణంగా అక్కణ్నుంచి తమిళనాడుకి తరలింది. కాస్త ముందూవెనకగా అమెరికన్ ఎనర్జీ కంపెనీ ఎన్రాన్ దభోల్‌లో ప్రాజెక్టు పెడతానంది. అప్పటి కాంగ్రెసు ప్రభుత్వం సరేనంటే, ప్రతిపక్షంలో ఉన్న శివసేన, బిజెపి అడ్డుకున్నాయి కానీ 1995లో వాళ్లు అధికారంలోకి రాగానే సరేనన్నాయి. ప్రజలు అడ్డు చెపుతూనే ఉన్నారు. చివరకు ఆ ప్రాజెక్టు కష్టాల్లో, నష్టాల్లో మునిగింది. 2010లో యుపిఏ ప్రభుత్వం జైతాపూర్‌లో 9900 మె.వా.ల పవర్ ప్రాజెక్టు పెడతానంది. ప్రజలు వ్యతిరేకిస్తున్నా భూమి సేకరించారు. కానీ విద్యుత్ ధర గురించి తేలకపోవడంతో కథ ముందుకు సాగలేదు. మరి యీ వివాదం చివరకు ఎటు మళ్లుతుందో చూడాలి. ఈలోగా ఆరామ్‌కో తన వాటాలో కొంత భాగాన్ని అబుధబీ నేషనల్ ఆయిల్ కంపెనీకి అమ్మేసింది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

**2018 జూన్** **ఎమ్బీయస్: డ్రగ్ వ్యాపారి విచారణలోనూ యిబ్బందే**

మెక్సికో కేంద్రంగా అమెరికాలో భారీగా డ్రగ్ వ్యాపారం చేసే జోవాక్విన్ గజ్‌మన్ (అతన్ని ‘ఎల్ చాపో’ – మిస్టర్ పొట్టివాడు అంటారు) అమెరికాకు జైల్లో 18 నెలలుగా ఉంటున్నాడు. మెక్సికో ప్రభుత్వం అతన్ని పట్టుకుని జైల్లో పెట్టిన రెండు సార్లూ 2001లోనూ, 2015లోనూ పారిపోయాడు. 2016లో మళ్లీ పట్టుకున్నారు. ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో మెక్సికన్లపై నానారకాల అభియోగాలూ చేశాడు. వాళ్లు అమెరికాకు దొంగతనంగా వచ్చి చౌకగా పనిచేస్తూ స్థానికులకు ఉద్యోగాలు లేకుండా చేస్తున్నారన్నాడు, డ్రగ్స్ వ్యాపారం చేస్తూ అమెరికన్ యువతను చెడగొడుతున్నాడన్నాడు. అసాంఘిక శక్తుల్లో చాలామంది మెక్సికన్లే అన్నాడు. వాళ్లు సరిహద్దులు దాటి రాకుండా గోడ కట్టేస్తానన్నాడు. ట్రంప్ నెగ్గడంతో మెక్సికో ప్రభుత్వాధినేతకు గుబులు పుట్టింది. తమ నిజాయితీని కొంతైనా చూపించకపోతే డ్రగ్స్ పేరు చెప్పి ట్రంప్ నిజంగా తమపై దాడి చేస్తాడేమోనని భయపడి ట్రంప్ ప్రమాణస్వీకారానికి కొన్ని గంటల ముందుగా చాపోను అమెరికాకు అప్పగించింది. అమెరికాలో అతను చేసిన నేరాలకై ఏడు ఫెడరల్ డిస్ట్రిక్టులలో కేసులు నమోదయ్యాయి. ‘సినాలోయా కార్టెల్’ అనే ప్రపంచంలోనే అతి పెద్దదైన డ్రగ్ మాఫియాకు అతనే అధినేతనీ, 14 బిలియన్ డాలర్ల డ్రగ్స్‌ను అమెరికాలో చలామణీలో పెట్టాడనీ అభియోగం. సాధారణంగా యిలా పట్టుబడిన డ్రగ్ లార్డులు నేరం ఒప్పేసుకుని శిక్ష తగ్గించుకుంటూ ఉంటారు. కానీ చాపో తాను అమాయకుణ్నని వాదిస్తున్నాడు. డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎడ్మినిస్ట్రేషన్ (డిఇఏ) వాళ్లు యిన్నాళ్లూ మాదకద్రవ్యాలు దగ్గర ఉంచుకున్నవారిని, కొన్నవారిని, అమ్మినవారిని, వాడిన వారిని పట్టుకుంటూ శిక్షలు వేయిస్తూ వచ్చారు. ఇప్పుడీ చిన్నాచితకా కేసులు వదిలేసి దేశంలోకి సరఫరా చేసే వాళ్ల నడ్డి విరచాలని ప్రణాళికలు రచిస్తున్నారు. వారి వలలో పడిన తిమింగలం యీ చాపో. అతను మూడు దశాబ్దాలుగా నడిపిన డ్రగ్ వ్యాపారం వలన వేలాది మంది చనిపోయారని, లక్షలాది మంది కొకైన్‌కు బానిసలయ్యారని

ప్రాసిక్యూషన్ అంటోంది. బ్రూక్లిన్‌లో యీ సెప్టెంబరులో ప్రారంభం కాబోతున్న యీ కేసు అమెరికా చరిత్రలోనే అది పెద్ద డ్రగ్ కేసుల్లో ఒకటంటున్నారు. అయితే యీ కేసుని తయారుచేస్తున్న ప్రాసిక్యూషన్‌కు కొన్ని అనుకోని చిక్కులు ఎదురవుతున్నాయి.

చాపో 1957లో మెక్సికోలోని పర్వతప్రాంతమైన లా ట్యూనాలో పుట్టాడు. అతి పేద కుటుంబం. చిన్నప్పుణుంచి బజార్లో బస్తాలు మోస్తూ నాలుగు రూకలు సంపాదించి కుటుంబానికి యిచ్చేవాడు. ఆ ప్రాంతాల్లో గనుల తవ్వకాలకు, రైళ్లు, రోడ్లు వేయడంలో పనిచేయడానికి 19 వ శతాబ్దం ద్వితీయార్థంలో చైనా నుంచి కార్మికులను తెప్పించారు. వాళ్లకు నల్లమందు, గంజాయి అలవాటు కాబట్టి, ఆ విత్తనాలు తెచ్చుకుని అక్కడ పాతారు. మెక్సికన్ వాతావరణంలో అవి బాగా పండాయి. నల్లమందు అక్కణ్నుంచి అన్నిచోట్లకు ఎగుమతి అయ్యేది – ముఖ్యంగా అమెరికాకు. దాన్నుంచే హెరాయిన్ తయారుచేసేవారు. నల్లమందు వాడకాన్ని నిషేధిస్తూ అమెరికా 1914లో హారిసన్ చట్టం తేవడంతో, దానికి అలవాటు పడ్డవారు మెక్సికోనుంచి చాటుగా తెప్పించుకోసాగారు. ఈ సరఫరాకు సినాలోవా, చిహువాహువా, ద్యురాంగో అనే మూడు ప్రాంతాల నడుమ ఉన్న ప్రాంతం (గోల్డెన్ ట్రయాంగిల్ అంటారు) పేరుబడింది. చాపో అక్కడివాడే కాబట్టి 1972లో అంటే తన 15 వ ఏట ఆ వ్యాపారంలోకి దిగాడు. ఉద్యోగం ఏదీ దొరక్కపోవడం చేత గంజాయి పెంచడం, అమ్మడం చేసేవాడు.

నిక్సన్ అమెరికా అధ్యక్షుడిగా ఉండగా డ్రగ్స్ సమస్యను గుర్తించి దానిపై 1971లో పోరాటాన్ని ప్రకటించాడు. అఫ్గనిస్తాన్ నుంచి కొలంబియా వరకు అనేక దేశాల్లోని వ్యాపారస్తులు అమెరికాకు మత్తుమందులు సరఫరా చేస్తున్నారని గ్రహించి వాళ్లపై పోరాటం సాగించాడు. కొలంబియా మాఫియాపై ఒత్తిడి పెరగడంతో వాళ్లు తమ దృష్టిని మెక్సికోపై పెట్టారు. ఎందుకంటే మెక్సికోకు, అమెరికాకు 2వేల మైళ్ల సరిహద్దు ఉంది. దాన్ని నిరంతరం కాపలా కాయడం అసాధ్యం. అప్పటికే మెక్సికో హెరాయిన్, మారిజువానా సరఫరా చేస్తోంది. ఇప్పుడు వాటికి కొలంబియా వారి కొకైన్ తోడయింది. కొలంబియా వాళ్లు ఆండియన్ అడవుల నుంచి తమ సరుకును విమానాల్లో గోల్డెన్ ట్రయాంగిల్‌కు తెచ్చి గ్వాడలాజారా కార్టెల్‌కు అప్పగించారు. వారిలో భాగమైన చాపో అక్కణ్నుంచి కాలిఫోర్నియా, అరిజోనా, టెక్సాస్‌లకు అతి తక్కువ సమయంలో రవాణా చేసేవాడు. అతనికి ఉన్న ఆ నేర్పు అతనికి 'ఎల్ రాపిడో' (మిస్టర్ స్పీడ్) అనే బిరుదు తెచ్చిపెట్టింది. అతనికి లాజిస్టిక్స్‌లో ఎక్స్‌పర్ట్‌గా పేరు వచ్చింది. నోగాలెస్ వంటి సరిహద్దు గ్రామాల్లో శాంతా క్రూజ్ నది కిందుగా సహజంగా ఏర్పడిన సొరంగాలున్నాయి. చాపో వాటిని పటిష్టం చేసి పట్టాలు వేసి, విద్యుత్‌తో నడిచే చిన్న తోపుడు బళ్లు, ఎలక్ట్రిక్ బల్బులు ఏర్పాటు చేసి, సరుకును నది కింద నుంచే స్మగుల్ చేసేసేవాడు. సొరంగాలు వేయించడంలో అతను ఎక్స్‌పర్ట్. 2015లో జైలు నుంచి అతను సొరంగం ద్వారానే జైలు నుంచి పారిపోయాడు. 1989 వచ్చేసరికి గ్వాడలాజారా కార్టెల్ ముక్కముక్కలుగా విడిపోయింది. వాటిలో సినాలోవా కార్టెల్ చాపో నియంత్రణ కిందకు వచ్చింది. అక్కణ్నుంచి క్రమంగా డ్రగ్ లార్డ్‌గా మారాడు. అయితే రాబిన్‌హుడ్ యిమేజి మేన్‌టేన్ చేయడానికి ఏదో ఒక సంతలో లేదా జాతరలో హఠాత్తుగా ప్రత్యక్షమై డబ్బు కట్టలు పంచేవాడు. రోడ్లు వేయించాడు, ఆసుపత్రులు కట్టించాడు. అందుకే యిప్పటికీ అతని సొంత ప్రాంతాల్లో అతని పేరున్న క్యాప్‌లను పెట్టుకుని తిరుగుతున్నారు.

చాపో తన ముఠాను కార్పోరేట్ లెవెల్లో నడిపేవాడు. సమర్థులను గుర్తించి, వారికి పనులు అప్పగించేవాడు. జీతాలు మరీ అంతగా యివ్వకపోయినా అందరూ అతని మాట పాటించేవారు. 1990 నుంచి కొకైన్ వ్యాపారంలో భారీ లాభాలు రావడం మొదలుపెట్టాయి. దాంతో డ్రగ్ మాఫియావాళ్లు ఆధునిక ఆయుధాలు చేపట్టి, ఒకరిపై మరొకరు దాడి చేసుకునేవారు. 1993 జూన్‌లో గ్వాటెమాలా పోలీసులు అతన్ని పట్టుకుని మెక్సికోకు అప్పగించారు. 20 ఏళ్లు శిక్ష పడింది. అతను వార్డన్లకు లంచాలిచ్చి, జైలు నుంచి తన ఆపరేషన్స్ కొనసాగించాడు. 2001లో జైలు సిబ్బంది సహకారంతో మాసిన బట్టల బండిలో దాక్కుని పారిపోయాడు కూడా. ఇక అప్పణ్నుంచి అమెరికా, మెక్సికో పోలీసులు వెతుకుతూనే ఉన్నారు. ఆ వేట 13 ఏళ్లు సాగింది. అండర్‌గ్రౌండ్ టన్నెళ్ల ద్వారా అతను ఎప్పటికప్పుడు తప్పించుకునేవాడు. చాపో జైల్లో ఉన్న సమయంలో సైన్యం నుంచి రిటైరయ్యాక డ్రగ్ వ్యాపారంలోకి దిగిన జెటాస్ అనే గ్రూపు పైచేయి సాధించింది. ఇతను బయటకు వచ్చి వాళ్లపై దాడులు చేశాడు. చివరకు 2014లో చాపో పట్టుబడ్డాడు. ఈసారి 16 నెలలే ఉన్నాడు. 2015 జులైలో బాత్‌రూమ్ కింద తవ్వించుకున్న సొరంగం ద్వారా పారిపోయాడు. భూమికి 33 అడుగుల లోతున అయిదున్నర అడుగుల ఎత్తు, రెండుపావు అడుగల వెడల్పు, మైలు పొడుగు ఉన్న సొరంగాన్ని అతని అనుచరులు తవ్వారు. 2016 జనవరిలో మెక్సికో నేవీవారు అతన్ని ఒక యింట్లో పట్టుకున్నారు. అతను ఎప్పటిలాగా ఒక సొరంగం ద్వారా పారిపోయాడు. కానీ కొన్నాళ్లకే పట్టుబడిపోయాడు. 2017 జనవరిలో అమెరికాకు తరలించి న్యూయార్కులో హై సెక్యూరిటీ జైల్లో ఉంచారు.

మెక్సికోలో డ్రగ్స్ తయారుచేసి అమెరికాకు పంపే వ్యాపారం బిలియన్ డాలర్ల వ్యాపారం కాబట్టి దాన్ని కైవసం చేసుకోవడానికి డ్రగ్ కార్టెల్‌లు తమలో తాము నిరంతరం కలహించుకుంటూ ఉంటాయి. ఒకరినొకరు చంపుకుంటాయి. మధ్యలో సాధారణ పౌరులు కూడా చనిపోతూ ఉంటారు. గత దశాబ్దకాలంలో యీ వ్యాపారం కారణంగా 1,19,000 మంది చనిపోయారు. అవయవాలు పోగొట్టుకున్నవారి సంఖ్య దీనికి అనేక రెట్లు ఎక్కువ. హింస పెరిగిపోవడంతో 2006లో మెక్సికో అధ్యక్షుడు కాల్డెరాన్ అమెరికా ప్రభుత్వ సాయంతో యీ గుంపులను అణచసాగాడు. అప్పణ్నుంచి పదేళ్లలో అమెరికా మెక్సికోకు 1.6 బిలియన్ డాలర్లు దీనికై యిచ్చింది. ఏం చేసినా హింస పెరుగుతూనే ఉంది. ఈ ముఠాలు మురికివాడల నుండి ధనాశ చూపించి పేద కుర్రవాళ్లను తమలో చేర్చుకుంటూ, తమలో తాము పోరాడుతూ, సెక్యూరిటీ ఫోర్సుపై కూడా దాడి చేస్తారు. డ్రగ్స్‌పై యుద్ధానికి అమెరికా యిప్పటివరకు ఒక ట్రిలియన్ డాలర్లు ఖర్చు పెట్టి ఉంటుందని అంచనా. హెరాయిన్ వలన 2010లో 3 వేల మంది చనిపోతే 2016లో 15 వేల మంది చనిపోయారు. ఇప్పుడు ప్రాసిక్యూషన్ వారు దేశాలకు విస్తరించిన హింసకు, యీ వ్యాపారానికి ముడిపెట్టి కేసు నడపబోతున్నారు.

దాంతో శిక్ష పెద్దదవుతుంది.

డ్రగ్స్ వ్యాపారం చేసే మెక్సికన్ మాఫియా వాళ్లు మెక్సికన్ పోలీసులకు, సరిహద్దులను రక్షించే సైనికులకు లంచాలు యిస్తూ తమ పని కానిచ్చుకుంటూ ఉంటారు. అందువలన డ్రగ్స్ వ్యాపారస్తులను పట్టుకోవాలంటే అమెరికాలోని డ్రగ్ నిరోధక శాఖ మెక్సికన్ సెక్యూరిటీ ఫోర్సెస్‌కు అవతలివాళ్ల కంటె ఎక్కువ లంచాలిచ్చి ఆ వ్యాపారస్తుల ఆనుపానులు లాగుతూ వచ్చారు. అలాగే డ్రగ్ వ్యాపారుల ఆచూకీ చెప్పడానికి అదే వ్యాపారంలో ఉన్న కొందరిని పోలీసు యిన్‌ఫార్మర్లగా మార్చుకున్నారు. వాళ్లకు డబ్బులిచ్చారు. వాళ్లు పట్టుబడ్డ సందర్భాల్లో తక్కువ శిక్ష పడేట్లుగా చేశారు. లేకపోతే డ్రగ్ మాఫియా గురించి సమాచారం రాబట్టడం అసాధ్యం. సమాచారం బయటకు పొక్కిందని తెలిస్తే మాఫియా వాళ్లను చిత్రహింసల పాలు చేస్తుంది, ప్రాణాలు తీస్తుంది. అందువలన వారిలో కొందరు చిన్నచేపలను పోలీసు పక్షాన మార్చుకోవాలి. దానికి డబ్బివ్వాలి, వేరే ఆశలు చూపాలి. కానీ చట్టప్రకారం చూస్తే యిది తప్పు. ఈ విషయం యిదివరకే వెలుగులోకి వచ్చింది. 2011లో విసెంటే జంబాడా అనే ఒక మాదకద్రవ్య వ్యాపారి పట్టుబడినపుడు అతను 'నన్ను శిక్షించడానికి వీల్లేదు. నేను డిఇఎ యిన్‌ఫార్మర్‌ని' అన్నాడు. ఇలాటి బేరసారాలు అడడానికి డిఇఏ అధికారులు, యీ వ్యాపారులతో అనేక సమావేశాలు జరిపారు. అవన్నీ బయటపడితే యికపై మాఫియా జాగ్రత్తపడుతుంది.

డిఇఏ ఏజంట్లు మాఫియాలో చొరబడడానికి ఒక్కోప్పుడు తామే చిన్న నేరాలకు పాల్పడి, తాము కూడా యీ వ్యాపారంలో ఉన్నామని చూపుకోవాలి. లేకపోతే వాళ్లు దగ్గరకు రానీయరు. కానీ చట్టరీత్యా యిది నేరం. డ్రగ్ వ్యాపారం చట్టవిరుద్ధమైనట్లే, డ్రగ్‌పై యుద్ధం కూడా చట్టవిరుద్ధమైన మార్గాలలో చేయాల్సి వస్తోంది. కోర్టులో విచారణకు వచ్చినపుడు జడ్జిలు దీనిపై ప్రాసిక్యూషన్‌ను నిలదీయవచ్చు. డిఫెన్సు లాయరు దీన్ని తన కనుకూలంగా వాడుకోవచ్చు. మెక్సికోలు అధికారగణం, రాజకీయనాయకులు యావత్తు ఎప్పుడో ఒకప్పుడు డ్రగ్ మాఫియాకు అమ్ముడుపోయినవారే. లేదా భయం చేత వారికి సాయపడినవారే. అవన్నీ అమెరికన్ కోర్టులో బయటపెడితే రెండు దేశాల మధ్య సంబంధాలు చెడిపోవచ్చు. దౌత్యపరమైన సమస్యలు రావచ్చు. ఎల్ చాపో నేరాలను నిర్ధారించడానికి మెక్సికో, కొలంబియాలలో డ్రగ్ వ్యాపారం చేస్తూ పట్టుబడి, శిక్ష అనుభవిస్తున్న నేరస్తులను తన సాక్షులుగా ప్రాసిక్యూషన్ ఉపయోగించుకుంటోంది. చాపో డిఫెన్సు లాయరు 'శిక్ష తగ్గిస్తామని ఆశ చూపి, వాళ్ల చేత అతనికి వ్యతిరేకంగా చెప్పిస్తున్నారేమోనన్న సందేహాన్ని కోర్టులో లేవనెత్తి, వారి సాక్ష్యాన్ని పరిగణించవద్దని జడ్జిని కోరతాను.' అన్నాడు. ఈ పరిస్థితుల్లో కేసు ఎలా పరిణమిస్తుందో తెలియదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

**2018 జూన్ మెమరీ నెమరేస్తే... శీర్షికకై ఎమ్బీయస్: జయలలిత ఎంపిక తప్పింది**

ప్రముఖ నిర్మాత 'కౌముదీ ఆర్ట్ పిక్చర్స్' ఎమ్మెస్ రెడ్డి సినీరంగంలో ఎగ్జిబిటర్‌గా ప్రవేశించారు. గూడూరులో సుందరమహల్ అనే థియేటరు ఉండేది ఆయనకు. ఒకసారి మద్రాసు వెళ్లినపుడు ఎవరో చెపితే "కుమరిపెణ్" అనే సినిమా చూడడానికి వెళ్లారు. దర్శకనిర్మాత టిఆర్ రామన్న రవిచంద్రన్ హీరోగా తీసిన ఆ సినిమాలో హీరోయిన్ జయలలిత ప్రేక్షకులను విపరీతంగా ఆకర్షిస్తోందని ఆయనకి అర్థమైంది. అప్పటికి సినిమా రిలీజై పదివారాలయింది. ఎమ్మెస్ మర్నాడే రామన్న ఆఫీసుకి వెళ్లి తెలుగు డబ్బింగ్ రైట్స్ అరవై వేలకు కొన్నారు. మరో అరవై వేలు ఖర్చు పెట్టి డబ్బింగు పూర్తి చేసి, "కన్నెపిల్ల" పేరుతో 1966 డిసెంబరు 26న విజయా పిక్చర్స్ ద్వారా రిలీజు చేశారు. అదే రోజు ఎన్టీయార్ "కంచుకోట" రిలీజైంది. ఐనా యీ సినిమా వంద రోజులు ఆడి, లాభాలు తెచ్చిపెట్టింది. ఆ వూపులోనే "కొంటెపిల్ల", "కాలచక్రం" అనే మరో రెండు డబ్బింగు సినిమాలు తీస్తే అవి "కన్నెపిల్ల" లాభాలలో సగం తినేశాయి. 1968లో టిఆర్ రామన్న తమిళంలో తీసిన "భవాని" సినిమాకు తెలుగు రీమేక్ రైట్స్ కొని కెఎస్ ప్రకాశరావుగారి దర్శకత్వంలో శోభన్‌బాబు, వాణిశ్రీలతో "భార్య" (1968) పేరుతో తీస్తే అది తమిళ కొంత లాభం తెచ్చిపెట్టింది. ఆ తరవాత కామేశ్వరరావుగారు దర్శకుడిగా, శోభన్‌బాబు, వాణిశ్రీలతో "కలసిన మనసులు" (1969) సినిమా తీస్తే అది ఘోరంగా ఫ్లాపయింది.

అయినా ఎమ్మెస్ యీసారి ఎన్టీయార్‌తో భారీ సినిమా తలపెట్టారు. ఆయనా, పింగళి, కమలాకర కామేశ్వరరావు గారు పురాణాలన్నిటినీ గాలించి "శ్రీకృష్ణవిజయం" సినిమా కథ తయారుచేశారు. దాని ప్రకారం కృష్ణుడికి అష్టభార్యలతో బాటు వసుంధర అనే మరో భార్య ఉంటుంది. నాయకుడైన ఎన్టీయార్ కథ ఎప్రూవ్ చేశారు. కాలయవనుడు, మహోదరుడు అనే ప్రతినాయకుల పాత్రలు ఎస్వీ రంగారావు డబుల్ రోల్‌గా వేస్తే బాగుంటుంది. కానీ అప్పట్లో రామారావు, రంగారావుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేటంత వివాదం నడుస్తోంది కాబట్టి అది జరిగేపని కాదన్నారు కామేశ్వరరావు. ఏం చేయాలా అని ఆలోచించి ఎమ్మెస్ 'ఎన్టీయార్ నాయకుడిగా, ఎస్వీయార్ ప్రతినాయకుడిగా త్వరలో ప్రారంభం కాబోతున్న భారీ పౌరాణిక చిత్రం 'శ్రీకృష్ణవిజయం' అని యాడ్ యిచ్చేశారు. అది చూసి ఎన్టీయార్ పిలిపించుకుని 'మాతో మాటమాత్రం చెప్పకుండా యిలా చేశారు?' అన్నారు కోపంగా. 'సార్, మాది పెద్ద పేరున్న బ్యానర్ కాదు, అలా యిస్తే ప్రేక్షకుల్లో క్రేజ్ వస్తుందని యిచ్చా..' అన్నారు ఎమ్మెస్. దానికి ఎన్టీయార్ నిర్లిప్తంగా నవ్వి 'ముందుచూపులో మీరు మా కన్నా ముందున్నారు. అలాగే కానీయండి' అన్నారు. తర్వాత రంగారావు వద్దకు వెళ్లి కథ వినిపిస్తే 'అలాగే వేస్తాను కానీ నన్ను పెట్టుకునేందుకు రామారావు ఒప్పుకోడు' అన్నారు. ఆయన అనుమతితోనే నేను యాడ్ యిచ్చా అని యీయన చెప్తే సరేనన్నారు.

ఇక హీరోయిన్ పాత్ర దగ్గరకు వచ్చేసరికి "వసుంధర పాత్ర కొత్తగా ఉంది. ఆ పాత్రకు జయలలిత గారైతే గొప్పగా ఉంటుంది. మీరు గట్టిగా ప్రయత్నించండి." అని ఎన్టీయార్ సూచించడంతో ఎమ్మెస్ ఆవిడ దగ్గరకు వెళ్లారు. ఆయన "కన్నెపిల్ల" సినిమా డాన్సింగ్ పోజులోని ఒక దృశ్యాన్ని ఒక ఆర్టిస్టు చేత పెయింటింగ్ చేయించి, ఫ్రేమ్ కట్టించి ఆఫీసులో పెట్టుకునేవారు. ఆ పటం

తీసుకుని జయలలిత యింటికి వెళితే వాళ్ల అమ్మగారు మేడపైన మేకప్‌లో ఉంది కలవండి అన్నారు. ఎమ్మెస్ వెళ్లి ఆ పటం చేతికి యివ్వగానే ఆమె ఎక్కడిది అన్నట్లు యాయన వంక చూసింది. 'నా ఫస్ట్ పిక్చర్ హీరోయిన్ మేడమ్' అన్నారీయన. 'ఓహో కుమరిపెణ్ డబ్బింగు చేసింది మీరేనన్నమాట. ఇది నేను ఉంచుకోవచ్చా?' అని అడిగింది జయలలిత. మీ కోసమే తెచ్చా, అంటూ తన సినిమా కథ చెప్పసాగారు. ఆమె సగం కథ విని 'నా పాత్ర కొత్తగా ఉంది. తప్పకుండా చేస్తాను. షూటింగుకి టైమైంది' అంటూ కిందకు వచ్చి తల్లితో 'రెడ్డిగారి పిక్చర్ చేస్తున్నాను. కాల్‌షీటెలా అడ్జస్టు చేస్తావో నీ యిష్టం' అని చెప్పి వెళ్లిపోయింది. ఆవిడ కూతురు మాట కాదనలేక "దసరాబుల్లోడు" సినిమాకు కేటాయించిన కాల్‌షీట్లు కాన్సిల్ చేసి ఎమ్మెస్ సినిమాకు యిచ్చారు. ఇదంతా ఎమ్మెస్ రెడ్డి ఆత్మకథ "నా కథ"లో రాశారు. దీని తర్వాత జరిగినది భగీరథ రాసిన విబి రాజేంద్రప్రసాద్ జీవితగాథ "దసరాబుల్లోడు"లో చూడవచ్చు.

రాజేంద్రప్రసాద్ తీసిన "ఆస్తిపరులు", "అదృష్టవంతులు" సినిమాలలో జయలలితే హీరోయిన్. "దసరా బుల్లోడు" సినిమా కథ అక్కినేనికి నచ్చింది కానీ డేట్స్ కోసం ఆగవలసి వచ్చింది. అంతలో ఆయన కాల్‌షీట్ యిచ్చిన సినిమాకు కథ సరిగ్గా కుదరకపోవడంతో షూటింగ్ కాన్సిల్ అయి, యీ సినిమా వెంటనే ప్రారంభించాల్సి వచ్చింది. డైరక్టర్లు ఎవరూ ఖాళీగా వుండకపోవడంతో రాజేంద్రప్రసాదే తొలిసారిగా డైరక్షన్‌కు పూనుకున్నారు. గబగబా తక్కిన నటీనటుల్ని కూడా కుదుర్చుకుని అమలాపురంలో ఔట్‌డోర్ షూటింగుతో సినిమా ఫస్ట్ షెడ్యూల్ ప్లాను చేసుకున్నారు. సరిగ్గా వారం రోజుల ముందు జయలలిత తల్లి సంధ్య 'మా అమ్మాయికి ఎమ్జీయార్‌తో సినిమా ఫిక్సయింది. అందువలన దీనిలో వేయలేదు' అని ఉత్తరం పంపారు. దాంతో రాజేంద్రప్రసాద్ వాణిశ్రీ గురించి ఆలోచించారు. ఆమె ఆయన తీసిన "ఆస్తిపరులు" (1966)లో జగ్గయ్య సరసన వేశారు. సారథీవారి "ఆత్మీయులు" (1969)లో అక్కినేని సరసన వేశారు. "అర్జంటుగా డేట్స్ కావాలి, ఎంత డబ్బయినా ఫర్వాలేదు' అన్నారు రాజేంద్రప్రసాద్. తక్కిన నిర్మాతలతో మాట్లాడి వాణిశ్రీ డేట్స్ అడ్జస్టు చేసుకుని "దసరాబుల్లోడు"లో వేశారు. చంద్రకళ మరో హీరోయిన్. నాగభూషణం, పద్మనాభం, రంగారావు, అంజలి, గుమ్మడి సహపాత్రధారులు.

"శ్రీకృష్ణవిజయం" సినిమా బ్లాక్ అండ్ వైట్‌లో తీసినా ఎన్టీయార్, ఎస్వీయార్, నాగభూషణం, కాంతారావు, సత్యనారాయణ, పద్మనాభం, జయలలిత, జమున, దేవిక అందరూ ఉన్నారు. రంభ పాత్రలో హేమమాలిని డాన్స్ చేసిన దృశ్యాన్ని కలర్‌లో తీశారు. పౌరాణిక బ్రహ్మ కమలాకర దర్శకత్వం. భారీ అంచనాలతో 1971 జనవరి 11న రిలీజైంది. రెండు రోజులు పోయాక "దసరా బుల్లోడు" రిలీజైంది, సూపర్‌డూపర్ హిట్ అయింది. శ్రీకృష్ణవిజయం ఫెయిలైంది. ఎమ్మెస్‌కు నష్టం వచ్చి నెగటివ్ రైట్స్ అమ్మేసి ఆ నష్టాన్ని పూడ్చుకోవలసి వచ్చింది. "దసరా బుల్లోడు" తర్వాత వాణిశ్రీ ధాటికి ఎదురు లేకపోయింది. అదే ఏడాది "పవిత్రబంధం", "ప్రేమనగర్" వచ్చాయి. హీరోయిన్‌గా 1979 వరకు 39 సినిమాల్లో వేశారు. ఇక జయలలిత "శ్రీకృష్ణవిజయం" తర్వాత తెలుగులో 5 సినిమాలు మాత్రమే వేశారు. అక్కినేనితో వేసిన "నాయకుడు-వినాయకుడు" (1980) జయలలిత కెరియర్లో ఆఖరి సినిమా. **- ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

**2018 జూన్** **ఎమ్బీయస్: టీచర్లకు డ్రెస్‌కోడ్ ఉందా?**

తూర్పు శ్రీలంకలో యిటీవల హిందూ-ముస్లిముల మధ్య ఘర్షణ వాతావరణం పెరుగుతోంది. ట్రిన్‌కొమలి లోని 'శ్రీ షణ్ముగ హిందూ లేడీస్ కాలేజి' అనే హైస్కూలులో నలుగురు ముస్లిము టీచర్లు ఉన్నట్టుండి చీరలు కట్టడం మానేసి అరేబియన్ స్త్రీలలా 'అబయా' (పై నుంచి కింద దాకా శరీరాన్ని కప్పి ఉంచే ఉడుపు) వేసుకు రాసాగారు. ఒక హిందూ స్కూలులో యిలాటి డ్రస్సు వేసుకురావడమేమిటంటూ స్కూలు పిల్లల తలిదండ్రులు, కొందరు టీచర్లు కలిసి ఆందోళనకు దిగారు. స్కూలు ముందు ప్లకార్డులు పట్టుకుని నిరసనలు తెలిపారు. 'హిందూ స్కూళ్లు హిందువుల కోసమే. ఇక్కడ మతతత్వం చెల్లదు' అంటూ. 'ఈ స్కూలు 1923లో ఒక హిందూ స్త్రీ విరాళంతో నెలకొల్పినా, ప్రస్తుతం అది ప్రభుత్వ నిధులతో నడుస్తోంది. అందువలన హిందూ స్కూలు అనడానికి లేదు. 2000 మంది విద్యార్థుల్లో 120 మంది ముస్లిములే. అన్ని మతాల టీచర్లను నియమిస్తున్నారు. పైగా టీచర్లకు డ్రెస్‌కోడ్ లేదు. మాకు సౌకర్యంగా ఉన్న బట్టలు మేం వేసుకుంటున్నాం' అంటారు ఆ టీచర్లు. ఆందోళనకారులు పనిలో పనిగా 'మీరు మంచి తమిళం మాట్లాడకలేకపోయినా ఫర్వాలేదు కానీ అపభ్రంశపు తమిళం మాట్లాడకండి' అంటూ నినాదాలు యిచ్చారు. శ్రీలంక తమిళుల యాసనే తమిళనాడు తమిళులు వెక్కిరిస్తారు. శ్రీలంక ముస్లిములు కూడా తమిళులే అయినా వారికి ప్రత్యేకమైన యాస ఉంది. దాన్ని వీళ్లు ఎత్తిచూపుతున్నారు.

శ్రీలంక జనాభాలో ముస్లిము తమిళులు 10% ఉంటారు. హిందూ తమిళులు 13% ఉంటారు. బౌద్ధులు 70%, క్రైస్తవులు 7% ఉంటారు. ఇరు మతాల తమిళులు ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటారు. 'ఈలమ్' పేరుతో శ్రీలంక నుంచి విడిపోవాలని తమిళ హిందువులు (కొద్దిమంది తమిళ క్రైస్తవులు) హింసాత్మకమైన పోరాటం చేసినపుడు ముస్లిములు కలిసి రాలేదు. తమిళతనం కారణంగా మొదట్లో సానుభూతి చూపి, తిరుగుబాటుదారులను పోలీసుల నుంచి రక్షించినా 1990లో మసీదులో ప్రార్థన చేస్తున్న 100 మంది ముస్లిములను ఎల్‌టిటిఇ తుపాకులతో కాల్చి మట్టుపెట్టిన దగ్గర్నుంచి వాళ్లు సహకరించడం మానేశారు. ఈలం అంటూ ఏర్పడితే దానిలో అధికారం తమిళ హిందువులదే అవుతుందని, వాళ్లు తమను రెండో తరగతి పౌరుల కంటె హీనంగా చూస్తారని ముస్లిములు భయపడ్డారు. దానికి తగ్గట్టుగానే వేర్పాటువాదులందరూ ముస్లిములను ప్రభుత్వానికి మద్దతుదారులుగా చూస్తూ తమ అధీనంలో ఉన్న తూర్పు ప్రాంతాల్లో వారిపై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశారు. ఉత్తర ప్రాంతాలలోని ముస్లిములను రాత్రికి రాత్రి ఖాళీ చేయించారు. పర్యవసానంగా ముస్లిములు శ్రీలంకలోని అధికారపక్షంతో చేతులు కలిపి, ప్రభుత్వంలో పదవులు

సంపాదించుకుని, వారి మద్దతుతో వ్యాపారాల్లో దిగి ఆర్థికంగా బాగుపడ్డారు. కల్లోల ప్రాంతాల్లోనే ఉండిపోయిన హిందువులు ఎల్‌టిటిఇ కారణంగా, సైన్యం కారణంగా చాలా నష్టపోయి ఆర్థికంగా దెబ్బ తిన్నారు. 2009లో యుద్ధం ముగిసినా వాళ్లు కోలుకోవడానికి టైము పడుతోంది. చాలా యిళ్లల్లో మగవారు ఎల్‌టిటిఇ చేతిలోనో, సైన్యం చేతిలోనో చనిపోయారు. అంతంత మాత్రంగా చదువుకున్న ఆడవాళ్లే యిళ్లు నడుపుతున్నారు. కాస్త డబ్బున్నవాళ్లు గొడవలు ప్రారంభం కాగానే విదేశాలకు వెళ్లి స్థిరపడిపోయారు. అందువలన అక్కడున్న వాళ్ల పరిస్థితి నాసిగా ఉంది. తత్ఫలితంగా యిరు వర్గాల మధ్య అసూయాద్వేషాలు కూడా కలిగాయి. అయినా ప్రత్యక్షంగా కలహాలకు దిగలేదు.

కానీ యిటీవల మనదేశంలో హిందూత్వ శక్తులకు ఊపు రావడంతో శ్రీలంకలో కూడా హిందూ శక్తులు తమ ప్రతాపం చూపదలచాయి. 2016 అక్టోబరులో "శివ సేనై" పేర ఒక సంస్థ వెలిసింది. ముస్లిం, క్రైస్తవ సంస్థల మతాంతీకరణను అడ్డుకోవడానికి ఆవిర్భవించాని చెప్పుకుంటోంది. దానికి ప్రతిగా ముస్లిములు అనేక కొత్త మసీదులు కట్టి ముస్లిముల్లో మతభావనలను రెచ్చగొట్టసాగారు. భారీగా ముస్లిము విద్యాసంస్థలు కూడా నెలకొల్పసాగారు. ఈ ఫిబ్రవరిలో స్థానిక ఎన్నికలు జరిగి జాఫ్నా మేయరుగా ఇమ్మాన్యుయేల్ ఆర్నాల్డ్ ఎంపిక అయినప్పుడు సేవా సేనై 'తమిళ ప్రాంతాల్లో క్రైస్తవ ప్రాబల్యాన్ని సహించం' అని అడ్డు చెప్పింది. తమిళ మీడియాలో కొన్ని వర్గాలు వారికి వత్తాసు పలికాయి. ఇలా కొద్దిపాటి గొడవలు జరుగుతూండగా యింతలో ఏప్రిల్‌లో యీ స్కూలు గొడవ వచ్చింది. డ్రస్సు మార్చిన నలుగురు ముస్లిం టీచర్లు ఆందోళన కారణంగా తమను 'ముస్లిం' స్కూళ్లకు బదిలీ చేయమని ప్రభుత్వాన్ని కోరారు. ఇది శివసేనైలో ఉత్సాహాన్ని నింపింది. రంజాన్ మాసం వస్తూండగా గోవధ, గోమాంసం అమ్మకం నిషేధించాలంటూ జాఫ్నాలో నిరసన తెలిపారు. 'ఇది హిందువుల, బౌద్ధుల దేశం. మేం గోవులను పూజిస్తాం. మా సెంటిమెంట్లు గౌరవించాలి.' అని ప్రకటించి ముస్లిములూ హిందూ సంప్రదాయాలను అవలంబించాని పట్టుబడుతున్నారు. కొలంబోలో ముస్లిములు ఎక్కువగా నివసించే శివారులో గోరక్షణ సమితి వెలిసింది. నందిని అధిరోహించిన శివుడు బొమ్మతో పెద్ద హోర్డింగు పెట్టి 'గోమాంసం తిననివారిని దేవుడు రక్షిస్తాడు' అని రాసి పెట్టారు. సింహళ వంటకాలు – ముఖ్యంగా మాంసాహారం – ప్రపంచవ్యాప్తంగా టూరిస్టులను ఆకర్షిస్తాయి. ఇప్పుడీ నిషేధం వలన టూరిజం దెబ్బ తినవచ్చు. రంజాన్ మాసంలోనే యీ వివాదం లేవనెత్తడంలో దురూహ కనబడింది కొన్ని తమిళ సామాజిక సంస్థలకు. 'మనల్ని చీల్చడానికి పొరుగుదేశం రచించిన వ్యూహం యిది' అంటున్నాయి అవి. ఎందుకంటే శివసేనై ప్రారంభం కాగానే శివసేన నాయకుడు సంజయ్ రౌత్ మద్దతు ప్రకటించాడు.

ఈ వివాదం కారణంగా తామెవరికీ లొంగేది లేదని, తమ ఐడెంటిటీని కాపాడుకోవడానికి వెరవమని చాటుకోవడానికి యిరు వర్గాలూ ప్రయత్నిస్తున్నాయి. ఇటీవలి కాలంలో ముస్లిము వనితలు అబయా ఎక్కువగా వేసుకుంటున్నారు. అరేబియా ప్రాంతం నుంచి తిరిగి వచ్చిన బంధువులు బహుమతిగా యిచ్చినవి కొన్ని. లోకల్ మార్కెట్లలో అమ్ముతున్నవి కొన్ని. కొంతమంది నల్లవి వేసుకుంటారు. మరికొందరు రంగురంగులవి వేసుకుంటారు. 'ఇదంతా మన తమిళ సంస్కృతి కాదు' అని అభ్యంతరం తెలుపుతున్న హిందువుల వాదన తిప్పికొడుతూ 'కొందరు హిందూ మహిళలు సాల్వార్‌కమీజ్ వేసుకుంటున్నారు. అది తమిళ సంస్కృతా?' అని అడుగుతున్నారు ముస్లిములు. ఆందోళన చేస్తున్న వారిలో కొందరు ఆడవారు సాల్వార్ కమీజ్ వేసుకోవడం గమనించవచ్చు. తమ ఉనికి చాటుకునే ప్రయత్నంలో భాగంగానే ఆ టీచర్లు డ్రస్సు మార్చారు. వార్తల్లోకి ఎక్కారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

## 2018 జూన్ టాబ్లాయిడ్‌కై ఎమ్బీయస్: సర్వే ఎందుకు చేసినట్లు?

ఆంధ్రజ్యోతి తను చేయించిన సర్వేలో టిడిపికే మళ్లీ పట్టం కడతారని వచ్చిందంటూ కథనాలు వేస్తోంది. వాస్తవఫలితాలకు అతి దగ్గరగా ఉంటాయని పేరుబడిన ఎగ్జిట్ పోల్స్ కూడా తప్పిపోతున్నాయని గమనిస్తూనే వున్నా సర్వే అనగానే ఆసక్తిగా చదువుతాం. దీనిలో వింతగా తోచిందేమిట్రా అంటే రాజగోపాల్ సర్వే అన్నట్లుగా కలరింగు యివ్వడం! ఆంధ్రజ్యోతికి పత్రిక, టీవీ ఛానెల్ కూడా ఉంది. వాళ్లు ఎవర్ని కావాలంటే వాళ్ల సేవలు ఉపయోగించుకుని సర్వేలు చేయించుకోవచ్చు. ఈసారి ఆర్జీస్ ఫ్లాష్ సర్వే చేత చేయించుకున్నాం అని చెప్పుకోవచ్చు. దానికి 'రాజగోపాల్ చేయించుకునే..' అని చేర్చడం దేనికి, అది హెడింగ్‌లో పెట్టడం దేనికి? అంటే రాజగోపాల్‌కి ఉన్న రెప్యుటేషన్, క్రెడిబిలిటీ తమ సంస్థకు లేదని చెప్పుకోవడమా? నాకు గుర్తున్నంతవరకు రాజగోపాల్ 'టుడేస్ చాణక్య' చేత కూడా చేయించుకున్నారు. ఎవరు, ఎవరి చేత చేయించుకున్నా ముఖ్యంగా చూడవలసినది శాంపుల్ పరిమాణం ఎంత, ఎక్కడ చేశారు అని. వీళ్లు సర్వే చేసినది 19 సీట్లలో. అంటే కేవలం 11% సీట్లలో అన్నమాట. ఒక్కోదానిలో 1200 మందిని సర్వే చేశారు. మొత్తం 22,800 మంది. దాన్ని బట్టి మొత్తం రాష్ట్రానికి అన్వయించారు. సెలక్టు చేసిన 19 సీట్లలో 68% సీట్లు గతంలో టిడిపిని గెలిపించినవి తీసుకున్నారు. వాటన్నిటిలో టిడిపి గెలుస్తుందని తెలుసుకున్నారు. ఆ ప్రకారం చూస్తే 110 వస్తాయని తేల్చారు. 2014 ఎన్నికలో టిడిపి 102 స్థానాలు గెలిచింది. తర్వాత 22 మంది వైసిపి నుంచి పార్టీ ఫిరాయించారు. దాని బలం ప్రస్తుతం 126. అది ఇప్పుడు 110కి పడిపోతుంది, అంటే 87%కి తగ్గిపోతుంది. వైసిపికి 2014లో 67 వచ్చాయి. 22 మంది వెళ్లిపోయారు. 45 అయింది. సర్వేలో దానికి 60, అంటే 133%కి పెరుగుతుంది అని వచ్చింది. సర్వే నిజమే అయితే టిడిపి సొంత స్థానాలనో, ఫిరాయింపుదార్లను చేర్చుకున్న స్థానాలనో మొత్తం 16టిని పోగొట్టుకుంటుంది. సర్వే ఫలితాలను ప్రచురించేటప్పుడు యీ కోణంలో వారు పరామర్శించలేదు.

2014లో ఓటర్లలో చంద్రబాబు ఏదో చేస్తారన్న ఆశ మాత్రమే ఉంది. అవతల బైబిల్ చేత్తో పట్టుకుని తిరుగుతున్న విజయమ్మ, ఆమె కొడుకు కనబడినవాళ్లందరినీ క్రైస్తవులుగా మార్చేస్తారనే భయం ఉంది. అందువలన 45% ఓట్లు పడ్డాయి. ఈ నాలుగు

సంవత్సరాలలో బాబు న భూతో అన్న తీరులో రాజధానికై 33 వేల ఎకరాల సేకరించారు. పైసా చెల్లించకుండా సింగపూరు వాళ్ల చేత ప్లాన్లు గీయించారు. ప్రపంచమంతా నివ్వెరపోయి చూసే స్థాయి రాజధానికి ప్రణాళికలు రచించి, నాలుగైదుసార్లు శంకుస్థాపనలు కూడా చేశారు. కృష్ణా, గుంటూరు వాసుల బంగరు భవిష్యత్తుకు బాటలు వేశారు, హైదరాబాదు నుంచి ఆంధ్ర నడిబొడ్డుకు రాజధానిని తరలించారు, తాత్కాలిక భవనాలంటూనే పకడ్బందీగా పెద్దపెద్ద భవనాలు కట్టారు, ఎంతో ఘనంగా రెండు పుష్కరాలు నిర్వహించారు, పట్టిసీమ నుంచి గోదావరి జలాలను రాయలసీమకు తరలించారు, నదులను అనుసంధానం చేయించారు, అనంతపురం జిల్లా నుంచి కరువును పారద్రోలారు, పోలవరం చాలా భాగం కట్టి, జాతికి అంకితం కూడా యిచ్చారు, హిందూ, ముస్లిం పండగలకు చంద్రన్న కానుకలను యిచ్చారు, కాపులకు రిజర్వేషన్ యిచ్చారు, వైజాగ్‌లో సదస్సులు నిర్వహించి లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చేట్లా ఒప్పందాలు చేసుకున్నారు, తను నిద్ర పోకుండా, అధికారగణాన్ని నిద్రపోనివ్వకుండా అన్ని ప్రాజెక్టులను ఏకకాలంలో స్వయంగా పర్యవేక్షిస్తూ, ఆంధ్రయువతకు స్ఫూర్తి కలిగిస్తూ, వారు అంతర్జాతీయ అవార్డులు తెచ్చుకునేట్లా చేస్తూ, వారిలో ఉత్సాహాన్ని రగిలిస్తూ ఉన్నారు. ఆయన ఎంత గొప్ప పాలనాసమర్థుడో, రాష్ట్రం మేలు కోసం కేంద్రాన్ని ఎంత పీడిస్తారో వెంకయ్యనాయుడు గారు ప్రాసాలంకారాలతో ఎన్ని ప్రసంగాలు చేశారో చెప్పనలవి కాదు. ఇంత చేసినా యీ సర్వే ప్రకారం టిడిపికి ఓటింగు శాతం 0.5% తగ్గింది తప్ప పెరగలేదు. ఇది వింతగా లేదూ?

ఇక వైసిపి, గత ఎన్నికలలో 44.6% ఓట్లు తెచ్చుకుంది. ఇప్పుడది దాదాపు 7% ఓట్లు పోగొట్టుకుంది. 33% మంది ఎమ్మెల్యేలను ఫిరాయింపుల ద్వారా పోగొట్టుకుంది కాబట్టి ఆ లెక్క ప్రకారం 15% ఓట్లు కూడా పోయి వుండాలి. కానీ దానిలో సగమే పోయాయన్నమాట. అంటే నాయకులు ఫిరాయించినంత సులభంగా ఓటర్లు ఫిరాయించలేదన్నమాట. రెండున్నరేళ్ల టిడిపి పాలన పూర్తయ్యాక చేసిన సర్వేలో బిజెపికి 5.4% ఓట్లు వస్తాయని తేలింది. అది యిప్పుడు 1%కి పడిపోయింది. అప్పటికి, యిప్పటికి తేడా ఏమిటి? అప్పుడూ బిజెపి ప్రత్యేక హోదా యివ్వలేదు. ఆర్థిక లోటు పూరించలేదు. నిధులు కురిపించలేదు. రాజధానికి మట్టి, నీళ్లూ తప్ప మరేమీ యివ్వలేదు. అయినా ఆ స్థాయిలో ఉంది. మరి యిప్పుడు? టిడిపి కటీఫ్ అందంతే, దెబ్బకి అది ఐదోవంతుకి పడిపోయింది. టిడిపియా? మజాకా? వైసిపికి, టిడిపికి, బిజెపికి అందరికీ తగ్గిన ఓట్లన్నీ జనసేన ఖాతాలో పడ్డాయి. ఏకంగా 9%! కానీ ఒక్క సీటూ రాదు. 1% ఓట్లతో బిజెపి 4 సీట్లు తెచ్చుకుంటుంది కానీ దానికి 9 రెట్లు ఓట్లతో జనసేన ఒక్కటీ తెచ్చుకోలేదు. అంటే ఓట్లన్నీ అన్ని నియోజకవర్గాల్లో చెదిరిపోయాయన్నమాట, పాపం.

ఈ సర్వేలో గమనించవలసిన విషయం ఏమిటంటే ఎటూ తేల్చుకోనివారి శాతం 5.40 ఉంది. 2014 ఎన్నికలలో టిడిపి-బిజెపి కూటమి మధ్య వైసిపి మధ్య ఓట్ల శాతంలో తేడా – 2.5%, కానీ సీట్లలో తేడా – 39! అందువలన తటస్థులుగా ఉన్నవారు ఎటు మొగ్గుతారు అనేది చాలా ప్రధానమైన అంశం. ఈ సర్వేలో 'ఎటూ తేల్చుకోనివారి' శాతం నియోజకవర్గం బట్టి 0.50% నుంచి 9.79% వరకు ఉంది. సరాసరి ఐన 5.40% కంటె ఎక్కువ ఉన్న నియోజకవర్గాలు 11 కాగా సరాసరి కంటె తక్కువ ఉన్నవి 8. ఇలాటి పరిస్థితిలో 2014లో తక్కువ మార్జిన్‌లో ఫలితాలు అటూయిటూ అయిన నియోజకవర్గాలను యీ సర్వేకు ఎంపిక చేసి ఉంటారు అనుకున్నాను. అలాగే తీసుకున్నారా అని చూశాను. వెయ్యి నుంచి 5 వేల వరకు మార్జిన్ ఉన్నవి 6 తీసుకున్నారు, 6-10 వేల మార్జిన్‌వి 3, 11-15 మార్జిన్‌వి 3, 16-20 మార్జిన్‌వి 1, 21-25 మార్జిన్‌వి 2, 26-30 మార్జిన్‌వి 2, 31-35 మార్జిన్‌వి 0, 36-40 మార్జిన్‌వి 2 తీసుకున్నారు. 10 వేల మార్జిన్ కంటె ఎక్కువ వచ్చినవి తీసుకోవడం అనవసరమని నా అభిప్రాయం. ఎందుకంటే అవి ఆ పార్టీకి బలమైన స్థానాలన్నమాట. 10 వేల లోపు మార్జిన్ ఉన్నవి 9 స్థానాలు మాత్రమే. 10 వేల మార్జిన్ పై బడ్డ 10 స్థానాల్లో టిడిపివి 8 తీసుకున్నారు, వాటిలో ఒకటి వైసిపికి పోతుందన్నారు, 1 బిజెపిది తీసుకుని, అది వైసిపికి పోతుందన్నారు, 1 వైసిపిది తీసుకుని అది టిడిపికి పోతుందన్నారు. ఏతావతా టిడిపి బలం అలాగే ఉంటుంది కానీ బిజెపి నుంచి వైసిపి ఒక సీటు గెలుచుకుంటుంది. బిజెపితో విడిపోవడం వలన బిజెపి నష్టపోతోంది కానీ టిడిపి చెక్కు చెదరకపోగా, గతంలో కంటె ఇంకా ఎక్కువ సీట్లు తెచ్చుకుంటుందని చెప్పడమే సర్వే లక్ష్యంగా తోస్తోంది.

అసలు యిప్పుడు సర్వే ఎందుకు చేశారో అన్న అనుమానం వస్తోంది. ఎన్నికలు యింకా ప్రకటించలేదు. టిడిపి, బిజెపి పరస్పర ఆరోపణలు యింకా ఓ కొలిక్కి రాలేదు. విజయవాడ సెంట్రల్ వంటి నియోజకవర్గంలో 10% మంది యింకా ఎటూ తేల్చుకోలేదు. 'బాబు పాలనలో ఒక్కో ఏడాది పూర్తి కాగానే సర్వే చేస్తున్నాం, మూడేళ్ల పాలన అయ్యాక చేసి సరిగ్గా ఏడాది అయింది కాబట్టి యీ ఏడాదీ చేశాం' అనడానికి లేదు. జగన్ పాదయాత్రకు స్పందన వస్తోంది, ప్రత్యేక హోదా గురించి బాబును మాట్లాడేలా జగన్ చేస్తున్న ఒత్తిడి ప్రజలను ఆకర్షిస్తోంది అనే వాదన ఆంధ్రజ్యోతి వారిని కలవరపెట్టి ఉంటుంది. జనాలు వచ్చినంత మాత్రాన ఓట్లు పడతాయన్న గ్యారంటీ లేదని, ఓటు మేనేజ్‌మెంటు, బూత్ మేనేజ్‌మెంటు ప్రత్యేకమైన కళ అని, బాబుని ఆ విద్యలో మించడం ఓ పట్టాన సాధ్యం కాదనీ వాళ్లకీ తెలుసు. అయినా టిడిపి క్యాడర్‌లో ఒకపాటి కలవరం కలుగుతోందేమో. ఏం భయం లేదు, విజయలక్ష్మి మన పక్కనే ఉందని చెప్పడం తన ధర్మంగా జ్యోతివారు భావించి ఉండవచ్చు. లేకపోతే టిడిపికి కంచుకోటల్లాటి నియోజకవర్గాల్లో సర్వే నిర్వహించి, దాన్నే రాష్ట్రాని కంతటికీ అన్వయించి ప్రకటించడమేమిటి, విడ్డూరం కాకపోతే! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

**2018 జూన్ టాబ్లాయిడ్‌కై మెమరీ నెమరేస్తే... శీర్షికకై ఎమ్బీయస్: 'సోదరుడు' శివాజీ గణేశన్‌కు సావిత్రి కానుక**

శివాజీ గణేశన్‌కు అమితంగా పేరు తెచ్చిపెట్టిన సినిమా "వీరపాండ్య కట్టబొమ్మన్' (తెలుగు డబ్బింగులో – కట్టబ్రహ్మన్న). 1959లో రిలీజైన యీ సినిమాకు దర్శకనిర్మాత బి.ఆర్.పంతులు. కట్టబొమ్మన (1760–1799) తమిళనాడులో ఆనాటి మధుర సామ్రాజ్యంలో ఉన్న 72 పాలయాలలో తూత్తుకుడికి 18 కి.మీ.ల దూరంలో ఉన్న పాంచాలంకురిచి అనే చిన్న ప్రాంతానికి పాలెగాడు. ఈస్టిండియా కంపెనీవారు కప్పం కట్టమంటే కట్టనని తిరగబడితే అతడిని ఉరి తీశారు. అతని జీవితం గురించి పెద్దగా చారిత్రక ఆధారాలు లేవు. ఎవరి కల్పన వారిది. ఆ కథను వీధినాటకం రూపంలో శివాజీ చిన్నపుడు చూశాడు. సినిమా నటుడయ్యాక నాటకంగా రాయించుకుని తన శివాజీ నాటక మన్రం తరఫున 1957 నుంచి ప్రదర్శనలు యిచ్చేవాడు. వాటిలో ఒకదాన్ని చూసిన బిఆర్ పంతులు లార్జర్–దాన్–లైఫ్ పాత్రలతో, చరిత్రపరంగా కావలసినంత స్వేచ్ఛ తీసుకుని, భారీ తారాగణంతో టెక్నికలర్‌లో సినిమాగా తీస్తానని ముందుకు వచ్చాడు. "శివాజీ చిత్రనిర్మాణంలో పాలుపంచుకున్నాడు. కట్టబొమ్మన కథలో వెల్లయ్యదేవన్ అనే పాత్ర ఉంది. అతను కట్టబొమ్మనకు సేనాపతి, అత్యంత ఆత్మీయుడు, సాహసి. జల్లికట్టులో ఆంబోతును అడ్డగించి, వెల్లయ్యమ్మ అనే అందగత్తె (సినిమాలో పద్మిని) మనసు దోచి పెళ్లాడతాడు. కట్టబొమ్మనకు, ఈస్టిండియా కంపెనీకి జరిగిన యుద్ధంలో పోరు ముగిసాక ధర్మవిరుద్ధంగా ఒక ఆంగ్లసైనికుడు కాల్చిన తుపాకీ కారణంగా నేల కొరుగుతాడు. ఈ పాత్రను వేయమని శివాజీ ఆనాటి అగ్రశ్రేణి నటుల్లో ఒకడైన ఎస్.ఎస్.రాజేంద్రన్‌ను కోరాడు. రాజేంద్రన్ కూడా వీరుడి పాత్రలు వేసి ప్రజాదరణ పొందినవాడు. అయితే అతను అంగీకరించలేదు. "శివగంగై సీమై" సినిమాలో హీరోగా వేస్తున్నాను, కాబట్టి కుదరదు అన్నాడు.

"శివగంగై సీమై" కూడా చారిత్రాత్మక సినిమాయే. కట్టబొమ్మన కథతో లింకూ ఉంది. కట్టబొమ్మన తమ్ముడు ఊమైదురై (అసలు పేరు దురైసింగం) అన్నగారితో పాటు ఈస్టిండియా వారి జైల్లో శిక్ష అనుభవించి, అన్నగారి ఉరితీత తర్వాత 1801లో జైలు నుంచి పారిపోయి శివగంగ చేరి దాన్ని పాలిస్తున్న మరుదు సోదరులతో చేతులు కలిపాడు. వారికి యింకో యిద్దరు పాలెగాళ్లు తోడయ్యారు. అంతా కలిసి ఈస్టిండియా కంపెనీపై దండెత్తారు కానీ ఓడిపోయి, చివరకు 1801 అక్టోబరులో పట్టుబడ్డారు. మరుదు సోదరులతో బాటు ఊమైదురై 1801 నవంబరులో ఉరితీయబడ్డాడు. ఈ కథకు కణ్ణదాసన్ స్క్రిప్టు, పాటలు రాయడంతో బాటు కె.శంకర్ దర్శకత్వంలో సినిమా నిర్మించాడు. కథానాయకుడైన ముదలగు సెర్వయ్ పాత్ర రాజేంద్రన్ వేశాడు. "దానవీర శూరకర్ణ", "కురుక్షేత్రం" లా యీ రెండు సినిమాలకు సంబంధం ఉండడంతో ఒకదానికి మరొకటి పోటీగా తయారైంది. కణ్ణదాసన్ టీము కట్టబొమ్మన సినిమాపై విరుచుకుపడ్డారు. అతను పాండ్యసీమకు చెందినవాడే తప్ప పాండ్యుడు కాదని, తెలుగువాడని, మురుదు సోదరులైతే అచ్చమైన తమిళులని వాదించారు. ఆ మాట నిజమే. 1565లో విజయనగర సామ్రాజ్యం కూలిపోయాక ఆ సైన్యంలో ఉన్న తెలుగువారు అనేకులు దక్షిణాది ప్రాంతాలు (నేటి తమిళనాడు)కి వెళ్లి స్థిరపడ్డారు. కులప్రకారం చెప్పాలంటే కమ్మ, రెడ్డి, కంబళ కులాల సైనికులు జీవనోపాధి కోసం వెతుక్కుంటూ మెట్టప్రాంతాలకు వెళ్లి వ్యవసాయదారులుగా మారారు. తిరునల్వేలి జిల్లాలో వెనకబడిన ప్రాంతానికి వచ్చిన కంబళ కులానికి చెందిన రైతు కుటుంబానికి చెందినవాడు కట్టబొమ్మన. సినిమాలో అతని పాత్రలో శివాజీ తమిళంలో అద్భుతంగా డైలాగుల జడివాన కురిపించినా నిజజీవితంలో అతనికి పెద్దగా తమిళం రాదు, తెలుగులోనే మాట్లాడేవాడు. ఇవన్నీ ఈస్టిండియా కంపెనీ రికార్డుల్లో నమోదై ఉన్నాయి. కట్టబొమ్మన తెలుగుతనాన్ని ఎత్తిచూపడంతో ఆగకుండా కణ్ణదాసన్ అతను స్వాతంత్ర్యయోధుడు కానే కాడనీ, దొంగ అనీ కూడా అన్నాడు.

ఇవన్నీ శివాజీ గణేశన్‌కు చికాకు తెప్పించాయి. తన ఆత్మకథలో అతను 'ఇలాటి ధోరణి ఆనాడు ఉండడం బాధాకరం. దాని గురించి విపులంగా చెప్పడం అనవసరం. రాజేంద్రన్ వెల్లయ్యదేవన్ పాత్ర వేయననడంతో నేను జెమినీ గణేశన్‌ను వేయమని కోరాను. 'మీ సినిమా చిత్రీకరణంతా జయపూర్‌లో సాగుతుంది. నా భార్య సావిత్రి ప్రస్తుతం పూర్ణ గర్భవతి. తొలికాన్పు. నేను దగ్గర ఉండాలి. అందువలన మీ సినిమాలో వేయలేను.' అన్నాడు. సావిత్రి నన్ను సోదరుడిలా భావిస్తుంది. ఆ చనువుతో ఆమె వద్దకు వెళ్లి 'మీ ఆయన్ని ఆ పాత్ర వేయడానికి పంపించు. ఇది ఒక సోదరుడికి నువ్విచ్చే పెద్ద కానుక' అన్నాను. తను నా మాట మన్నించి జెమినీని జయపూర్ వెళ్లిరమ్మంది. మా అదృష్టమేమిటంటే, ప్రసవసమయానికి మేం జయపూర్‌లో సినిమా షూటింగు ముగించుకుని వచ్చేశాం. జెమిని ఆమె పక్కనే ఉన్నాడు.' అని రాశాడు.

రెండు సినిమాలు ఒకేసారి రిలీజయ్యాయి. తమిళప్రేక్షకులు తెలుగు–తమిళ మూలాల గురించి పట్టించుకోలేదు. కట్టబొమ్మన సిల్వర్ జూబ్లీ ఆడింది. తెలుగు డబ్బింగ్, "అమర్ షహీద్" (1960) పేరుతో రిలీజైన హిందీ డబ్బింగు కూడా బాగా ఆడాయి. 'ఎందుకు కట్టాలి కప్పం? నారు పోశావా? నీరు పోశావా?' వంటి శివాజీ కట్టబొమ్మన డైలాగులు నాటికీ నేటికీ కూడా హోరెత్తిస్తూనే ఉన్నాయి. ఈ సినిమాలో హీరోయిన్‌గా వేసిన ఎస్.వరలక్ష్మి "శివగంగై సీమై"లో కూడా హీరోయినే అయినా ఆ సినిమా ఫ్లాపైంది. కుముదం పత్రిక ఆ సినిమాను సమీక్షిస్తూ "ఈ సినిమాలో అందరికీ భారీగా మీసాలున్నాయి కాబట్టి "శివగంగై సీమై బదులు శివగంగై మీసై (మీసం)"గా పేరు పెడితే బాగుండేది." అని వెక్కిరించింది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

**2018 జూన్ టాబ్లాయిడ్‌కై మెమరీ నెమరేస్తే... శీర్షికకై ఎమ్బీయస్: దిలీప్–రాజ్ స్పర్ధ; వైజయంతిమాల వ్యథ**

1950లలో హిందీ చిత్రసీమలో పెద్ద హీరోలు – దిలీప్ కుమార్, రాజ్ కపూర్, దేవ్ ఆనంద్. దేవ్ హుందాగా తన పని ఏదో తను చేసుకున్నాడు కానీ రాజ్, దిలీప్‌ల మధ్య ఎప్పుడూ స్పర్ధ వుంటూ వచ్చింది. ఇద్దరూ పెషావర్‌కు చెందినవారే. 1923 డిసెంబరులో దిలీప్ పుడితే, 1924 డిసెంబరులో రాజ్ పుట్టాడు. ఇద్దరూ ఒకే స్కూల్లో చదువుకున్నారు. అయితే స్వభావాల్లో యిద్దరికీ చాలా తేడా ఉంది. దిలీప్ ముభావి, అంతర్ముఖుడు. ముడుచుకుపోయే స్వభావం. రాజ్ సరదా మనిషి, షో–మ్యాన్. సందడి చేయడం, తన

గురించి గొప్పలు చెప్పుకోవడం, పబ్లిసిటీ కోసం ఏమైనా చేయడం అతని అలవాటు. ఈ స్వభావాలు వారి నటనల్లో కూడా ప్రతిఫలించాయి. దిలీప్ ప్రేమికుడిగా, విషాద కథానాయకుడిగా రాణిస్తే, రాజ్ హాస్యంతో, ప్రజాసమస్యలు లేవనెత్తే కళాకారుడిగా రాణించాడు. 24 ఏళ్లకే రాజ్ దర్శకనిర్మాత అయిపోయాడు. స్టూడియో కూడా కట్టాడు. దిలీప్ దర్శకత్వంలో వేలుపెడుతూనే వున్నాడు కానీ తనను తాను దర్శకుడిగా ఎప్పుడూ ప్రకటించుకోలేదు. 37వ ఏట సినీనిర్మాత అయ్యాడు. ఒకే ఒక్క సినిమా. రాజ్‌కు చిన్నప్పుడే పెళ్లయింది. దిలీప్ 43 ఏళ్లకు కానీ పెళ్లి చేసుకోలేదు. అవివాహితుడు కావడం, తెరపై భగ్నప్రేమికుడిగా నటించడం చేత దిలీప్ మహిళా అభిమానులు విపరీతంగా ఉండేవారు. కామినీ కౌశల్, మధుబాల వంటి హీరోయిన్లు కూడా మినహాయింపు కాదు. రాజ్‌కు యీ విషయంలో అసూయ ఉండేది. ముఖ్యంగా కథానాయిక నర్గీస్ విషయంలో.

రాజ్ హీరోగా నిలదొక్కుకునే నాటికే నర్గీస్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. తను హీరోగా, సొంత దర్శకత్వంలో "ఆగ్" (1948) సినిమా నిర్మిస్తూ రాజ్ నర్గీస్‌ను తన పక్కన వేయమని కోరాడు. ఆమె అప్పటికే దిలీప్ సరసన "అనోఖా ప్యార్" (1948), "మేలా" (1948)లలో నటిస్తోంది. మెహబూబ్ ఖాన్ తీసిన "అందాజ్" (1949) వీళ్లు ముగ్గురూ వేశారు. నర్గీస్‌ను మూగగా ఆరాధించిన ప్రేమికుడిగా దిలీప్ వేస్తే, ఆమెను అపార్థం చేసుకునే భర్తగా రాజ్ వేశాడు. ముకేశ్ పాటలన్నీ దిలీప్ మీదే చిత్రీకరించారు. ప్రేక్షకుల సింపతీ ఎటు వుంటుందో సులభంగా ఊహించుకోవచ్చు. రాజ్‌కు యిది నచ్చలేదు. నర్గీస్ పక్కన తనే కనబడాలని కోరుకున్నాడు. తెర మీదా, తెర వెనుకా తమ జంట ప్రాజెక్టు కావాలని ఆశించాడు. "ఆగ్" ఓ మాదిరిగా ఆడినా భారీ బజెట్‌తో "బర్సాత్" (1950) ప్లాన్ చేశాడు. అది సూపర్ హిట్ కావడంతో దాని వెంటనే "ఆవారా" (1951) తీశాడు. ఓ పక్క నర్గీస్ దిలీప్‌తో "జోగన్" (1950), "బాబుల్" (1950), "హల్‌చల్" (1951), "దీదార్" (1951) వేస్తోంది. కానీ బర్సాత్ సినిమా షూటింగు టైములో రాజ్‌తో ప్రేమలో పడింది. ఆమె తల్లి అభ్యంతరపెట్టింది కానీ "ఆవారా" తీస్తూండగా ఆమె మరణించింది. తండ్రి అంతకుముందే చనిపోవడంతో నర్గీస్‌పై ఆంక్షలు పెట్టేవారు లేకపోయారు. ఇక 1952 నుంచి 1956 వరకు ఆమె వరుసగా రాజ్‌తోనే నటించసాగింది. సొంత సినిమాలైన "ఆహ్", "శ్రీ 420" లోనే కాదు, బయట నిర్మాతలు తీసిన "అన్‌హోనీ", "అంబర్", "ఆశియానా", "ధూన్", "పాపి", "చోరీచోరీ"లలో కూడా వేసింది. ఈ మధ్యలో దిలీప్‌తో వేసినది "శికస్త్" (1953) ఒక్కటే. ఆ విధంగా రాజ్ నర్గీస్‌ను దిలీప్ క్యాంప్‌ను విజయవంతంగా గుంజుకోగలిగాడు. తనూ దేవదాసు తరహా పాత్రలో మెప్పించగలనని అదే తరహా కథతో చూపించుకోవడానికి "ఆహ్" తీశాడు. దాని తెలుగు, తమిళ వెర్షన్లు హిట్ అయ్యాయి కానీ హిందీ సినిమా ఫ్లాపయింది. దీని తర్వాత దిలీప్ హీరోగా "దేవదాస్" (1956) వస్తే అది హిట్టయింది.

అయితే రాజ్, నర్గీస్ బంధం ఎక్కువకాలం కొనసాగలేదు. "చోరీచోరీ" (1956) సినిమా షూటింగుకై వెళ్లినపుడు రాజ్, దక్షిణాది హీరోయిన్ పద్మినితో ఒకే గదిలో పట్టుబడ్డాడు కాబట్టి నర్గీస్ కోపగించుకుంది అంటారు. అది కాకపోయినా రాజ్ ఓ పక్క తన కుటుంబజీవితం కొనసాగిస్తూనే, తనను బహిరంగంగా పెళ్లాడకుండా, తమ రొమాన్సును సినిమాలను ప్రమోట్ చేసుకోవడానికి వాడుకుంటున్నాడని ఆమె అభిప్రాయపడింది. "మదర్ ఇండియా" (1957)లో తనకు కొడుకుగా నటించిన సునీల్ దత్‌ను పెళ్లాడి, రాజ్‌కు గుడ్‌బై చెప్పేసింది. దాదాపు సినిమా రంగానికి దూరమైంది. నర్గీస్ తన పక్కన వేయడం మానేశాక దిలీప్ నిమ్మి ("ఆన్", "దాగ్", "ఉడన్ ఖటోలా") మధుబాల ("తరానా", "సంగ్‌దిల్", "మొఘల్ ఏ ఆజమ్") మీనాకుమారి ("ఫుట్‌పాత్", "అమర్", "ఆజాద్") లతో సినిమా చేశాడు. "దేవదాస్" సినిమాలో చంద్రముఖి పాత్ర వేయడానికి వచ్చిన వైజయంతిమాల అతని దృష్టిని ఆకర్షించింది. వైజయంతి తమిళ, తెలుగు సినిమాలలో నటిస్తూనే "బహార్" (1951), "లడ్కీ" (1953), "నాగిన్" (1954), "మిస్ మాలా" (1954), "యాస్మిన్" (1955)లలో నటించింది. ఈ సినిమాల్లో ఆమె పక్కన వేసిన హీరోలు కిశోర్ కుమార్, ప్రదీప్ కుమార్, సురేశ్, కరన్ దివాన్ అంతగా పేరున్నవారు కారు. అందం, స్ఫురద్రూపం, అభినయం, నాట్యకౌశలం అన్నీ కలబోసిన వైజయంతి దిలీప్‌ను ఆకర్షించింది. "నయా దౌర్" (1957) సినిమా నిర్మాణసమయంలో మధుబాల తండ్రికి, దర్శకనిర్మాత బిఆర్ చోప్డాకు తగాదా వచ్చింది. సినిమా ఔట్‌డోర్‌లో తీస్తానని ముందుగానే నిర్మాత చెపితే సరేనని ఒప్పుకున్న మధుబాల తండ్రి, షూటింగు ప్రారంభమయ్యాక కుదరదని పేచీ పెట్టాడు. ఎందుకంటే దిలీప్, మధుబాల మధ్య నడుస్తున్న రొమాన్సు ఔట్‌డోర్ షూటింగు సందర్భంగా యింకాస్త ముందుకు వెళ్లి కూతురు తనను విడిచి వెళ్లిపోతుందన్న భయం అతనిది. దాంతో చోప్డా మధుబాలపై కేసు పడేసి, ఆమెకు బదులుగా ఎవర్నీ తీసుకుందామా అని ఆలోచించాడు. దిలీప్ వైజయంతి పేరు సూచించాడు.

కేసు విచారణ సమయంలో దిలీప్ మధుబాలే మాట తప్పిందని, మధుబాలకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాడు. దాంతో వాళ్లిద్దరి మధ్య మాటలు పోయాయి. అయినా అప్పటికే ఒప్పుకున్న "మొఘల్ ఏ ఆజమ్"లో వారు తెరపై శృంగారాన్ని అద్భుతంగా పండించారు. ఆ తర్వాత కలిసి నటించలేదు. "నయా దౌర్" సూపర్ హిట్ కావడంతో దిలీప్, వైజయంతి జంట పాప్యులర్ అయింది. "మధుమతి" (1958), "పైఘామ్" (1959)లలో కూడా యిదే జంట విజయవంతమైంది. "యహూదీ" (1958), "కోహినూర్" (1960)లలో తన సరసన మీనా కుమారి నటించి, అవి హిట్టయినా, దిలీప్ సొంతంగా "గంగా జమునా" (1961) సినిమా నిర్మాణం తలపెట్టినపుడు వైజయంతినే హీరోయిన్‌గా తీసుకున్నాడు. బందిపోటుగా మారిన అన్నకు, పోలీసు ఆఫీసరైన తమ్ముడికి మధ్య ఘర్షణ ఆ సినిమా యితివృత్తం. తర్వాతి రోజుల్లో ఎన్నో సినిమాలు దానికి నకలుగా వచ్చినా ఆ సినిమాకు మాత్రం అనేక సెన్సారు కష్టాలు వచ్చాయి. 50 కట్స్ చెప్పారు. అలా అయితే సినిమా ధ్వంసమై పోతుందని బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిగా ఉన్న కేస్కర్ వద్ద మొత్తుకున్నా ఆయన వినలేదు. చివరకి దిలీప్ నెహ్రూ దగ్గరకు వెళ్లి చెప్పుకుంటే సినిమా రిలీజైంది. దీని కంతా ఒక ఏడాది పట్టింది. అదే సమయంలో రాజ్ కపూర్ పద్మిని హీరోయిన్‌గా "జిస్ దేశ్ మే( గంగా బహతీ హై" సినిమాను తీశాడు. అది చంబల్ లోయలోని బందిపోట్లను సంస్కరించే థీమ్‌తో తయారైంది. నలుపు, తెలుపు సినిమా. గంగా జమునా రంగుల్లో తీసినది. పద్మిని కన్న వైజయంతి హిందీ

ప్రేక్షకులకు సుపరిచితురాలు. దిలీప్ సినిమా ముందుగా రిలీజైతే తన సినిమా దెబ్బ తింటుందనే భయంతో రాజ్ తన పలుకుబడి ఉపయోగించి "గంగా.."కు యిబ్బందులు కలిగించాడనే పుకారు ఎవరు నమ్మినా నమ్మకపోయినా దిలీప్ నమ్మాడు. చివరకు "జిస్ దేశ్.." విడుదలయ్యాకే "గంగా.." విడుదలైంది. రెండూ సూపర్ హిట్ అయ్యాయి.

అప్పట్లో ఫిల్మ్‌ఫేర్ అవార్డులకు చాలా విలువ ఉండేది. తన సినిమాకు అవార్డులు చాలా వస్తాయని దిలీప్ ఆశించాడు. కానీ డైలాగ్సుకి, సినిమాటోగ్రఫీకి, ఉత్తమ నటిగా వైజయంతికి మాత్రం వచ్చాయి. "జిస్ దేశ్.."కైతే ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడులతో బాటు ఎడిటింగ్, ఆర్ట్ డైరక్షన్‌కు కూడా వచ్చాయి. దీనిలోనూ రాజ్ మేనేజ్‌మెంట్ ఉందని దిలీప్‌కు సందేహం. ఇలా ఉండగా దక్షిణాది నిర్మాతలు "పెళ్లికానుక" సినిమాను "నజరానా" (1961)గా హిందీలో తీస్తూ హీరోహీరోయిన్లగా రాజ్ కపూర్, వైజయంతిలను తీసుకున్నారు. మద్రాసులో షూటింగు సందర్భంగా వైజయంతిని చూసి రాజ్ యింప్రెస్ అయ్యాడు. గతంలో నర్గీస్ లాగానే యీమెను కూడా దిలీప్ నుండి లాగేసుకుంటే...? అనుకున్నాడు. తన మనసులో మెదలుతున్న "సంగమ్" కథాంశాన్ని చెప్పాడు. ఓ సారి దిలీప్‌తో "అందాజ్‌నే కొద్దిగా మార్చి "సంగమ్" పేరుతో మళ్లీ తీద్దామనుకుంటున్నాను. నర్గీస్‌కు బదులు వైజయంతి ఉంటుందంతే. నువ్వు ఏ పాత్ర వేస్తానన్నా ఓకే." అని ఆఫర్ యిచ్చాడు. "నువ్వు హీరోగా నైనా తప్పుకో, లేదా దర్శకుడిగానైనా తప్పుకో. అప్పుడు వేస్తాను." అన్నాడు దిలీప్. దానికి రాజ్ ఒప్పుకోలేదు. చివరకి రాజేంద్ర కుమార్‌ను తీసుకున్నాడు. పద్మినితో రాజ్ అనుబంధం ఎక్కువగా సాగలేదు. "ఆషిక్" (1962)లో మాత్రం జంటగా వేశారు. (తర్వాత ఎప్పుడో "మేరా నామ్ జోకర్" (1970)లో తీసుకున్నాడు). "సంగమ్" సినిమా షూటింగు విదేశాల్లో కూడా జరగడంతో నిర్మాణం చాలా ఏళ్లు పట్టింది. ఈ లోపున రాజ్ పబ్లిసిటీ డిపార్టుమెంటు వాళ్లు వైజయంతిని రాజ్ కొత్త ప్రేయసిగా ప్రొజెక్ట్ చేయసాగారు.

ఇదంతా దిలీప్‌కు చిర్రెత్తించింది. అప్పటికే అతను వైజయంతితో కలిసి "లీడర్" సినిమాలో నటిస్తున్నాడు. దిలీప్‌ను ముందు నుంచి ప్రోత్సహిస్తూ వచ్చిన ఫిల్మిస్తాన్ శశధర్ ముఖర్జీ, తన కొడుకు రామ్ దర్శకత్వంలో ఆ సినిమాను ప్లాన్ చేశాడు. రాజకీయాలు, నిర్భయుడైన జర్నలిస్టు, హత్య.. యిత్యాది అంశాలతో కథ నడుస్తుంది. బోల్డు పాటలు. విషాదమూర్తిగా తనకున్న యిమేజి చెరిపేసుకోవడానికి కామెడీ కూడా ప్రయత్నించాడు దిలీప్. ఇవన్నీ చాలనట్లు స్క్రిప్టు విపరీతంగా దిద్దడమే కాకుండా, అందరి ఎదుటా డైరక్షన్ కూడా మొదలుపెట్టేశాడు. దానితో యీ సినిమా షూటింగూ లేటయింది. వైజయంతి యీ రెండు సినిమాల మధ్య విపరీతంగా నలిగింది. పంతం కొద్దీ యిద్దరూ ఒకేసారి డేట్స్ అడిగేవారు. అవతలి సినిమాకు ఎక్కువ ప్రాధాన్యత యిస్తున్నావని ఆరోపించేవారు. ఈ గొడవలకు తోడు రాజ్ పబ్లిసిటీ శాఖ వారు రాజ్-వైజయంతి సాన్నిహిత్యాన్ని ప్రజల మెదళ్లలో నాటుకునేందుకు కథనాలు పుట్టించసాగారు. వైజయంతి మైసూరు మహారాజు కూతురని, ఆర్కె స్టూడియోలోని రాజ్ కుటీరంలో వైజయంతి రాత్రుళ్లు గడుపుతోందని.. యిలా అనేక కథలు. ఇవన్నీ వాళ్లు పుట్టించినవే తప్ప వాస్తవాలు కాదు అని వైజయంతి తన ఆథరైజ్‌డ్ బయాగ్రఫీలో చెప్పుకుంది. 'వాస్తవం కాకపోవడమేం? ఆ సమయంలో మా నాన్నపై అలిగి మా అమ్మ నాలుగున్నర నెలలు హోటల్లో ఉంది కూడా' అంటాడు ఋషి కపూర్. ఏమైతేనేం, "సంగమ్" రిలీజై సూపర్ హిట్ అయింది. అదే ఏడాది రిలీజైన "లీడర్" ఫ్లాపయింది. ఇది దిలీప్‌ను మండించింది.

"లీడర్" నిర్మాణంలో ఉండగానే అతని యింకో సినిమా ఎఆర్ కర్దార్ అనే దర్శకనిర్మాతగా "దిల్ దియా దర్ద్ లియా" (1966) ప్రారంభమైంది. దిలీప్ హీరోయిన్‌గా వహీదా రెహమాన్ పేరును సూచించాడు. కథను దిలీప్ చిత్తం వచ్చినట్లు మార్చేసి, డైరక్షన్ తనే చేపట్టి సినిమాను ఘోరంగా ఫ్లాపవడానికి కారకుడయ్యాడు. అయినా "రాముడు-భీముడు" సినిమాను హిందీలో "రామ్ ఔర్ శ్యామ్"గా తీస్తూ నాగిరెడ్డి దిలీప్‌నే ఎంచుకున్నారు. హీరోయిన్లగా వైజయంతి, మాలా సిన్హా (దరిమిలా ఆమె స్థానంలో ముంతాజ్ వచ్చింది)లను తీసుకున్నారు. డైరక్టరుగా చాణక్య పేరున్నా దిలీపే డైరక్షన్ చేయడంతో కోపం వచ్చి వైజయంతి కొన్ని రోజుల షూటింగు తర్వాత సినిమా నుంచి తప్పుకుందని డివి నరసరాజుగారు తన పుస్తకంలో రాశారు. బహుశా నాగిరెడ్డి అదే చెప్పి ఉంటారు. కానీ వైజయంతి తన ఆత్మకథలో దిలీపే తనను తీయించేశాడని రాసింది. నిజానికి ఆ పాటికి ఆమె రాజ్ వ్యక్తిగత వైద్యుడైన డా.బాలితో ఉంటూ దరిమిలా పెళ్లి చేసుకుంది. అయినా ఒకప్పుడు తనను విడిచి రాజ్ క్యాంప్‌కి ఫిరాయించిందనే కోపం దిలీప్‌లో ఉంది. 8 రోజుల ఒక షెడ్యూల్ పూర్తి చేసుకుని బొంబాయి వెళుతూండగా నాగిరెడ్డి మేనేజర్ వచ్చి తర్వాతి డేట్స్ ఎప్పుడు యిస్తారో రాతపూర్వకంగా యివ్వండి అని అడిగాడు. నేను యిప్పుడు ఏ సంతకాలూ పెట్టనని చెప్పి వైజయంతి విమాన మెక్కింది. విమానంలో ఆమెతో "నజరానా", "సూరజ్" తీసిన నిర్మాత వీనస్ కృష్ణమూర్తి కనబడ్డాడు. ఇదేమిటి యిలా అడుగుతున్నారు అని ఆయనతో చెపితే 'నీకు తెలియదా? నిన్ను తీసేసి వహీదాను పెట్టేశారు' అన్నాడాయన. బొంబాయి రాగానే వైజయంతి ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న మన్‌మోహన్ కృష్ణకు ఫిర్యాదు చేసింది. ఆయన నాగిరెడ్డికి నోటీసు పంపడంతో సినిమాపై స్టే వచ్చింది. మర్నాడే నాగిరెడ్డి మేనేజర్ బొంబాయి వచ్చి క్షమాపణలు చెప్పి, ఒప్పుకున్న డబ్బంతా చెల్లించి వెళ్లాడు.

ఈ సినిమాలోనే కాదు, దిలీప్ "గుడిగంటలు" హిందీ వెర్షనైన "ఆద్మీ" (1968) సినిమాకు కూడా వహీదాను సూచించాడు. ఒకప్పుడు ఎంతో సన్నిహితంగా మెలగిన వైజయంతి, దిలీప్ శత్రువులై పోయారు. వారిద్దరూ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న "సంఘర్ష్" (1968) నిర్మాణం ఆగిపోయింది. భారీ తారాగణం. హీరోయిన్‌ను మార్చే సావకాశం లేదు. దర్శకుడు రవైల్ యిద్దరి దగ్గరకు వచ్చి మొత్తుకున్నాడు. చివరకు సినిమా షూటింగు పున:ప్రారంభమైంది – అదీ శృంగార సన్నివేశంతో. ఏమవుతుందో చూడాలని జర్నలిస్టులంతా వచ్చారు. దిలీప్, వైజయంతి యిద్దరూ ప్రొఫెషనల్సే కాబట్టి, కెమెరా ముందు ప్రేమికులుగా అద్భుతంగా నటించారు. లైట్లు ఆఫ్ చేయగానే పలకరింపులు లేవు. సినిమా పూర్తయి 1968లో రిలీజై ఓ మాదిరిగా ఆడింది. ఆ తర్వాత వైజయంతి దిలీప్‌తో కానీ రాజ్‌తో మళ్లీ నటించలేదు, స్నేహం పెట్టుకోలేదు. దేవ్ ఆనంద్, ఉత్తమ్ కుమార్, శమ్మీ కపూర్, ధర్మేంద్ర, రాజేంద్ర కుమార్‌లతో

నటించి 1970లో సినిమాలు మానేసింది. "దీవార్"లో తల్లి పాత్ర ఆఫర్ వచ్చినా చేయలేదు. కథానాయకిగానే రిటైరై, నృత్యప్రదర్శనలు యిస్తూ యిప్పటికీ చురుగ్గానే ఉంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

**2018 జూన్ ఎమ్బీయస్: పూరీ గుడి తాళంచెవి మిస్టరీ**

తిరుపతి గుడిలో స్వామివారి ఆభరణాలన్నీ భద్రంగా ఉన్నాయా లేదా అని మన దగ్గర అనుమానాలు చెలరేగిన సమయంలోనే పూరీ జగన్నాథుని నగల గురించి కూడా భక్తుల్లో ఆందోళన ప్రారంభమైంది. భక్తులతో పాటు, ఆ గుడి ధర్మకర్తలైన గజపతి మహారాజులు గుడికి ఎన్నో విలువైన కానుకలు సమర్పించారు. అనంగ భీమదేవుడనే రాజు ఆ రోజుల్లోనే 1457 కిలోల బంగారపు ఆభరణాలు యిచ్చాడట. 1466లో కపిలేంద్ర దేవ్ గజపతి కూడా ఎన్నో ఆభరణాలు యిచ్చాడట. గుడి రికార్డుల ప్రకారం 1952లో 150 రకాల వివిధ ఆభరణాలు ఉన్నాయట. గుడిలో 7 గదులున్న రత్న భండారం అనే చోట వీటిని భద్రపరచారు. వాటిలో మూడు గదులు వాడుతూంటారు. స్వామివారి నిత్యసేవకు ఉపయోగించే ఆభరణాలు యీ మూడు గదుల్లో పెట్టారు. తక్కిన గదులకు తాళాలు వేసి వుంటాయి. బయటి ద్వారానికి మూడు తాళం చెవులుంటాయి. వాటిలో ఒకటి గజపతి వంశీకుల వద్ద, ఒకటి దేవాలయ బోర్డు – శ్రీ జగన్నాథ టెంపుల్ ఎడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జెటిఎ) వద్ద, మూడోది ప్రభుత్వాధికారి ఐన పూరీ జిల్లా కలక్టరు వద్ద ఉంటాయి. లోపలి ద్వారానికి కూడా యిలాటి ఏర్పాటే ఉంది కానీ 1960లో గజపతుల నుంచి ఆలయనిర్వాహణ ఒడిశా ప్రభుత్వం తీసేసుకున్నాక ఆయన వద్ద మూడో తాళం చెవి లేదు. కలక్టరు, ఎసిజెటిఎ మధ్యే ఉంటోంది. ప్రభుత్వం స్వాధీనం చేసుకునేటప్పుడు ప్రతీ ఆర్నెల్లకు భండారం తెరుస్తామని, మూడేళ్ల కోసారి ఎస్‌జెటిఎ కమిటీ మారినప్పుడల్లా జాబితా తయారు చేస్తూంటామని లిఖితపూర్వకంగా ఒప్పందం చేసుకుంది. కానీ అలా జరగలేదు. 1964లో ఒకసారి భండారం తెరిచి, లోపల ఏమున్నాయో జాబితా తయారుచేశారు. ఆ తర్వాత 1978లో చేశారు. 1984లో ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ) అధికారులతో కలిసి తలుపులు తీయబోయారు. రెండు తలుపులు తెరిచేసరికి లోపల్నుంచి విషసర్పాల బుసబుసలు వినబడడంతో అందరూ అదిలిపోయారు. భాండారం తరచుగా తెరవడం జగన్నాథుడికి యిష్టం వుండదని, తెరిస్తే యిక్కట్లు వస్తాయనే నమ్మకం ఒకటి ప్రచారంలో ఉంది. దాంతో ఎందుకొచ్చిన గొడవ అని భాండారం సాంతం తెరవకుండా ఊరుకున్నారు. ఆ తర్వాత కూడా అదే భయంతోనో, మరే కారణంతోనో తెరవలేదు.

కాలక్రమేణా గుళ్లు శిథిలం కావడం సహజం కాబట్టి భాండారం స్థితిగతులు ఎలా ఉన్నాయో ఎఎస్ఐ సాయంతో పరిశీలించమని ఒడిశా హైకోర్టు ఈ మార్చిలో ఆదేశించింది. కోర్టు ఉత్తర్వు అమలు చేయడానికి ఎస్‌జెటిఎ తమ వద్దనున్న తాళం చెవి బయటకు తీసి, కలక్టరు ఆఫీసులో ఉన్న 25 అంగుళాల పొడవున్న యిత్తడి తాళం చెవి పట్టుకురమ్మనమని కలక్టరుకి కబురు పెట్టింది. అయితే వాళ్ల వద్ద ఉండవలసిన చెవి కనబడలేదు. వెంటనే పోలీసు రిపోర్టు యివ్వాల్సింది, కానీ యివ్వలేదు. ఏదోలా నాటకం ఆడేద్దామనుకున్నారు. ఏప్రిల్ 4న ఎస్‌జెటిఎ, ఎఎస్ఐ, ప్రభుత్వాధికారులు కొందరు మొత్తం 17 మంది టీముగా ఏర్పడి గుళ్లో తిరిగారు. ఆ తర్వాత ఎస్‌జెటిఎకి చీఫ్ ఎడ్మినిస్ట్రేటర్ (మన టిటిడి ఇఓ లాటివాడు)గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రదీప్ జేనా బయటకు వచ్చి పత్రికల వాళ్లతో "మేం సెర్చిలైట్ల సాయంతో నిర్మాణాలను బయటనుంచి పరిశీలించాం. అంతా బాగానే ఉంది. రత్నభండారంలోకి ప్రవేశించ వలసిన అవసరం ఏమీ కనబడలేదు." అని చెప్పాడు. అందరికీ వింతగా తోచింది కానీ ఎవరూ ఏమీ అనలేదు. అయితే జూన్ మొదటివారంలో కలక్టరాఫీసులో ఉండవలసిన చెవి కనబడకపోవడం చేతనే అలా చెప్పారని బయటకు పొక్కింది. దాంతో పెద్ద గొడవ అయింది. రత్న భండారాన్ని ఎవరైనా కొల్లగొట్టారా అనే సందేహాలు వచ్చాయి. రాష్ట్రప్రభుత్వం బాధ్యత వహించాలని, సిబిఐ విచారణ చేయించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

అసలేం జరిగిందో తేల్చడానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జూన్ 6న రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ రఘువీర్ దాష్ నేతృత్వంలో కమిటీ వేసి మూణ్నెళ్లలో రిపోర్టు యిమ్మన్నాడు. వ్యవహారాన్ని రిపోర్టు చేయకుండా తొక్కిపెట్టిన ప్రదీప్ జేనాను జూన్ 11న తొలగించి, ఆయన స్థానంలో ప్రదీప్త మహాపాత్రను వేశాడు. ఇంకో రెండు రోజులకు జూన్ 13న తాళం చెవి దొరికిందంటూ జిల్లా కలక్టరు అరవింద్ అగర్వాల్ ప్రకటించాడు. 'అది ఎక్కడుందో వెతకమని నలుగురు సభ్యుల టీముని వేశాం. వాళ్లు జిల్లా ట్రెజరీ ఆఫీసులోని రికార్డు రూములో ఒక కవర్లో అది ఉందని కనుగొన్నారు' అన్నాడు. అయితే చిక్కు ఎక్కడ వచ్చిందంటే దానికి 'డూప్లికేట్' అని ఒక ట్యాగ్ కట్టి ఉంది. "ఒరిజినల్‌ని ఏం చేశారు?" అని కాంగ్రెసు, బిజెపి నాయకులు గర్జించడంతో యిది మళ్లీ కొత్త వివాదానికి దారి తీస్తుందని భయపడిన న్యాయశాఖా మంత్రి ప్రతాప్ జేనా "1984లో రత్న భండారాన్ని తెరిచినప్పుడు కూడా దీన్నే వాడారు" అని ప్రకటించాడు. "ఏది ఏమైనా కమిటీయే అన్ని విషయాలు బయటకు తీస్తుంది." అని చేర్చాడు. ప్రభుత్వం కమిటీ యొక్క విచారణాంశాలను విస్తరింపజేసింది. తాళం చెవుల సంరక్షణ, వాడకం విషయంలో వ్యక్తుల/సంస్థల/అధికారుల పాత్రను, లోపాలను కూడా తరచి చూడమని కోరింది. జస్టిస్ దాష్ అధికారులు, మహంతుల నుంచే కాకుండా ప్రజల నుంచి అఫిడవిట్లు కోరుతున్నారు. జులై 25 లోగా తనకు అందివ్వాలని, జులై 30న మొదటి సమావేశం నిర్వహిస్తానని అంటున్నారు.

ఆ నివేదిక బయటకు వస్తేనే దీని వెనుక ఉన్న 'జగన్నాటకం' లోకవిదితమవుతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018)**

**2018 జూన్ ఎమ్బీయస్: గోవాలో పడకేసిన పాలన లేస్తుందా?**

గోవా ముఖ్యమంత్రి మనోహర్ పర్రీకర్ (63) విదేశాల నుంచి తిరిగి వచ్చాడు కాబట్టి యిప్పటికైనా గోవాలో ప్రభుత్వం పట్టాలెక్కుతుందని ఆశించాలి. కానీ మనోహర్‌లో మునపటి ఆరోగ్యం లేదు కాబట్టి అతను వ్యవహారాలు ఎలా చక్కబెడతాడా అని వేచి చూడాల్సిందే. గోవాలో బిజెపికి మనోహర్ తప్ప మరో నాయకుడు కానరావటం లేదు. అతన్ని ఢిల్లీకి రప్పించి కేంద్రమంత్రిని చేస్తే, వేరే అతన్ని ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోబెడితే గోవాలో పాలన అస్తవ్యస్తమైంది. చివరకు ఎన్నికల వేళ 40 సీట్ల ఎసెంబ్లీలో కాంగ్రెసు కంటె 4 సీట్లు తక్కువగా 13 వచ్చాయి. వెంటనే మనోహర్‌ను పంపితే అతను తన చాకచక్యమంతా ఉపయోగించి, 3 సీట్లున్న మహారాష్ట్ర వాదీ గోమంతక్ పార్టీ (ఎంజిపి), 3 సీట్లున్న గోవా ఫార్వర్డ్ పార్టీ (జిఎఫ్‌పి)లను కలుపుకుని సంకీర్ణ ప్రభుత్వం ఏర్పరచాడు. ఏదోలా వ్యవహారం గడుపుకుని వస్తూ ఉంటే ఫిబ్రవరి నెలలో అతనికి కడుపులో ఏదో బాధ మొదలై ముంబయిలో లీలావతీ హాస్పటల్లో చూపించుకున్నాడు. పాన్‌క్రియాస్‌కు కాన్సర్ సోకిందని, బాగా ముదిరిపోయిందని, అమెరికాలో చికిత్స చేయించుకోవాలని డాక్టర్లు చెప్పారు. ఉపముఖ్యమంత్రి ఉంటే అతనికి బాధ్యతలు అప్పగించేవాడు కానీ అలా ఎవరూ లేరు. తన పార్టీలో ఫ్రాన్సిస్ డిసౌజాకు అప్పగిస్తే భాగస్వామ్య పక్షాలు ఊరుకోవు. పోనీ సీనియర్, ఎంజిపికి చెందిన పిడబ్ల్యుడి మంత్రి సుదీన్ ధావ్లీకర్‌కో, జిఎఫ్‌పికి చెందిన వ్యవసాయ మంత్రి విజయ్ సర్దేశాయికో అప్పగిద్దామంటే ముఖ్యమంత్రి పదవికి పోటీ పడుతున్న వారిద్దరికీ అస్సలు పడదు. దాంతో వాళ్లిద్దరితో పాటు డిసౌజాను కూడా చేర్చి సెంట్రల్ ఎడ్వయిజరీ కమిటీ అని ఏర్పరచి తన గైరుహాజరీలో నిర్ణయాలు తీసుకునే అధికారం వాళ్లకు అప్పగించి అమెరికాకు వెళ్లాడు.

ముగ్గురి మధ్యా ఎన్నడూ లేని అవగాహన యిప్పుడు మాత్రం ఎలా వస్తుంది? వాళ్లు సమావేశం కావటం అరుదై పోయింది. మరి పాలన ఎలా సాగుతుంది? సాగడం లేదని, నిర్ణయాలన్నీ ఆగిపోయాయనీ కాంగ్రెసు ఆందోళన చేయసాగింది. అవతల మనోహర్‌కు అమెరికాలో కాన్సర్ చికిత్స సాగుతోంది. ఎప్పుడు తిరిగివస్తాడో తెలియని పరిస్థితి. కాంగ్రెసు మాటలు ప్రజలు నమ్మేస్తారేమోనని భయపడి బిజెపి 'ముగ్గురు సభ్యులు కలిసి కూర్చోకపోయినా విడివిడిగా అమెరికాలోని ముఖ్యమంత్రితో ఈమెయిల్ ద్వారా డైరక్టుగా టచ్‌లో ఉన్నారనీ, ఆయన సూచనల ప్రకారమే ప్రభుత్వాన్ని నడుపుతున్నార'నీ చెప్పసాగింది. ఇంతలో డిసౌజాకు ఏం పుట్టిందో ఏమో 'నేను నెల్లాళ్ల సెలవుపై పోర్చుగల్‌కు విహారయాత్రకై వెళుతున్నాను' అని వెళ్లిపోయాడు. జోక్ ఏమిటంటే వెళుతూ వెళుతూ తన మంత్రిత్వ శాఖలను అమెరికాలో ఉన్న ముఖ్యమంత్రికి అప్పగిస్తున్నానని ప్రకటించడం! ఇది చాలనట్లు ఒక హై ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టును ఒక రియల్ ఎస్టేటు బిల్డర్‌కు అనువుగా మారుస్తున్నారని, బ్యాకప్ సరిగ్గా పెట్టుకోకపోవడం చేతనే ఉత్తర గోవాలో ఒక వారం రోజుల పాటు కరంటు సరఫరా లేకుండా పోయిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న సమయంలోనే బిజెపి విద్యుత్ మంత్రి పాండురంగ్ మద్కైకర్‌కు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. ముంబయి హాస్పటల్‌లో చేరాడు.

కాబినెట్‌లో ఉన్నదే 12 మంది. హెూం, ఫైనాన్స్, జనరల్ ఎడ్మినిస్ట్రేషన్ చూసే ముఖ్యమంత్రి అమెరికాలో. అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రి డిసౌజా పోర్చుగల్‌లో. విద్యుత్ శాఖామాత్యుడు పాండురంగ్ హాస్పటల్లో. కాగితాలు కదులుతున్నాయంటే ఎవరు నమ్ముతారు? ఈ పరిస్థితుల్లో మనోహర్ తనకు ఆత్మీయులైన జర్నలిస్టులు నలుగురికి అమెరికా నుంచి ఫోన్ చేసి పలకరించాడు. రాష్ట్రంలో జరుగుతున్న సంగతులన్నీ టెలిఫోన్ ద్వారా తను అక్కణ్నుంచే పర్యవేక్షిస్తున్నానని, డాక్యుమెంట్లు స్కాన్ చేసి తనకు ఈమెయిల్లో పంపిస్తున్నారనీ చెప్పుకున్నాడు. అయితే కాంగ్రెసు యిదంతా కొట్టి పడేసింది. ముఖ్యమంత్రి ఈమెయిల్‌ను ఆఫీసర్లు గోవాలోనే ఆపరేట్ చేస్తున్నారని ఆరోపించింది. గోవాకు పని చేసే ప్రభుత్వమూ, పూర్తి స్థాయి ముఖ్యమంత్రి కావాలని నినాదాలు యిచ్చింది. కాబినెట్ సమావేశం జరిగి మూణ్నెళ్లు దాటింది కాబట్టి యీ అసాధారణ పరిస్థితికి పరిష్కారం కనుగొనమని రాష్ట్రపతికి అభ్యర్థన పంపుతున్నామని కాంగ్రెసు అంది.

చికిత్స పూర్తయిందో లేదో తెలియదు కానీ యింకా ఆలస్యం చేస్తే విషమౌతుందని భయపడి కాబోలు మూణ్నెళ్ల అమెరికా వాసం తర్వాత మనోహర్ జూన్ 15న భారత్‌కు, 18 న గోవాకు తిరిగి వచ్చేశాడు. తను ఆరోగ్యంగానే ఉన్నాననీ, కానీ గతంలో రోజుకి 14 గంటలు పనిచేసే తను యిప్పుడు 6–7 గంటల కంటె ఎక్కువ పని చేయలేనని చెప్పాడు. పబ్లిక్ ఫంక్షన్లకు హాజరు కానని కరాఖండీగా చెప్పాడు. రాగానే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించాడు. మండోవి, జువారీ నదుల పైన వంతెనల నిర్మాణాన్ని 2019 మార్చిలోగా పూర్తి చేసి ఎన్నికల నాటికి ప్రదర్శించాలని బిజెపి ఆత్రుత పడుతోంది. కానీ అవి ఆలస్యమయ్యాయి. గోవా సముద్రతీరంలో ఉధృతంగా అలలు వచ్చే ప్రాంతంలో 50 మీటర్ల లోపున నిర్మాణాలను అనుమతిస్తూ కేంద్ర పర్యావరణ శాఖ నిర్ణయించింది. దానివలన కోస్తాలోని 3,200 గ్రామాల్లో జాలరుల ఉపాధి పోతుందని స్వచ్ఛంద సంస్థలు ఆందోళనలు చేస్తున్నాయి. గని తవ్వకాల్లో స్కాము జరగడంతో సుప్రీం కోర్టు మార్చి 16 నుంచి గోవాలో నాలుగు చోట్ల మైనింగ్ నిషేధించింది. దానివలన 2 లక్షల మంది జీవనోపాధి ప్రభావితమౌతుంది.

మనోహర్ యీ చిక్కుముడులన్నీ విప్పాలి. అతను లేనప్పుడు వీటిని పరిష్కరించే నాధుడు లేకపోయాడు. అధికారాలన్నీ ఒకరి చేతిలో కేంద్రీకృతమైతే వచ్చే చిక్కే గోవాలోనూ వచ్చింది. మనోహర్ ఆరోగ్య పరిస్థితి గురించి అధికారికంగా ఏ ప్రకటనా వెలువడకపోవడంతో పుకార్లు చిత్తం వచ్చినట్లు షికారు చేశాయి. తీవ్ర అనారోగ్యం నుంచి కోలుకుని వచ్చిన మనోహర్ వీటన్నిటితో ఎలా వేగుతాడో చూడాలి. మనోహర్ తిరిగి రావడంతో ఏమనుకున్నాడో ఏమో డిసౌజా తన సెలవు తగ్గించుకుని తిరిగి వచ్చాడు. జులైలో జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో ప్రతిపక్షాలు తమను నిలదీస్తాయి కాబట్టి ఆ దాడికి సిద్ధం కావడానికట!

**– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2018) (మనోహర్ పర్రీకర్ – కాన్సర్ అమెరికా పర్యటనకు ముందు, తర్వాత)**